ఈనాడు

విజయవాడ 29-9-2024 ఆదివారం సిటీ సంపుటి 51 . సంచిక 50
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 8-00 పేజీలు 16+28
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఆనందంగా ఉండు.. గుండె చల్లగుండు!



- ఆశావహ దృక్పథంతో శరీరంలో ఇన్‌ఫ్లమేటరీ మార్కర్ల తగ్గుదల
- కుటుంబం, స్నేహితులతో గడపడమూ మేలు చేస్తుంది
- చైనా శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడి
- ఆధ్యాత్మికతకూ ప్రాధాన్యం ఇవ్వాలంటున్న ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ ఆంజనేయులు

నేడు ప్రపంచ హృదయ దినోత్సవం

పొద్దున లేచిన దగ్గర నుంచి రాత్రి నిద్రపోయే వరకు అందరం ఉరుకులు, పరుగులతో పనిచేస్తున్నాం. శరీరం అలసిపోతుంది. అలాగని.. అది వ్యాయామం కాదు. కడుపు నింపుతుంటాం. కానీ, అది ఆరోగ్యకరమైన ఆహారంతో కాదు. నిద్రపోతున్నాం. అయితే.. అది మనసు తేలికపడేంతలా కాదు. ఫలితంగా... చాలామందిలో ఒత్తిడి, ప్రతికూల దృక్పథాలు పెరుగుతున్నాయి. వెరసి 30 ఏళ్లు నిండకుండానే అధిక రక్తపోటు, గుండెపోటు, పక్షవాతం, మధుమేహం, క్యాన్సర్ వంటి జీవనశైలి వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రపంచం మొత్తమ్మీద ఎక్కువ శాతం మరణాలకు, శారీరక రుగ్మతలకు గుండె జబ్బులే ప్రధాన కారణం అవుతున్నాయి. అందుకే ముందస్తు జాగ్రత్తలు చాలా ముఖ్యం. జీవనశైలిని కాస్త మార్చుకుంటే చాలని.. సంతోషం, సంతృప్తి... ఈ రెండింటినీ పుష్కలంగా పొందుతున్న వారిలో గుండెపోటు, పక్షవాతం వంటివి కనిపించడంలేదని తాజా పరిశోధనలో వెల్లడైంది. ఎంత ఆనందంగా ఉంటే.. గుండెకు అంత మేలు చేకూరుతుందని తేలింది. ఈ నేపథ్యంలో జీవితాన్ని ఆనందంగా గడుపుతూ గుండె జబ్బుల బారిన పడకుండా ఎలా కాపాడుకోవచ్చో వివరించారు.. సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఏవీ ఆంజనేయులు. ...వివరాలు 2లో



డాక్టర్ ఏవీ ఆంజనేయులు

రాష్ట్రానికి మళ్లీ లులు గ్రూప్

- జగన్ తీరు నచ్చక వెళ్లిన సంస్థ.. చంద్రబాబు సీఎం కావడంతో తిరిగి రాక
- సీఎంతో ఆ సంస్థ ఛైర్మన్ యూసుఫ్ అలీ, బృందం భేటీ
- సాదర స్వాగతం పలికిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- విజయవాడ, విశాఖ, తిరుపతిలో మాల్స్, మల్టీప్లెక్స్‌లు

ఈనాడు, అమరావతి : గత ఐదేళ్లలో అప్పటి సీఎం జగన్, ఆయన ప్రభుత్వ తీరుతో విసిగి ఆంధ్రప్రదేశ్‌లో ఇక ఎప్పటికీ పెట్టుబడులు పెట్టబోమంటూ వెళ్లిపోయిన లులు గ్రూప్ ఇంటర్నేషనల్... చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో మళ్లీ రాష్ట్రంలో అడుగుపెట్టింది. ఆ సంస్థ ఛైర్మన్ యూసుఫ్ అలీ తన బృందంతో శనివారం అమరావతికి వచ్చారు. సీఎం చంద్రబాబు ఆయనను సాదరంగా ఆహ్వానించారు. తిరిగి వెళ్లేముందు ఆలింగనం చేసుకొని, కారు వరకూ వచ్చి వీడ్కోలు పలికారు. వీరి భేటీలో రాష్ట్రంలో (మిగతా 2లో)



ముఖ్యమంత్రి చంద్రబాబుతో లులు గ్రూప్ ఇంటర్నేషనల్ ఛైర్మన్ యూసుఫ్ అలీ

కళ్లు లేని కమిటీలు... అడ్డగోలు దోపిడీలు



తితిదే కమిటీల్ని కీలుబొమ్మలుగా మార్చేసిన జగన్ ప్రభుత్వం

- ఛైర్మన్, ఈవో చెప్పినదానికి తందానా అనాల్సిందే
- కొనుగోళ్లు, సివిల్ పనులకు ఇష్టారాజ్యంగా ఆమోదాలు
- నెయ్యి టెండర్‌ను అప్పుడే అడ్డుకుంటే అనర్థం జరిగేది కాదు

ఈనాడు – తిరుపతి, అమరావతి

తితిదే బోర్డును రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చేసి, అస్మదీయులతో నింపేసిన జగన్... అక్కడ సర్వాధికారాలనూ తన బంధువులైన ఛైర్మన్లు, అదనపు ఈవో ధర్మారెడ్డి చేతిలో పెట్టేశారు. అంతేనా.. బోర్డులోని పలు కమిటీలను ఉత్సవ విగ్రహాలుగా మార్చేశారు. వైకాపా హయాంలో తితిదే కమిటీల సభ్యుల్లో అత్యధికులు బోర్డు చెప్పినదానికి తందానా అనేశారు. అయినవారికి దర్శనాలు చేయించుకోవడానికి, పైరవీలకే పరిమితమయ్యారు. కొండపై చోటు చేసుకున్న పలు అక్రమాల్లో వారూ భాగస్వాములయ్యారన్న తీవ్ర ఆరోపణలు ఉన్నాయి.

జేబులు నింపుకోవడానికే పరిమితం



తితిదే పాలకమండలి అన్ని అంశాల్నీ పరిశీలించలేదు కాబట్టి... బోర్డు సభ్యులు, ఆయా విభాగాల అధిపతులతో పలు కమిటీలు వేస్తారు. బోర్డు తీర్మానాలకు ఆమోదముద్ర వేయడానికి ముందు... ఆయా కమిటీలు వాటిని పరిశీలించాలి. కమిటీల సిఫారసుల్ని అనుసరించే బోర్డు... తీర్మానాలను ఆమోదించడమో, తిరస్కరించడమో చేస్తుంది. అంతటి కీలకమైన కమిటీల్ని వైకాపా ప్రభుత్వం కీలుబొమ్మలుగా మార్చేసింది. టెండర్ ప్రక్రియలో పాల్గొనే సంస్థల నేపథ్యం, వాటి ఆర్థిక స్థితి, సరఫరాలు, పనులు చేయగల సామర్థ్యాల్ని పూర్తిగా అధ్యయనం చేయకుండానే... ఛైర్మన్, ఈవో ఆదేశాల మేరకు అడ్డగోలుగా ఆమోదముద్ర వేసేశారు. (మిగతా 2లో)

‘కల్తీ నెయ్యి’పై దర్యాప్తునకు సిట్ సిద్ధం

తిరుపతి చేరుకున్న సర్వశ్రేష్ఠ త్రిపాఠి బృందం


కార్యాచరణ ప్రణాళిక రూపకల్పన

నేటి నుంచి మూడు బృందాలుగా దర్యాప్తు

2లో

హెజ్‌బొల్లా చీఫ్ నస్రల్లా హతం

మాటువేసి మట్టుబెట్టిన ఇజ్రాయెల్



హసన్ నస్రల్లా

- అతని కుమార్తె, ఐఆర్‌జీసీ డిప్యూటీ కమాండర్ సహా పలువురు సీనియర్ హెజ్‌బొల్లా నేతలూ హతం
- ఇజ్రాయెల్ నియంత్రణలో బీరుట్ విమానాశ్రయం
- తీవ్ర ప్రతీకారం తప్పదంటున్న రెసిస్టెన్స్ ఫ్రంట్
- పశ్చిమాసియాలో ఉద్రిక్త వాతావరణం

బీరుట్: లెబనాన్ తీవ్రవాద గ్రూపు హెజ్‌బొల్లాకు ఊహించని శరాఘాతం. ఇజ్రాయెల్ వైమానిక దాడిలో హెజ్‌బొల్లా అధినేత హసన్ నస్రల్లా (64) మృతిచెందారు. ఈ విషయాన్ని అటు ఇజ్రాయెల్ సైన్యం (ఐడీఎఫ్), ఇటు హెజ్‌బొల్లా ధ్రువీకరించాయి. “హసన్ నస్రల్లా ఇక ఈ ప్రపంచాన్ని భయభ్రాంతులకు గురి చేయలేడు” అని ఐడీఎఫ్ ‘ఎక్స్’ వేదికగా పేర్కొంది. “మా సందేశం సుస్పష్టం. మా పౌరులను ఎవరైతే బెదిరిస్తారో.. వారిని మట్టుబెట్టడం మాకు బాగా తెలుసు. వారు ఏ దిక్కున దాక్కున్నా వదిలిపెట్టం” అని ఇజ్రాయెల్ సైన్యాధిపతి లెఫ్టినెంట్ జనరల్ హెర్జి హలేవీ తెలిపారు. నస్రల్లా మరణానికి ప్రతీకారం తీర్చుకుంటామని, పాలస్తీనియన్లకు తమ మద్దతు కొనసాగిస్తామని హెజ్‌బొల్లా, రెసిస్టెన్స్ ఫ్రంట్ ప్రకటించాయి. నస్రల్లా లక్ష్యంగా శుక్రవారం బీరుట్‌లోని దాహియా ప్రాంతంలోని హెజ్‌బొల్లా కేంద్ర కార్యాలయంపై ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు విరుచుకుపడ్డాయి. ఈ దాడుల్లోనే నస్రల్లాతో పాటు.. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ దళానికి చెందిన డిప్యూటీ కమాండర్ జనరల్ అబ్బాస్ నీలోఫరసన్ (58), హెజ్‌బొల్లా సీనియర్ కమాండర్ అలీ కర్కి సహా మరికొంత మంది కమాండర్లు ప్రాణాలు కోల్పోయారు. దాడిలో నస్రల్లా కుమార్తె జైనబ్ నస్రల్లా కూడా చనిపోయారని ఇజ్రాయెల్ మీడియా సంస్థల్లో కథనాలు వస్తున్నాయి. ఆమె మృతిని హెజ్‌బొల్లా ధ్రువీకరించలేదు. (మిగతా 2లో)



లెబనాన్ రాజధాని బీరుట్ శివారులో శనివారం ఇజ్రాయెల్ వైమానిక దాడి చేయడంతో ఎగసిన అగ్నికీలలు

ప్రతిభ | సవాలక్షగతి

ముఖ్యమైన ప్రశ్నలు-జవాబులు



సబ్జెక్టుల వారీగా ముఖ్యమైన ప్రశ్నలు–జవాబులను నేటి నుంచి ‘ప్రతిభ’లో అందిస్తున్నాం. వార్షిక, ఇతర పరీక్షల్లో మంచి మార్కులు సంపాదించుకోడానికి విద్యార్థులు వాటిని ఉపయోగించుకోవచ్చు. బోధనలో, పరీక్షల మూల్యాంకనంలో అనుభవజ్ఞులైన నిపుణులు వాటిని రూపొందిస్తున్నారు.

pratibha.eenadu.net / eenadupratibha.net

‘ప్రజావేదిక’ ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ

ఏ రోజు అర్జీలు ఆ రోజే సీఎంవోకు

అక్కడి నుంచి సంబంధిత శాఖలకు

45 రోజుల్లో క్షేత్రస్థాయి పరిశీలన, నివేదిక

స్వర్ణాంధ్ర సాధనకు సూచనలివ్వండి

ప్రజలకు సీఎం చంద్రబాబు పిలుపు

లోపలి పేజీల్లో

ఇదీ సంగతి!



డియర్! బోనస్‌తో ఏం తెచ్చానో చెప్పుకో చూద్దాం?!

87 సెంట్ల స్థల పరిహారానికి 42 ఏళ్ల పోరాటం

- 81 ఏళ్ల వయసులో హైకోర్టులో వృద్ధుడి విజయం
- ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని ఆదేశాలు

ఈనాడు, అమరావతి: భూసేకరణ కింద తన భూమిని తీసుకుని పరిహారం ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టిన ప్రభుత్వంపై న్యాయస్థానంలో పోరాడి గెలిచిన 81 ఏళ్ల వృద్ధుడి విజయగాథ ఇది. ప్రస్తుతం కదలలేని స్థితిలో మంచంపైనే ఉంటున్న ఆయన 42 ఏళ్ల సుదీర్ఘ పోరాటం అనంతరం తన హక్కును సాధించుకున్నారు. కృష్ణా జిల్లా కలిదిండి మండలం తాడినాడకు చెందిన ఓలేటి వెంకట నారాయణకు 87 సెంట్ల స్థలం ఉండేది. ఉప్పుటేరు డ్రెయిన్ నిమిత్తం అధికారులు ఆ భూమిని 1894 భూసేకరణ చట్టం కింద 1982లో స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన భూ యజమానులు అప్పట్లోనే కోర్టుకెళ్లి ఎకరాకు రూ.5,002.50 పరిహారం పొందినా వెంకటనారాయణకు ఒక్క పైసా కూడా ప్రభుత్వం నుంచి రాలేదు. దీంతో ఆయన 2009లో హైకోర్టును ఆశ్రయించారు. వెంకట నారాయణ పిటిషన్‌పై 2023 జూన్‌లో తుది విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. ఎకరాకు రూ. 5,003 చొప్పున 6% వడ్డీతో లెక్కించి పరిహారం చెల్లించాలని అధికారులను ఆదేశించారు. అయితే 2013లో అమల్లోకి వచ్చిన నూతన భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని ఆదేశించేందుకు నిరాకరించారు. దీంతో ఈ తీర్పును సవాలు చేస్తూ పిటిషన్‌దారు అప్పీల్ దాఖలుచేశారు. ఇటీవల ఈ అప్పీలును విచారించిన (మిగతా 2లో)

రాష్ట్రానికి మళ్లీ లులు గ్రూప్

(మొదటి పేజీ తరువాయి)


సీఎం చంద్రబాబు, లులు గ్రూపు ఇంటర్నేషనల్ ఛైర్మన్ యూసుఫ్ అలీల ఆత్మీయ ఆలింగనం

పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై చర్చించారు. విశాఖపట్నంలో మాల్, మల్టీప్లెక్స్, విజయవాడ, తిరుపతిలో హైపర్ మార్కెట్, మల్టీప్లెక్సుల నిర్మాణంతోపాటు ఆహారశుద్ధి రంగంలో పెట్టుబడులకు యూసుఫ్ అలీ ఆసక్తి చూపారు. సులభతర, వేగవంతమైన వ్యాపారానికి తాము ప్రాధాన్యం ఇస్తున్నామని ఈ సందర్భంగా చంద్రబాబు వారికి తెలిపారు. లులు గ్రూప్ వంటి సంస్థల రాకతో పారిశ్రామికవేత్తల్లో ఏపీలో పెట్టుబడులపై చర్చ జరుగుతుందని, ఇది రాష్ట్రానికి మేలుచేస్తుందని అభిప్రాయపడ్డారు. పెట్టుబడుల్ని ప్రోత్సహించేందుకు తీసుకొస్తున్న నూతన పాలసీలను వివరించారు. ఏపీలో తిరిగి పెట్టుబడులు పెట్టేందుకు లులు గ్రూప్ ఆసక్తి చూపడం, మూడు ప్రాంతాల్లో ప్రాజెక్టులకు ముందుకు రావడంపై సీఎం ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఛైర్మన్‌తో పాటు సంస్థ ప్రతినిధుల్ని సత్కరించారు.

జగన్ తీరు నచ్చక వెళ్లిపోయిన సంస్థ

రూ.2,200 కోట్ల పెట్టుబడితో విశాఖలో షాపింగ్‌మాల్, 5వేల సీట్ల సామర్థ్యంతో అంతర్జాతీయ స్థాయి కన్వెన్షన్ కేంద్రం, ఐదు నక్షత్రాల హోటల్ నిర్మాణంతో 10వేల మందికి ఉపాధి కల్పించే లక్ష్యంతో 2018లో లులు గ్రూప్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. 13.83 ఎకరాల భూములను కేటాయించడంతో లులు గ్రూప్ డిజైన్లు తయారు చేయించింది. ప్రాజెక్టుకు శంకుస్థాపన కూడా చేసింది. వైకాపా అధికారంలోకి వచ్చాక భూ కేటాయింపుల్లో అవకతవకలు జరిగాయంటూ.. రివర్స్ టెండరింగ్ పేరుతో ఒప్పందాన్నే రద్దుచేసింది. జగన్ ప్రభుత్వ తీరుతో నొచ్చుకున్న లులు గ్రూప్.. ఇక ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టబోమని ప్రకటన విడుదల చేసింది. వెంటనే తెలంగాణ, తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్, కేరళ సహా వివిధ రాష్ట్రాలు ఆహ్వానించడంతో అక్కడకు వెళ్లిపోయింది. తెలంగాణ, తమిళనాడుల్లో రూ.3,500 కోట్ల చొప్పున పెట్టుబడులతో ప్రాజెక్టులు ప్రారంభించింది. జగన్ తీరు నచ్చక వెళ్లిపోయిన ఆ సంస్థ ఇప్పుడు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, చంద్రబాబు సీఎం కావడంతో మళ్లీ ఆంధ్రప్రదేశ్ తలుపు తట్టింది.

87 సెంట్ల స్థల పరిహారానికి 42 ఏళ్ల పోరాటం


(మొదటి పేజీ తరువాయి)

జస్టిస్ ఆర్.రఘునందన్‌రావు, జస్టిస్ ఎన్.హరినాథ్‌తో కూడిన ధర్మాసనం.. 2013 భూసేకరణ చట్టం ప్రకారం 87 సెంట్లకు ప్రస్తుత మార్కెట్ ధరను నిర్ణయించి నాలుగు నెలల్లో పిటిషనర్‌కు పరిహారం చెల్లించాలని అధికారులను ఆదేశించింది. దీంతో పాటు ఆ వృద్ధుడికి అప్పట్లో ఇవ్వాల్సిన రూ.5,003 పరిహారం సొమ్ముతో పాటు, స్థలాన్ని సాధీనం చేసుకున్న తేదీ 1982 ఫిబ్రవరి 16 నుంచి 9% వడ్డీ లెక్కించి 3 వారాల్లో చెల్లించాలని ఈనెల 25న తీర్పులో పేర్కొంది.

విచారణ సందర్భంగా.. రైతుకు పరిహారం చెల్లింపులో చోటుచేసుకున్న జాప్యాన్ని ధర్మాసనం తీవ్రంగా తప్పుపట్టింది. ప్రత్యామ్నాయ మార్గాల్లో సమస్యను పరిష్కరించుకోలేని లక్షల మందిలో పిటిషన్‌దారు ఒకరని వ్యాఖ్యానించింది. సముచితమైన పరిహారం పొందేందుకు ఆయనకు ఉన్న హక్కును హరించడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. వయోభారంతో ప్రస్తుతం మంచంపై ఉన్న పిటిషనర్‌కు ఈ పరిహారం, మద్దతు ఎంతో అవసరమని అభిప్రాయపడింది. భూసేకరణ వ్యవహారం పూర్తిగా ప్రభుత్వ పరిధిలోనిదేనని.. అలాగని యజమానికి పరిహారం చెల్లించకుండా ఆస్తులను తీసేసుకోలేరని ధర్మాసనం స్పష్టం చేసింది.

ఆనందంగా ఉండు.. గుండె చల్లగుండు!

12 ఏళ్లపాటు అధ్యయనం



చైనాకు చెందిన పలువురు శాస్త్రవేత్తలు యూకేలో దీర్ఘకాలంపాటు పరిశోధన చేశారు. 'యూకే బయో బ్యాంక్' డేటా నుంచి 1,21,317 మందిని ఎంచుకున్నారు. 2006 నుంచి 2010 వరకు వీరి సమాచారాన్ని తీసుకున్నారు. తర్వాత 2022 వరకు అంటే 12 సంవత్సరాలపాటు వారి జీవితం, కెరీర్, కుటుంబం, శారీరక ఆరోగ్యం, స్నేహితులు, బంధువులు తదితర అంశాల్లో వారు పొందుతున్న ఆనందం, సంతృప్తిపై వివరాలు సేకరించారు. వీరిలో ఎవరెవరికి ఎప్పుడెప్పుడు ఏయే జబ్బులొచ్చాయి? వాటివల్ల కలిగిన నష్టమెంత? వాటిని ఎలా అధిగమించారు... తదితర సమాచారాన్ని క్రోడీకరించారు. 'ఆరోగ్య జీవనశైలి... హృదయ ఆరోగ్యం' అనే శీర్షికన వారు రూపొందించిన పరిశోధనపత్రం తాజాగా ప్రఖ్యాత వైద్యపత్రిక 'అమెరికన్ హార్ట్ అసోసియేషన్(అహ-ఏహెచ్‌ఏ)'లో ప్రచురితమైంది.

ఇన్‌ఫ్లమేటరీ మార్కర్ల పాత్ర కీలకం

సంతృప్తి, సంతోషం... దేహ ఆరోగ్యానికి చాలా ముఖ్యమని పెద్దలు చెబుతుంటారు. మనం చేసే పనిలో, పొందుతున్న ఆదాయంలో, గడుపుతున్న జీవనంలో తృప్తిని పొందలేకపోతే... అది శాపంగా మారుతుంది. అయితే దీనిపై ఇప్పటివరకు పెద్దగా అధ్యయనాలు జరగలేదు. తాజా అధ్యయనంలో మాత్రం సంతోషాన్ని, సంతృప్తిని ప్రత్యేకంగా విశ్లేషించారు. అమితమైన సంతోషం, చాలా సంతోషం, ఓ మాదిరిగా సంతోషం... తీవ్ర దుఃఖం, చాలా బాధ, ఓ మాదిరి బాధ... ఇలా విభజించి వారి నుంచి సమాచారం సేకరించారు.

- సంతోషానికి, శరీరంలో వచ్చే ఇన్‌ఫ్లమేషన్(వాపు)కు మధ్య ఏమైనా సంబంధం ఉందా? అనే కోణంలోనూ అధ్యయనం చేశారు. అసంతృప్తి, తీవ్ర బాధలో ఉన్నవారిలో శరీరంలోని ఇన్‌ఫ్లమేటరీ మార్కర్లుగా పిలిచే... సీ-రియాక్టివ్ ప్రొటీన్, తెల్ల రక్తకణాలు, లింఫోసైట్స్, సైటోకైన్స్ తదితరాలన్నీ పెరిగాయి. ఇలాంటి వారిలో గుండెజబ్బుల ముప్పు పెరిగినట్లు గుర్తించారు.
- ఎక్కువ సంతోషంగా ఉన్నవారిలో, ఆశావహ దృక్పథంతో ఉన్నవారిలో... ఇన్‌ఫ్లమేటరీ మార్కర్లన్నీ తక్కువగా కనిపించాయి. తద్వారా వీరికి అన్ని గ్రూపుల కంటే కొలెస్ట్రాల్, హైబీపీ, గుండెజబ్బుల ముప్పు తక్కువగా ఉన్నట్లు వెల్లడైంది.

సానుకూలంలో... అలవాట్లూ ఆరోగ్యకరమే

సానుకూల దృక్పథంతో జీవిస్తున్న వారిలో అలవాట్లు కూడా ఆరోగ్యకరంగానే ఉన్నాయి. బాగా సంతోషంగా ఉన్నవారు తమ కెరీర్, ఆర్థికం, కుటుంబం, స్నేహితులు... ఇలా అన్ని రంగాల్లోనూ సంతోషం, సంతృప్తి వ్యక్తపర్చారు. సంతోషంగా ఉన్న పురుషులు, మహిళల్లోనూ జీవనశైలి వ్యాధులు తగ్గాయి. కుటుంబ బంధాలు బలంగా ఉన్నవారిలో, స్నేహితులతో భావోద్వేగాలను పంచుకుంటూ నిత్యం ఆహ్లాదంగా గడిపే వారిలోనూ... జబ్బులు బాగా తక్కువగా కనిపించాయి.

ఔషధం... మాత్రల్లో మాత్రమే ఉండదు

వ్యాధులకు ఔషధం మాత్రమే ప్రత్యామ్నాయం కాదు. ఔషధం అన్నివేళలా మాత్రల రూపంలోనే లభించదు. వ్యాయామం, ధ్యానం, ఉపవాసం, నవ్వడం, సరైన నిద్ర, పోషకాహారం, సూర్యరశ్మి, కృతజ్ఞతాభావం, తోటివారిని ప్రేమించడం, ప్రకృతిలో గడపడంతోపాటు ధూమపానం, మద్యపానం ఆపేయడం... వంటి చక్కటి అలవాట్లలోనూ ఔషధం ఉంటుంది.

ఆధ్యాత్మిక ఆరోగ్యమూ కావాలిప్పుడు

శారీరక, మానసిక ఆరోగ్యంతోపాటు కొత్తగా ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని కూడా సమాజంలో అభివృద్ధి చేయాలి. భక్తి, యోగా, ధ్యానం వంటివి అలవాటు చేసుకోవాలి. ఇవి ఒత్తిడిని దూరం చేయడానికి దోహదపడతాయి. ఇవి కేవలం ఆరోగ్యాన్ని ఇవ్వడమే కాదు.. అనారోగ్యకర అలవాట్లను దూరం చేస్తాయి.

అది... మనచుట్టూ వైఫైగా అల్లుకునే ఉంది

ఆనందాన్ని ఎక్కడో కాదు మన చుట్టూనే వెతుక్కోవాలి. కాస్త పరికించి చూస్తే అది వైఫై మాదిరి అల్లుకునే ఉండటాన్ని గమనించవచ్చు. చేసే ప్రతిపనిలో ఎంత ఒత్తిడి ఎదుర్కొంటున్నా, క్షణం తీరిక లేకుండా ఉంటున్నా... కొంత సమయమైనా కుటుంబంతో గడపాలి. మనసుకు నచ్చిన స్నేహితులు, సన్నిహితులతో ఆహ్లాదంగా గడపడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. సంతృప్తికర జీవనాన్ని అలవాటు చేసుకోవడం ఎనలేని మేలు చేస్తుంది.

నిద్ర కాయొద్దు... నిద్రాళువూ కావద్దు

ప్రతి ఒక్కరూ కనీసం 7 నుంచి 9 గంటలపాటు నిద్రపోవాలి. 9 గంటల కంటే ఎక్కువ పడుకుంటూ నిద్రపోతులుగా మారడం... అదే సమయంలో 7 గంటల కంటే తక్కువగా నిద్రపోవడమూ మంచిది కాదు. సమస్థితి అత్యంత ముఖ్యం.

-ఈనాడు, హైదరాబాద్

హెజ్‌బొల్లా చీఫ్ నస్రల్లా హతం

(మొదటి పేజీ తరువాయి)

బీరుట్‌పై శనివారం కూడా ఇజ్రాయెల్ దాడులు కొనసాగించింది నస్రల్లాను చంపిన దాహియాలోని హెజ్‌బొల్లా ఇంటెలిజెన్స్ కమాండర్ హసన్ ఖలీల్ యాసిన్‌ను మట్టుబెట్టింది. బీరుట్ విమానాశ్రయం దగ్గర్లోని గోదాముపైనా దాడి చేసింది. దీంతో ఆ ప్రాంతంలో మంటలు భారీ ఎత్తున ఎగసిపడుతున్నాయి. మరోవైపు నస్రల్లా మృతికి ప్రతీకారంగా యెమెన్‌లోని హూతీ తిరుగుబాటుదారులు ఇజ్రాయెల్‌పై రెండు బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించారు. వీటిని ఇజ్రాయెల్ మధ్యలోనే అడ్డుకొని కూల్చివేసింది. శుక్రవారం దాహియాపై జరిగిన దాడిలో 11 మంది మృతి చెందారని, 108 మందికి గాయాలయ్యాయని లెబనాన్ ఆరోగ్యమంత్రిత్వశాఖ తెలిపింది. దీంతో మొత్తం మృతుల సంఖ్య 720కి చేరుకుంది. గత కొన్ని రోజుల నుంచి లెబనాన్‌పై ఇజ్రాయెల్ పూర్తిస్థాయిలో దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ వారంలోనే దాదాపు 17 మంది హెజ్‌బొల్లా సీనియర్ కమాండర్లను మట్టుబెట్టింది. ఈ నేపథ్యంలో మూడున్నర దశాబ్దాల నుంచి హెజ్‌బొల్లాకు నేతృత్వం వహిస్తున్న నస్రల్లాను హతమార్చడం ఇజ్రాయెల్‌కు భారీ విజయమే. నస్రల్లా మరణం.. తమ దేశ చరిత్రలోని అతి ముఖ్యమైన ఘట్టం అని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి గలాంట్ పేర్కొన్నారు. నస్రల్లా మరణంతో పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు మరింత దట్టంగా అలుముకున్నాయి. హెజ్‌బొల్లా, హమాస్‌కు మద్దతిస్తున్న ఇరాన్ ఎలాంటి అడుగులు వేస్తుంది? అది ఇజ్రాయెల్‌తో నేరుగా యుద్ధానికి దిగుతుందా? అదే జరిగితే అది ప్రాంతీయ యుద్ధానికి దారితీస్తుందా? అనే ఉత్కంఠ, భయాందోళనలు కొనసాగుతున్నాయి.


మృతి చెందిన ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ డిప్యూటీ కమాండర్ జనరల్ అబ్బాస్ నీలోఫరసన్

7 నిమిషాలు.. 85 బాంబులు

పక్కా ఇంటెలిజెన్స్ సమాచారంతోనే నస్రల్లాను ఐడీఎఫ్ హతమార్చినట్లు తెలుస్తోంది. శుక్రవారం ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధుల సభ 79వ సదస్సులో ప్రసంగించారు. తన ప్రసంగంలో హెజ్‌బొల్లాపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నెతన్యాహు ప్రసంగం ముగిసిన కొన్ని నిమిషాలకే దక్షిణ బీరుట్‌లోని భూగర్భంలో ఉన్న హెజ్‌బొల్లా కేంద్ర కార్యాలయంపై ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు విరుచుకుపడ్డాయి. దాడిలో ఏకంగా 85 బంకర్ విధ్వంసకర బాంబులను ఐడీఎఫ్ వినియోగించినట్లు తెలుస్తోంది. ఒక్కో బాంబు బరువు 1,000 కేజీలు. భూమిలోకి 30 మీటర్ల వరకు, కాంక్రీటుపైనైతే ఆరు మీటర్ల వరకు చొచ్చుకొని వెళ్లే సామర్థ్యం వీటి సొంతం. ఏడు నిమిషాల్లోనే వీటిని నస్రల్లా ఉన్న ప్రాంతంపైన ప్రయోగించినట్లు తెలుస్తోంది.

4 దశాబ్దాల ఉగ్రవాదానికి మూల్యం: బైడెన్

నాలుగు దశాబ్దాలుగా ఉగ్రవాద చర్యలకు పాల్పడినందుకు తగిన మూల్యమే చెల్లించారని నస్రల్లా మృతిపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వ్యాఖ్యానించారు. హమాస్‌తో చేతులు కలిపి ఉత్తర ఇజ్రాయెల్‌పై దాడులకు సిద్ధమైన మరుసటి రోజే అతడి తలరాత లిఖితమైందని పేర్కొన్నారు.

ముస్లింలు అండగా నిలవాలి: ఖమేనీ

నస్రల్లా మృతిపై ఇరాన్ సుప్రీం అధినేత అలీ ఖమేనీ స్పందించారు. ప్రపంచవ్యాప్తంగా ముస్లింలంతా లెబనాన్ ప్రజలకు, హెజ్‌బొల్లాకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రాంతీయ ప్రతిఘటన దళాలన్నీ ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా నిలవాలని అన్నారు. నస్రల్లాను తెలివైన నాయకుడిగా అభివర్ణించారు. అయితే ఇరాన్ స్పందన ఎలా ఉంటుందన్న విషయంపై ఖమేనీ ఎలాంటి ప్రకటన చేయలేదు. నస్రల్లా మృతి వార్త తెలిసిన వెంటనే ఖమేనీని సురక్షిత ప్రాంతానికి ఇరాన్ భద్రతా దళాలు తరలించినట్లు రాయిటర్స్ వార్తా సంస్థ పేర్కొంది. దేశవ్యాప్తంగా భద్రతను పెంచినట్లు పేర్కొంది. ఇజ్రాయెల్ చర్యకు ప్రతీకారం తీర్చుకుంటామని హెజ్‌బొల్లా ప్రతిజ్ఞ చేసింది. ఆ దేశంపై తమ పవిత్ర యుద్ధం కొనసాగుతుందని తెలిపింది. "నస్రల్లా మృతికి ప్రతీకారం తీర్చుకుంటాం. పాలస్తీనాకు మద్దతుగా నిలవడంతో పాటు శత్రువుపైనా యుద్ధం కొనసాగిస్తాం" అని హెజ్‌బొల్లా బృందం ప్రకటించింది. నస్రల్లా మృతిని ఇరాక్, రష్యా, తుర్కియే ఖండించాయి. ఇరాక్ ఐదు రోజులు సంతాపదినాలుగా ప్రకటించింది.

ఇరాన్ విమానానికి అనుమతి నిరాకరణ

నస్రల్లా మరణానంతరం బీరుట్‌లో దిగేందుకు ప్రయత్నించిన ఇరాన్ రవాణా విమానానికి లెబనాన్ అధికారులు అనుమతి ఇవ్వలేదు. శుక్రవారమే బీరుట్ విమానాశ్రయాన్ని ఇజ్రాయెల్ సైన్యం అదుపులోకి తీసుకుంది. పౌర విమానాలు తప్ప మిగతావి విమానాశ్రయంలోకి వస్తే పేల్చివేస్తామని హెచ్చరించింది. ఈ నేపథ్యంలోనే ఇరాన్ విమానానికి లెబనాన్ రవాణా మంత్రిత్వశాఖ అనుమతి నిరాకరించిందని తెలుస్తోంది.

వారసుడెవరు?

నస్రల్లా మరణంతో హెజ్‌బొల్లా కొత్త అధిపతి ఎవరన్న చర్చ ప్రారంభమైంది. ఇరాన్ ఆమోదం ఉన్న వ్యక్తికే పగ్గాలు దక్కే అవకాశాలు ఉన్నాయన్న వార్తలొస్తున్నాయి. హెజ్‌బొల్లా రాజకీయ వ్యవహారాలను పర్యవేక్షించే హాషీమ్ సఫీ అల్ దిన్ ప్రస్తుతం రేసులో ముందు ఉన్నారు. హెజ్‌బొల్లాకు చెందిన జిహాద్ కౌన్సిల్‌లోనూ సఫీ అల్ దిన్ సభ్యుడు. అన్నింటికి మించి నస్రల్లాకు బంధువు.

'కల్తీ నెయ్యి'పై దర్యాప్తునకు సిట్ సిద్ధం

ఈనాడు- తిరుపతి; న్యూస్‌టుడే- తిరుపతి (నేరవిభాగం): తిరుమల శ్రీవారి లడ్డూప్రసాదంలో కల్తీ నెయ్యిని వినియోగించిన వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణకు సమాయత్తమైంది. బృంద సభ్యులతో శనివారం తిరుపతిలో భేటీ అయిన సిట్ చీఫ్ సర్వశ్రేష్ఠ త్రిపాఠి.. వారికి పలు అంశాల పరిశీలన బాధ్యతలు అప్పగించారు. ఆదివారం నుంచి మూడు రోజులపాటు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయనున్నట్లు తెలుస్తోంది. సిట్ కార్యకలాపాలు నిర్వహించేందుకు అనుగుణంగా తితిదేకు చెందిన శ్వేత భవనాన్ని కేటాయించారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వినియోగించిన నెయ్యిలో జంతు, పంది కొవ్వుతోపాటు ఫిష్ ఆయిల్ లాంటివి ఉన్నట్లు ఎన్‌డీడీబీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గుంటూరు రేంజీ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి నేతృత్వంలో విశాఖ రేంజీ డీఐజీ గోపీనాథ్ జెట్టి,


శ్రీవారి దర్శనం అనంతరం ఆలయం నుంచి వెలుపలికి వస్తున్న సిట్ చీఫ్ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

కడప ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, తిరుపతి అదనపు ఎస్పీ (పరిపాలన) వెంకటరావు, డీఎస్పీలు శివనారాయణ స్వామి, సీతారామారావు, అన్నమయ్య జిల్లా ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్, కల్లూరు ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణలతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. బృందానికి అపరిమితమైన అధికారాలను అప్పగించింది. ప్రభుత్వ శాఖల నుంచి ఎటువంటి సమాచారం, సహకారం కోరినా వెంటనే అందించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

ఈఓతో విచారణ ప్రారంభం!

సిట్ చీఫ్ సర్వశ్రేష్ఠ త్రిపాఠి శనివారం మధ్యాహ్నం తిరుమల వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి తిరుపతిలోని పోలీస్ అతిథిగృహానికి చేరుకుని.. బృంద సభ్యులతో సమావేశమై చర్చించారు. ఆదివారం నుంచి గోపీనాథ్ జెట్టి, హర్షవర్ధన్ రాజు, వెంకటరావుల నేతృత్వంలో మూడు బృందాలు దర్యాప్తు చేయనున్నాయి. తితిదే ప్రొక్యూర్‌మెంట్ జీఎం ఇచ్చిన ఫిర్యాదులోని అంశాలను దర్యాప్తులో పరిగణనలోకి తీసుకోనున్నారు. ధర్మకర్తల మండలి దగ్గర నుంచి అధికారులు, సిబ్బంది పాత్ర వరకు అన్ని అంశాలనూ లోతుగా దర్యాప్తు చేయనున్నారు. తొలుత తితిదే ఈఓ శ్యామలరావును కలిసి నెయ్యి కల్తీ వ్యవహారంపై పూర్తివివరాలు తెలుసుకోనున్నారు.

ఏఆర్ ఫుడ్ డెయిరీలోనూ పరిశీలన!

తితిదేకు నెయ్యి సరఫరా చేసిన ఏఆర్ డెయిరీ ఫుడ్‌ను సైతం సిట్ బృందం సందర్శించి నెయ్యి తయారీ కార్యకలాపాలను పరిశీలించే అవకాశం ఉంది. నెయ్యి సరఫరాకు అంత తక్కువ ధర కోట్ చేయడానికి కారణాలేంటి? నెయ్యి సరఫరాకు టెండరు దక్కించుకుని ఇతర సంస్థలకు సబ్‌లీజుకు ఇచ్చారా అనేదీ చూడనున్నారు. నాసిరకం నెయ్యి సరఫరా చేస్తున్నట్లు తితిదే అధికారులు హెచ్చరించినా కల్తీ సరకును ఎందుకు సరఫరా చేయాల్సి వచ్చిందనే అంశాలను వారి నుంచి తెలుసుకోనున్నారు. 2019 నుంచి నెయ్యి సరఫరా చేసిన సంస్థల వివరాలనూ సేకరించనున్నట్లు సమాచారం.

ఏయే అంశాలపై విచారిస్తారంటే..

- నెయ్యి కొనుగోలుకు టెండరులో ఎటువంటి ప్రమాణాలు పొందుపరుస్తారు? సరఫరాదారుల నుంచి టెండర్లు ఎలా స్వీకరిస్తారు? టెండరులో పాల్గొనే గుత్తేదారుల సంస్థల సాంకేతిక, ఆర్థిక అర్హతలను ఎలా పరిగణనలోకి తీసుకుంటారు? గుత్తేదారు సంస్థలను ఎలా ఎంపిక చేస్తారు? రివర్స్ టెండరింగ్ ఎలా జరుగుతుంది వంటి వివరాలపై ప్రొక్యూర్‌మెంట్ విభాగాధికారుల నుంచి వివరాలు తీసుకుంటారు.
- మార్కెటింగ్ విభాగం పాత్ర ఎలా ఉంటుందనేదీ ఆరాతీస్తారు.
- నెయ్యి తిరుమలలోని గోదాముకు చేరుకున్న తర్వాత ఎన్ని రోజులు ఉంచుతారు? నాణ్యత పరీక్షల నిమిత్తం ఎప్పుడు శాంపిల్స్ తీసుకుంటారు? ల్యాబ్‌కు పంపిన తర్వాత ఎలాంటి పరీక్షలు నిర్వహిస్తారు? ప్రమాణాల మేరకు సరఫరా చేశారా లేదా అనేది ఎలా నిర్ధారిస్తారు? జంతువుల కొవ్వును కలిసిన విషయాన్ని పసిగట్టే స్థాయి పరికరాలు ల్యాబ్‌లో ఉన్నాయా వంటి వివరాలను పోటు సిబ్బంది, సంబంధిత అధికారుల నుంచి రాబడతారు.

కళ్లు లేని కమిటీలు.. అడ్డగోలు దోపిడీలు

(మొదటి పేజీ తరువాయి)

తితిదేలో కొనుగోళ్ల కమిటీ, ఆర్థిక, ఇంజినీరింగ్ పనుల కమిటీ, ఎస్టేట్స్, అప్పీల్స్ కమిటీ, హెచ్‌డీపీపీ ఎగ్జిక్యూటివ్ కమిటీ, బర్డ్ ట్రస్ట్, స్విమ్స్ గవర్నింగ్ కౌన్సిల్, విద్యాకమిటీలు ఉన్నాయి. ఆయా విభాగాల్లోని కార్యక్రమాలు, కొనుగోళ్లు, ఇతర వ్యవహారాల్లో కమిటీ సభ్యుల సిఫారసుల్ని ధర్మకర్తల మండలి సమావేశం ముందుంచుతారు. వైకాపా హయాంలో ఆ కమిటీల సభ్యుల్లో అత్యధికులు వారి జేబులు నింపుకోవడానికే పరిమితమయ్యారన్న ఆరోపణలున్నాయి. తితిదే 2021 జనవరిలో కిలో నెయ్యిని రివర్స్ టెండరింగ్ ద్వారా రూ.392.22 చొప్పున కొన్నది. ఏడాది తర్వాత 2022లో మళ్లీ టెండర్లు పిలిచినప్పుడు కిలో నెయ్యికి రూ.329 ధర ఖరారు చేసింది. 2024లో టెండర్లు పిలిచి... ఏఆర్ డెయిరీ ఫుడ్స్ అనే సంస్థకు కిలో రూ.319.85 చొప్పున 6 నెలల్లో 10 లక్షల కిలోల నెయ్యి సరఫరా చేసేందుకు కాంట్రాక్ట్ ఇచ్చేసింది. అప్పటి పాలకమండలి సభ్యులకు, కొనుగోళ్ల కమిటీలోని మేధావులకు కొంచెమైనా ఇంగితం ఉందా? పాలు, నెయ్యి ధరలు రోజురోజుకూ పెరుగుతాయే తప్ప తగ్గుతాయా? 2021లో రూ.392కు కొన్న కిలో నెయ్యి... మూడేళ్ల తర్వాత రూ.319కి ఎలా వస్తుంది? అసలు మార్కెట్‌లో స్వచ్ఛమైన ఆవు నెయ్యి ధర ఎంతుంది? ఒక కిలో నెయ్యి ఉత్పత్తికి ఎన్ని లీటర్ల పాలు కావాలి? ఎంత ఖర్చవుతుంది? ఏఆర్ డెయిరీ ఫుడ్స్ సంస్థ అంత తక్కువ ధరకు కోట్ చేయడంలో మతలబేంటి? ఆ సంస్థకు సరఫరా సామర్థ్యం ఉందా? వంటి అంశాల్ని తితిదే బోర్డు వేసిన కొనుగోళ్ల కమిటీ పరిశీలించిందా? అంటే లేదనే సమాధానం వస్తోంది.

గుడ్డిగా ఆమోదం

- తితిదేలో వివిధ సరకుల కొనుగోళ్ల తర్వాత, ఎక్కువ నిధులు ఖర్చుపెట్టేది ఇంజినీరింగ్ విభాగంలోనే. కొండపైనా, తిరుపతిలోనూ తితిదే నిధులతో ప్రతిపాదించిన సివిల్ వర్క్స్ ఎంత వరకు అవసరమన్నది వర్క్స్ కమిటీ పరిశీలించి సిఫారసు చేస్తుంది.
- వైకాపా ప్రభుత్వ హయాంలో అధికార పార్టీ నాయకుల ఒత్తిడి, వారి సిఫారసులకు వర్క్స్ కమిటీ కళ్లు మూసుకుని ఆమోదముద్ర వేసేసింది.


రబ్బరు స్టాంపే

తితిదే బోర్డు ఏర్పాటుచేసే కమిటీల్లో... కొనుగోళ్ల కమిటీ పాత్ర కీలకం. ప్రసాదాలతో పాటు, భక్తులకు నిత్యాన్నదాన పథకంలో ఉపయోగించే అన్ని రకాల సరకుల కొనుగోళ్లను పర్యవేక్షించేది ఈ కమిటీనే. పైగా తితిదే సరకుల కొనుగోలుకు చేస్తున్న ఖర్చు ఏటా పెరుగుతుండటంతో ఈ కమిటీపై గురుతర బాధ్యత ఉంది.

- 2024-25 ఆర్థిక సంవత్సరం తితిదే బడ్జెట్‌లో సరకుల కొనుగోలుకు రూ.751 కోట్లు కేటాయించారు. 2023-24లో రూ.690 కోట్లు, 2022-23లో రూ.623.50 కోట్లు పెట్టారు.
- తితిదే కొనే ప్రతి సరకు ధరనూ కొనుగోలు కమిటీ సిఫారసు చేయాలి. టెండర్‌లో పాల్గొన్న గుత్తేదారులు కోట్ చేసిన ధరలు హేతుబద్ధంగా ఉన్నాయో లేదో చూడాలి. బియ్యం వంటి సరకుల్ని బయటి మిల్లర్లు, హోల్‌సేల్ దుకాణాల్లో ఏ ధరకు ఇస్తున్నారో వాకబు చేయాలి. అభ్యంతరాలుంటే నివేదికలో పొందుపరచాలి. అన్నీ సక్రమంగా ఉన్నాయని భావిస్తే ఆమోదముద్ర వేసి, పాలకమండలికి సిఫారసు చేయాలి.
- వైకాపా హయాంలో కొనుగోలు కమిటీ... అధికారులు ఇచ్చిన వివరాలకు ఆమోదముద్ర వేసే రబ్బరుస్టాంప్‌గా మారిపోయింది.
- టెండరు ప్రక్రియలో పాల్గొన్నవారు కోట్ చేసిన ధరలు హేతుబద్ధంగా లేవని... వాటిని పక్కన పెట్టాలంటూ కొనుగోలు కమిటీ సిఫారసు చేసిన సందర్భాలు గత ఐదేళ్లలో లేనే లేవు.
- జీడిపప్పు, యాలకులు, కిస్‌మిస్ తదితర దినుసులు, సామగ్రిని బోర్డు పెద్దలు 'అత్యవసరం' అంటూ అస్మదీయ గుత్తేదారుల నుంచి అధిక ధరలకు తీసుకున్నా కొనుగోళ్ల కమిటీ చోద్యం చూసింది.
- గుత్తేదారులు సరఫరా చేస్తున్న సరకు నాణ్యంగా ఉంటోందా? లేదా? నాణ్యత నిర్ధారణ పరీక్షలు సక్రమంగా జరుగుతున్నాయా? వంటి అంశాల్నీ కొనుగోళ్ల కమిటీ పరిశీలించలేదని అర్థమవుతోంది.

రాజకీయ నిర్ణయాలకు వత్తాసు

- తితిదేలో భూములు, కల్యాణ మండపాలు, షాపులు తదితరాల లీజు వ్యవహారాల్ని ఎస్టేట్స్ కమిటీ పరిశీలిస్తుంది. వైకాపా హయాంలో వీటిలోనూ పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరిగిందన్న ఆరోపణలున్నాయి.
- భూమన కరుణాకరరెడ్డి తితిదే ఛైర్మన్‌గా ఉండగా తిరుపతిలోని పలు భూముల్ని తమ రాజకీయ అవసరాల కోసం ఒక్కపైసా చెల్లించకుండా కార్పొరేషన్ అవసరాలకు వినియోగించుకున్నారు.
- వైఎస్సార్ మార్గ్ నుంచి సామవాయి మార్గ్‌వైపు రహదారి నిర్మాణం కోసం 1.12 ఎకరాల తితిదే భూమిని కార్పొరేషన్‌కు ఉచితంగా కట్టబెట్టారు. దాని టైటిల్ మాత్రం తితిదేకు ఉండాలని ఎస్టేట్స్ కమిటీ సిఫారసు చేసింది. రహదారి నిర్మించాక ఆ భూమిని తితిదే ఎలా పొందుతుందో ఎస్టేట్ కమిటీ సభ్యులకే తెలియాలి.
- చెన్నారెడ్డి కాలనీ శ్మశానవాటిక నుంచి ఇస్కాన్ రహదారికి వెళ్లే మార్గంలో తితిదేకు 34 సెంట్ల భూమి ఉంది. దాన్నీ కార్పొరేషన్‌కు ఇచ్చేసినా ఎస్టేట్స్ కమిటీ సభ్యులు అభ్యంతరం చెప్పలేదు.
- ఎన్నికలకు ముందు ఆరు నెలల్లో రూ.1,400 కోట్ల పనులకు అడ్డగోలుగా టెండర్లు పిలవడంలో వర్క్స్ కమిటీ పాత్ర ఉందన్న ఆరోపణలున్నాయి.
- అధికారులు వివిధ పనుల్ని ప్రతిపాదించి, టెండర్లు పిలిచే ముందు వర్క్స్ కమిటీకి పంపిస్తారు. అసలు ఆ పనులు అవసరమా? వాటి వల్ల భక్తులకు ఏ మేరకు ప్రయోజనం కలుగుతుంది? వంటి అంశాల్ని కమిటీ సభ్యులు పరిశీలించి ధర్మకర్తల మండలిలో ఆమోదానికి పంపిస్తారు.
- కరకంబాడిలోని ఆర్టీవో కూడలి నుంచి రేణిగుంట పరిధిలోని శ్రీపద్మావతి ఫ్లోర్ మిల్ వరకు 2.90 కి.మీ.ల మాస్టర్ ప్లాన్ రహదారి నిర్మాణానికి తితిదే నిధులు వినియోగించారు. వాస్తవానికి కరకంబాడి నుంచి తిరుమలకు నేరుగా వచ్చేందుకు స్మార్ట్‌సిటీలో భాగంగా ఫ్లైఓవర్ నిర్మించారు. అయినా రహదారి ప్రతిపాదనను తితిదేకి పంపించారు. ఆ రహదారి అవసరం లేదని తిప్పికొట్టాల్సిన వర్క్స్ కమిటీ... దానికి ఆమోదముద్ర వేసింది.
- తిరుపతిలో పటిష్ఠంగా ఉన్న గోవిందరాజస్వామి వసతిగృహాల్ని కూల్చి కొత్తగా నిర్మించేందుకు రూ.600 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. వాటికి మరమ్మతులు చేస్తే సరిపోయేది. వర్క్స్ కమిటీ సభ్యులు గుడ్డిగా ఆ ప్రతిపాదనకు ఆమోదముద్ర వేసేశారు.



ఇలాంటి బంధం నిత్యనరకం

స్నేహం, ప్రేమ, దాంపత్యం.. ఇలా ఏ బంధంలో అయినా రెండు రకాల మనస్తత్వాలున్న వారుంటారు- స్వార్థమన్నది లేకుండా సాధ్యమైనంత ఎక్కువ ఇచ్చేవారు; హద్దు అన్నది తెలుసుకోకుండా మరింత ఎక్కువ ఆశించేవారు. ఇద్దరూ మొదటి రకానికి చెందినవారుంటే ఆ బంధం స్వర్గంలా ఉంటుంది. ఇద్దరూ రెండో రకానికి చెందినవారైతే నిత్యనరకంలా మారుతుంది.

– ఎ.వేలుమణి, వ్యాపారవేత్త

గ్రహం అనుగ్రహం

29-9-2024 ఆదివారం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయణం; వర్ష రుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం
ద్వాదశి: సా. 5-37 తదుపరి త్రయోదశి
ఆశ్లేష: ఉ. 5-55 తదుపరి మఖ
వర్జ్యం: సా. 6-49 నుంచి 8-32 వరకు
అమృత ఘడియలు: ఉ. 5-55 వరకు
తిరిగి తె. 5-08 నుంచి
దుర్ముహూర్తం: సా. 4-14 నుంచి 5-02 వరకు
రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు
సూర్యోదయం: ఉ. 5.53; సూర్యాస్తమయం: సా.5.50

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	39.0	25.5
విజయవాడ	34.4	26.2
విశాఖపట్నం	33.8	24.98

ప్రముఖ రచయిత్రి విజయభారతి కన్నుమూత

గాంధీ వైద్య కళాశాలకు పార్థివదేహం అప్పగింతకు నిర్ణయం



ఈనాడు, హైదరాబాద్, సనత్‌నగర్, న్యూస్‌టుడే: ప్రముఖ రచయిత్రి డా. విజయభారతి(83) శనివారం హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌లో కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజోలులో 1941లో ఆమె జన్మించారు. పద్మభూషణ్ బోయి భీమన్న కుమార్తె, దివంగత సామాజికవేత్త బొజ్జా తారకం సతీమణి అయిన విజయభారతి ఓయూ నుంచి తెలుగు సాహిత్యంలో పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. తెలుగు సాహిత్యం, చరిత్ర, వివిధ సామాజిక అంశాలకు సంబంధించి 20కి పైగా పుస్తకాలు రాశారు. డా. బి. ఆర్. అంబేడ్కర్ రచనలు సహా పలు ఆంగ్ల గ్రంథాలను తెలుగులోకి అనువదించారు. డా. బి. ఆర్. అంబేడ్కర్, మహాత్మా జ్యోతిబా ఫులే జీవితచరిత్రలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. మహిళా సాధికారత, దళితుల హక్కుల కోసం పోరాడారు. తెలుగు అకాడమీ హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టరుగా, ఏపీ సాహిత్య అకాడమీ సభ్యురాలిగా, ఓయూ తెలుగు విభాగం అధిపతిగా వ్యవహరించారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు, తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ రచయిత్రి, డా. బి. ఆర్. అంబేడ్కర్ జాతీయ అవార్డు వంటి ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. ఆమె కుమారుడు రాహుల్ బొజ్జా ప్రస్తుతం తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి. డా. విజయభారతి పార్థివదేహాన్ని ఆదివారం గాంధీ వైద్యకళాశాలకు అప్పగించాలని కుటుంబసభ్యులు నిర్ణయించారు. ఆమె మృతిపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. సాహితీ రంగానికి ఆమె చేసిన సేవలు అపారమైనవని అన్నారు. సాహితీవేత్తగా, విశ్లేషకురాలిగా విజయభారతి చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ సీఎం కేసీఆర్ సంతాపం ప్రకటించారు.

కాళ్లు మొక్కుతా.. కాపాడండి సార్

మస్కట్‌లో ఉంటున్న మహిళ వేడుకోలు



ఇందిరమ్మ

ఈనాడు డిజిటల్, తిరుపతి: 'నా భర్త చనిపోవడంతో పిల్లల పెళ్లిళ్లు చేయాలని డబ్బు సంపాదించేందుకు మస్కట్ వచ్చాను. కానీ ఇక్కడ తినేందుకు తిండిపెట్టకుండా హింసిస్తున్నారు. కాళ్లు మొక్కుతా.. కాపాడండి సార్' అంటూ తిరుపతి సమీపంలోని కరకంబాడి ప్రాంతానికి చెందిన ఇందిరమ్మ అనే మహిళ విలపిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన వీడియో వైరలవుతోంది. తాను పనిచేస్తున్న చోటునుంచి తప్పించుకొని బయటకు వచ్చానని, ప్రస్తుతం చేతిలో చిల్లిగవ్వ లేదని వాపోయారు. ఆకలికి తట్టుకోలేక అడుక్కు తింటున్నట్లు చెప్పుకొచ్చారు. తన తల్లికి కూడా ఆరోగ్యం బాగోలేదని దయతలచి తనను ఇంటికి తీసుకురావాలని వేడుకుంటూ వీడియోను పోస్టుచేశారు.



ఆరోగ్యకరమైన డోపమైన్ పెరగాలంటే..

మెదడును ఉత్తేజితం చేయడంలో డోపమైన్ కీలక పాత్ర పోషిస్తుంది. ఆరోగ్యకరమైన విధానంలో డోపమైన్ హార్మోన్ మోతాదును పెంచుకోవడానికి దైనందిన జీవితంలో ఇవి పాటించండి: **1.**క్రమం తప్పకుండా నడక లేదా రన్నింగ్ చేయడం **2.**ధ్యానం **3.**బరువులు ఎత్తడం **4.**సూర్యకాంతిలో గడపడం **5.**ప్రకృతిని ఆస్వాదించడం **6.**సృజనాత్మక ప్రక్రియల్లో పాలుపంచుకోవడం **7.**చన్నీటి స్నానం చేయడం **8.**రోజూ ఎనిమిది గంటల పాటు నిద్రపోవడం **9.**అర్థవంతమైన లక్ష్యాల కోసం పనిచేయడం **10.**సజ్జనులతో సత్సంబంధాలు పెంచుకోవడం.

– స్టీజిన్ నూర్మన్, బిజినెస్ గ్రోత్ మెంటార్

మూడు సిలిండర్లపై ముమ్మర కసరత్తు!

- **ఉచితంగా అందించేందుకు ప్రభుత్వ సన్నాహకాలు**
- **దీపావళి నుంచి వంటింటి వెలుగులు**

ఈనాడు, అమరావతి: ఉచిత గ్యాస్ సిలిండర్ల హామీ అమలుపై ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. దీపావళి నుంచి ఈ పథకాన్ని ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించిన నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ కార్యాచరణ సిద్ధం చేస్తోంది. రాష్ట్రంలో 1.55 కోట్ల గృహ వినియోగ వంటగ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో తెల్లకార్డు దారుల కనెక్షన్లకు పథకాన్ని వర్తింపజేస్తే ఏడాదికి రూ.3,640 కోట్లు ఖర్చవుతాయి. దీపం, ఉజ్వల, ఇతర రాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద కనెక్షన్లు తీసుకున్న 75 లక్షల మందికే పథకం అమలు చేస్తే ఏడాదికి రూ.1,763 కోట్లు అవుతుంది. ఏడాదికి ఎంత ఖర్చవుతుంది? ఇతర రాష్ట్రాల్లో ఎలా అమలు చేస్తున్నారు? అనే వివరాలతో పౌరసరఫరాల శాఖ నివేదిక సిద్ధం చేస్తోంది. దీనిపై మంత్రుల కమిటీ సమావేశమై చర్చించి పలు సిఫారసులు చేసింది. సీఎం చంద్రబాబు ఆమోదించాక విధివిధానాలు వెలువడనున్నాయి.

ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.2,476

సూపర్ 6 హామీల అమల్లో భాగంగా.. ప్రతి ఇంటికీ ఏడాదికి 3 ఉచిత సిలిండర్లు ఇస్తామని ఎన్డీయే మేనిఫెస్టోలో ప్రకటించారు. ప్రస్తుతం ఒక్కో సిలిండర్ ధర రూ.825.50(విజయవాడలో) ఉంది. ఏడాదికి మూడు సిలిండర్ల లెక్కన ప్రస్తుతమున్న వంటగ్యాస్ ధర ప్రకారం ఒక్కో కుటుంబానికి రూ. 2,476.50 ప్రయోజనం లభిస్తుంది.



1.55 కోట్ల కనెక్షన్లు

రాష్ట్రంలో 1.55 కోట్ల గృహ వినియోగ వంటగ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. తెల్లకార్డు ప్రాతిపదికగా తీసుకుంటే ఇందులో 95%పైన అంటే 1.47 కోట్ల కుటుంబాలు అర్హత సాధిస్తాయి. వీరందరికీ ఏడాదికి మూడు సిలిండర్లను ఉచితంగా ఇవ్వడానికి సుమారు రూ.3,640 కోట్ల ఖర్చవుతుంది.

దీపం కనెక్షన్లనూ ఉజ్వల కింద మారిస్తే

కేంద్రం అమలుచేస్తున్న ఉజ్వల యోజన లాగే.. ఏపీలోని పేద కుటుంబాలకు 1999 నుంచే దీపం పథకం కింద గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామని, వాటినీ ఉజ్వల కింద పరిగణనలోకి తీసుకుని సిలిండర్‌కు రూ.300 చొప్పున రాయితీ ఇవ్వాలని సీఎం చంద్రబాబు ఇటీవల కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రికి లేఖ రాశారు. దీనిపై కేంద్రం ఇంకా ఏమీ తేల్చలేదు. దీన్ని ఆమోదిస్తే దీపం, ఇతర పథకాల కింద ఉన్న 65 లక్షల కనెక్షన్లను ఉజ్వల కిందకు మార్చుకోవచ్చు. ఫలితంగా రాష్ట్రప్రభుత్వంపై ఏడాదికి రూ.585 కోట్ల భారం తగ్గుతుంది. ఐదేళ్లకు రూ.2,925 కోట్ల మేర రాష్ట్ర ప్రభుత్వానికి ప్రయోజనం కలుగుతుంది.

రాష్ట్ర ప్రభుత్వ ప్రాయోజిత కనెక్షన్లకే అమలు చేస్తే...

కట్టెల పొయ్యి ఇబ్బందుల నుంచి మహిళలకు విముక్తి కల్పించేందుకు 1999లో ఉమ్మడి రాష్ట్ర సీఎంగా ఉన్నప్పుడు చంద్రబాబు దీపం పథకాన్ని ప్రారంభించారు. దీనితోపాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల కింద 59 లక్షల వంటగ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. 2016లో ఎన్డీయే అధికారంలోకి వచ్చాక ప్రధానమంత్రి ఉజ్వల యోజన(పీఎంయూవై) ప్రారంభించారు. ఈ పథకంలో సుమారు 9.70 లక్షల కనెక్షన్లు ఉన్నాయి. సామాజిక బాధ్యత కింద ఇంధన కంపెనీలు 6 లక్షల మందికి గ్యాస్ కనెక్షన్లు ఇచ్చాయి. మొత్తంగా 75 లక్షల మంది వివిధ పథకాల కింద గ్యాస్ తీసుకుంటున్నారు.

- 9.70 లక్షల ఉజ్వల వినియోగదారులకు కేంద్రం ఒక్కో సిలిండర్‌పై రూ.300 చొప్పున ఏడాదికి 12 సిలిండర్లకు రాయితీ ఇస్తోంది. అంటే వీరికి ఒక్కో సిలిండర్‌పై రూ.525.50 చొప్పున రాయితీ ఇవ్వాలి. మూడు సిలిండర్లకు ఏడాదికి రూ.153 కోట్లు అవుతుంది.
- దీపం, ఇంధన కంపెనీలిచ్చిన 65 లక్షల కనెక్షన్లకు ఒక్కో సిలిండర్‌కు రూ.825.50 చొప్పున ఏడాదికిచ్చే మూడు సిలిండర్లకు రూ.1,610 కోట్లు భరించాలి. అంటే మొత్తంగా రూ.1,763 కోట్లు వెచ్చించాలి.

హుబ్బళ్లి-విజయవాడ ఎక్స్‌ప్రెస్‌లో భారీ దొంగతనం

- 3.5 కిలోల బంగారు ఆభరణాల అపహరణ

ఈనాడు, కర్నూలు: కర్ణాటకలోని హుబ్బళ్లి నుంచి విజయవాడ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలులో శనివారం ఉదయం రూ.2.5 కోట్ల విలువైన 3.5 కిలోల బంగారు ఆభరణాలను దొంగలు అపహరించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన కాశీ విశ్వనాథ్, రంగారావు సత్తెనపల్లిలో 'సాయిచరణ్ జ్యువెలర్స్' పేరుతో బంగారు ఆభరణాల వ్యాపారం చేస్తున్నారు. వీరు ఆభరణాలను తయారుచేసి కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో విక్రయిస్తుంటారు. అందులోభాగంగా రంగారావు, ఆయన సోదరుడు సతీశ్‌బాబుతో కలిసి బంగారు ఆభరణాలను తీసుకొని మంగళవారం రాత్రి సత్తెనపల్లి నుంచి బళ్లారి వెళ్లారు. మూడు రోజులపాటు బళ్లారిలో ఉండి పలు దుకాణాల వ్యాపారులను సంప్రదించినా.. వారు ఆభరణాల కొనుగోలుకు ముందుకు రాలేదు. దీంతో శుక్రవారం రాత్రి హుబ్బళ్లి-విజయవాడ రైలులో తిరుగు ప్రయాణమయ్యారు. నంద్యాల వరకు మెలకువగా ఉన్నా, తర్వాత ఆభరణాలున్న బ్యాగును రంగారావు తన తల కింద పెట్టుకొని నిద్రపోయారు. రైలు దొనకొండ సమీపానికి వచ్చేముందు మెలకువ వచ్చి చూసుకోగా బ్యాగు కనిపించలేదు. దీంతో వెంటనే రైలుదిగి దొనకొండ రైల్వే స్టేషన్‌కు శనివారం ఉదయం ఏడు గంటల సమయంలో వెళ్లారు. అక్కడ రైల్వే పోలీసుస్టేషన్ లేకపోవడంతో.. కొందరు మార్కాపురం వెళ్లాలని సూచించగా అక్కడికి వెళ్లారు. అక్కడివారు నరసరావుపేట వెళ్లాలని చెప్పడంతో మధ్యాహ్నం 12 గంటలకు అక్కడికి వెళ్లారు. అక్కడి రైల్వే పోలీసులు సాయంత్రం వరకు రకరకాల ప్రశ్నలు అడిగి, చివరికి దొంగతనం జరిగిన ప్రాంతం నంద్యాల రైల్వే పోలీసుల పరిధిలోకి వస్తుందని, అక్కడికి వెళ్లాలని సూచించారు. దీంతో వారు రాత్రి నరసరావుపేట నుంచి బయలుదేరి నంద్యాల రైల్వే పోలీసుల వద్దకు వెళ్లారు. చోరీ జరిగిందని తెలిసినా.. దొంగలను పట్టుకునేందుకు వెంటనే స్పందించకపోగా.. కనీసం కేసు నమోదుచేయకుండా రైల్వే పోలీసులు పరిధి పేరుతో నిర్లక్ష్యం ప్రదర్శించారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

విశాఖలో సీబీఐ దాడులు.. ఐదుగురు సైబర్ నేరగాళ్ల అరెస్టు

విశాఖపట్నం(మాధవధార), న్యూస్‌టుడే: దిల్లీలో నమోదైన సైబర్ నేరాల కేసుల్లో నిందితులుగా ఉన్న విశాఖకు చెందిన ఐదుగురిని శనివారం సీబీఐ అరెస్టు చేసింది. విశాఖ నగరంలోని ఎండాడలో నివాసం ఉంటున్న అక్షయపత్వాల్, ధీరజ్‌జోషి, హిమాన్షుశర్మ, పార్థ్‌బాలి, పి.నవీన్‌చంద్ర పటేల్ స్థానిక బిర్లాజంక్షన్ వద్ద ఉన్న ఓ కాల్‌సెంటర్‌లో పని చేస్తున్నారు. వీరు కొంతకాలంగా ఆన్‌లైన్‌లో మోసాలకు పాల్పడుతూ.. పలువురి నుంచి డబ్బు కాజేస్తున్నారు. దీంతో సీబీఐ.. ఇతర రాష్ట్రాల పోలీసులతో కలిసి సంయుక్తంగా దాడులు చేసి వీరిని అదుపులోకి తీసుకుంది. నిందితుల నుంచి ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్ హార్డ్‌డిస్క్‌లు, కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుంది. ఐదుగురు నిందితులను కోర్టులో హాజరుపరిచారు. తర్వాత వారిని సీబీఐ తన కస్టడీలోకి తీసుకుంది. నగరంలో ఉన్న పలు కాల్‌సెంటర్లలోనూ తనిఖీలు నిర్వహించి, మరి కొందరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ఉపముఖ్యమంత్రిగా ఉదయనిధి ప్రమాణం నేడు

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తనయుడు, ఆ రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి స్టాలిన్ ఆదివారం ఉపముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ముఖ్యమంత్రి పంపిన ఈ ప్రతిపాదనకు గవర్నర్ ఆర్.ఎన్.రవి శనివారం ఆమోదం తెలిపారు.

94% మంది టెట్ హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు: విద్యాశాఖ

ఈనాడు, అమరావతి: టెట్‌కు దరఖాస్తు చేసిన వారిలో ఇప్పటి వరకు 94.30% మంది హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారని పాఠశాల విద్యాశాఖ తెలిపింది. మొత్తం 4,27,300 మంది దరఖాస్తు చేయగా.. 4,02,935 మంది హాల్‌టికెట్లు పొందారని, మిగిలిన వారూ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది.

ఈనాడు

గ్రంథాలయ దీప్తి

ఆ విదుషీమణిని ఓ శ్రీమంతురాలు తన ఇంటికి ఆహ్వానించింది. అది విలాసవంతమైన భవంతి. దేశ విదేశాలనుంచి సేకరించిన అపూర్వ కళాఖండాలతో అమూల్య వస్తుసంపదతో అలరారుతోంది. అన్నీ తీరిగ్గా తిలకించారామె. 'అంత పెద్ద ఇంట్లో ఒక్కటంటే ఒక్క పుస్తకం నా కంట పడలేదు... పుస్తకాలు లేని ఇల్లూ ఇల్లేనా!' అని నిట్టూర్చారు. ఎందుకంటే సుప్రసిద్ధ హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో ప్రముఖ భారతీయ గ్రంథాలతో 'ది మూర్తి క్లాసికల్ లైబ్రరి ఆఫ్ ఇండియా'ను నెలకొల్పిన చరిత్ర ఆమెది. ఎవరో కాదామె ఇన్ఫోసిస్ నారాయణమూర్తి భార్య సుధామూర్తి! గొప్ప చదువరి. అందుకే ఆ ఇంట లోటేమిటో సరిగ్గా గుర్తించారు. గ్రంథాలు కొలువుతీరిన భవనాన్ని 'పుస్తకాల మేడ' అనడం తెలుగు భాషకు తెలియదు- 'పొత్తపుగుడి' అనడమే దానికి ఆనవాయితీ. గ్రంథాలయాలంటే సరస్వతీ నిలయాలుగానే లెక్క! 'సిరులెల్ల క్షరములు(అశాశ్వతములు) అక్షరమైన సిరిజూపు ఆప్త ఉపదేష్ట(గురువు) గ్రంథాలయమ్ము' అనేదే ఈ జాతి విశ్వాసం.

గ్రంథాలయాల్లోకి ప్రవేశించగానే ఒకవైపు చెళ్లపిళ్ల 'కథలూ-గాథలూ', శ్రీపాద 'అనుభవాలు-జ్ఞాపకాలూను', ప్రకాశం 'నా జీవితయాత్ర'. గడియారం 'శతపత్రం', సామల సదాశివ 'యాది'... వంటి గ్రంథర్వకన్యల సోయగాలు కంటిని ఆకట్టుకొంటాయి. మల్లెపొదలపై ఆరవేసిన పట్టుబట్టల్లాంటి వారి అనుభవాల పుటలను కదపగానే పరిమళాలను వెదజల్లుతాయి. ఎదలను ఆకర్షిస్తాయి. నిదానంగా వాటిని ఆస్వాదించి, మరోవైపుగా కదులుతామా... వలల్లోంచి, మగ్గాల్లోంచి, కంకి కొడవళ్ల నుంచి, నాగేటి చాళ్లనుంచి, అణచివేతల్లోంచి మూల మూలల్లోంచి, మూలుగుల్లోంచి... ఆర్తితో ఆత్మీయంగా పొంగివచ్చే తడి ఆరని తల్లిభాష గుండెను తడుముతుంది. ప్రాచీన ప్రబంధ ఆధునిక గ్రంథకర్తల ఆప్త వచనాలు ఆప్యాయంగా దగ్గరకు తీసుకొంటాయి. కుశలం కనుక్కొంటాయి. 'పుటక నీది చావు నీది- బతుకంతా దేశానిది' కావాలని హితబోధ చేస్తాయి. మంచి మనిషిగా మారుస్తాయి. 'జాతి బంధములన్న గొలుసులు జారి సంపదలు అబ్బెడున్' అన్న గురజాడ ఆశయాన్ని నిజం చేస్తాయి.

పాఠ్యగ్రంథాలు- భుక్తి కోసమే. పై పుస్తకాలు- జీవితంపై అనురక్తి కోసం! కాబట్టే ఆ పుస్తకాలు కొలువుతీరే ప్రాంగణాలను ఆలయాలన్నారు. పుస్తకాలు అలంకారం కోసం కాదు గాని, పుస్తకాలకన్నా ఇంటికి గొప్ప అలంకారాలు ఈ లోకంలో లేవు. నింగి అంచులు దాటి పైకి ఎదగాలన్నా, ఎడద తలుపులు మీటి లోతులు చూడాలన్నా అక్షరంతో బంధం బలపడాలి. 'కావ్యామృత రసాస్వాదనం అంటే సంసార విషవృక్షానికి కాసిన మధుర ఫలాన్ని రుచి చూడడం' అన్నాడు విష్ణుశర్మ అనే సంస్కృతకవి. ఆ మాధుర్యాన్ని యువతకు చవి చూపేందుకు జాతీయ సేవా సంఘం(ఎన్ఎస్ఎస్) తెలంగాణ శాఖ తాజాగా 'గ్రంథాలయ దీప్తి' పేరుతో ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సెల్‌ఫోన్ల మీంచి యువత దృష్టిని గ్రంథాల దిశగా మళ్లించడం..., మానవ మస్తిష్కపు సద్వినియోగమే- ఆదిమ, ఆధునిక యుగాల మధ్య ఇంతటి వ్యత్యాసానికి కారణమని, అందుకు గ్రంథ పఠనం బలమైన సాధనమనీ నూరిపోయడం ఆ ప్రణాళిక లక్ష్యం. 'మనిషికి హృదయం ఉంది... దానికి అనుభవం ఇవ్వాలి' అనే గొప్ప సంకల్పంలోంచి ఉబికి వచ్చిన ఈ ప్రతిపాదనను జనమంతా స్వాగతించాలి. ఇతర రాష్ట్రాలు అనుసరించాలి. 'అన్ని దిశల నుంచి వివేకం మనిషిని ఆవరించుగాక' అనే ఉపనిషత్తు ఆకాంక్ష నెరవేరాలి!

సిద్ధాంతాల ఆధారంగానే పొత్తు



జమ్మూకశ్మీర్ అసెంబ్లీ మూడో దశ ఎన్నికలు అక్టోబర్ ఒకటిన జరగనున్నాయి. పోలింగ్ తీరుతెన్నుల పరిశీలనకు అమెరికా, నార్వే, సింగపూర్ సహా 16 దేశాల దౌత్యవేత్తలు వచ్చారు. ఈ ఎన్నికల్లో తామే గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నామని, అందులో మెహబూబా ముఫ్తీ నాయకత్వంలోని పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ(పీడీపీ)కి స్థానం ఉండదని జమ్మూకశ్మీర్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు రవీందర్ రైనా ప్రకటించారు. మరోవైపు ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా తాము మాత్రం భాజపాతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే ప్రసక్తే లేదని **నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) పార్టీ సీనియర్ నాయకుడు, శ్రీనగర్ పార్లమెంటు సభ్యుడు ఆగా రుహుల్లా మెహదీ** స్పష్టం చేశారు. తాము భావజాల పరంగానే ముందుకెళ్తామని **ఈటీవీ భారత్ ప్రతినిధి మీర్ ఫర్హత్ మక్బూల్**తో ముఖాముఖిలో ఆయన పేర్కొన్నారు.

జమ్మూకశ్మీర్ పోలింగ్ ఎలా జరుగుతోంది?

ప్రజలు చాలా ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేస్తున్నారు. మా పార్టీ నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) ప్రచారం ప్రజల్లోకి బాగా వెళ్లింది. ఈసారి మేము మంచి ఫలితాలు సాధిస్తామనుకుంటున్నాను.

ఒకవేళ ఎన్‌సీ మెజారిటీ సాధిస్తే- ఆ విజయం ఎలాంటి సందేశమిస్తుంది అనుకుంటున్నారు?

జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తినిచ్చిన 370వ రాజ్యాంగ అధికరణను కేంద్రం రద్దుచేయడం పట్ల ఇక్కడి ఓటర్లు అసంతృప్తితో ఉన్నారన్న సందేశం వెళ్తుంది. జమ్మూకశ్మీర్ ప్రజల సమ్మతితోనే 2019 ఆగస్టు అయిదున ఈ నిర్ణయం తీసుకున్నామని కేంద్ర అధికార పక్షం చెబుతోంది. ఎన్‌సీ గెలిస్తే- అది నిజం కాదని తేలుతుంది.

నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ), కాంగ్రెస్ పార్టీలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తే కనుక తరవాత పరిణామాలు ఎలా ఉంటాయి?

జమ్మూకశ్మీర్ ప్రజల హక్కులను హరించారని, వారిని మోసం చేశారని, రాష్ట్ర శాసనసభ స్థాయిని తగ్గించారని ప్రజాస్వామ్యయుతంగా ప్రపంచానికి తెలియజెబుతాం. మేము కోల్పోయిన హక్కులను, ప్రత్యేక ప్రతిపత్తిని తిరిగి సాధించడానికి అసెంబ్లీ వేదికగా ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడతాం.

జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం ఈ కేంద్రపాలిత ప్రాంతానికి సంబంధించిన నిర్ణయాలన్నింటినీ పార్లమెంటు, భారత ప్రభుత్వం తీసుకుంటాయి. అలాంటప్పుడు కశ్మీర్ అసెంబ్లీ చేయగలిగిందేముంటుంది?

జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరించాలని కొత్త అసెంబ్లీ సుప్రీంకోర్టును అర్థించగలుగుతుంది. 370వ అధికరణ రద్దును జమ్మూకశ్మీర్ ప్రజలు సమ్మతిస్తున్నారా లేదా అన్నదే అసలు ప్రశ్న. దానికి జవాబును ఎన్నికల తరవాత కొలువు తీరే కొత్త శాసనసభ ఇవ్వగలుగుతుంది. 370వ అధికరణ రద్దుపై మేము వీధుల్లో నిరసన తెలపాలనుకున్నాం. కానీ, దానికి కేంద్రం అంగీకరించలేదు. ఇకపైనా మేము శాంతియుతంగానే నిరసన తెలుపుతాం తప్ప హింసకు దిగబోము. మేము హింసకు వ్యతిరేకం. మేము కోల్పోయిన హక్కులు, ప్రత్యేక ప్రతిపత్తిని తిరిగి సాధించడానికి అసెంబ్లీ ద్వారా ఉద్యమిస్తాం.

నిషిద్ధ జమాతే ఇస్లామీతో పాటు మరి కొన్ని పక్షాలు, ఇంజినీర్ రషీద్ అభ్యర్థులను ద్రోహులనీ, ఎన్‌సీకి వ్యతిరేకంగా పోటీ చేస్తున్నారనీ నేషనల్ కాన్ఫరెన్స్ అగ్రనాయకులైన ఫారూక్, ఒమర్ అబ్దుల్లాలు విమర్శిస్తున్నారు. ఎందుకని?

ప్రజాస్వామ్యంలో ఎన్నికల్లో పోటీ చేసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. అయితే వారి భావజాలం, విధానాలేంటనేదే అసలు ప్రశ్న. కొన్ని పార్టీలు ఇటీవలి పార్లమెంటు ఎన్నికల్లో తాము భారతీయ జనతా పార్టీ మిత్రులమని స్వయంగా చెప్పుకొన్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఇంజినీర్ రషీద్, కొందరు ఇండిపెండెంట్లు ఓట్లు చీలుస్తారు.

మీ పార్టీ ప్రస్తుత ఎన్నికల్లో పీడీపీతో కలిసి కూటమిగా ఎందుకు పోటీచేయడం లేదు?

నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ)పైన, పార్టీ సంస్థాపకుడైన దివంగత షేక్ అబ్దుల్లాపైనా పీడీపీ విషం చిమ్మింది. జిల్లా అభివృద్ధి మండలి ఎన్నికల తరవాత ఎన్‌సీని అది బాగా లక్ష్యంగా చేసుకుంది. ఎన్నికల పొత్తుకు అదే అడ్డంకిగా మారింది. ఏది ఏమైనా అందరినీ కలుపుకొనిపోవడానికి ఎన్‌సీ కృషి కొనసాగిస్తుంది.

ఎన్నికల తరవాత హంగ్ అసెంబ్లీ వస్తే ప్రభుత్వ ఏర్పాటుకు భాజపాతో చేయి కలుపుతారా?

భాజపా, ఎన్‌సీ సంకీర్ణం ఏర్పడే ప్రసక్తే ఉండదన్నది నా వ్యక్తిగత, మా పార్టీ అభిప్రాయం. మెజారిటీ తగ్గిందని పొత్తు పెట్టుకోకూడదు. సిద్ధాంతాలు, నిబద్ధత ఆధారంగా పొత్తు కుదుర్చుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలి. ఇదే నేషనల్ కాన్ఫరెన్స్ అభిమతం. ●

భారీగా ఎగుమతులు



వస్త్రాలు, హస్తకళాకృతులను భారత్ పెద్దయెత్తున వివిధ దేశాలకు ఎగుమతి చేస్తోంది. తద్వారా పెద్దమొత్తంలో ఆదాయాన్ని ఆర్జిస్తోంది. విదేశాల నుంచీ ఆ ఉత్పత్తులు కొన్నింటిని దిగుమతి చేసుకుంటోంది. ఆయా ఆర్థిక సంవత్సరాల్లో వాటి ఎగుమతులు, దిగుమతుల విలువ.. (కోట్ల డాలర్లలో)

సంవత్సరం	ఎగుమతులు	దిగుమతులు
2019–20	3517.7	826.2
2020–21	3,158.5	587.3
2021–22	4443.5	819.3
2022–23	3668.6	1048
2023–24	3587.4	894.7

(ఆధారం: పార్లమెంటులో కేంద్రం వెల్లడించిన వివరాలు)

ఇలా బతకకూడదని...

ఏ కథలో అయినా కథానాయకుడు ఇలా ఉండాలీ అని కొన్ని గుణగణాలను మనం ఊహించుకుంటాం. ఆ ఊహల్ని పక్కన పెట్టి చదవాల్సిన పుస్తకం ఇది. పేరుకు తగ్గట్టే ఇది ఒక 'అసమర్థుడి జీవయాత్ర'. అసమర్థుడని చెప్పాక ఇంక అతడి గురించి తెలుసుకునేదేముందీ అనుకుంటే పొరపాటే. ఎన్నేళ్లయినా సమాజమూ మనిషి స్వభావమూ మౌలికంగా అలాగే ఉంటాయి. ఈ నవలలోని పాత్రల్లాంటి వాళ్లెంతమందో మన చుట్టూ కనిపిస్తుంటారు. కాబట్టి, ఎలా బతకకూడదో తెలుసుకోవడానికి... ఈ నవల చదవాలి.

సీతారామారావుది జమీందారీ కుటుంబం. వంశప్రతిష్ఠను నిలపమన్న తండ్రి మాట ప్రకారం సీతారామారావు చేతికి ఎముక లేనట్లు దానధర్మాలు చేస్తాడు. నిత్యాన్నదానాలూ పేదలకు వస్త్రదానాలూ చేసి బంధువులందరికీ తృప్తిగా కానుకలిచ్చి పంపిస్తాడు. అడిగినవారికి లేదనకుండా అప్పులిస్తాడు. కూర్చుని తింటే కొండలైనా కరుగుతాయన్నది తెలిసిందే. సీతారామారావుకు తన హోదాకి తగ్గట్టు బతకడమే తెలుసు కానీ సంపాదించడం తెలియదు. దాంతో వాళ్ల ఆస్తులూ కరిగిపోతాయి. అయినా తమది ప్రత్యేక వంశమనీ మిగిలినవారి కన్నా తాము భిన్నమనీ అనుకోవడమూ అలా ప్రవర్తించడమూ మానడు.



సంసార జంఝాటంలో ఇరుక్కున్న స్నేహితులను గేలి చేస్తూ తానసలు పెళ్లే చేసుకోనని కోతలు కోసి, కొన్నాళ్లకే ప్రేమించి పెళ్లి చేసుకుంటాడు. అదేమంటే సంసారజీవితానికి సరికొత్త అర్థం చెబుతాను చూడండంటాడు. నాలుగేళ్లు తిరిగేసరికల్లా ఇద్దరు పిల్లలతో, చిల్లిగవ్వ ఆదాయం లేక, ఇల్లు గడవని పరిస్థితుల్లో... మిగులుతాడు. ఒకరి కింద ఉద్యోగం చేయడమే కాదు, బయటికి వెళ్లి కూరగాయలు తేవడం కూడా చేతకాదు. గతంలో అతడి నుంచి సాయం పొందిన వాళ్లెవరూ కృతజ్ఞత చూపరు సరికదా, 'మామీద ప్రేమతో చేశాడా, తన గొప్పదనం చూపించుకోడానికి చేశాడు కానీ' అని ఈసడించుకుంటారు. దాంతో వాళ్లకు ఎదురు పడటానికి కూడా ఇష్టపడని సీతారామారావు అందరినీ తప్పించుకు తిరుగుతుంటాడు. ఆ కోపమంతా ఇంటికొచ్చి భార్యాబిడ్డల మీద చూపిస్తాడు. మామ ఉద్యోగం చూపిస్తే అదీ చేయలేక వదిలేస్తాడు. పైగా మామ ఆడపిల్లను కని తనకిచ్చి పెళ్లి చేయడంవల్లే తనకీ కష్టాలన్నీ అనుకుంటాడు. సీతారామారావును చిన్నప్పటినుంచీ ఎరిగిన రామయ్య తాత అతడికి జీవిత సత్యాలు విడమరచి చెప్పే ప్రయత్నం చేస్తాడు. లౌక్యం నేర్చుకోమనీ, సమాజంతో పాటు మారాలనీ చెప్పినా సీతారామారావుకు అర్థం కాదు. గంటలు గంటలు ఆలోచిస్తూ పిచ్చోడిలా తయారవుతాడు. కుటుంబాన్ని పట్టించుకోని అతణ్ని ఆఖరికి అతడి నీడ కూడా వదిలివెళ్లిపోతుంది.

మన సమాజం భూస్వామ్య, జమీందారీ విధానం నుంచి పెట్టుబడిదారీ విధానం వైపు మళ్లుతున్న సమయంలో రాసిన పుస్తకమిది. అలాంటి సీతారామారావులు ఇప్పుడూ ఉంటారు. కాకపోతే మంచివాడిననిపించుకునే ఆరాటానికి బదులు మద్యం, జూదం, ఆన్‌లైన్ గేమింగ్, విలాసాల కోసం తాహతుకు మించి అప్పులు చేయడం... లాంటి వ్యసనమేదైనా ఉండొచ్చు. అందుకే గోపీచంద్ రాసిన ఈ మనోవైజ్ఞానిక నవలని చదివి తీరాల్సిన క్లాసిక్స్‌లో చేర్చారు.

– మిహిర


న్యాయమూర్తులు తప్పనిసరిగా సమాజంతో అంటీ ముట్టనట్టుగానే వ్యవహరించాలి. లాయర్లు, రాజకీయ పార్టీలు, నాయకులు, మంత్రులు తదితరులతో వ్యక్తిగత సంబంధాలకు దూరంగా ఉంటూనే అన్ని రంగాలపైనా అవగాహన కలిగి ఉండాలి. అప్పుడే ఉద్యోగ ధర్మానికి న్యాయం చేయగలుగుతారు.

– జస్టిస్ ఎస్.హెచ్.కపాడియా



జీవిత మకరందం

సంతోషంగా జీవించడం ఏమంత తేలికైన విషయం కాదు. జీవితం సవాళ్లతో నిండి ఉంటుంది. జీవనక్రమంలో విజయం, ఆనందం తారసపడుతుంటాయి. కానీ జీవితం చాలావరకూ నిరాశతోనే గడిచిపోతుంది. ఎందుకంటే, చాలామంది విజయాన్ని ఆనందంతో సమానం అనుకుంటారు. కేవలం కీర్తిప్రతిష్ఠలు, డబ్బు ఆనందాన్ని కలిగించవు. ఆనందం మన సొంత చర్యల నుంచి, లోలోపలి నుంచి ఉద్భవిస్తుంది. విజయాన్ని కీర్తి, డబ్బు, అధికారంతో కొలవడమనేది సామాజికపరమైంది. ఆ ఉచ్చులో పడకూడదు. వినయం ప్రధానం. అంతిమంగా, లోపల ఉన్న ఆత్మ వాస్తవం. అదే ముఖ్యమైంది. బాహ్య వాతావరణం కాదు. సత్యాన్ని, ధర్మాన్ని అనుసరించాలి. పోరాడకుండా దేన్నీ విడిచిపెట్టకూడదు. సామర్థ్యాన్ని పూర్తి పరిమితుల మేర విస్తరించేదాకా నిష్క్రమించకూడదు. అప్పుడే జీవితం విలువైందిగా అనిపిస్తుంది. అలా అనిపించినప్పుడే అసలైన ఆనందం అనుభవంలోకి వస్తుంది. జీవితం నాణ్యతను ఈ ఆనందక్షణాల ద్వారానే గ్రహిస్తుంటాం. ఆనందం అంతిమమైనదే. దానిని ఎవరికి వారే అనుభూతి చెందాలి.



అంతర్యామి

'మీ ప్రథమ కర్తవ్యం ఆనందంగా ఉండటమే' అని వందేళ్ల క్రితమే స్వామి రామానందతీర్థ చెప్పారు. సాధువులు ఆనందమార్గాన్ని ఆటంకపరచే అడ్డంకులేంటో కనుగొన్నారు. వాటిని తొలగించుకుని ముందుకు వెళ్లే నిర్ణీత పద్ధతుల్ని తెలియజేశారు. విజయమార్గంలో కోరిక పుడుతుంది. కోరిక ఎదుగుదలను నిరోధిస్తుంది. శక్తిహీనుల్ని చేస్తుంది. కోరికల వలయంలో చిక్కుకున్న మనిషి బయటపడటం అంత తేలిక కాదు. భగవద్గీత కోరికలను వదిలేయమని చెప్పదు. పరిపూర్ణతను కలిగించే ఒక ఉన్నతస్థాయి కోరిక వైపునకు ఎదగమంటుంది.

ఆనందం అంటే వేర్వేరు వ్యక్తులకు వేర్వేరు విషయాలు. కొందరికి ఆర్థికపరమైన భద్రత, కొందరికి అర్థవంతమైన సంబంధాలు, ఆరోగ్యం అయితే ఇంకొందరికి ఎదుగుదల. ఆనందాన్ని నిర్వచించాలంటే- సంతృప్తి వైపు చేసే ప్రయాణంలో ముఖ్యమైన మొదటి అడుగు. క్షణికానందాలకు విలువ కచ్చితంగా ఉంటుంది. దీర్ఘకాలిక ఆనందానికి స్వీయ ఆలోచనలు, స్పృహతో కూడిన ప్రయత్నం, సానుకూల దృక్పథం... అవసరం. ఆ దిశగా చేసే ప్రయత్నాలు మానసిక స్థిరత్వాన్ని మెరుగుపరుస్తాయి. కాలం గడిచినకొద్దీ మానసిక శ్రేయస్సుకు తోడ్పడతాయి.

ఇష్టమైన పనిలో మునిగిపోయినప్పుడు కలిగే ఆనందం ఒక ప్రవాహం లాంటిది. సంగీత కళాకారులు, చిత్రకారులు, నటీనటులు... తమ నైపుణ్యంతో గంటల తరబడి నిమగ్నమై ఆనందంలో మునిగిపోతారు. ఆ కళను ఇష్టపడేవారిని సైతం అందులో ముంచెత్తుతారు. మన స్వభావం, దృక్పథం... తృప్తిలో ప్రభావవంతమైన భూమికను పోషిస్తాయి. నిరంతర అభ్యాసం, లక్ష్యాలను కలిగి ఉండటం వల్ల ఉత్సాహం, పురోగతి లభిస్తాయి. దాటే ప్రతి మైలురాయి పురోగతితోబాటు ఆనందాన్నీ ఇస్తుంది. జ్ఞానసాధనే లోతైన ఆనందాన్ని అందిస్తుందని తెలుసుకోవాలి.

– మంత్రవాది మహేశ్వర్

నదులా... చెత్తబుట్టలా?

మానవ నాగరికతకు తమ చనుబాలు పట్టి పెంచినవి నదీమతల్లులే. నదీ పరీవాహక ప్రాంతాల్లో వ్యవసాయం పెరిగి ఆహారంలో మిగులు చేతికందిన తరవాతే మనిషి ఆలోచనా పరిధి విస్తరించింది. అదే ఇప్పుడు ఆకాశ తీరపు ఆవలి అంచుల వరకు చేరింది. తమ జలధారలతో మానవ జాతిని పెంచి పోషించిన నదులకు మనం తిరిగి ఇస్తున్నదేంటి? వాటిని చెత్తబుట్టలుగా మార్చేసి టన్నుల కొద్దీ వ్యర్థాలను తీసుకెళ్లి గుమ్మరిస్తున్నాం. ఇళ్లలోంచి వాడల్లోంచి పొంగిపొర్లే మురుగునీళ్లను నేరుగా నదుల్లోకి వదిలిపెడుతున్నాం. పారిశ్రామిక వ్యర్థాలూ రసాయనాలనూ నదుల్లోనే కలిపేస్తున్నాం. జీవనదుల నీటిని తాగేందుకు కాదు కదా కనీసం స్నానం చేయడానికీ పనికి రాకుండా చేసుకుంటున్నాం. ఆ నీళ్లను ముట్టుకుంటేనే నానారోగాల బారినపడే దురవస్థను కోరి తెచ్చుకుంటున్నాం. అంతాచేసి మళ్లీ గంగమ్మా, గోదారమ్మా, కృష్ణమ్మా అంటూ పైకి దండాలు పెడుతుంటాం! తినే కంచంలో మట్టిపోసుకునే వాణ్ని మూర్ఖుడు అంటారు... మరి పొలాలకు నీళ్లిచ్చి మన కడుపులు నింపి, గొంతు తడిపి ప్రాణాలు నిలిపే నదులను అయినకాడికి పాడుచేసే వారిని ఏమంటారు?

సాగు, తాగునీటి అవసరాలను తీరుస్తూ, విద్యుత్ వెలుగులను అందిస్తూ రెండు తెలుగు రాష్ట్రాలకు జీవరేఖలా భాసిల్లుతోంది కృష్ణానది. "కృష్ణవేణీ తరంగిణి పయోలహరికా స్నాతుడై పవనుడు పునీతుడై చలియించె" (కృష్ణలో స్నానంచేసి వాయుదేవుడు పునీతుడయ్యాడు- అంటే ఆ నదే కాదు, దానిమీదుగా వీచే గాలి సైతం పవిత్రమైనదే) అంటూ కృష్ణమ్మను నోరారా కీర్తించారు సి.నారాయణరెడ్డి. అలాంటి జీవనది ఇప్పుడెలా తయారైంది? చుట్టుపక్కలి ప్రాంతాల నుంచి నానారకాల చెత్త కుప్పలుతెప్పలుగా వచ్చి కలుస్తుండటంతో కృష్ణానది కాలుష్య కాసారమైంది. ఆ మేరకు వరంగల్, సూరత్‌కల్ జాతీయ సాంకేతిక సంస్థ(ఎన్ఐటీ)ల తాజా అధ్యయన నివేదికలో చేదునిజాలెన్నో ప్రస్తావితమయ్యాయి. తీరప్రాంత పట్టణాల్లోని పరిశ్రమల నుంచి రసాయన వ్యర్థాలు భారీగా వచ్చిచేరుతుండటంతో కృష్ణా జలాలు ఎందుకూ పనికిరాని స్థితికి చేరుతున్నాయని ఎన్ఐటీల పరిశోధనలో తేలింది. కృష్ణానదితో పాటు గోదావరిలో కూడా కొలిఫాం బ్యాక్టీరియా విపరీతంగా ఉన్నట్లు కేంద్ర జలసంఘం ఇటీవలే వెల్లడించింది. దాహార్తిని తీర్చుకోవడానికి కాదు కదా, కనీసం స్నానం చేసేందుకు కూడా ఆ రెండు నదుల నీళ్లు పనికిరావని... ఆ స్థాయిలో అవి కలుషితమయ్యాయని జలసంఘం స్పష్టంగా పేర్కొంది. బాసర నుంచి రాజమహేంద్రవరం వరకు తెలుగు రాష్ట్రాల్లో గోదావరి నది పొడవునా ప్రయాణిస్తే- ఒళ్లు జలదరించే దృశ్యాలెన్నో కనపడతాయి. ఘనవ్యర్థాలు మొదలు శుద్ధి చేయని మురుగునీరు, పరిశ్రమల నుంచి వెలువడే అత్యంత ప్రమాదకర రసాయనాల వరకూ అన్నీ గోదావరిలోనే కలిసిపోతున్నాయి. కాదు... కలిపేస్తున్నారు. మూసీ, మానేరు. తుంగభద్ర, కుందూ, హంద్రీ, నీవా, చిత్రావతి, పెన్నా, కాళంగి, స్వర్ణముఖి, గుండ్లకమ్మ... ఇలా తెలుగునాట పలు ప్రాంతాలకు వరదాయినులైన నదులన్నింటినీ డంపింగ్ యార్డులుగా మార్చేస్తున్నారు. వాటి జీవం తీసి, భావితరానికి బతుకు లేకుండా చేస్తున్నారు!



పుణ్యభూమి

భారతీయ సాంస్కృతిక సౌధానికి పునాది వంటి గంగానది ఎంత దుర్గంధభూయిష్ఠమైందో అందరికీ తెలుసు. దాన్ని శుభ్రం చేయడానికి 1986-2014 మధ్యలో ప్రభుత్వం రూ.20వేల కోట్లు ఖర్చుచేసింది. 2014 తరవాత మరో రూ.13వేల కోట్లకు పైగా నిధులను ఆ పనికోసమే వెచ్చించింది. అయినాసరే, చెత్తాచెదారాల నుంచి గంగానదికి విముక్తి లభించలేదు. గంగతో పాటు బిహార్‌లో ప్రవహిస్తున్న మరో 21 నదుల్లో ప్రతిఒక్కటీ తీవ్రస్థాయిలో కలుషితమైంది. తాగు, సాగునీటి అవసరాలను తీర్చుకోవడానికే కాదు- మునకేయడానికీ పనికిరాకుండా ఆ నదీజలాలు ఉన్నాయని బిహార్ కాలుష్య నియంత్రణ మండలి నివేదిక ఇటీవలే స్పష్టంగా పేర్కొంది. దేశవ్యాప్తంగా 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ప్రాణాధారాలైన 279 నదులకు చెందిన 311 ప్రవాహ ప్రాంతాలు కాలుష్య రక్కసి కోరల్లో చిక్కుకున్నట్లు సర్కారీ అధ్యయనాలే చాటిచెబుతున్నాయి. సగం సగం కాలిన మానవ మృతదేహాలు, పశువుల కళేబరాలు, జంతు వ్యర్థాలు, మలమూత్రాలు, క్రిమిసంహారకాలు... ఇలా అన్నింటిని పారబోయడానికి నదులను వాడుకోవడం ఎంత ఘోరం? మళ్లీ అవే నీటిని చేలకు మళ్లించడం, కలుషిత నీళ్లతో పండిన పంటలే ఆహార పదార్థాలై మన పొట్టలోకి చేరడం, ఆపై చెప్పనలవి కాని జబ్బులెన్నో చుట్టుముట్టడం- ఇదో విషవలయం!

కెనడా, చిలీ, డెన్మార్క్, స్వీడన్, సింగపూర్, జర్మనీ తదితర దేశాలు జలవనరులను భద్రంగా రక్షించుకుంటున్నాయి. ప్రజలకు పరిశుద్ధమైన నీటిని అందిస్తున్నాయి. మరి మనదగ్గరో... నీటివనరులన్నీ కాలుష్య రక్కసి కబంధ హస్తాల్లో చిక్కి విలవిల్లాడుతున్నాయి. అభివృద్ధి అంటే జీడీపీ లెక్కలు కాదు. జనజీవన ప్రమాణాలు పెరగడమే ప్రగతికి నిదర్శనం. ఆరోగ్యకరమైన పరిసరాల్లో ఆహ్లాదంగా జీవించడమే అభివృద్ధికి కొలమానం. ఆ స్పృహలేని రాజకీయ నాయకుల పాలబడిన భారతావనిలో కనీసం మురుగునీటి శుద్ధి కూడా చెప్పుకోదగిన స్థాయిలో జరగడం లేదు. దేశవ్యాప్తంగా రోజుకు సుమారు 7,236.8 కోట్ల లీటర్ల మురుగునీరు ఉత్పత్తి అవుతుంటే- అందులో 2,686.9 కోట్ల లీటర్లే శుద్ధికి నోచుకుంటున్నాయి. మిగిలిన వ్యర్థజలాలను నదులు, చెరువులు, కుంటలు, సరస్సుల్లోకి వదిలిపెట్టేస్తున్నారని నీతిఆయోగ్ గతంలో ఆందోళన వ్యక్తంచేసింది. మురుగునీటి శుద్ధి ప్లాంట్ల ఏర్పాటులో అలక్ష్యం- ఉపరితల జలవనరుల ప్రాణం తీయడమే కాదు, భూగర్భ జలాలనూ కలుషితం చేస్తోంది. ఆయా నదులూ చెరువుల నీటితో పండించిన కూరగాయలూ ఆకుకూరల్లో భారలోహాలు భారీగా పోగుపడుతున్నాయి. ఆ విధంగా ప్రభుత్వాల బాధ్యతారాహిత్యం, సమాజ నిర్లక్ష్యం కలగలిసి జనారోగ్యాన్ని పీల్చిపిప్పి చేస్తున్నాయి. కష్టార్జితాలను ఆసుపత్రులకు ధారబోయించి, సామాన్యులను అప్పుల సుడిగుండంలోకి నెట్టేస్తున్నాయి!

బావి ఎండిపోయాక కానీ, జనానికి నీటి విలువ తెలియదన్నది ఓ అనుభవజ్ఞుడి మాట. అలాగే, నదులన్నీ పూర్తిగా వట్టిపోతే కానీ, నష్టం మన తలకెక్కదేమో! అంతవరకు తెచ్చుకోవడం క్షేమదాయకం కాదు. నదీమతల్లులను దేవతలుగా భావించి పూజించే భారతావనిలో, పుష్కరాల పేరిట పుణ్యస్నానాలు ఆచరించే చోట... నదీకాలుష్యం తీవ్రతరం అవుతుండటం మొత్తం జాతికే సిగ్గుచేటు. ఆ దుస్థితిని రూపుమాపడానికి ప్రభుత్వాలు చేయాల్సిన వ్యవస్థాగత కృషి ఎంత ఉందో- చెత్తాచెదారాలను జలవనరుల్లోకి విసిరి పారేయకుండా ఉండాల్సిన బాధ్యత ప్రజలపైనా ఉంది. ఆ దిశగా అందరిలో మార్పు వస్తేనే- మన ఆరోగ్యాలు బాగుపడతాయి!

– శైలేష్ నిమ్మగడ్డ


బుజ్జిగాడి జామపండు!

హాయ్! బుజ్జీ!!

బడి నుంచి ఇంటికి రాగానే బుజ్జిగాడు పెరట్లో ఉన్న జామచెట్టు దగ్గరకు వెళ్లాడు. పొద్దున తాను చూసిన జామపండు కోసుకుని తినాలనుకున్నాడు. కానీ పండును ఓ చిలకమ్మ ముక్కుతో పొడుస్తూ కనిపించింది. దాంతో బుజ్జిగాడికి కోపం వచ్చింది. ఓ రాయి తీసుకుని చిలకమ్మ మీదకు విసిరాడు. అది తప్పించుకుని చిటారు కొమ్మ మీద వాలింది.

'ఓయ్ చిలకా! ఈ జామ చెట్టు మాది. నువ్వు ఎందుకు మా జామపండ్లు పాడు చేస్తున్నావు?' అని ప్రశ్నించాడు బుజ్జిగాడు. 'నేనేమీ పాడు చేయటం లేదు. ఆకలిగా ఉంటే ఈ చెట్టు మీద వాలి తింటున్నా' అని చిలకమ్మ సమాధానమిచ్చింది. 'ఈ చెట్టు నువ్వు నాటావా! దీన్ని మా బామ్మ మొక్కగా నర్సరీ నుంచి కొనుక్కొని వచ్చి నాటి, పెద్ద చేసింది తెలుసా!' అన్నాడు బుజ్జిగాడు. 'అవునా.. మరి నువ్వెన్ని మొక్కలు నాటావు?' అని ప్రశ్నించింది చిలకమ్మ.

'నేను మా పెరట్లో మామిడి, బొప్పాయి, సపోటా, గులాబీ మొక్కలు నాటాను' అన్నాడు బుజ్జిగాడు. 'ఓస్..అంతేనా!? రెండు, మూడు మొక్కలు నాటినందుకే నువ్వింత మాట్లాడుతున్నావే. అసలు ఈ ప్రకృతి ఇంత పచ్చగా ఉండటానికి కారణం మేమే.. తెలుసా!' అని దబాయిస్తూ అంది చిలకమ్మ. బుజ్జిగాడికి అర్థం కాలేదు. నోరు తెరిచి చిలకమ్మ వైపు చూశాడు. 'మా పక్షిజాతి వల్లే వృక్షజాతి అంతరించిపోకుండా ఇంకా కళకళలాడుతూ ఉంది. అదిగో అక్కడ చూడు.. నేను జామపండును ముక్కుతో పొడవటం వల్ల కొన్ని గింజలు నేల మీద పడ్డాయి. అవి కొత్త మొక్కలవుతాయి. తర్వాత పెరిగి పెద్ద చెట్లవుతాయి' అంది చిలకమ్మ. బుజ్జిగాడు ఇంకేమీ మాట్లాడలేదు. ఆ పండు చిలకమ్మకే వదిలేశాడు.



– పైడిమర్రి రామకృష్ణ

రాయగలరా?

ఇక్కడ కొన్ని పదాలు గజిబిజిగా ఉన్నాయి. వాటిని సరైన పదాలతో కలిపి అర్థవంతంగా చేయండి చూద్దాం.

మతి	నవ్వులు	అష్టా	జువ్వ	పిడుగు
బుడ్డి	కిరణం	పెద్ద	మరుపు	తడ
చమ్మా	రచన	చిచ్చు	వ్యాస	బాలశిక్ష
బాటు	బోసి	తారా	చిచ్చర	రవి

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
ఆదివారం సెప్టెంబరు 29, 2024

చేనేత ప్రదర్శనలతో మరింత వైభవం


పూసల దండను చూపిస్తున్న మంత్రి సవిత

లబ్బీపేట(విజయవాడ సిటీ): చేనేత కార్మికులు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించుకునేలా రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత శాఖ మంత్రి సవిత అన్నారు. క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఎంజీ రోడ్డులోని పీవీపీ స్క్వేర్ మాల్‌లో చేనేత బజార్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. కొన్నేళ్ల నుంచి చేనేత వృత్తి చేసుకుంటున్న కార్మికుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ ప్రతినిధులు రంజన, సుజాత తదితరులు పాల్గొన్నారు. స్టాల్స్‌ను పరిశీలించినప్పుడు అందంగా ఆకర్షణీయంగా ఉన్న పూసల దండను మంత్రి వేసుకున్నారు. చీరలు కొనుగోలు చేశారు.

నిన్ను సూత్తే ఎట్టో ఉన్నాది.. గుండె గట్టిగ కొట్టేసుకున్నాది!



'నిన్ను చూడబుద్దే తాంది రాజీగో.. మాటాడ బుద్దయి తాంది రాజీగో.. చేయి పట్టబుద్దాయితాంది రాజీగో.. ముద్దు పెట్టబుద్దాయితాంది రాజీగో.. అని చిరునగవులతో.. చిలిపి చూపులతో..” నటి శ్రీలీల కుర్రకారు మదిని గిలిగింతలు పెట్టింది. విజయవాడ నగరంలో ఓ ప్రముఖ వస్త్ర దుకాణం ప్రారంభానికి విచ్చేసిన సొగసిరి.. అభిమానులకు కనువిందు చేసింది.


- ఈనాడు, అమరావతి

మున్సిపల్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే : విజయవాడ, మచిలీపట్నం నగర పాలకసంస్థలతోపాటు గుడివాడ పురపాలక సంఘ పరిధిలోని స్కూల్ అసిస్టెంట్ తెలుగు, హిందీ ఉపాధ్యాయులకు శనివారం మచిలీపట్నంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఉద్యోగోన్నతులు, రివర్షన్‌కు సంబంధించి కౌన్సెలింగ్ చేయాల్సి ఉంది. రివర్షన్‌కు సంబంధించి ఉపాధ్యాయులు సమయానికి హాజరు కాకపోవడంతో ఆలస్యంగా కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని పురపాలక సంఘాల పరిధిలో 19 మంది స్కూల్ అసిస్టెంట్లు(తెలుగు), ఐదుగురు స్కూల్ అసిస్టెంట్ల(హిందీ)కు ఉద్యోగోన్నతులు కల్పించి డీఈవో చేతులమీదుగా ఉత్తర్వులు అందజేశారు. విద్యాశాఖ ఏడీ అజీజ్, సూపరింటెండెంట్ పవన్‌కుమార్, సూరిబాబు, రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఉత్సవం.. అంగరంగ వైభవంగా!

ఈనాడు డిజిటల్, అమరావతి: విజయవాడ దుర్గామల్లేశ్వర దేవస్థానంలో దసరా ఉత్సవాలకు అధికారులు ముందస్తుగా ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీలో నీరు అధికంగా ఉండటంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జల్లు స్నానాలు కల్పించనున్నారు. సీతమ్మవారి పాదాల దగ్గర కేశఖండనశాల, దుర్గాఘాట్, పద్మావతి ఘాట్‌ల వద్ద భక్తులు జల్లు స్నానాలు చేసేందుకు, హైదరాబాద్ నుంచి వచ్చే భక్తుల కోసం పున్నమి ఘాట్ వద్ద 700 షవర్లు ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల స్నానాలకు తగ్గట్టుగా ఘాట్‌లన్నీ ఇప్పటికే శుభ్రం చేశారు. కొండ దిగువన ఉన్న వినాయక ఆలయం నుంచి రెండు కిలోమీటర్లు భక్తులు నడిచి. . ఘాట్‌రోడ్డు మీదుగా అమ్మవారిని దర్శించుకుని తిరిగి శివాలయం మెట్ల మార్గం గుండా దిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతోపాటు ఈ సారి ప్రత్యేక ఆకర్షణగా పచ్చదనంతో నిండేలా రాజమహేంద్రవరంలోని కడియం నర్సరీ నుంచి వివిధ ఆకృతుల్లో ఉండే మొక్కలు తీసుకొచ్చారు. ఘాట్‌రోడ్డు, భక్తులు ఆలయంలోకి ప్రవేశించే ప్రధాన ద్వారం, మీడియా పాయింట్ ఇలా అన్నిచోట్లా ఈ మొక్కలు పెట్టనున్నారు. ప్రధాన ఆలయం, గోపురం, చుట్టూ ఉన్న ఉపాలయాలు, గోడలకు రంగులు వేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు 5 క్యూలైన్లు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు కిందకు దిగిన తర్వాత.. అన్నదానం, ప్రసాద కౌంటర్లు ఏర్పాటు చేశారు. దసరా ఉత్సవాల్లో చివరి రోజు నిర్వహించే తెప్పోత్సవంలో భాగంగా.. దుర్గామల్లేశ్వర్ల నదీ విహారానికి హంస వాహనాన్ని సిద్ధం చేసే పనులు శనివారం ప్రారంభించారు. దుర్గాఘాట్‌లోనే ఈసారి నవహారతులు నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా అన్ని ఏర్పాట్లు త్వరితగతిన పూర్తిచేస్తున్నట్లు ఆలయ ఈవో కే.ఎస్ రామారావు వెల్లడించారు.


కృష్ణవేణి ఘాట్‌లో జల్లు స్నానాల కోసం ఏర్పాట్లు


కడియం నుంచి తెచ్చిన పచ్చని మొక్కలతో ఆహ్లాదంగా ఆలయ ప్రాంగణం


అర్జున వీధిలో ప్రసాదం కౌంటర్లు సిద్ధం

దసరా ఏర్పాట్లు సమన్వయంతో పూర్తి చేయాలి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాల ఏర్పాట్లు సమన్వయంతో పూర్తి చేయాలని దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ అధికారులకు సూచించారు. తాత్కాలిక కేశఖండనశాల, జల్లు స్నానాలు, ఘాట్ రోడ్డు రక్షణ గోడ నిర్మాణం, మల్లేశ్వరాలయ మెట్ల మార్గాన్ని ఈవో రామారావు, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులతో పాటు ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని కోరారు. ప్రతి ఘాట్ వద్ద జల్లు స్నానాలు చేసేందుకు షవర్లు ఏర్పాటు చేయడంతో పాటు లైటింగ్, క్లోక్ రూమ్, పాదరక్షల స్టాండ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మూలా నక్షత్రం రోజున సీతమ్మ వారి పాదాల సెంటరులోని స్థలంలో భక్తులను ఏ విధంగా పంపుతారో దుర్గగుడి అధికారులు ఆయనకు వివరించారు. నవ హారతుల ట్రయల్ రన్‌ను పరిశీలించారు. స్థానాచార్య శివప్రసాద శర్మ, డిప్యూటీ ఈవో రత్నం రాజు, ఈఈలు కోటేశ్వరరావు, రమాదేవి, వైకుంఠరావు పాల్గొన్నారు.

- దసరా ఉత్సవాలు సమీపిస్తుండడంతో ఘాట్లు, క్యూలైన్ల వద్ద పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలను మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర సిబ్బందికి సూచించారు. అధికారులతో కలిసి దుర్గాఘాట్, క్యూలైన్లు వద్ద ఆయన పరిశీలన చేశారు. కెనాల్ రోడ్డు వినాయకుడి గుడి నుంచి దూర్గాఘాట్ వరకు క్యూలైన్లో వచ్చే భక్తుల కోసం 32 లక్షల వాటర్ ప్యాకెట్లను సిద్ధం చేయమని ఆదేశించారు. 150 తాత్కాలిక మరుగుదొడ్లు, క్లోక్ రూమ్స్ ఏర్పాటు చేయమని సూచించారు.

ఈవీఎంలకు కట్టుదిట్టమైన భద్రత



గొల్లపూడిలోని ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన

గొల్లపూడి, కృష్ణలంక, న్యూస్‌టుడే : ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎంలకు కట్టుదిట్టమైన భద్రత కల్పించినట్లు కలెక్టర్ జి.సృజన పేర్కొన్నారు. గొల్లపూడిలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో భద్రపరిచిన ఈవీఎంలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల గోదామును క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక ఇస్తున్నట్లు వెల్లడించారు. గోదాము వద్ద విధులు నిర్వర్తిస్తున్న భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి





RAMOJI FILM CITY

సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.



రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మరిన్ని వివరాలకు..
www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

ఐటీఐ కౌన్సెలింగ్‌లో 35 సీట్ల భర్తీ

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: నగరంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మూడో విడత కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన సీట్లకు శనివారం నాలుగో విడత కౌన్సెలింగ్ నిర్వహించారు. 35 సీట్లు భర్తీ అయ్యాయి. ప్రక్రియకు 55 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 36 మంది వచ్చారు. 35 మంది సీట్లు తీసుకున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి విజయవాడ ప్రభుత్వ ఐటీఐలో 15 ట్రేడుల్లో మొత్తం 716 సీట్లు అందుబాటులో ఉండగా... 684 సీట్లు భర్తీ కాగా... ఇంకా 32 సీట్లు మిగిలాయని ప్రిన్సిపల్, కౌన్సెలింగ్ కన్వీనర్ కనకారావు తెలిపారు.

కేజీబీవీల్లో ఖాళీల భర్తీ

కంచికచర్ల, విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : జిల్లాలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో (కేజీబీవీ) 2024-25 ఏడాదికి ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది పోస్టులకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి.మహేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్ట్ టైం ఉపాధ్యాయినులు -2 పోస్టులు, అకౌటెంట్ - 1 పోస్టు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హతలు వయసు ఓపెన్ కేటగిరికి 18-42 ఏళ్ల మధ్య ఉండాలి (వయో పరిమితి సడలింపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీలకు 5 ఏళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్లు, మాజీ సైనికులకు 3 ఏళ్లు) ఆసక్తి గల అభ్యర్థులు అక్టోబరు 10 వ తేదీలోగా apkgbv.apcfss.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 రిటైల్ ధర [illegible] స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర


[illegible] 100 గుడ్ల ధర రూ. 565 [illegible]

ప్రోత్సాహకాలపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న పారిశ్రామికవేత్తలు

సీతారాంపురం, న్యూస్‌టుడే : గన్నవరం మండలం సూరంపల్లిలోని పారిశ్రామికవాడలోని ఎలీప్ (అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) ఆధ్వర్యంలో జడ్‌ఈడీ (జీరో ఎఫెక్ట్ జీరో డిఫెక్ట్) సర్టిఫికేషన్‌పై శనివారం అవగాహన సదస్సు నిర్వహించినట్లు ఎలీప్ అధ్యక్షురాలు కె.రమాదేవి తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా ఆమె ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సూచనలు చేశారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి శాఖ (ఎంఎస్ఎంఈ) పారిశ్రామికంగా ఎలా ఉపయోగపడుతుంది, ఎలా వినియోగించుకోవాలి అనే అంశాలు వివరించారు. ఎలీప్ జడ్‌ఈడీ కన్సల్టెంట్ కోసూరు కాంతి మాట్లాడుతూ.. జడ్‌ఈడీ పద్ధతులు, ప్రోత్సాహకాల గురించి తెలియజేశారు. 40 మంది పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారని ఎలీప్ ప్రాంతీయ అధికారి వి.సునీత తెలిపారు.



నీళ్లు జల్లుతూ.. ఉన్నచోటే వినాయక నిమజ్జనం ఇలా..



తిలకిస్తున్న భక్తులు



లంబోదరుడికి హారతినిస్తూ..



వేలంలో రూ.16 లక్షలకు లడ్డూని దక్కించుకున్న నగరానికి చెందిన బాలాజీ

బొజ్జ గణపయ్యా.. వెళ్లి రావయ్య!

విజయవాడ లేబర్ కాలనీ మైదానంలో డూండీ గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలోని 72 అడుగుల భారీ మట్టి గణపతిని ప్రతిష్ఠించిన చోటే శనివారం నిమజ్జనం చేశారు. విగ్రహం లోపల అమర్చిన పైపులు, అగ్నిమాపక శకటం సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ భారీ గణనాథునికి నివేదించిన లడ్డూ రికార్డు స్థాయిలో రూ.16 లక్షలు పలికింది. కామకోటినగర్‌కు చెందిన నక్కా బాలాజీ వేలంలో దీన్ని దక్కించుకున్నారు. - న్యూస్‌టుడే, విద్యాధరపురం

మధ్యాహ్న భోజనం మెనూ మార్పునకు కసరత్తు



మాట్లాడుతున్న కలెక్టర్ సృజన, డీఈవో సుబ్బారావు తదితరులు

కృష్ణలంక, న్యూస్‌టుడే: డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం మెనూను విద్యార్థులు మరింత ఇష్టపడేలా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందని కలెక్టర్ జి.సృజన తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ శనివారం మధ్యాహ్న బడి భోజనంపై కార్యశాల నిర్వహించారు. ప్రస్తుత మెనూలో మార్పులపై పాఠశాల యాజమాన్యం కమిటీల ఛైర్మన్లు, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, కుక్ కమ్ హెల్పర్ల నుంచి అభిప్రాయాలు స్వీకరించారు. ఈ నెల 27న మధ్యాహ్న భోజనం తీసుకున్న విద్యార్థుల వివరాలను విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. మొత్తం 89,713 మంది విద్యార్థులకు గాను 78,402 మంది హాజరు కాగా... 70,829 మంది మధ్యాహ్న భోజనం తీసుకున్నట్లు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ... ఏ ఒక్క విద్యార్థి ఆకలితో ఉండకూడదని, హాజరు శాతాన్ని పెంచడంతో పాటు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని వివరించారు. ప్రస్తుత మెనూలో పొంగల్, సాంబార్ బాత్ వంటి వాటిని పిల్లలు ఇష్టపడటం లేదని గుర్తించామన్నారు. ప్రాంతాల వారీగా ఆహార అలవాట్లు, పోషకాలతో పాటు పిల్లల ఇష్టానికి కూడా ప్రాధాన్యం ఇచ్చేలా మెనూలో మార్పులు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైందని తెలిపారు. అందుకే మండల, జిల్లా స్థాయిలో భాగస్వామ్య పక్షాల నుంచి అభిప్రాయాలు తీసుకుంటున్నామని వివరించారు. వాటి ఆధారంగా నివేదిక రూపొందించి ప్రభుత్వానికి పంపనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. డీఈవో సుబ్బారావు, ఏడీ (మిడ్ డే మీల్స్) కేవీఎన్ కుమార్, న్యూట్రిషనిస్టు డాక్టర్ సుష్మ తదితరులు పాల్గొన్నారు.



అలసి సొలసి.. ఆపద మరచి!

నిద్ర సుఖం ఎరుగదు అంటారు. దానికి ఈచిత్రమే ఉదాహరణ. జాతీయ రహదారిపై లారీ మరమ్మతులు చేస్తూ.. మధ్యాహ్నం వేళకు అలసిన శరీరానికి కాస్త ఉపశమనం కోసం అదే లారీ కింద ఇలా నిదురిస్తూ కనిపించారు ఓ మెకానిక్. అసలే జాతీయ రహదారి... ఆపై దూసుకు వచ్చే లారీలు ఒకవైపు.. మరోవైపు మరమ్మతులకు వచ్చిన లారీ తొట్టి పైకెత్తి ఉండగా దాని కింద నిదురించడం కూడా ప్రమాదమే. నిద్రకేం.. తెలుసు... ప్రమాదం పొంచి ఉందని.? ఎనికేపాడు వద్ద జాతీయరహదారిపై కనిపించిన చిత్రమిది. - ఈనాడు - అమరావతి

అకౌంట్ ట్యాలీ కోర్సుకు ఉచిత శిక్షణ

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కానూరులోని ఫెడరల్ స్కిల్ అకాడమీ శిక్షణ కేంద్రంలో 30 రోజుల అకౌంట్ ట్యాలీ ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్య శిక్షణాధికారి ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఉచిత శిక్షణకు ఇంటర్, డిగ్రీ, బీటెక్ విద్యార్హతలతో 18-35 ఏళ్ల మధ్య వయస్కులు అర్హులని ఎన్టీఆర్ జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.విక్టర్ బాబు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు కానూరు తులసీనగర్‌లోని శిక్షణ కేంద్రానికి తమ విద్యార్హత పత్రాలతో పాటు ఆధార్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకొచ్చి తమ పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు చెందిన వారు శిక్షణకు అర్హులని, ఇతర వివరాలకు 87146-92749, 87146-92748 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఇంటర్ విద్యార్థుల ప్రగతి పత్రాలు సిద్ధం

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే : జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్ విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు సిద్ధమయ్యాయి. వాటిని ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలోని 25 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు పంపనున్నారు. ఇప్పటికే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 1, 2 యూనిట్ పరీక్షలు పూర్తయ్యాయి. దసరా సెలవుల అనంతరం అక్టోబర్ 15 నుంచి త్రైమాసిక పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షలు పూర్తి కాగానే అధ్యాపకులు జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి మార్కుల్ని ప్రోగ్రెస్ కార్డుల్లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఆర్ఐఓ సీఎస్ఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ ప్రోగ్రెస్ కార్డులు సిద్ధంగా ఉన్నాయన్నారు. సోమవారం కళాశాలలకు పంపుతామని తెలిపారు.



జాతీయ రహదారి పక్కనే ఘాటు రోడ్డులో కొండరాళ్లు దొర్లిపడే అవకాశాలు (పాతచిత్రం)



నేడు అదే ప్రదేశంలో నిర్మిస్తున్న రక్షణ గోడ

కొండంత... రక్షణ!

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ అమ్మవారి దర్శనానికి నిత్యం లక్షల మంది భక్తులు తరలివస్తారు. ఇంద్రకీలాద్రిపై నుంచి కొండరాళ్లు దొర్లిపడకుండా... ఘాటురోడ్డులో భక్తుల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా.. రక్షణగా దేవదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఘాటురోడ్డు మలుపులో గత కొన్నేళ్లుగా ప్రమాదకరంగా ఉన్న కొండరాళ్లను తొలగించి దాని స్థానంలో రక్షణ గోడను నిర్మించారు. ఘాటురోడ్డులో కొండరాళ్లు పడే ప్రమాదం ఉన్న చోట కొండ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రాళ్లు దొర్లకుండా మట్టిని ఏర్పాటు చేశారు.
- ఈనాడు - అమరావతి



చుట్టూ ఏర్పాటు చేసిన కంచె.. మట్టి నింపుతున్న కూలీలు

రాష్ట్రంలో నవజాత శిశు మరణాల రేటు తగ్గుదల

ఈనాడు డిజిటల్- అమరావతి: ప్రజారోగ్య పరిరక్షణకు ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధనలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందడుగు వేసిందని ఆ శాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్ పేర్కొన్నారు. విజయవాడలోని ఓ హోటల్లో శనివారం జరిగిన రాష్ట్రీయ కిషోర్ స్వాస్థ్య, కౌమార బాలబాలికల కౌన్సిలర్లకు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2030 నాటికి ప్రతి లక్ష జననాలకు 70 కంటే తక్కువ మరణాల రేటు ఉండాలన్న ఐక్యరాజ్యసమితి లక్ష్యాన్ని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా సాధించిందన్నారు. ఐదేళ్లలోపు చిన్నారుల మరణాల రేటు తగ్గింపులోనూ లక్ష్యానికి చేరువలో ఉన్నామన్నారు. ప్రస్తుతం దేశంలో ప్రతి లక్ష సజీవ జననాలకు.. ప్రసూతి మరణాల రేటు 97 ఉంటే. . ఏపీలో 45 ఉందన్నారు. ఈ రేటుతో దేశంలోనే ఏపీ నాలుగో స్థానంలో ఉన్నామని వెల్లడించారు. ప్రసూతి, శిశుమరణాల రేటు తగ్గించడానికి.. కౌమారదశలోని పిల్లల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు 45 మంది కౌన్సిలర్లను జాతీయ ఆరోగ్య మిషన్ కింద ప్రసూతి ఆసుపత్రుల వద్ద నియమించామన్నారు. వీరి విధులు.. నెరవేర్చాల్సిన లక్ష్యాల గురించి ఆయన వివరించారు. కార్యక్రమంలో ఐక్యరాజ్యసమితి పిల్లల నిధి వైద్యాధికారి డా. సలీమా భట్టా, ఆర్కేఎస్కే రాష్ట్ర కార్యక్రమ అధికారి సిహెచ్ నిర్మలా గ్లోరీ, జాయింట్ డైరెక్టర్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

91.9FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
ఆదివారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్	ఉ. 7 - ఉ. 9
టెస్ట్ డ్రైవ్	ఉ. 9 - ఉ. 10
ఎక్స్‌ట్రా డోస్	ఉ. 10 - మ. 2
ఈవారం సినిమా	మ. 2 - సా. 5
ఈ టాప్-20	సా. 5 - రా. 7
#హ్యాష్‌ట్యాగ్	రా. 7 - రా. 9
ఈ స్టార్ మీ స్టార్	రా. 9 - రా. 10
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 10 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact **8008003297**

తిరువూరు

• తిరువూరు • మైలవరం



ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందిస్తున్న దాతలు

ఆలయ పునర్నిర్మాణానికి రూ.1.25 లక్షల విరాళం

తిరువూరు, న్యూస్‌టుడే: స్థానిక జగన్నాథపురం కాలనీలో 400 ఏళ్ల నాటి చరిత్ర కలిగిన శ్రీదాసాంజనేయ స్వామి ఆలయం పునర్నిర్మాణానికి పట్టణానికి చెందిన నాళ్లా నరసింహారావు, ఆయన కుమారుడు నాగవెంకట్ రూ.1.25 లక్షలు విరాళం ఇచ్చారు. శనివారం ఆ మొత్తాన్ని కమిటీ సభ్యులు సంకా మల్లికార్జున రాంబాబు, నర్సింగ్ లక్ష్మణ్‌కు అందజేశారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

తిరువూరు: పథకాలు సద్వినియోగం చేసుకుంటూ మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఛైర్‌పర్సన్ జి.కస్తూరిబాయి సూచించారు. స్థానిక పురపాలక సంఘం కార్యాలయం ఎదుట మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. కమిషనర్ జి.లోవరాజు, మెప్మా సీవో ప్రసాద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మెప్మా అర్బన్ మార్కెట్ ప్రారంభిస్తున్న ఛైర్‌పర్సన్ కస్తూరిబాయి

జాషువా..భగత్ సింగ్ సేవలు ఎనలేనివి

గొల్లపూడి, న్యూస్‌టుడే: ఒకప్పుడు సమాజంలో పేరుకున్న కులతత్వాన్ని గుర్రం జాషువా తన రచనా శక్తితో ఎదుర్కొన్నారని, దేశ స్వాతంత్ర్యం కోసం 23 ఏళ్లకే ప్రాణత్యాగం చేసిన గొప్ప వ్యక్తి భగత్‌సింగ్ అని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. గుర్రంజాషువా, భగత్‌సింగ్‌ల జయంతిని గొల్లపూడిలోని కార్యాలయంలో శనివారం నిర్వహించారు. అనంతరం వారిద్దరి చిత్రపటాల వద్ద నివాళులర్పించారు.

తిరువూరు: స్థానిక సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గుర్రం జాషువా, యువతకు స్ఫూర్తి ప్రదాత భగత్‌సింగ్ జయంతిని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించి ఇద్దరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తదితరులు

రాజవరం(గంపలగూడెం): మండలంలోని రాజవరం ప్రాథమిక పాఠశాలలో శనివారం గుర్రం జాషువా జయంతి నిర్వహించారు. ఆయన చిత్రానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, శిర్డీసాయిబాబా సేవా కమిటీ సభ్యులు పాల్గొని నివాళులర్పించారు.

మైలవరం: జాషువా జయంతిని పురస్కరించుకుని శనివారం లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఉప ప్రిన్సిపాల్ రంగారావు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట నష్టంపై అవకతవకలపై ఆందోళన

జి.కొండూరు: కవులూరులో పంట నష్టం అంచనాల్లో అవకతవకలు జరిగాయాని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులకు ముడుపులు చెల్లిస్తే వంద శాతం పంట నష్టం జరిగిందని, లేకుంటే అరకొర నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. రైతులు శనివారం రైతు సేవ కేంద్రానికి చేరుకుని న్యాయం చేయాలని కోరారు. విషయం తెలుసుకున్న మైలవరం ఏడీఏ శ్రీనివాసరావు రైతులతో కలిసి పంట పొలాలను సందర్శించి..రైతులందరికీ న్యాయం జరిగేలా చేస్తామన్నారు. సమస్యపై మండల వ్యవసాయాధికారి ఎం.రాంకుమార్‌ను న్యూస్‌టుడే వివరణ కోరగా ముడుపులు ఆశించడం అవాస్తవమని, పారదర్శకంగా నష్టం అంచనా వేసినట్లు తెలిపారు.


చెదిరిన బతుకులకు బాసట

పరిహారం చెల్లింపులపై హర్షం

మైలవరం, గంపలగూడెం, ఎ.కొండూరు - న్యూస్‌టుడే

అకాల వర్షాలకు అతలాకుతలం అయిన జీవితాలు.. నీట మునిగిన ఇళ్లలో రోజులపాటు అవస్థలు పడిన ప్రాణాలు... ఇంట్లోకి చేరిన బురద కడుక్కోలేక ఇబ్బందులు..దాదాపు 15 రోజుల పాటు వరద నీటితో సావాసం..ఉపాధి కోల్పోయి ఆసరా కోసం ఆశగా ఎదురు చూస్తున్న మనసులకు ప్రభుత్వం అందించిన చేయూత ఊరటనిస్తోంది. గతంలో ఎప్పుడూ ఇవ్వనంత పరిహారం అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ సాయంపై లబ్ధిదారులు ఆనందోత్సవాల్లో మునిగి తేలుతున్నారు. వరదలు తగ్గాక నష్టం అంచనాల మొదలు, జాబితాల తయారీ వరకు ప్రభుత్వం తీసుకున్న చర్యలపై సంతోషం వెలిబుచ్చుతున్నారు. వేన్నీళ్లకు చన్నీళ్ల చందంగా ప్రభుత్వ సాయంతో కొంత మేరకు ఇబ్బందులను తొలగించుకోగలమన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు.

సకాలంలో స్పందించింది



వరదలపై ప్రభుత్వం సకాలంలో స్పందించి పరిహారం అందించటం ఆనందంగా ఉంది. నాకున్న 9 ఎకరాలు పత్తి, 4 ఎకరాల్లో వరి మాగాణి వరదలకు బాగా దెబ్బతింది. రూ.50 వేలు పరిహారం అందింది.

- చెరుకూరు శ్రీనివాసరావు, కవులూరు

సంతోషంగా ఉంది



భారీ వర్షాలు, వరదకు మా ఇల్లు పడిపోయింది. ప్రభుత్వం వెంటనే రూ.10వేలు ఆర్థిక సాయం చేసింది. మళ్లీ ఇళ్లు కట్టుకోడానికి ఉపయోగపడుతాయి. సంతోషంగా ఉంది.

- మోతే తిరుపతమ్మ, రెడ్డిగూడెం

మాట నిలబెట్టుకున్నారు



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు 5 ఎకరాల్లో సాగు చేసిన పత్తి పంట పూర్తిగా పాడైపోయింది. సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట మేరకు పరిహారంగా రూ.28వేలు బ్యాంక్ ఖాతాకు జమ చేశారు. మాట నిలబెట్టుకున్నందుకు కృతజ్ఞతలు

- వాసిరెడ్డి ప్రతిమ, గంపలగూడెం మండలం నెమలి

అండగా ఉన్నారు



వరదలు పోటెత్తి రెండెకరాల్లో సాగు చేసిన వరి పంటను నిలువునా ముంచేశాయి. సీఎం చంద్రబాబు నష్టపరిహారం పెంచి ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం రూ.20,235 బ్యాంకు ఖాతాకు జమ చేసి అండగా ఉంది.

- పి.కేశవులు, ఎ.కొండూరు మండలం కంభంపాడు

తక్కువ సమయంలోనే ఆదుకున్నారు



దాములూరులో రెండు ఎకరాల్లో పత్తి, 1.5 ఎకరంలో మినుము ముంపునకు గురైంది. పత్తికి ఎకరాకు రూ.వెయ్యి చొప్పున రూ.రెండు వేలు, మినుము ఎకరానికి రూ.6 వేలు చొప్పున రూ.9 వేలు వచ్చాయి. ఇంటి ముంపునకు రూ.25 వేలు, ద్విచక్రవాహనం మరమ్మతులకు రూ.3 వేలు బ్యాంకు ఖాతాలో జమచేశారు. తక్కువ సమయంలో ఆదుకున్న ప్రభుత్వాధికారులకు రుణపడి ఉన్నాం.

- సుంకర భాస్కరరావు, రైతు, దాములూరు

ప్రభుత్వానికి ధన్యవాదాలు



వరదలో 8 గొర్రెలు, 4 పిల్లలు కొట్టుకుపోయాయి. వాటికి రూ.85 వేలు, మునిగిన ఇంటికి రూ.25 వేల, ఎకరం పత్తి పంట నష్టానికి రూ.10 వేలు నష్టపరిహారంగా ఇచ్చారు. రెండు రోజులుగా రైతుల ఖాతాలకు డబ్బులు జమవుతున్నాయి. రైతుల కష్టాలు అర్థం చేసుకుని వెంటనే స్పందించిన కూటమి ప్రభుత్వానికి ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు.

- జి.శివయ్య, రైతు, కొటికలపూడి, ఇబ్రహీంపట్నం మండలం

లబ్ధిదారులు ఇళ్లు త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న బాలాజీ కుమార్

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధిలో గ్రామాల్లో గృహాలు మంజూరైన లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి(జిల్లా ఉద్యాన శాఖ అధికారి) బాలాజీ కుమార్ సూచించారు. శనివారం రెడ్డిగూడెంలో కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మన ఇల్లు - మన గౌరవం కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు సూచనలు, సలహాలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచి ఎం.రాజీ, ఎంపీడీవో బి.వి.విష్ణు ప్రసాద్, గృహనిర్మాణ శాఖ సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సత్వరమే బిల్లులు మంజూరవుతాయి..

పోలిశెట్టిపాడు(ఎ.కొండూరు): మండలంలోని పోలిశెట్టిపాడులో శనివారం సర్పంచి బొల్లెపోగు చిట్టిబాబు అధ్యక్షతన 'మన ఇల్లు మన గౌరవం' గ్రామ సభ నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ.. 2014-19 మధ్య గృహాలు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలు పూర్తి చేసుకుంటే ప్రభుత్వం సత్వరమే బిల్లులు మంజూరు చేస్తుందన్నారు. అప్పట్లో సగం నిర్మాణంతో నిలిచిన గృహాలను ఇప్పుడు పూర్తి చేసుకున్నా బిల్లులు చెల్లిస్తారన్నారు. గ్రామ ప్రత్యేకాధికారి ఆర్.శ్రీకాంత్, మండల పరిషత్ ఏవో విష్ణు, కార్యదర్శి ఉపేంద్ర తెదేపా నాయకులు వాసం మునియ్య, టి.శ్రీనివాసరెడ్డి, ఎ.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

చెరువులు, కాలువల పూడ్చివేతపై విచారణ



లేఔట్ వద్ద విచారిస్తున్న తహసీల్దార్ లక్ష్మి, కమిషనర్ లోవరాజు

ఈనాడు కథనానికి స్పందన

తిరువూరు, న్యూస్‌టుడే: చెరువులు, కాలువలు పూడ్చివేడయమే కాకుండా కట్లేరు వాగు అంచులో నిబంధనలకు విరుద్ధంగా కరకట్ట కట్టి ప్లాట్లు వేసి విక్రయిస్తుండడంపై 'ఈనాడు'లో ఈనెల 21న 'ఆక్రమణల చెరలో మగ్గుతున్నాయి' శీర్షికన ప్రచురించిన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. రెవెన్యూ, పురపాలక శాఖల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ లక్ష్మి, కమిషనర్ జి.లోవరాజు శనివారం విచారణ జరిపారు. కట్లేరు వాగు అంచులో కరకట్ట కట్టి వేసిన లేఔట్‌ను పరిశీలించారు.

సైబర్ మోసాలకు గురికావద్దు

మైలవరం, న్యూస్‌టుడే: ప్రజలు సైబర్ మోసాలకు గురికావద్దని సీఐ డి.చంద్రశేఖర్ సూచించారు. కమిషనర్ ఆదేశాల మేరకు మైలవరం సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో ప్రజల చరవాణుల్లో సైబర్ సిటిజన్ యాప్‌ను తమ సిబ్బందితో ఇన్‌స్టాల్ చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. యాప్ ద్వారా అనేక అంశాలపై ప్రజలకు అవగాహన కలుగుతుందని వివరించారు. సైబర్ నేరాల నుంచి కాపాడుకోవడమే గాక, స్నేహితులు, బంధువులను కూడా నేరాల బారిన పడకుండా కాపాడాలని తెలిపారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉంటే నేరాలను పూర్తిగా అదుపు చేయవచ్చన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన తప్పనిసరి

కొండపల్లి: సామాజిక అంశాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి.పద్మలత పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర 2047 అనే సాధనలో విద్య, నైపుణ్యాభివృద్ధి అనే అంశంపై విజయవాడ బిషప్ అజరయ్య హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను శనివారం నిర్వహించారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో పాఠశాలకు చెందిన బండి యశ్విని తృతీయ స్థానం సాధించింది. జిల్లా విద్యాశాఖాధికారి యు.వి. సుబ్బారావు, ఎస్ఎంసీ ఛైర్మన్ షేక్ బజీబీ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు సర్వజనాసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

గుంటూరు వైద్యం : కడుపులో నొప్పి, తీవ్రమైన జ్వరం, కామెర్లు.. ఎన్ని ఆసుపత్రుల చుట్టూ తిరిగినా ఫలితం కనిపించక చివరికి సర్వజనాసుపత్రికి వచ్చిన ఓ వ్యక్తికి వైద్యులు అరుదైన శస్త్రచికిత్సతో సాంత్వన కలిగించారు. జీజీహెచ్‌లో శనివారం సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాధిపతి వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంకు చెందిన ఎం.వెంకటేశ్వరరావు గత కొన్నాళ్లుగా కామెర్ల వ్యాధితో బాధపడుతున్నారు. స్టెంట్ అమర్చినా.. ఫలితం లేనందున అనేక ఆసుపత్రులకు వెళ్లినా తగ్గలేదు. ఇటీవల జీజీహెచ్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగానికి రాగా వైద్య పరీక్షలు నిర్వహించగా క్లోమ గ్రంథి క్షీణించి పిత్తాశయనాళం మూసుకుపోయినట్లు గుర్తించారు. వెంటనే సర్జరీ చేయాలని జాప్యం జరిగితే అత్యంత ప్రమాదకరంగా కూడా పరిణమించొచ్చన్నారు. అందువల్ల ఈనెల 18న సర్జరీ చేశామన్నారు. దీన్ని వైద్య పరిభాషలో క్రానిక్ పాంక్రియాటైటిస్, బినైన్ బిలియరీ స్ట్రిక్చర్ అపరేషన్ సైడ్ టు సైడ్ అంటారని తెలిపారు. ఇది అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సని వివరించారు. సర్జరీ విజయవంతమైనందున రోగిని శనివారం ఆసుపత్రి నుంచి డిశ్ఛార్జి చేసినట్లు తెలిపారు. కోటి వెంటకేశ్వరరావుతోపాటు సత్యదేవ్, వంశీ, పోలయ్య, శాంసన్‌దేవ్, శ్వేత, దీప్తి, శాలిని పాల్గొన్నారు.

పట్టుమని పదిరోజులూ రాకపోకలు సాగట్లేదు

గంపలగూడెం, న్యూస్‌టుడే: వినగడప వంతెన వద్ద ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. గత రెండు నెలల్లో పట్టుమని పది రోజులు కూడా మళ్లింపు రోడ్డుపై రాకపోకలు సాగలేదు. కట్లేరుకు వస్తున్న వరదలతో మళ్లింపు రోడ్డుపై గండ్లు పడటం తరచూ రోజులు తరబడి ప్రయాణాలు నిలిచిపోవడం మామూలైపోయింది. ఈ వారంలోనే నాలుగు రోజులు వంతెన వద్ద ప్రయాణ ఇబ్బందులు తలెత్తాయి. శనివారం కూడా రహదారిపై ప్రవహిస్తున్న నీటిలోనే వాహనదారులు ప్రమాదకరమైన ప్రయాణాలు సాగించారు. ఇటీవలే అధికారులు గ్రావెల్, కంకర పోసి తాత్కాలిక మరమ్మతులు చేయించారు. మళ్లీ శుక్రవారం వచ్చిన వరదకు రహదారిపై పోసిన గ్రావెల్, కంకర కొట్టుకుపోయి కొంత దూరం గండ్లు పడ్డాయి. ఆగస్టు, సెప్టెంబరులో వంతెన వద్ద గండ్లు పడినప్పుడు తాత్కాలిక మరమ్మతులు చేసినందుకు రూ.25 లక్షలు మంజూరు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులు ఇటీవలే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఏమైనా వంతెన సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంలేదని ప్రజలు మండిపడుతున్నారు.



వినగడప వంతెన వద్ద మళ్లింపు రోడ్డుపై వాహనదారుల అవస్థలు ఇలా

పురపాలిక కార్మికుల సేవలు మరువలేనివి

కొండపల్లి, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివని సీఐటీయూ మండల కార్యదర్శి మహేష్ అన్నారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు వరద బాధితుల సహాయార్థం మున్సిపాలిటీ కార్మికులకు శనివారం భోజన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ సమయంలో, వరదల బీభత్సంలో ప్రాణాలకు తెగించి పారిశుద్ధ్య పనుల నిర్వహించిన కార్మికుల ప్రతి ఒక్కరూ రుణపడి ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు వాసుదేవన్, కొండలరావు, పాపయ్య, ఐద్వా నాయకులు పార్వతి, అప్పారావు, దేవుళ్లు, రమణ తదితరులు పాల్గొన్నారు.

వైకాపా నాయకుల నిరసన

తిరువూరు: వైకాపా అధిష్ఠానం పిలుపు మేరకు పార్టీ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో నిరసన ప్రదర్శన చేశారు. స్థానిక శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వైకాపా నియోజకవర్గ కన్వీనర్ నల్లగట్ల స్వామిదాసు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

శేషాచల శ్రీనివాసుడి ఆలయానికి విరాళం

పెనుగొలను(గంపలగూడెం): మండలంలోని మెట్టగుట్ట శేషాచల శ్రీనివాసస్వామి ఆలయానికి ఖమ్మానికి చెందిన నాగుబండి భిక్షం, వెంకటేశ్వరరావు, కిరణ్ తమ తల్లిదండ్రులైన రంగయ్య, లక్ష్మీకాంతం జ్ఞాపకార్థం రూ.51 వేలు విరాళం ఇచ్చినట్లు కమిటీ సభ్యులు కె.నాగేశ్వరరావు తెలిపారు.

కల్యాణ మండపం నిర్మాణానికి..

విస్సన్నపేట, న్యూస్‌టుడే: స్థానిక ఎన్ఎస్‌పీ కాలువ సమీపంలోని రామాలయంలో నూతనంగా చేపట్టిన కల్యాణ మండపం నిర్మాణానికి కంటే కొండయ్య, వెంకటలక్ష్మి దంపతులు రూ.25 వేలు, బట్టు పద్మనాభప్రసాద్, విజయ రూ.13,500, బట్టు రామకృష్ణ, వరలక్ష్మి రూ.13,500, నెక్కడపు వేణుగోపాలకృష్ణ, శ్రీలక్ష్మి రూ.5 వేలు, బాల అప్పారావు, శ్రీలత రూ.5 వేలు చొప్పున విరాళాలను అందజేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు పలగాని పుల్లారావు, పర్వతం నారాయణరావు వారిని అభినందించారు.

ట్యాబ్‌లతో బోధన ఉత్తమం

ఇబ్రహీంపట్నం: సాధారణ బోధన కన్నా ట్యాబ్, యాప్‌లతో విద్యార్థులకు బోధించడం ద్వారా ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు సులభంగా అర్థమవుతుందని సమగ్ర శిక్షా సహిత విద్యా కో-ఆర్డినేటర్ అన్నపూర్ణ అన్నారు. ట్యాబ్‌ల వినియోగం, యాప్‌ల బోధనపై ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు.

రహదారి అభివృద్ధి పనులు ప్రారంభం

మైలవరం: పొందుగలలోని పలు ప్రాంతాల్లో సీసీ రహదారి అభివృద్ధి పనులను ఆ గ్రామ తెదేపా నాయకులు ప్రారంభించారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, నరేగా ద్వారా గ్రామానికి రూ.40 లక్షలను కేటాయించగా పనులను నిర్వహిస్తున్నట్లు నాయకుడు బి.సుధాకర్ తెలిపారు.

విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు

ఇబ్రహీంపట్నం(గ్రామీణం): కాచవరం మండలపరిషత్తు పాఠశాల విద్యార్థులకు శనివారం వైద్యఆరోగ్య సిబ్బంది హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి వారి ఎత్తు బరువులు పరీక్షించి నమోదు చేశారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ స్పందన, హెచ్ఎం నాగమల్లేశ్వరి ఉపాధ్యాయులు ఇర్ఫాన్ పాషా, భవాని ఆశా కార్యకర్తలు సీతా జ్యోతి పాల్గొన్నారు.

ముగ్గురికి రిమాండ్

జి.కొండూరు: మండలంలోని కోడూరులో పాత కక్షల నేపథ్యంలో హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు జి.కొండూరు పోలీసులు తెలిపారు. వారి సమాచారం మేరకు భక్కతట్ల నాగప్రవీణ్‌కుమార్ అతని స్నేహితులు రాజులపాటి రాంబాబు, పామర్తి శివాజీలు గత రాత్రి గ్రామానికి చెందిన కొలుసు జమలయ్యపై మద్యం మత్తులో విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డారు. గాయపడిన జమలయ్య శనివారం జి.కొండూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. అనంతరం నిందితులను అదుపులోకి తీసుకుని నూజివీడు కోర్టులో హాజరు పరచగా, వారికి 14 రోజులు రిమాండు విధించినట్లు ఎస్సై సతీష్‌కుమార్ తెలిపారు.

అవీ ఇవీ

పీఆర్టీయూ నూతన కార్యవర్గం

గంపలగూడెం, న్యూస్‌టుడే: పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నేరెళ్ల రంగనాథ్, జె.రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం రాత్రి గంపలగూడెంలో జరిగిన మండల కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు.

స్వచ్ఛత సాధనకు సహకరించండి

తిరువూరు: పట్టణంలో స్వచ్ఛత సాధనకు ప్రజలు సహకరించాలని కమిషనర్ జి.లోవరాజు విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛతా హీ సేవా - 2024 కార్యక్రమంలో భాగంగా శనివారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులు పట్టణ ప్రధాన వీధుల్లో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీశ్ పాల్గొన్నారు

సామూహిక సీమంతం



జాతీయ పోషకాహార మాసోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో శనివారం గంపలగూడెం ప్రధాన పాఠశాల ఆవరణలో 33 మంది గర్భిణులకు సీమంతం చేశారు. దాతల సౌజన్యంతో చీరలు, జాకెట్లు, ఫలాలు, పసుపు, కుంకుమ, గాజులు సంప్రదాయంగా అందజేసి ఆశీర్వదించారు. తహసీల్దారు రాజేశ్వరి, సీడీపీవో సత్యవతి, వైద్యాధికారిణి భార్గవి, సర్పంచి పుల్లమ్మ, ఉపసర్పంచి కె.నాగరాజుగుప్తా, తెదేపా మండల, గ్రామ శాఖల అధ్యక్షులు ఆర్.వీరారెడ్డి, కె.రవికుమార్, సూపర్‌వైజర్ వై.మునిలక్ష్మి, వార్డు సభ్యుడు ఎల్.రామకృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగినులు, ఆయాలు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, గంపలగూడెం**

బాధిత కుటుంబానికి సాయం

విస్సన్నపేట: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన తెదేపా మాజీ సర్పంచి భూక్యా శ్రీరాములు కుటుంబానికి తెదేపా నాయకులు శనివారం రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. ఎన్.వెంకటేశ్వరరావు, ఎన్టీ వెంకటేశ్వరరావు, ఎన్ఆర్ఐ వల్లభనేని గిరి, ఎన్.శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, రామకృష్ణ, రాణి, వేమన, రాణిసురేశ్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మైలవరం డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ తన సిబ్బందితో శనివారం సాయంత్రం నాలుగు బృందాలుగా ఏర్పడి అక్రమంగా తరలిస్తున్న ఇసుక రీచ్‌ల వద్ద దాడులు చేశారు. ఈ దాడుల్లో రెడ్డిగూడెం మండలంలోని రెడ్డిగూడెం కోతుల వాగువద్ద ఎలాంటి బిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్‌లు పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ డివిజన్‌లో జూదం, కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే 94440 906871, 83329 83805, 94407 96447 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

నేత్రదానం



ఝాన్సీలక్ష్మి (పాత చిత్రం)

తిరువూరు, న్యూస్‌టుడే: స్థానిక శాంతినగర్‌కు చెందిన ఏపీఎస్ఆర్టీసీ ఎన్ఎంయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పాటిబండ్ల సీతాపతిరావు సతీమణి ఝాన్సీలక్ష్మీ (78) అనారోగ్యంతో శనివారం కన్నుమూశారు. ఆమె కుమారుడు పీవీఎన్ ప్రసాద్, కుమార్తె రజని తమ తల్లి నేత్రాలు దానం చేసేందుకు ముందుకు వచ్చారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధుల ద్వారా ఎస్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి సమాచారం అందించారు. వారు తిరువూరుకు వచ్చి మృతురాలి నుంచి కార్నియాలు సేకరించి తీసుకెళ్లారు.

మధిర బ్రాంచి కెనాల్‌కు 838 క్యూసెక్కుల సాగర్‌జలాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు శనివారం ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కప్పలబంధం నియంత్రిక నుంచి 838 క్యూసెక్కుల సాగర్‌జలాలు విడుదల చేసినట్లు ఏఈలు సత్యరవి కిశోర్, మహేష్ తెలిపారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 160 క్యూసెక్కులు వచ్చాయన్నారు. దిగువన మేజర్ల వారీగా గంపలగూడెం-20, ఊటుకూరు-30, పెదకొమిర, మధిర, నిదానపురం మేజర్లకు 10 క్యూసెక్కుల చొప్పున సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం నీటి సరఫరా మేజర్ కాల్వలకు పెరుగుతుందన్నారు.

దాటలేకున్నాం.. గండ్లు పూడ్చండి

జి.కొండూరు, న్యూస్‌టుడే

ఇటీవల వరద ఉద్ధృతికి మండలంలోని గ్రామాల్లో రహదారులకు గండ్లు పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఒక వైపు కవులూరు నుంచి వెలగలేరు మీదుగా విజయవాడ చేరుకునే రహదారి వరద తాకిడికి పూర్తిగా రాకపోకలు నిలిచాయి. దీంతో ఆ మీదుగా విజయవాడ వెళ్లే విద్యార్థులు, చిరు వ్యాపారులు, రైతులు, కూలీలు ప్రయాణానికి తీవ్ర అసౌకర్యమేర్పడింది. దాదాపు 20 రోజులు గడుస్తున్నా కోతకు గురైన రహదారి దుస్థితి పట్టించుకునే నాథుడే లేడని కవులూరు, వెలగలేరు గ్రామస్థులు వాపోతున్నారు. ఈ రహదారికి పడిన గండి పూడ్చేందుకు అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో తెలియక పాదచారులు, వాహన చోదకులు సతమతమవుతున్నారు. ఈ విషయమై పంచాయతీ రాజ్ సహాయక ఇంజినీర్ వివరణ కోరగా సత్వరమే తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రాకపోకలు పునరుద్ధరిస్తామన్నారు.

కోతకు గురైన రోడ్లతో ప్రజల అవస్థలు



గడ్డమణుగు మోటరుగడ్డ సమీపంలో కొట్టుకుపోయిన వంతెన ఖానా



కవులూరు వెలగలేరు గ్రామాల రహదారి దుస్థితి

మరో వైపు మునగపాడు బైపాస్‌లో

మునగపాడు బైపాస్‌లో గడ్డమణుగు మోటరుగడ్డ సమీపంలో పులివాగు పై వంతెన వరద ధాటికి కోతకు గురైంది. దీంతో ఒక వైపు ఖానా పూర్తిగా కొట్టుకుపోయి మండల గ్రామాల ప్రజలు జి.కొండూరు చేరుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఇప్పటికే కేజీవై రహదారి విస్తరణ ప్రశ్నార్థకంగా మారడంతో మునగపాడు, సున్నంపాడు, తెల్లదేవరపాడు, గంగినేని, దుర్గిరాలపాడు ప్రజలు ఈ వంతెన మీదుగా ప్రయాణిస్తున్నారు. వరద తాకిడికి వంతెన ఖానా పూర్తిగా కొట్టుకుపోవడంతో ప్రత్యామ్నాయం లేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఆయా లోయ గ్రామాలకు చేరుకోవాలంటే జి.కొండూరు పోలీస్ స్టేషన్ మీదుగా నిర్మించిన మార్గంలో ప్రయాణించాల్సిందే. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండలంలోని కోతకు గురైన రహదారులపై దృష్టి పెట్టి రాకపోకలను మండల గ్రామాల ప్రజలు పునరుద్ధరించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఆర్ అండ్‌బీ సహాయక ఇంజినీర్ హుస్సేన్‌ని వివరణ కోరగా గడ్డమనుగు నుంచి మునగపాడు వరకు బైపాస్ రోడ్డు మరమ్మతుల్లో భాగంగా నిర్మాణం జరుగుతుందని తెలిపారు.

AUTO

VEHICLES FOR SALE

2014 Fortuner white colour, Top end, Automatic, All advance features for sale. Only direct parties. Contact ✆ 89858 87459.

2019 టాటా మోడల్ ఎక్స్‌ప్రెస్ బస్సు ★ 2020 అశోక్ లేలాండ్ స్లీపర్ (వెన్నెల) బ్యాంక్ వారి వేలం ద్వారా అమ్మబడును. వివరములకు ✆ 90301 61117.

BUSINESS SERVICES

WANTED DEALERS/AGENTS

Wanted Dealers and Distributors for Alkaline Water Bottle Company in Vijayawada. Cont: 89779 24233, 94404 14646.

Wanted CSA, SS, Chennai base Edible Oil, Basmati Rice Products. Srikrishna Foods. Ph: 8919478977.

BUSINESS OFFER

Looking for Investment Partner in IT Service/ Education / Online Stores Who Can Invest Mini 25 Lakhs. ✆ 73827 90366.

కొబ్బరి పీచు / కోకోపిట్ పూర్తి రన్నింగ్ కండీషన్‌లో గల ఫ్యాక్టరీ అమ్మకంనకు or అద్దెకు కలదు. మేదరమెట్ల, బాపట్ల జిల్లా. వివరములకు సంప్ర॥ 98495 19527.

మహిళలు, నిరుద్యోగులు, చిన్న పెట్టుబడితో హోమ్ బేస్డ్ ప్రోడక్ట్స్ బిజినెస్ ద్వారా ప్రతినెల ఫిక్స్‌డ్ సంపాదన పొందండి. ✆ 7013544075, 7842877904.

PACKERS & MOVERS

Tirumala Packers & Movers an ISO 9001: 2015 Certified Co. House hold Goods shifting any time any where. ✆ 97043 64389, 92900 87673.

SOLAR PRODUCTS

Surya Ghar పథకము ద్వారా సబ్సిడీ, తక్కువ ధరలో బ్యాంక్ లోన్ సౌకర్యంతో నాణ్యమైన Solar Project చేయబడును. వివరాలకు సంప్ర: 81792 39699.

BUILDING CONSTRUCTION

Raghava Constructions. We do Building Contracts on Turn Key Basis for VMC/ APCRDA Approvals, Vasthu, Plans Elevations & Structural Designs. ✆ 98851 12999.

తక్కువ ఖర్చు, పూర్తి క్వాలిటీతో మీ ఇల్లు మరియు ... సంప్ర: PVR Constructions. ✆ 77805 69091.

సూర్య కన్‌స్ట్రక్షన్స్ ... ✆ 94402 42092.

WATER PROOFING

Tarun Slab Leakage Works ★ 25 Yrs. Exp. ★ 5 Yrs. Warranty ★ Bathroom Leakage Grouting Epoxy Works. ★ 94940 02285, 99516 07504.

WOOD

377 టేకువెట్టు 3 అడుగుల నుండి 5 అడుగుల ... అమ్మకమునకు కలదు. ... Contact. ✆ 98484 70700.

BEAUTY & PERSONAL CARE

పీసీ బ్యూటీ ... ✆ 98485 88530.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు స్పందించే ముందు తగిన రీతిలో ... విచారించుకోవలసిందిగా ... [illegible]

EDUCATION

Last Date: SSC, Inter One Sitting.. MBBS, BPT, MLT, GNM, many Diploma Courses. Hindi Pradhamika to Praveena.. Wisdom Academy. ✆ 70957 91736.

రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్: డిగ్రీ, PG, B.Tech, డిప్లొమా, D&B-ఫార్మసీ, D.Ed, B.Ed, B.P.Ed, MBA, MCA, B.Sc(Agri), B.Sc (నర్సింగ్), GNM. Ph:8866977112, 339

SPOKEN HINDI

Learn Online / Offline Spoken Hindi/ English & French With in 30 Days 100% Guarantee for all ages. Free Demo. ✆ 98495 42456.

HOME TUITIONS

KKRs Maths Tuition: Regular & IIT Classes for State & CBSE (8,9,10,+1,+2), Diploma, Inter (MPC), B.Tech (Maths) and GRE (Maths) at Gunadala. ✆ 98858 83128.

ప్రత్యూష (ఆన్‌లైన్ & హోమ్) ట్యూషన్స్ LKG to PG, NEET, IIT, EAMCET, B.Tech. CA-CPT, BITSAT ఆల్ ట్యూటర్స్ కావాలన్నా ✆ 92900 05677, 74165 35749.

FINANCIAL SERVICES

ఖాళీ స్థలాలపై లోన్స్ / హోమ్ లోన్స్ / ప్రోపర్టీ లోన్స్ / బిజినెస్ లోన్స్ చేయబడును. సిబిల్ అవసరం లేదు. సంప్ర: ✆ 94909 63409.

తాడికొండ పెదపరిమి పొలంపై లోన్ (Finance) కావలెను. Contact Only Financiars.Cell: 9550579985.

మీ ఇళ్లు, బిల్డింగ్స్, కాంప్లెక్స్‌ల మీద తనఖా పద్ధతిలో రూ. 1 వడ్డీకి ఫైనాన్స్ ఇప్పించబడును. వేరే ఏ బ్యాంకులో వున్నను విడిపించబడును. ✆ 83099 11995, 93904 35013.

బ్యాంకింగ్, నాన్ బ్యాంకింగ్.. All type లోన్స్ - హోమ్ లోన్, మార్ట్‌గేజ్, ఎడ్యుకేషనల్ లోన్, టేకోవర్ మరియు Top అప్.. లో సిబిల్, నో ITR.. ✆ 77025 49105.

FOOD

విజయవాడ పాత ఆటోనగర్ సరౌండింగ్ 5KM పరిధిలో హాస్టల్స్‌కి, కాలేజీలకి, వర్కర్స్‌కి మంచి క్వాలిటీ టిఫిన్స్ & భోజనం సప్లయ్ చేయబడును. సంప్ర: ✆ 85292 93979.

HOME NEEDS

PEST CONTROL

Tarun Pest ★25 Yrs. Exp. 5 Yrs. Waranty ★ Smell Less ★ Bayers Chemicals (Pest and Other Insects Control). ✆ 94940 02285, 99516 07504.

Priyanka Pest: 25 Yrs. Exp. 5 Yrs. Warranty Smell Less Bayer Chemicals (Pest and Other Insects Control). ✆ 94924 82494, 93932 30136.

... ✆ 91103 43262, 89853 51383.

INDUSTRY

MACHINERY FOR SALE

GEN Samrat ... Ph:9246249543, 9000688888

PEOPLE CARE

OLD AGE HOME

న్యూ లైఫ్ హోమ్ వృద్ధాశ్రమం ... ✆ 98483 40496, 73866 20496.

వృద్ధాశ్రమం
శ్రీ వేంకటాద్రి
వయోవృద్ధుల ఆశ్రమం, వెలగలేరు గ్రామం జి.కొండూరు మండలంలో చేరదలచినవారు సంప్రదించండి.
✆9848691799

వృద్ధుల ... Ph: 94941 79779 / 63027 93978.

REAL ESTATE

విజయవాడ సిటీ ... ✆ 97035 38222.

గుంటూరు సిటీ, గోరంట్ల, లాం, రెడ్డిపాలెం, అగతవరప్పాడు, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కొప్పురావూరు, కంతేరు, కాజా మరెక్కడైనా ప్లాట్లు అ/కొ సంప్ర॥ జనచైతన్య ప్లాట్లు మా ప్రత్యేకత. A1 రియల్ ఎస్టేట్, 73823 96677.

గుంటూరు సిటీలో, గోరంట్ల, లాం, JKC రోడ్ ఇన్నర్‌రోడ్, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కాజ, మంగళగిరి, తాడికొండ, రాజధానిలోని, ప్లాట్లు అమ్మదలచినవారు సంప్రదించండి. 93999 55545.

రాజధాని అమరావతి పరిధిలోని మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ ఏరియాలోని KL యూనివర్సిటీకి దగ్గరలోని వడ్డేశ్వరం గ్రామమునందు E/F 30x82 అడుగుల కొలతలు గల 273 చ.గ.లు స్థలము అమ్మబడును. Cell No: 94905 72990.

పటమట NTR సర్కిల్ SBI-MED-PLUS, బందర్‌రోడ్ నుండి 5th ఇల్లు చ॥గ॥ 222 లు, మరియు దుర్గా మహల్ వెనుక రోడ్ 3bhk కొత్త ప్లాట్ అమ్మకమునకు కలదు. 63000 65270.

300 చ॥గ॥ స్థలం + ఇల్లు (సూర్యనారాయణ వీధి, సూర్యారావు పేట) & 3BHK ఫ్లాట్ (2400 చ॥అ॥ కస్తూరిబాయిపేటలోని పాత అపార్ట్‌మెంట్) అమ్మకమునకు కలవు. విజయవాడ. 98855 55888.

కుంచెనపల్లి అపర్ణ అపార్టుమెంట్స్ ఎదురు రోడ్‌లో సూర్య ఫ్లాట్స్ నందు, G+1 బిల్డింగ్ మరియు గీతాంజలి అరవింద వసుంధర విలాస్ దగ్గరలో 21x 50=116 చ॥గ॥ కొలతలతో ఖాళీ స్థలం అమ్మబడును. ✆ 79816 36468, 78426 38752.

FLAT FOR SALE

KANURU

కానూరు పిన్నమనేని టీచర్స్ కాలనీ మన కళ్యాణ మండపం ఎదురుగా మైత్రి రెసిడెన్సీనందు 2 BHK డీలక్స్ ఫ్లాట్స్ గృహప్రవేశమునకు సిద్ధముగా కలవు. ✆ 94914 43283, 90328 70228.

3BHK లగ్జరీ 2140 Sft. ఇండివిడ్యువల్ ఫ్లోర్ కానూరు ఉమాశంకర్‌నగర్‌లో, 2BHK లగ్జరీ ఫ్లాట్స్ తాడిగడప 100 Ft. PVSR స్కూల్ & చైతన్య కాలేజ్ రోడ్, Nr. బందర్ రోడ్. ✆ 9390472429.

Ready to Occupy. SR ప్యారడైజ్, విజయవాడ - కానూరు - మురళీనగర్ మెయిన్‌రోడ్డులో 2 & 3 BHK ప్రీమియం ఫ్లాట్స్, బెంజిసర్కిల్‌కి 5KM, NTR హెల్త్ యూనివర్సిటీకి 2KM, టాప్ బ్రాండ్స్‌తో నిర్మాణం. Ph: 82977 01800.

కానూరు కెనడీ స్కూల్ ఎదురుగా 3 BHK ఫ్లోర్ వైజ్ ఫ్లాట్స్ మరియు తాడిగడప మనోజ్‌నగర్‌లో లే అవుట్ నందు నిర్మాణంలో ఉన్న 155 గ॥ల హౌస్‌లు కలవు. ✆ 70750 17255.

TADIGADAPA

2BHK (800 sq.ft)+ Pent house (250 sq.ft) total 32Lakhs (Neg). Yanamalakuduru, opp: Sivalayam steps. Call: 8341217802

PENAMALURU

రామవరప్పాడు పిన్నమనేని హైట్స్ 4th ఫ్లోర్ నందు 1360 S.Ft.తో పుల్లీఫర్నిష్డ్ 3 BHK లగ్జరీ ఫ్లాట్ 100% వాస్తు, కార్ పార్కింగ్, లిఫ్ట్, జనరేటర్‌తో అమ్మకం. ✆ 93812 20181, 94404 54909.

CURRENCY NAGAR

విజయవాడ, కరెన్సీనగర్, ... 3 BHK (1850 S.Ft) ... ✆ 80083 48560/ 98493 20848.

కరెన్సీనగర్ ... ✆ 98485 98331.

TADEPALLI

తాడేపల్లి/ AIIMS దగ్గరలో 3BHK ... S.Ft. 3100/- Only. (Including Cupboards & Ceiling) Ready to Occupy. ✆ 82977 01800.

గుంటూరు ... 3 BHK లగ్జరీ ఫ్లాట్స్ (1750 S.Ft) ... ✆ 99088 45511, 99088 45111.

GOLLAPUDI

East Facing 3BHK 1600 S.Ft., Flat Near Venkayya Swamy Temple, Sai Puram Colony, Gollapudi, VJA. ✆ 99498 84401, 99591 42980.

ఆటోనగర్ ... 2BHK Dlx Flats 1015 & 1100 Sft. E/F, Lift, Car Park, CC Camera ... ✆ 9848194986.

GENERAL

Brindavan Colony beside Siris Rajus House, Spacious Deluxe 3BHK 2285 Sft., E/F 3rd Floor (Rate 1.8 Cr.) Ready to Occupy. ✆ 9440304304.

3 BHK, E/F, Gated Community 1st Flr. 7th Top Floor, 1745 Sq.Ft. 2 Car Parking, Vertex Siris Sigma, Ayyappa Nagar, Vijayawada. ✆ 99022 91002.

EENADU Classifieds

న్యూ 2BHK - 1290 S.Ft., 3BHK - 1550 S.Ft. ఫ్లాట్స్ అమ్మకానికి కలవు. PVR Meadows (70 Flats) శ్రీ కనకదుర్గా నగర్ కాలనీ, ఆయుష్ హాస్పిటల్ దగ్గర, VJA. సంప్ర॥ ✆ 97034 19192.

పెనమలూరులో
న్యూ 2 BHK Flat అమ్మకం
పెనమలూరు హైస్కూల్ దగ్గర గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న
2 BHK ఫ్లాట్ ఉత్తరం ఫేస్
3rd ఫ్లోర్ 1041 S.Ft.,
లిఫ్ట్ సౌకర్యంతో అమ్మకం.
ప్లింత్ 841 S.Ft., Car Park 100S.Ft., Common Area 120 S.Ft.
✆ 85209 24444

కానూరు వినాయకనగర్‌లో KCP స్కూలు దగ్గర శ్రీహాస ఎన్‌క్లేవ్‌నందు 3 BHK 1400 S.Ft. 2nd ఫ్లోర్ వెస్ట్ ఫేసింగ్ లిఫ్ట్, కారు పార్కింగ్‌తో అమ్మకం. ✆ 95026 68467.

విజయవాడ కరెన్సీనగర్ నారాయణ స్కూలు దగ్గర 3BHK ఫ్లాట్స్ (1420 చ॥అ॥ కామన్ ఏరియా, కారు పార్కింగ్‌లతో సహా) గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్నవి అమ్మకమునకు కలవు. ✆ 93941 11044.

3 LUXURY FLATS FOR SALE @ TADEPALLI
SITE 1477 YARDS
TOTAL FLATS 10 ONLY
EACH FLAT 4260 Sq.FEETS
UDS 137 YARDS
(Incloud 3 car parkings)
20x15 BED ROOMS 4
10X16 &10x8 BATH ROOMS 4
20x15 KITCHAN
20x15 DINNING
20x15 DRAWING HALL
20x10 HOME THEATER
63x17 LIVEING HALL
Prime Locality
Beside SIT Office
Prathuru Road, Tadepalli
available gn-fab DOORS & WINDOWS
92464 95788 / 99

VJA, మొఘల్‌రాజపురం VP సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ప్రక్కన రఘురామ స్ట్రీట్‌లో శ్రీసాయి అపార్ట్‌మెంట్స్ నందు GF-3 2BHK ఫ్లాట్ అమ్మకమునకు కలదు. ✆ 99123 41163, 88976 23332.

కానూరు, మురళీనగర్, కలిదిండివారివీధి, బాలాజీ ఎన్‌క్లేవ్‌లోని 1050 Sft గల 2 BHK Flat అమ్మకమునకు కలదు. (Flat No. 501) సంప్రదించండి ✆ 94411 94639, 94405 35956, Call టైమింగ్స్: 1 PM onwards.

విజయవాడ, రామవరప్పాడు, బళ్ళెంవారివీధిలో, ఫ్లోర్‌కి 1 ఫ్లాట్ చొప్పున నిర్మించిన, 3 BHK పుల్లీ ఫర్నిష్డ్ ఫ్లాట్ (1900 Sft) అన్ని సౌకర్యములతో అమ్మకమునకు కలవు. ✆ 92469 77999.

విజయవాడ, లబ్బీపేట YVరావు హాస్పటల్ రోడ్, Koduru ఎన్‌క్లేవ్, G2, 2BHK, 1050 Sft, ఈస్ట్ ఫేసింగ్, కార్ పార్కింగ్ ఫ్లాట్ అమ్మకానికి కలదు. 97044 64829, 98490 64369.

3 BHK, 2 BHK సూపర్ లగ్జరీ ఫ్లాట్స్ గృహప్రవేశానికి సిద్ధంగా కలవు. ట్రెండ్‌సెట్ మెడోస్ గేటెడ్ కమ్యూనిటీ వెనుక, GVR నగర్, 3వ లైన్, పందిరి రోడ్, VJA. ✆ 98492 44328, 97047 83727.

రూ. 24 లక్షలకే న్యూ 2BHK ఫ్లాట్స్ ఫర్‌సేల్ ఏలూరు, సత్రంపాడులో నార్త్, ఈస్ట్ ఫేసింగ్ రెడీటూ ఆక్యూపై. POP సీలింగ్. శ్రీచాంద్ రెసిడెన్సీ. ✆ 96761 22957.

1256 Sft. 2BHK 3rd Flr., West Facing with Car Parking at Penamaluru, Vijayawada for Sale. Direct Parties only. Ph.: 9951904721.

FLAT FOR SALE
2 BHK, 800 Sq.Ft,
Flat. Radhakrishna Residency
Opp: Autonagar Gate, 30 meters from Bandar Road
WhatsApp +91 94918 67267

New 3 BHK Sq.Ft Luxury Flats Near Mahanadu Road, Vijaya Lakshmi Colony with Cup Boards and all Amenities. ✆ 94405 28023.

Poranki, Near Krishnaveni School, 4 BHK Luxury East Face Floor Wise Individual 2700 S.Ft. Flat, North East site, High Quality, Top Brands, Class Location, Double Car Parking, APCRDA, SBI approved. ✆ 90635 88233, 76740 82458.

Newly Constructed SKR Heights. Double (2 BHK) Bedroom Flats 1200 S.Ft. Ayyappa Nagar, Veera Sawarkar Road, VJA. ✆ 91219 82584.

VJA, మంగళగిరి, ఎత్తైన ప్రదేశము NRI హాస్పిటల్ వెనుక క్రిస్టల్ గార్డెన్స్ నందు గేటెడ్ కమ్యూనిటీ సౌకర్యంతో స్వీట్ వాటర్‌తో అపార్ట్‌మెంట్ ఫ్లాట్లు అమ్మబడును. కొనదలచిన వారు సంప్ర: ✆ 98480 82879.

2BHK -39 Lakhs, 3BHK -58Lakhs ఫ్లాట్స్ AT- సెమిగేటెడ్ కమ్యూనిటీ నందు. 1170 S.Ft., & 1560 S.Ft., ఈడ్పుగల్లు, విజయవాడ - మచిలీపట్నం హైవేకు అతి సమీపముగా కలవు. ✆ 94944 76303, 98480 55344.

గన్నవరం సెంట్ జాన్స్ స్కూల్ ప్రక్కన శ్రీ నగర్ కాలనీలో భాను ఎంపైర్ నందు న్యూగా ఉన్న 2BHK, 3BHK ఫ్లాట్స్ రెడీ ఆక్యూపెన్సీకి అమ్మకమునకు కలవు. సంప్ర॥ ✆ 98481 47485.

విజయవాడ మొగల్‌రాజ్‌పురం దాసరి లింగయ్య స్ట్రీట్, రావిచెట్టు ప్రక్కన సాయి కళ్యాణ్ రెసిడెన్సీలో తూర్పుఫేస్ 3 BHK ఫ్లాట్ 1950 Sftతో 3rd ఫ్లోర్‌లో అమ్మకం. ✆ 98481 14980.

3 BHK ఇండివిడ్యువల్ లగ్జరీ ఫ్లాట్ (CRDA) Ready to Occupy బందరురోడ్డు టైం హాస్పిటల్ వెనుక వరలక్ష్మీపురంలో (బ్యాంక్ లోన్‌తో) ✆ 76719 22845.

అయ్యప్పనగర్, శివాజీ రోడ్ బందర్‌రోడ్‌కు దగ్గరలో 2BHK ఫ్లాట్స్ గృహప్రవేశానికి సిద్ధంగా అమ్మకంనకు కలవు. సంప్ర: 90303 98110, 99485 89787.

FLAT FOR SALE
విజయవాడ ఆయుష్ హాస్పిటల్ దగ్గర **వసంత నివాస్** అపార్ట్‌మెంట్‌లో 2 BHK
3rd ఫ్లోర్ 1175 చ॥అ॥
తూర్పు ఫేసింగ్ లిఫ్ట్, కారు పార్కింగ్‌తో అమ్మకము
✆ 94927 11449

విజయవాడ మహానాడు రోడ్డు రామచంద్రనగర్ లో 2000 S.Ft లగ్జరీ 3 BHK ఫ్లాట్ అమ్మకానికి కలదు. ✆ 97052 44567, 96404 41111.

పోరంకి, ప్రియ కుపెనీ ఎదురు రోడ్, శ్రీనివాసనగర్ నందు 2 BHK, 3 BHK ప్రీమియం ఫ్లాట్స్. Ready to Occupy. Decent Location, High Quality Construction , Top Branded Materials. APCRDA, RERA, SBI Approved . ✆ 76740 82458.

గృహప్రవేశమునకు సిద్ధముగా 2 BHK & 3BHK ఫ్లాట్స్ ప్రసాదంపాడు వివేకానంద స్కూల్ రోడ్ లో, నేషనల్ హైవేకి 100. మీ దూరంలో ఎకరం స్థలంలో 75 ఫ్లాట్స్‌తో బొప్పన వారి సంకల్ప్ కాసా అపార్టుమెంట్ నందు A/C, జిమ్, చిల్డ్రన్ ప్లే ఏరియా, పార్క్ మొ॥ సౌకర్యములతో అమ్మకమునకు కలవు. ✆ 99088 45511, 99088 45111.

ఉయ్యూరు, MLC గారి వీధిలో, శ్రీసాంబశివ రెసిడెన్సీలో న్యూ 2 BHK లగ్జరీ ఫ్లాట్స్ (1072 Sft), గ్రౌండ్, 1st ఫ్లోర్స్‌లో ఫాల్ సీలింగ్, RCC కబోర్డ్స్,లిఫ్ట్, కార్ పార్కింగ్‌తో అమ్మబడును. ✆ 86393 56018.

కరెన్సీనగర్, కేతినేని వారి వీధిలో అమృత్ రెసిడెన్సీ నందు ఫ్లోరుకు ఒక ఫ్లాట్ గల 5 ఫ్లోరులలో 5వ ఫ్లోరు మాత్రమే అమ్మకం. (S.Ft.2200, UDS 65 గ॥లు) మాడ్యులర్ కిచెన్, ఫర్నిషింగ్‌తో గృహప్రవేశమునకు సిద్ధంగా ఉన్న ఫ్లాటు అమ్మకం. ✆ 98481 10102, 98491 64444.

3BHK 1850 Sq ft పుల్లీ ఫర్నిష్డ్ లగ్జరీయస్ ఫ్లాట్స్ ఫ్లోర్‌కి ఒక్క ఫ్లాట్ రెడీ టు ఆక్యుపై ప్రైమ్ లొకేషన్, ఆయుష్ హాస్పిటల్ దగ్గర, కరెన్సీనగర్. ✆ 90524 13111, 93901 11339.

సత్యనారాయణపురం పురుషోత్తంవీధిలో (BRTS రోడ్ దగ్గర) 3వ ఫ్లోర్ తూర్పు సింహ ద్వారం, పడమర రోడ్ గల 3 BHK ఫ్లాట్ (1600 Sft) అమ్మకం. ✆ 93953 01959, 93943 24991, 92945 61111.

నున్న D.Mart ఎదురుగా గల అపార్ట్‌మెంట్స్ లో 2BHK (875) S.Ft., 2,700/-కు, 3BHK (1134) SFT 3,000/-కి అమ్మకానికి కలవు. లిఫ్ట్, కార్ పార్కింగ్‌తో ✆ 90005 02222.

నందిగామ రైతుపేట సెంటర్ LP థియేటర్ ప్రక్కన నిర్మించిన విఘ్నేష్ ప్లాజా నందు కమర్షియల్ షాప్స్ మరియు 2BHK ఫ్లాట్స్ గృహప్రవేశమునకు సిద్ధంగా కలవు. ✆ 76800 70510.

బందరురోడ్డు అశోక్ నగర్ పప్పులమిల్లు సెంటర్‌కు అతిసమీపమున నిర్మించిన 3 BHK (ఫ్లోర్‌కి 2 ఫ్లాట్స్) గృహప్రవేశమునకు సిద్ధముగా కలవు. ✆ 94940 51157.

VJA, సూర్యారావుపేట, గోవిందరాజులు నాయుడు స్ట్రీట్, రేకుల షెడ్ స్కూల్ ప్రక్కన, శ్రీచక్ర అపార్ట్‌మెంట్‌లో, 5th ఫ్లోర్, ఈస్ట్ ఫేస్ 2 B/R ఫ్లాట్ అమ్మకం. ✆ 93474 32499, 98491 85739.

పోరంకి ప్రియఫుడ్స్ రోడ్డు శ్రీనివాస నగర్‌లో గ్రూప్‌హౌస్ SF2 ఈస్ట్ ఫేసింగ్ 1250 S.Ft. కార్ పార్కింగ్‌తో 2BHK ఫ్లాట్ అమ్మకం. ✆ 81061 84141.

విజయవాడ పటమటలంక కేశవరెసిడెన్సీ నందు 3BHK (1796 S.F.t) ఫ్లాట్ లిఫ్ట్, కార్ పార్కింగ్, జనరేటర్ మొ॥ సౌకర్యములతో అమ్మకం. ✆ 78010 20328.

మొగల్రాజపురం (విజయవాడ) బోయపాటి మాధవరావు వీధిలో 3B/R 2nd ఫ్లోర్, E/F, 1900 S.Ft. కార్‌పార్కింగ్ సౌ॥లతో అమ్మకమునకు కలదు. ✆ 98495 12974.

బ్యాంక్ వేలములో ప్రాపర్టీస్ విజయవాడ నందు సితార జంక్షన్, NTR కాలనీ, గన్నవరం, జగ్గయ్యపేట నందు కలవు. ✆ 86396 53638.

VJA భవానీపురం నేషనల్ హైవే ప్రక్కన Caliber Utsav Apt., 1st ఫ్లోర్ W/F 2BHK Flat, E/F 3BHK Flat అన్ని సౌకర్యాలతో అమ్మబడును. ✆ 98481 10246.

ప్రశాంతినగర్, లయోల కాలేజ్, కణదర్శిని ప్రక్కన శ్వేత ఎంక్లేవ్ నందు 1150 S.Ft, W/F, లిఫ్ట్, కార్ పార్కింగ్ గల 2 BHK ఫ్లాట్ అమ్మబడును. సంప్ర: ✆ 94949 58888.

HOUSE FOR SALE

HB కాలనీ భవానిపురం గద్దె రామ్మోహన్ రావు పార్కు దగ్గర HIG - 207, 205 చ॥గ॥లో, సౌత్ ఫేస్ బిల్డింగ్ అమ్మకంనకు కలదు. ✆ 88975 63506.

విజయవాడ మహానాడు రోడ్డులో న్యూ G+5 బిల్డింగ్ మొత్తం / విడివిడిగా I st ఫ్లోర్ కమర్షియల్, మిగతా 4 ఫ్లోర్లు, ఫ్లోర్‌కి 1 ఫ్లాట్ 3 BHK 2200 Sft అమ్మకం. ✆ 88975 63506.

విజయవాడ గద్దే వారి పొలాలు, G.V.R. నగర్, 2nd లైన్ ట్రెండ్‌సెట్ దగ్గర 180 గజాలలో నూతనంగా నిర్మించిన G+2 బిల్డింగ్ అమ్మబడును. Ready to Occupy ✆ 94901 21110.

Kamakotinagar Vidyadharapuram- Vijayawada: Two Storeyed East Face Bldng In 200 Sq.Yrds - 33ft South Face Rd. Rent Yld Rs.35,000/- P.M. Brokers Excuse. Ph: 9440138085, 8019780935.

బందర్‌రోడ్ లబ్బీపేట పైడయ్యవీధిలో 300 గజాల స్థలంలో S/W కార్నర్ బిల్డింగ్ అమ్మకం. ✆ 99897 63003, 84999 46555.

4 BHK PREMIUM VILLAS @ Poranki
★ King Sized Bed Rooms
★ Double Height Living
★ 2 Car Parking
★ 1KW Solar
★ Terrace Garden
★ Courtyard Balcony
✆ 99889 53339
80 96 123 123

నెలకు 85000/- అద్దెలు వచ్చే 250 చ॥గ॥లలో నిర్మించిన G+3+పెంట్‌హౌస్ గల బిల్డింగ్ విజయవాడ ప్రసాదంపాడులో 3.5 Cr కే అమ్మబడును. ✆ 76720 94576.

హైదరాబాద్, పెద్దఅంబర్‌పేట హైవే దగ్గరలో మైత్రి గ్రూప్ వారి కమ్యూనిటీలో MIVAN టెక్నాలజీ కన్‌స్ట్రక్షన్ 4BHK ప్రీమియం లగ్జరీ డూప్లెక్స్ 516 విల్లాస్ సేల్, 4.5 ఎ॥ లగ్జరీ పార్క్, లక్ష SFT లగ్జరీ ప్రీమియం క్లబ్ హౌస్. HMDA & RERA అప్రూవ్డ్. Ph.9666685222.

LAND FOR SALE

PENAMALURU

East Face Land For Sale Abutting Kankipadu - Godavarru Road. Contact: 98481 21762

GENERAL

భవానీపురం జోజినగర్ చర్చి సెంటర్ దగ్గర 200 అడుగుల రోడ్డు నుంచి 2వ బిట్ 700 చ॥గ॥ ల తూర్పుఫేసింగ్ మరియు కబేళా దగ్గర పోలేరమ్మగుడి రోడ్డు నందు 270 చ॥గ॥ల స్థలం అమ్మకమునకు కలవు. ✆ 90596 00573, 90526 75370.

తిరువూరు (నడిమ్ తిరువూరు) రంగనాయకస్వామి గుడి ప్రక్కన, జూనియర్ కాలేజి రోడ్డులో 8.4 సెంట్ల స్థలం అమ్మబడును. సంప్ర. ✆ 89853 44097.

రెడ్డిగూడెం మండలం ముద్దులపర్వ గ్రామంలో 14 యకరాలు 10సం॥లు లోపు వయసు గల మామిడి తోట, బోరు, ఫెన్సింగ్‌తో అమ్మకమునకు కలదు. ✆ 95503 41270.

14 Acres Land Sale/ Joint Dev. in Appaiahpalem Egumadurai Village, TN. Nr. Sricity, AP. Interested Land Dev. Builders Call: 9966855529.

Jangareddy Gudem, 45 Acres Land available for Sale/ Development with Palm oil Trees. Contact 7337335254.

5 Acres Land available for Sale/ Development near Jupudi, Vijayawada. Contact 7337335254.

Building available for sale in Nuzvid suitable for School or Hospital in 1 Acre Land. Contact: 7337335254.

NH-16 సమీపంలో కేర్ డెంటల్ కాలేజ్ వెనుక గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ అనుమతితో (LP No.7/15) అభివృద్ధి పరచి, ప్రతిపాదిత ORR ను ఆనుకొని 5,780 చ.గ. వెంచర్ అమ్మకమునకు కలదు. సంప్ర. 99597 77928, 89783 69494.

నాగాయలంక మండలం ఏటిమొగ గ్రామంలో 3 ఎకరంల మాగాణి భూమి అమ్మకంనకు కలదు. ✆ 9393107955.

కోకో, కొబ్బరి, వరి, పామాయిలు తోటలు మరియు ఇండస్ట్రీయల్‌కు ఉపయోగపడే ల్యాండ్స్, అమ్మాలన్నా కొనాలన్నా సంప్ర॥ ✆ 62810 03074.

గోసాల బందరు రోడ్డుకి 1/2 Km చైతన్య కాలేజ్ దగ్గర, వెస్ట్ ఫేస్ 400 చ॥గ॥లు ఇళ్ళ స్థలము మరియు కనుమూరు బందరు రోడ్డు ఫేసింగ్‌తో 4 ఎకరముల పొలము అమ్మబడును. సంప్ర: 94911 23645.

పొలము & హౌస్ అమ్మకం
త్వరలో రాబోతున్న లాజిస్టిక్ పార్కుకు దగ్గరలో గల తొట్లవల్లూరు గ్రామంలో గల డొంకకు 1 కి.మీ దగ్గరలో 4.63 ఎకరముల పొలము మరియు హౌస్ అమ్మకంనకు కలదు. సంప్రదించగలరు.
83093 27118

PLOT FOR SALE

KANURU

వీరంకి చేపల కుండీల 200 అ॥ రోడ్డుకి 4వ ప్లాటు 344 చ॥గ॥ల ప్లాటు అమ్మకం. రేటు చ॥గ॥ 20,000/- ✆ 92907 63488.

కానూరు, కామినేని హాస్పిటల్ రోడ్డు, పోరంకి, రాఘవ ఎస్టేట్స్, జనచైతన్య ఈడుపుగల్లు కంకిపాడు చుట్టుప్రక్కల ప్లాట్లు అమ్మదలచినవారు డైరెక్ట్ పార్టీ సంప్ర: ✆ 98485 87376.

PENAMALURU

బందరు రోడ్డు గోసాల శ్రీ సిటీ వెంచర్‌లో పడమర ఫేస్ 40 x60 కొ॥తో 266 చ॥గ॥ల లే అవుట్ ప్లాటు అమ్మకం. సంప్ర: 93966 16555.

GANNAVARAM

Premium Plot For Sale, 418 sq yds. West South Corner Bit. Beside MG Showroom, Gudavalli. 3kms from Gannavaram Airport, 150 mts from Highway Contact Owner: 9885499999

TADEPALLI

హ్యాపీక్లబ్ వెనుక, శాంతి హౌసింగ్, అమరావతి టౌన్‌షిప్, రాజధాని, చినకాకాని, కాజ రామకృష్ణ హౌసింగ్ మంగళగిరి చుట్టుప్రక్కల ప్లాట్లు అమ్మదలచిన వారు సంప్ర: ✆ 98485 87376.

GOLLAPUDI

గొల్లపూడిలో 200 చ॥గ॥, 340 చ॥గ॥, 400 చ॥గ॥, 600 చ॥గ॥ నుండి 1,000 చ॥గ॥, 1,000 చ॥గ॥ నుండి 2,000 చ॥గ॥ ప్లాట్లు మరియు 1ఎ, 2ఎ, 3ఎకరాల పొలములు అమ్మబడును, కొనబడును. ✆ 94948 81699.

SATYANARAYANAPURAM

PLOT FOR SALE IN VIJAYAWADA
Located at Ayodhya Nagar Main Road,
1542 Sq.Yards.
Ph: 9346530121

GENERAL

కానూరు నుండి కంకిపాడు మధ్యలో మీ ప్లాట్ అమ్మాలనుకుంటున్నారా (సంప్ర) ఈడుపుగల్లులో 246, 228 గజాలు లేఅవుట్ ప్లాట్స్ అమ్మకం. గజం రేటు: 14000/-. ✆ 7382422777.

అక్కినేని ప్రాపర్టీస్. బందరు రోడ్డు దగ్గర ప్రొద్దుటూరులో మరియు రాజధానిలో కంతేరు నందు CRDA ఓపెన్ ప్లాట్స్ కలవు. బ్యాంక్ లోన్ సౌకర్యం కలదు. ✆ 91545 68568.

ఏలూరు రోడ్డు ఎనికేపాడు Jeep షోరూమ్ వద్ద హైవేకి 50 మీ || దగ్గరగా W/F వెంటనే ఇంటి నిర్మాణమునకు అనువైన 45x79 కొ॥తో 395 చ॥గ॥ల లేఅవుట్ ప్లాటు అమ్మకం. ✆ 93966 16555.

పునాదిపాడు గుడివాడ రోడ్‌లో అభినందన హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో తూర్పు-ఉత్తరం కార్నర్ 355 చ॥గ॥లు ప్లాటు అమ్మకానికి కలదు. ✆ 94942 87778, 73824 22777.

VJA నున్న HP పెట్రోల్ బంకు ప్రక్కన నూజివీడు హైవేకి 3వ ప్లాట్ ఉత్తరం ఫేస్, పవర్ సప్లై, 388 గజాలు. గజం: 20,000/- మాత్రమే. గోడౌన్‌లకు/ గ్రూప్‌హౌస్‌కు ఉపయోగం. ✆ 96182 82731.

పోరంకి వెంకటాపురం కాలనీలో ప్లాటు నెం: 404 నందు 80 అ॥ రోడ్డు ఫేసింగ్‌తో 280 చ॥గ॥ల కమర్షియల్ ప్లాటు అమ్మకము. ✆ 81429 75999.

AP CRDA Approved Layout in Nuzuvidu. Plots available for sale. Contact- 7337335254.

Jangareddy Gudem Town 3200 Square Yards for Sale/ Development. Contact 7337335254.

విజయవాడ సిటీ బందర్‌రోడ్ CRDA అప్రూవ్డ్ లేఅవుట్ LP RERA ప్రీమియం ఓపెన్ విల్లాస్ ఫుల్ డెవలప్‌మెంట్ ప్లాట్స్ చ॥గ॥ ఆఫర్ రేటు 12,000/- బ్యాంక్ లోన్ & స్పాట్ రిజిస్ట్రేషన్. ✆ 7893800789.

కంకిపాడు దగ్గర,
బందరు రోడ్‌లో LAYOUT PLOTS కొన్నవారికి
1.5 TON A.C ఆఫర్
ఈ సదవకాశం దసరా వరకు మాత్రమే.
బ్యాంక్ లోన్ సౌకర్యంతో...
✆ 70950 59166

కంకిపాడు బస్టాండ్‌కు దగ్గరగా సకల సౌకర్యాలతో 80 ఎ॥ గేటెడ్ కమ్యూనిటీ నందు 54 x 37 కొలతలు గల 222 చ॥గ॥ N/W కార్నర్ స్థలం అమ్మకం. ✆ 93948 70425.

AP రాజధాని అమరావతిలో ల్యాండ్ పూలింగ్‌లో ఉన్న రెసిడెన్షియల్ & కమర్షియల్ ప్లాట్లు కొరకు సంప్రదించగలరు. ✆ 92472 41154.

విజయవాడ ఎయిర్‌పోర్టుకి 10ని॥ దూరంలో ఆత్కూరు, తెంపల్లి రోడ్డులో 100గజాల నుంచి 400 గ॥ వరకు స్థలములు కలవు. గజం ధర 4,500/- ✆ 63028 86538.

విజయవాడ, నున్న CRDA గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో క్లబ్ హౌస్ స్విమ్మింగ్ పూల్ గల ఓపెన్ ప్లాట్స్ లోన్ సౌకర్యంతో అమ్మకానికి కలవు. సంప్ర: ✆ 99123 93377.

కంచికచర్లకు అతి దగ్గర్లో చ॥గ॥ 4499/-, మరియు 6999/- మరియు గన్నవరంలో గ॥ 3200/- ఫిక్స్‌డ్ రేటు. అమరావతి దిడుగులో CRDA గ॥ 11,500/-. ✆ 72073 17577.

COMMERCIAL
Vijayawada Highway Facing
Commercial Plots 3000 Sq.yds
Near Kamineni Hospital, Narkatpally Town.
Suitable for Hotels, Petrol Pumps & Future investment.
9618918917 / 9110575797

జగ్గయ్యపేట - ముత్యాల R&B రోడ్‌లో K.అగ్రహారం శివారు రోడ్ ఫేసింగ్ గల 2,600 చ.గజాలు మరియు 870 చ.గజాలు కమర్షియల్ ప్లాట్స్ అమ్మబడును. ✆ 70936 39919.

HYD హయత్‌నగర్, కోహెడ, మజీద్‌పూర్, బాటసింగారం, పిగ్లిపురం, మల్కాపూర్, లక్కారం, గుండ్రంపల్లి, చౌటుప్పల్, జలల్‌పూర్, పోచంపల్లిలో ప్లాట్లు. అ/కొ. Ph: 9550066888

తాడిగడప 100 అ॥ రోడ్ 320 చ॥గ॥, కంకిపాడులో 194 చ॥గ॥ & సెమీ కమర్షియల్ 63 చ॥గ॥, ఈడుపుగల్లు 2 BHK ఫ్లాట్ 19.50 ల॥, పోరంకి/కానూరులలో రీసేల్ ఫ్లాట్స్ కలవు. ✆ 85018 17789.

కృష్ణా జిల్లా, కంకిపాడు, అంబులు కేశవరావు రైస్‌మిల్ బజార్, జైహింద్ వీధిలో సైట్ నెం. 50/8, 435 చ॥గ॥ స్థలం అమ్మబడును. ✆ 83096 81184, 99634 17965.

కృష్ణా జిల్లా పామర్రు, వాసవి నగర్ ఓల్డ్ ఏజ్ హోమ్ దగ్గరలో 300 చ.గ. ఓపెన్ ప్లాట్ తూర్పు ఫేసింగ్ రూ. 24,00,000/-. (8000/చ.గ.). Ph: 8008963269.

కంకిపాడు మం., కుందేరు గ్రామం శ్రీ సాహితీనగర్ లేఅవుట్ ప్లాట్ నెం. 10, 171 చ॥గ॥ (47x34) East Facing ఫ్లాట్ సేల్. Rate: 15 లక్షలు. 6301701515.

Plot for Sale. ఖాళీ స్థలం 464 చ॥గజాలు, 2nd రైట్‌కార్నర్ విజయగణపతి దేవాలయం వీధి, టెలికామ్ కాలనీ, గొరపాటి TVS సర్వీస్ సెంటర్ వెనుక, గొల్లపూడి. ✆ 7702444575.

భవానీపురం అట్కిన్‌సన్ స్కూలు 100 అడుగులు మెయిన్ రోడ్‌లో 60x30 కొలత 200 చ॥గ॥ ఈస్ట్ ఫేస్ కమర్షియల్ ప్లాట్ అమ్మబడును. గజం @ 60,000/-లు. ✆ 98858 19883.

దసరా స్పెషల్ ఆఫర్! చ.గ.13వేలు. అక్టోబర్ 6 లోపు బుక్ చేసుకున్నవారికి 2,000/- తగ్గింపు. రాజధాని, ఔటర్ రింగ్ రోడ్డును ఆనుకొని, దిడుగు, చావపాడు పరిసర ప్రాంతాలలో CRDA అప్రూవల్ ప్లాట్లు కొరకు. 94905 17066.

శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీలో 40 అడుగుల రోడ్డు తూర్పుఫేస్ 43x56= 267 చ.గ స్థలం అమ్మబడును. ✆ 94409 46827.

200గ॥ ★బిల్డింగ్ ఈడుపుగల్లు, 180గ॥ ★ గోశాల, పటమట 600గ॥, కామినేని రోడ్‌లో 200, 500గ॥, పోరంకి 400గ॥, మొగల్రాజపురం 600గ॥, కరెన్సీనగర్ 500గ॥, ప్లాట్స్ సేల్‌కు. ✆ 93928 18189.

గుడివాడ బైపాస్ రోడ్డులో స్కంధా అపార్ట్‌మెంట్స్ పక్కన తూ/ద రోడ్డు 264 చ॥గ॥ స్థలం అమ్మకానికి కలదు. ✆ 99663 60356.

కస్తూరిబాయిపేటలో 530 గ॥జ, గురునానక్ కాలనీలో 480 గ॥జ, తాడిగడపలో 302 గ॥జ, రామవరప్పాడు ఇన్నోటెల్ దగ్గర 237 గ॥జ, ముస్తాబాద్ రోడ్‌లో 1400 గ॥జ అమ్మకం. Singh ✆ 92464 12213.

బందరురోడ్డు కంకిపాడు టోల్‌గేట్ వద్ద E/F 200గ॥ గాయత్రి విహార్‌లో E/F - 225 గ॥ పునాదిపాడు జంక్షన్‌లో E/F 228 చ॥గ॥లు అమ్మకం. ✆ 99851 51976, 98482 87696.

COMMERCIAL SPACE FOR SALE

HUGE parking land with compound wall, water facility 5.5 acres for lease. Near bandar road at konthanapadu village kankipadu for reputed companies and insurance companies available. 83093 27118.

VJA-GNT కాజా టోల్ ప్లాజా దగ్గర రామకృష్ణ హౌసింగ్ IT టవర్స్‌లో కమర్షియల్ స్పేస్, 31 ఫ్లోర్స్ అపార్ట్‌మెంట్ లో ఫ్లాట్స్ అమ్మకం సంప్ర: ✆ 70937 56789.

LEASE/ RENT

NH65 గన్నవరం హనుమాన్‌జంక్షన్ మధ్య హైవే ఫేసింగ్ య.1.30 సెంట్లు భూమి అద్దెకు / లీజుకు కలదు. ✆ 98481 53136.

స్కూల్ & కాలేజీ బిల్డింగ్ లీజుకు
గుంటూరుకు అత్యంత చేరువలో నూతనంగా CBSE స్కూల్ మరియు కాలేజీల కొరకు, అన్ని రకముల అనుమతులకు అనుగుణంగా నిర్మించిన భవనములు (55,000 చదరపు అడుగులు) అన్ని సదుపాయాలతో 5 ఎకరాల విస్తీర్ణంలో లీజుకు ఇవ్వబడును.
☎ : వివరాలకు : ☎
94408 40509
93478 76171
94948 05749

LEASE/ SALE

GOLLAPUDI

గొల్లపూడి ఒన్ (1) సెంటర్‌లో పుల్లీ ఫర్నిష్డ్ 3 BHK అపార్ట్‌మెంట్ ఫ్లాట్ అమ్మకం/ అద్దెకు/ లీజుకు ఇవ్వబడును. ✆ కాంటాక్ట్ సెల్: 83099 13134.

GENERAL

2000 Sq. Ft . Commercial Space for Super Market Cum Coffee Shop Available at Premium gated Community in Prime Location at Vijayawada Cont. ✆ 86391 23768, 92475 52748.

TO LET

3BHK for Rent Abhinav Enclave Ballem Vari Street, Ramavarappadu. Lift, Generator, Car Parking Available. Employees Preferred. ✆ 98480 75914, 99120 25496.

West Facing, 2nd Floor, 3 Rooms Portion Near Nalanda School, Acharya Ranga Nagar, for student or Couple for rent. Cont. ✆ 99852 95566.

2 B/R Flat అద్దెకు. ఏలూరు రోడ్ మల్లెల శ్రీరామమూర్తి వీధి, శ్రీ విఘ్నేశ్వర నిలయంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో 2 B/R Flat 1100 Sft. East face, కారు పార్కింగ్‌తో అద్దెకు. ✆ 92464 12441.

కామయ్యతోపు సెంటర్, కానూరు ఆర్చ్ ప్రక్కన, తాళ్ళ రోశయ్యగారి రోడ్‌లో VBR టవర్స్‌నందు 4th ఫ్లోర్‌లో W/F, 3 BHK ఫ్లాట్ అన్ని సౌకర్యములతో అద్దెకు కలదు. ✆ 88864 63083.

విజయవాడ ఏలూరు రోడ్ కొత్తవంతెన దగ్గరలో కాట్రగడ్డ రాజగోపాలరావు వీధి నందు 3BHK 2,350 S.Ft. ఇండివిడ్యువల్ 1st ఫ్లోర్ అద్దెకు కలదు. ✆ 98480 24011.

3 BHK, 1600sft, 1st Floor Apt, Bhaskara Residency. Near Eenadu, Benzcircle. Rent: 24000/-. Ph: 8333807359

4th Main Road Plot No: 3 Film Colony 3BHK Indipendent House for Rent Jayaprakash nagar, Vijayawada. Cont: ✆ 94419 29136.

3 BHK E/F Super Deluxe Indipendent house 2200 Sq.Ft. 2nd floor with car parking. No lift. Durgapuram, Vza-3. Ph: 98490 74328.

3 Bedroom Flat No: 404 in RR Residency at Nara Chandrababu Naidu Street, Adj. to Benz Circle Admuesring 1440 Sqf. ✆ 98482 82749.

హాస్టల్ 1st & 2nd ఫ్లోర్స్ 12 బెడ్ రూమ్స్ + బాత్‌రూమ్స్ 2nd ఫ్లోర్ 2600 S.Ft., + పార్కింగ్. బ్యాంక్స్, ఆఫీసు, ఇన్‌స్టిట్యూట్స్. చుట్టుగుంట, VJA ✆ 94905 11849.

4B/R Flat, అద్దెకు. పటమట, గణపతి సచ్చిదానంద ఆశ్రమం రోడ్, పద్మజ అపార్ట్‌మెంట్‌లో 4B/R ఫ్లాట్, 401, కార్ పార్కింగ్‌తో అద్దెకు. ✆ 96764 00122.

విజయవాడ గొల్లపూడి అయ్యప్పస్వామి గుడి సందులో లక్ష్మీదుర్గా నిలయంలో 3 బెడ్‌రూం పోర్షన్ అన్ని సౌకర్యములతో అద్దెకు కలదు. వివరములకు ✆ 99893 97979 సంప్రదించగలరు.

3BHK ఫ్లాట్ అద్దెకు
2100 Sq.Ft VJA
బందరురోడ్డు అయ్యప్పనగర్ గొట్టిపాటి బ్రహ్మయ్య వీధిలో లిఫ్ట్, కార్ పార్కింగ్‌తో
✆ 99518 09418

విజయవాడ ప్రైమ్ ఏరియాలో మెయిన్ రోడ్డుకు దగ్గరలో 600 చదరపు గజాల స్థలం లీజుకు కావలెను. Ph: 9010757776

విజయవాడ లయోల కాలేజ్ మెయిన్ గేట్ దగ్గర, వెంకటేశ్వరపురం 6th రోడ్, ప్లాట్‌నెం. 62, ఇండిపెండెంట్ హౌస్, 2nd ఫ్లోర్‌లో 3 B/R హౌస్ ఆఫీసులకు/రెసిడెన్సీలకు అద్దెకు కలదు. లిఫ్ట్ లేదు. ✆ 98666 12344.

పటమట గణపతి ఆశ్రమం రోడ్డులో అపార్ట్‌మెంట్ 4th ఫ్లోర్ నందు 4 BHK ఫ్లాట్ లిఫ్ట్, కార్ పార్కింగ్‌తో మొ॥ సౌకర్యలతో అద్దెకు కలదు. ✆ 98662 13067, 96764 00122.

కానూరు PVP సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజి వెనుక తిరుమల క్యాస్టిల్ 2nd ఫ్లోర్ 2 BHK ఫ్లాట్ అన్ని సౌకర్యాలతో అద్దెకు కలదు. ✆ 92462 94997, 92907 26757.

విజయవాడ మధురానగర్ నేతాజీ రోడ్ 4 క్రాస్ రోడ్ P.V.సుబ్బారావు స్ట్రీట్ D.No.21-11-32/8లో 2nd ఫ్లోర్ 2BHK ఇండిపెండెంట్ హౌస్ ఫ్యామిలీ/ బ్యాచిలర్స్‌కు అద్దెకు ✆ 94409 44522.

COMMERCIAL

విజయవాడ బందరురోడ్డు అశోక్‌నగర్ సుజుకీ షోరూమ్ ఎదురుగా 2200 S.Ft. గల గోడౌన్ అద్దెకు ఇవ్వబడును. ✆ 90009 43802, 90144 34951.

విజయవాడ ఏలూరు రోడ్ కొత్తవంతెన దగ్గర 2,000 S.Ft. గోడౌను అద్దెకు కలదు. ✆ 92473 64441, 92477 45962.

700 S.Ft, 2nd Floor East Facing Beside Minerva Grand, Mogalrajpuram, Vijayawada. for Rent. ✆ 92480 44455/ 56

Commercial Space E/F 5,400 S.Ft. Near Swathi Theatre, Bhavanipuram, VJA-12. For Rent/ Long Lease. Useful for Commercial/ Well Established Companies/ Organisations. Contact ✆ 92464 94499.

VJA, గవర్నరుపేటలో 3BHK (4వ ఫ్లోర్) & 2,000 S.Ft ., గ్రౌండ్ ఫ్లోర్‌లో & లబ్బీపేట, బందరురోడ్డు దగ్గరలో గ్రౌండ్, I & II nd ఫ్లోర్స్ (500 S.Ft each) ఆఫీస్ / రెసిడెన్స్‌కు అద్దెకు కలదు. ✆ 94909 15637.

గోడౌన్ అద్దెకు కలదు
6400 చ॥అడుగులు కలిగిన (East Facing) గోడౌన్ అద్దెకు ఇవ్వబడును. సూరంపల్లి, నూజివీడు రోడ్, రామవరప్పాడు రింగ్ 5KM మరియు న్యూ బైపాస్‌కి 1KM దగ్గరలో.
✆ 89776 19938

నున్న నూజివీడు రోడ్డులో సాయిబాబా గుడి ప్రక్కన 3,500 చ॥అ॥ గోడౌన్‌కి అద్దెకు ఇవ్వబడును. ✆ 98481 53136.

కంచికచర్ల చింతానగర్‌లో 65x48 కొ॥లతో 3120 S.Ft. గోడౌన్ అద్దెకు కలదు. Cont: ✆ 94907 43320, 98663 07949.

విజయవాడ, MG రోడ్, లబ్బీపేట ఏరియాలో 4th Floor నందు 3,200 S.Ft కమర్షియల్ స్పేస్ ఆఫీసులకు అద్దెకు ఇవ్వబడును. ✆ 77992 81234.

ఆటోనగర్ గేటు ఎదురుగా న్యూ RTC కాలనీ బందరు రోడ్డుకి 4వ బిల్డింగ్ 1600 S.Ft. గల గ్రౌండ్ ఫ్లోరు గోడౌన్/ ఆఫీస్/ కమర్షియల్‌గా అద్దెకు ఇవ్వబడును. ✆ 88976 49047.

MORE CLASSIFIEDS ON PAGES 9

గుండె వ్యాధులకు.. ఏఐతో చికిత్స





- ఆకస్మికంగా వచ్చే ముప్పును ముందే గుర్తించగలం
- మొదటి గంటలో ఆసుపత్రికొస్తే.. ప్రాణాలు నిలపొచ్చు
- ప్రముఖ హృద్రోగ వైద్య నిపుణులు డాక్టర్ పోతినేని రమేష్‌బాబు

ఈనాడు, అమరావతి



ప్రస్తుతం గుండె సంబంధిత వ్యాధుల వల్లే వచ్చే మరణాలను కృత్రిమ మేధ(ఏఐ) సహకారంతో 80 శాతం నివారించవచ్చని. . ప్రముఖ హృద్రోగ వైద్య నిపుణులు, ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ చీఫ్ ఇంటర్‌వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పోతినేని రమేష్ బాబు వెల్లడించారు. గత 70 ఏళ్లలో గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించిన అధ్యయనాల్లో ఎంత ప్రగతిని సాధించగలిగామో.. దానికి రెట్టింపు స్థాయిలో కొవిడ్ తర్వాత ఈ మూడు నాలుగేళ్లలో సాధించామని తెలిపారు. ప్రధానంగా ఏఐ సహకారంతో అధునాతన పద్ధతుల్లో గుండె సంబంధిత వ్యాధులను గుర్తించే సాంకేతికత ప్రస్తుతం అందుబాటులోకి రావడం మానవాళికి వరంగానే భావించాలన్నారు. ముందస్తుగా గుండె వ్యాధుల నిర్ధరణ, సరైన వైద్యం అందించడం, ఆసుపత్రుల్లో సంభవించే ఆకస్మిక గుండెపోటు మరణాల (ఐఎన్‌ఎస్‌సీఏ)ను అరికట్టడం సహా అనేక ప్రయోజనాలు ఏఐ వల్ల ప్రస్తుతం కలుగుతున్నాయని తెలిపారు. గత నాలుగైదు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న అనేక సవాళ్లకు ప్రస్తుతం పరిష్కారం దొరికిందని వెల్లడించారు. 'వరల్డ్ హార్ట్ డే' సందర్భంగా గుండె వ్యాధుల ముప్పును అరికట్టేందుకు ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన ఆధునిక వైద్యవిధానాలపై 'ఈనాడు' ముఖాముఖిలో డాక్టర్ రమేష్ బాబు మాట్లాడారు. ఎలాంటి ముందస్తు లక్షణాలు కనిపించకుండా ముంచుకొచ్చే గుండెపోటు ముప్పును అరికట్టేందుకు ఏఐ ఎంతో దోహదపడుతోందని వివరించారు. ప్రస్తుతం బిగ్‌డేటా ఎనలటిక్స్, డీప్ లెర్నింగ్, కన్వల్యూటెడ్ న్యూరల్ నెట్‌వర్క్ లాంటి వాటిని ఉపయోగించి... ఒక వ్యక్తికి దేనివల్ల గుండెపోటు వచ్చిందనేది అత్యంత తేలికగా గుర్తించగలుగుతామన్నారు.

బ్లాకులోని కొవ్వు శాతం వల్లే గుండెపోటు..

ఒక రోగికి పరీక్షలో రెండు లేదా మూడు బ్లాకులు ఉన్నట్టు గుర్తించాక.. అతనికి ఏ రకమైన వైద్యం అందించాలనే విషయంలో వైద్య నిపుణుల మధ్య విపరీతమైన భేదాభిప్రాయాలు ఉండేవి. స్టంట్లు వేయాలా, మందులు వాడాలా, శస్త్రచికిత్స చేయాలా.. అనేది తేల్చుకోలేని పరిస్థితి. రక్తనాళంలో 70 నుంచి 80 శాతం బ్లాక్ ఉంటేనే గుండెపోటు వస్తుందనే అపోహ గతంలో ఉండేది. కానీ.. ప్రస్తుతం వెలుగుచూసిన వాస్తవాలు అందరి అంచనాలనూ తారుమారు చేశాయి. 50 శాతం... అంతకంటే తక్కువ బ్లాకు ఉన్న వారిలోనే అత్యధికంగా గుండెపోటు ముప్పు ఉంటోంది. తాజాగా ఏఐ ద్వారా దీనికి అసలు సమస్య ఏంటనేది బయటపడింది. సిటి ఎఫ్‌ఎఫ్ఆర్, సిటి బ్లాక్ మార్ఫాలజీ పద్ధతుల్లో ఏఐ ఆధారంగా పరిశీలించగా అసలు వాస్తవాలు వెలుగుచూశాయి. రక్తనాళంలో ఏర్పడిన బ్లాక్‌లో కొవ్వు శాతం, కాల్షియం, ఫైబర్.. ఏవి ఎక్కువ ఉన్నాయనేది గుర్తించగలుగుతున్నాం. బ్లాక్ ఎంత పరిమాణంలో ఉందనే దానితో సంబంధం లేకుండా.. దానిలో కొవ్వు, కాల్షియం, ఫైబర్.. ఎంత శాతం ఉన్నాయనే ఆధారంగా గుండెపోటు వస్తోందని తేలింది. బ్లాక్‌లో కొవ్వు శాతం ఎంత ఎక్కువ ఉంటే.. అంత ప్రమాదం ఉందని గుర్తించగలిగాం. బ్లాక్ 80శాతం ఉన్నా.. దానిలో కొవ్వు తక్కువ ఉండి.. ఫైబర్ ఎక్కువ ఉంటే అంత ప్రమాదం కాదు. బ్లాక్‌లో ఉండే కొవ్వు శాతం వల్లే.. అది చిట్లి.. రక్తనాళాన్ని పూర్తిగా మూసేసి గుండెపోటుకు కారణం అవుతోంది.



గోల్డెన్ అవర్ చాలా కీలకం..

గుండెపోటుకు గురైన వారిని గోల్డెన్ అవర్(మొదటి గంట)లో ఆసుపత్రికి తెస్తే.. 98 శాతం మందిని రక్షించొచ్చు.కానీ.. చాలామంది చదువుకున్న వాళ్లు కూడా గుండెల్లో నొప్పి వచ్చినా. . గ్యాస్, కండరాల నొప్పి అనుకుని ఆసుపత్రికి వెళ్లకుండా ఆలస్యం చేస్తున్నారు. వెంటనే ఆసుపత్రికి తీసుకొస్తే.. రక్తం కరిగించే ఇంజక్షన్లు ఇవ్వడం, ఎమర్జెన్సీ స్టంట్లు వేయడం, బైపాస్‌లు చేయడం లాంటివి.. చేసి ప్రాణాపాయాన్ని తప్పించగలం.



ఆసుపత్రిలో సంభవించే మరణాలకూ అడ్డుకట్ట..

ఆసుపత్రిలో చేరిన తర్వాత అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించడం (ఐఎన్‌ఎస్‌సీఏ) ఎందుకు జరుగుతోందనేది తెలిసేది కాదు. కారణాలు గుర్తిస్తే ఐఎన్‌ఎస్‌సీఏ మరణాలు 40 శాతం నివారించదగినవే. అప్పటి వరకూ బాగున్న రోగి.. అకస్మాత్తుగా చనిపోవడం ఏంటనేది అర్థమయ్యేది కాదు. కానీ.. ప్రస్తుతం ఏఐ ద్వారా దీనికి పరిష్కారం దొరికింది. ఆసుపత్రిలో ఉన్న రోగికి సంబంధించిన హార్ట్‌రేటు, శ్వాస, రక్తపోటు పెరగడం లాంటి పది రకాల లక్షణాల ఆధారంగా.. వారికి ఆకస్మిక గుండెపోటు వస్తుందా.. రాదా.. అనేది ఏఐ ద్వారా ముందుగానే కనిపెడుతున్నాం. ముందే అప్రమత్తమై.. వైద్యం అందించి ప్రాణాలు కాపాడుతున్నాం.



లక్షణాలు కనిపించని ముప్పును కనిపెట్టొచ్చు..

ఎలాంటి వ్యాధి లక్షణాలు కనిపించకుండా ఆకస్మికంగా వచ్చే గుండె ముప్పును గుర్తించడం ఆధునిక సాంకేతికతతో ప్రస్తుతం తేలికగా మారింది. మన దేశంలో 45 ఏళ్లు దాటి, ఆరోగ్యంగా కనిపించే ప్రతి వంద మందిలో బయటకు ఎలాంటి లక్షణాలు కనిపించకుండా గుండె సంబంధిత సమస్యలు ఉంటున్న వారు కనీసం 50 మంది ఉంటున్నారు. వీరిలో వ్యాధి ముప్పును నిర్ధరించడానికి రోగికి సంబంధించిన చరిత్ర, వ్యాధి లక్షణాలు, ఈసీజీ, కలర్‌డోప్లర్ స్కానింగ్, స్ట్రెస్ టెస్ట్.. లాంటి పద్ధతులనే గత నాలుగు దశాబ్దాలుగా అనుసరిస్తున్నాం. కానీ.. వీటిలో ఫలితాలు ఎక్కువసార్లు తప్పుగా రావడంతో వ్యాధి నిర్ధరణ సరిగా జరిగేది కాదు. ప్రస్తుతం ఒక వ్యక్తిలో గుండె జబ్బు ఉందో లేదో కనుగొనేందుకు కాల్షియం స్కోర్, సిటి కరోనరీ యాంజియోగ్రామ్.. పరీక్షలు సరైనవని ప్రపంచం అంతా గుర్తించింది. ఈ పరీక్షల ద్వారా.. వంద శాతం పక్కాగా వ్యాధి నిర్ధరణ చేయొచ్చు.



ఘంటసాల విగ్రహ ఏర్పాటుకు విజ్ఞప్తి



మంత్రి దుర్గేష్‌కు వినతి పత్రం ఇస్తున్న ప్రతినిధులు

గాంధీనగర్, న్యూస్‌టుడే : రాజధాని అమరావతిలో 25 అడుగుల ఘంటసాల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఘంటసాల విగ్రహ సాధన సమితి అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి కోరారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్ మాదిరిగా కృష్ణా నదిపై ఇరువైపులా తెలుగు జాతి మహనీయులు, స్వాతంత్ర్య సమరయోధులు, కవుల విగ్రహాలు నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. నటరత్న ఎన్టీ రామారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించేలా చొరవ తీసుకోవాలని కోరారు. అక్టోబరులో విజయవాడలో నిర్వహించే రాష్ట్ర సదస్సుకు హాజరుకావాలని కమిటీ కార్యదర్శి చింతకాయల చిట్టిబాబు మంత్రిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ది చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభం

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : విజయవాడ ఎంజీ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ది చెన్నయ్ షాపింగ్ మాల్‌ను హీరోయిన్ శ్రీలీల శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నాణ్యమైన, ఆకర్షణీయమైన, సరికొత్త వస్త్రాలు అందిస్తూ ది చెన్నయ్ షాపింగ్ మాల్ వినియోగదారుల ఆదరణ, నమ్మకాన్ని పొందుతోందని అన్నారు. మా అమ్మకు పట్టు చీరలంటే ఇష్టమని, అందుకే తాను అవి కట్టుకుంటానని తెలిపారు. రవితేజతో తన కొత్త సినిమా ప్రారంభం కానుందని, తమిళం, కన్నడ భాషల్లో కూడా నటించనున్నట్లు వెల్లడించారు. మంత్రి కొలుసు పార్థసారధి, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ. . చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని శుభపరిణామాలే చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి షోరూమ్‌లు రావడం వల్ల యువతకు ఉపాధి దొరుకుతుందని తెలిపారు. షాపింగ్ మాల్ అధినేతలు జనార్దన్‌రెడ్డి, వెంకటరెడ్డి, జమున మాట్లాడుతూ... ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 19 షాపింగ్ మాల్స్ ప్రారంభించామని, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా వస్త్రాలు నేయిస్తున్నామన్నారు. అన్ని వర్గాలకు అందుబాటు ధరల్లో వస్త్రాలు ఉంటాయని తెలిపారు.



జ్యోతి వెలిగిస్తున్న నటి శ్రీలీల



అభిమానుల సందడి

జాషువా మార్గం... అందరికీ అనుసరణీయం



కళాకారులతో మంత్రి దుర్గేశ్, కలెక్టర్ సృజన తదితరులు

ఈనాడు డిజిటల్- అమరావతి: సాహిత్యంతో సమాజంలోని రుగ్మతలను ఎదిరించిన విశ్వమానవుడు గుర్రం జాషువా అని మంత్రి కందుల దుర్గేశ్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో గుర్రం జాషువా 129వ జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. సామాజిక ప్రయోజనాలకు పెద్దపీట వేసి.. సాహిత్య ప్రక్రియను సుసంపన్నం చేసిన జాషువా మార్గం అందరికీ అనుసరణీయం అన్నారు. నాడు ఆలయాల్లో ఎస్సీలను అనుమతించకపోవడంతో వారణాసి విశ్వనాథుడికి 'గబ్బిలం' ద్వారా తన ఆవేదనను... సందేశం రూపంలో నివేదించిన ఆధునిక కవి జాషువా అని తెలిపారు. గబ్బిలం అనే కావ్యంలో నాటి దురాచారాలను ఎండగట్టారన్నారు. కాటికి వెళ్లాక పెద్ద.. చిన్న అనే కులాల తేడా లేదని... పేద, ధనిక అనే తారతమ్యం ఉండదని.. అందరూ సమానమే భావనను కలిగించారని వెల్లడించారు. తన ఆత్మసంతృప్తి కోసమో.. రచనలపై మక్కువతోనో ఆయన కావ్యాలు రాయలేదనీ.. సమాజ శ్రేయస్సు కోసమే సాహిత్య బాట పట్టారని గుర్తుచేశారు. 1964లో శాసనమండలి సభ్యుడిగా ఎన్నికైన జాషువా తన లాంటి ఎందరికో మార్గదర్శకులన్నారు. ఆయన జయంతిని జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో సాంస్కృతిక వారసత్వ కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు.

కళాకారులకు ప్రోత్సాహం.. జాషువా జయంతి సందర్భంగా కవి కోకిల పురస్కారం-2024కు భాషా సాంస్కృతిక శాఖ ఎంపికైన సంజీవరావు (శిఖామణి), దుగ్గినపల్లి ఎజ్రా శాస్త్రి, టి.వరప్రసాద్, పి.రమణయ్యలకు జ్ఞాపికలతో పాటు ఒక్కొక్కరికి రూ.50 వేలు చెక్కులను మంత్రి అందజేశారు. కవులు కళాకారులను భుజం తట్టి ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ వెన్నంటే ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం కవి సంచిక మాసపత్రిక... 50వ సంచికను ఆవిష్కరించారు. కళాకారులు గీసిన జాషువా చిత్రపటాల ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి వాడ్రెవు వినయ్‌చంద్, కలెక్టర్ సృజన, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు ఎ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు వరుణ్ గ్రూప్ అండ

525 మందికి రూ.కోటి అందజేత



చెక్కు అందజేస్తున్న మంత్రి మనోహర్, ఎమ్మెల్యేలు రామ్మోహన్, ఉమా, ప్రతినిధులు ప్రభు కిశోర్, వరుణ్ తదితరులు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: వరద విపత్తు సమయంలో సీఎం చంద్రబాబు పాలన దక్షత బహిర్గతమైందని, బాధితులను బాసటగా నిలిచారని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. విజయవాడ నోవోటెల్ హోటల్‌లో శనివారం వరుణ్ గ్రూప్ వరద బాధిత ఉద్యోగులు 525 మందికి సంస్థ అండగా నిలిచింది. రూ.కోటి చెక్కు ఉద్యోగులకు అందజేసింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విపత్తు జరిగిన 12 రోజుల్లోనే ఆఖరి బాధితుడికి సాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. శాసనసభ్యుడు బొండా ఉమా మాట్లాడుతూ... ముంపు పోయే వరకు చంద్రబాబు కలెక్టరేట్‌లో ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించి బాధితులకు భరోసాగా నిలిచారని పేర్కొన్నారు. మొదటి అంతస్తులో బాధితులకు రూ.25 వేలు నష్ట పరిహారం ఇవ్వడం చరిత్రలో మొదటిసారని అన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ.. ఒకే రోజు 36 సెం.మీ. వర్షం విజయవాడలో మొదటిసారి కురిసిందని, 2014లో అప్పటి సీఎం చంద్రబాబు చొరవతో 60 శాతం కృష్ణా రక్షణ గోడ కట్టడంతో కృష్ణలంకకు ముంపు తప్పిందన్నారు. సీపీ ఎస్.వి.రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ.. వరుణ్ గ్రూప్ స్ఫూర్తితో ముంపుతో అవస్థలు పడిన పోలీసులు, హోంగార్డుల కుటుంబాలకు సాయం చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. వరుణ్ గ్రూప్ ఛైర్మన్ ప్రభు కిశోర్ మాట్లాడుతూ... తమ ఉద్యోగులకు కష్టకాలంలో సంస్థ ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని స్పష్టం చేశారు. మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌దేవ్, జేఎండీ వర్ష, డైరెక్టర్ లక్ష్మీకిశోర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యనారాయణ, ఆర్.సి.రాజు, సీఈవో అనూరాధ, గిరి, జనరల్ మేనేజర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.



రెండో రోజు ఆట వర్షార్పణం

ఒక్క బంతీ పడకుండానే..

కాన్పూర్

భారత్, బంగ్లాదేశ్ మధ్య రెండో టెస్టును వర్షం వెంటాడుతూనే ఉంది. గ్రీన్‌పార్క్ స్టేడియంలో ఒక్క బంతి పడకుండానే రెండో రోజు ఆట రద్దయింది. శనివారం ఉదయం జల్లులుగా మొదలైన వాన.. క్రమంగా పెద్దదైంది. ఉదయం 11 గంటల సమయంలో వర్షం తగ్గగా.. గ్రౌండ్స్‌మెన్ మూడు సూపర్ సాపర్స్ వినియోగించారు. వెలుతురు కూడా తగినంత లేదు. పరిస్థితులు మెరుగుపడక పోవడంతో మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఆటను అధికారికంగా రద్దు చేశారు. ఆదివారం కూడా వర్షం ముప్పు ఉంది.. సోమ, మంగళవారాలు ఎండ కాస్తుంది. మ్యాచ్ డ్రా దిశగా సాగుతున్నట్లే. తొలి రోజు వాన వల్ల కేవలం 35 ఓవర్ల ఆటే సాధ్యం కాగా.. బంగ్లాదేశ్ 107/3తో నిలిచింది. ఆకాశ్‌దీప్ రెండు వికెట్లు పడగొట్టాడు. చెన్నైలో జరిగిన మొదటి టెస్టులో గెలిచిన టీమ్‌ఇండియా.. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉంది.

మ్యాచ్ తుడిచిపెట్టుకుపోతే..: వర్షం వల్ల రెండో టెస్టు తొలి రెండు రోజుల్లో 35 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. ఆదివారం కూడా వర్షం కురిసే అవకాశముంది. అయితే అంతరాయం కలగొచ్చు కానీ.. రోజు మొత్తం తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం లేదు. చివరి రెండు రోజులు పూర్తిగా ఆట సాగొచ్చు. కానీ ఇప్పటికే చాలా సమయం వృథా అయిన నేపథ్యంలో మ్యాచ్ డ్రా అయ్యే అవకాశాలే మెండు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో టీమ్‌ఇండియా ఇప్పటివరకు 10 మ్యాచ్‌ల్లో ఏడు విజయాలు సాధించింది. ప్రస్తుతం 71.67 గెలుపు శాతంతో అగ్రస్థానంలో ఉంది. బంగ్లాను 2-0తో క్లీన్‌స్వీప్ చేస్తే ఫైనల్ అవకాశాలు మరింత బలపడేవి. మిగతా ఎనిమిది మ్యాచ్‌ల్లో మూడు గెలిస్తే సరిపోయేది. కానీ డ్రాతో రోహిత్‌సేన సమీకరణం కాస్త కష్టంగా మారింది. సమీకరణాలతో ఇబ్బంది లేకుండా భారత్ నేరుగా ఫైనల్ చేరాలంటే సొంతగడ్డపై మూడు టెస్టుల సిరీస్‌లో న్యూజిలాండ్‌ను క్లీన్‌స్వీప్ చేయడమే కాకుండా.. బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో ఆస్ట్రేలియాపై కనీసం రెండు టెస్టుల్లో నెగ్గాలి.

ఛాంపియన్

క్రికెట్ క్షేత్రంలో అది ఓ చిన్న రాజ్యం. అందులోంచి ఒకప్పుడు కొందరు యోధులు పుట్టుకొచ్చారు. యుద్ధ రంగంలో మహామహులను ఢీకొట్టి గెలిచారు. చిన్న రాజ్యమైనా దాన్ని చూసి పెద్ద సామ్రాజ్యాలు కూడా కంగారు పడ్డాయి. కానీ ఆ యోధుల నిష్క్రమణ తర్వాత ఆ రాజ్యం ప్రభ కోల్పోయింది. కాల క్రమంలో దాని ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. కానీ ఇప్పుడు అక్కడి నుంచే ఓ కొత్త వీరుడు దూసుకొచ్చాడు. కదన రంగంలో అసామాన్య విన్యాసాలతో శత్రువులపై పైచేయి సాధిస్తున్నాడు. కళ తప్పిన తన రాజ్యంలో మళ్లీ కాంతులు నింపుతున్నాడు. క్రికెట్ క్షేత్రంలో వైభవం నుంచి పతనం వైపు అడుగులేస్తున్న ఆ రాజ్యం శ్రీలంక అయితే.. దాన్ని మళ్లీ సగర్వంగా నిలబెట్టే ప్రయత్నం చేస్తున్న కొత్త యోధుడు కమిందు మెండిస్.


అనగనగా ఓ ధీరుడు

ఫోర్త్ అంపైర్

అండర్‌డాగ్‌గా మొదలుపెట్టి అసామాన్య ప్రదర్శనతో 1996 వన్డే ప్రపంచకప్‌లో శ్రీలంక విజేతగా నిలవడం అప్పట్లో పెను సంచలనం. అప్పట్నుంచి ఓ రెండు దశాబ్దాల పాటు ప్రపంచ క్రికెట్లో తన ఆధిపత్యాన్ని చాటింది లంక. ఇంకో రెండు పర్యాయాలు వన్డే ప్రపంచకప్ ఫైనల్ చేరింది. 2014లో టీ20 ప్రపంచకప్‌నూ సొంతం చేసుకుంది. టెస్టు క్రికెట్లోనూ ఎన్నో గొప్ప విజయాలు సాధించింది. జయసూర్య, మురళీధరన్, చమిందా వాస్, మహేల జయవర్ధనె, కుమార సంగక్కర లాంటి మేటి ఆటగాళ్లు ప్రపంచ క్రికెట్లో లంకను అత్యున్నత స్థాయిలో నిలబెట్టారు. కానీ వీరిలో ఒక్కొక్కరుగా ఆట నుంచి నిష్క్రమిస్తున్న కొద్దీ లంక బలహీనపడింది. కొంత విరామంలో మహేల, సంగక్కర ఆటకు గుడ్‌బై చెప్పాక లంక కుదేలైపోయింది. సచిన్ తరం దిగ్గజాల నిష్క్రమణ తర్వాత భారత్ కూడా ఇబ్బంది పడింది. కానీ ధోని నాయకత్వంలో సంధి దశను అధిగమించి మళ్లీ మేటి జట్టుగా ఎదిగింది. ఆస్ట్రేలియా సైతం ఇలా ఇబ్బంది పడి పుంజుకున్న జట్టే. కానీ లంక మాత్రం దిగ్గజాల నిష్క్రమణతో ఏర్పడిన లోటును పూడ్చుకోలేకపోయింది. యువ ఆటగాళ్లలో ఎవ్వరూ ముందు తరం మేటి ఆటగాళ్లు నెలకొల్పిన ప్రమాణాలను అందుకోలేకపోయారు. కుశాల్ మెండిస్ లాంటి ప్రతిభావంతులు వెలుగులోకి వచ్చినా.. వారిని సరిగా తీర్చిదిద్దలేకపోయారు. రాజకీయ జోక్యం సహా కొన్ని కారణాలతో శ్రీలంక క్రికెట్ వ్యవస్థ గాడి తప్పడం, జట్టులో వాతావరణం దెబ్బ తినడం కూడా ఇందుకు కారణాలే. వెస్టిండీస్ లాగే వైభవం కోల్పోయి చిన్న జట్లలో ఒకటిగా మారే ప్రమాదాన్ని ఎదుర్కొందా జట్టు. పెద్ద జట్ల మీద గెలిస్తే దాన్నో సంచలనంగా భావించే పరిస్థితి. అసలే లంక జట్టు పరిస్థితి అంతంతమాత్రంగా ఉంటే.. దేశం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోవడం లంక క్రికెట్‌ను అశనిపాతంలా తాకింది. ప్రమాణాలు ఇంకా పడిపోయాయి. ప్రపంచ క్రికెట్లో లంక ఓ పసికూనలా మారిపోయింది. ప్రత్యర్థి జట్లు లంకను తేలిగ్గా తీసుకోవడం మొదలుపెట్టాయి. ఇలాంటి సమయంలో లంక క్రికెట్‌ను ఆదుకోవడానికి నేనున్నానంటూ దూసుకొచ్చాడు కమిందు మెండిస్.

ఆడింది కేవలం ఎనిమిది టెస్టులు. అప్పుడే కమిందు పరుగులు వెయ్యి దాటిపోయాయి. అత్యంత వేగంగా ఈ మైలురాయిని చేరుకున్న ఆటగాళ్లలో డాన్ బ్రాడ్‌మన్ లాంటి దిగ్గజం సరసన చేరాడు. దశాబ్దాల కిందటి రికార్డులను ఇప్పుడు ఓ యువ ఆటగాడు అందుకోవడం అంటే మామూలు విషయం కాదు. కమిందు సగటు వందకు చేరువగా ఉండడం విశేషం. 147 ఏళ్ల టెస్టు క్రికెట్ చరిత్రలో అరగేట్రం నుంచి వరుసగా ఎనిమిది టెస్టుల్లోనూ 50+ స్కోర్లు సాధించిన తొలి ఆటగాడిగా కమిందు రికార్డు సృష్టించాడు. అతడి ప్రదర్శనను గాలివాటంగానో, ఆరంభ శూరత్వంగానో భావించి తేలిగ్గా తీసుకోవడానికి వీల్లేదు. తన ఆట చూస్తే ఆ భావన ఎంతమాత్రం కలగదు. తన తొలి టెస్టు ఇన్నింగ్స్‌లోనే ఆస్ట్రేలియాపై 61 పరుగులు చేశాడు. ఆపై బంగ్లాదేశ్‌లో తన రెండో టెస్టులోనే రెండు ఇన్నింగ్స్‌ల్లో సెంచరీలు (102, 164) బాదేశాడు. తర్వాతి సిరీస్‌ను ఇంగ్లాండ్‌లో ఆడుతూ మరో శతకం (113) సాధించాడు. ఇప్పుడు సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో వరుసగా రెండు టెస్టుల్లోనూ సెంచరీలు (114, 182 నాటౌట్) కొట్టాడు. భిన్న పరిస్థితుల్లో, భిన్న జట్లపై నాణ్యమైన బౌలర్లను ఎదుర్కొంటూ సాధించిన అతడి ప్రతి ఇన్నింగ్స్ విలువైందే.

25 ఏళ్ల ఈ ఎడమచేతి వాటం బ్యాటర్‌లో పేసర్లను, స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కొనే టెక్నిక్ ఉంది. పాదాలను చక్కగా ఉపయోగిస్తూ మైదానం నలువైపులా షాట్లు ఆడతాడు. నిన్నటితరం ఆటగాళ్లలా చూడముచ్చటైన డ్రైవ్ షాట్లు ఆడతాడు. పరిస్థితులకు తగ్గట్లు ఆచితూచి ఆడే ఓపిక ఉంది. అదే సమయంలో ఈ తరం క్రికెటర్లలా చెలరేగి ఆడే దూకుడూ తన సొంతం. రివర్స్ స్వీప్, స్కూప్ షాట్లు కూడా అలవోకగా ఆడగలడు. మొదట్లో కమిందును తేలిగ్గా తీసుకున్న ప్రత్యర్థి జట్లు.. ఇప్పుడు అతడి కోసం ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. ప్రస్తుత న్యూజిలాండ్ సిరీస్‌లో ఒంటి చేత్తో జట్టును సిరీస్ విజయం దిశగా నడిపిస్తున్నాడు కమిందు. టీనేజీలోనే అదరగొట్టడంతో అండర్-19 జట్టుకు కెప్టెన్‌గా ఎంపికైన కమిందు.. ఇంకా ముందే జాతీయ జట్టులోకి రావాల్సింది. కానీ దేశవాళీల్లో నిలకడగా రాణిస్తున్నప్పటికీ లంక క్రికెట్లో రాజకీయాల కారణంగా అతడికి అవకాశం దక్కలేదనే విమర్శలున్నాయి. అయితే ఈ ఏడాది సెలక్షన్ కమిటీ మారాక కమిందుకు అవకాశం దక్కింది. దీన్ని అతను రెండు చేతులా అందిపుచ్చుకున్నాడు. టెస్టు టోపీ ధరించిన నాటి నుంచి చెలరేగి ఆడుతున్నాడు. లంక జట్టులో మరికొందరు ప్రతిభావంతులు ఉన్నప్పటికీ సమష్టి తత్వం లేక, ప్రేరణ కొరవడి కొన్నేళ్లుగా తడబడుతూ సాగుతోంది. కానీ ఇప్పుడు కమిందు ప్రదర్శనతో జట్టు రాతే మారే సంకేతాలు కనిపిస్తున్నాయి. అతను అందించిన విజయాలు జట్టులో మిగతా ఆటగాళ్లకు స్ఫూర్తి నింపుతున్నాయి. ఆర్థిక సంక్షోభంతో అల్లాడుతున్న లంకేయులకు కమిందు అసామాన్య ప్రదర్శన, మళ్లీ జట్టు సాధిస్తున్న విజయాలు గొప్ప ఊరటనిస్తుంటాయనడంలో సందేహం లేదు. కమిందు ఇదే నిలకడను కొనసాగిస్తే శ్రీలంక నుంచి మరో దిగ్గజ ఆటగాడు తయారవుతున్నట్లే. అతడి స్ఫూర్తితో జట్టులో పోరాట తత్వం పెరిగితే ఆ దేశ క్రికెట్‌కు కూడా పూర్వ వైభవం రావడం ఖాయం. మూడు, నాలుగు జట్ల ఆధిపత్యం సాగుతున్న ప్రపంచ క్రికెట్‌కు శుభసూచకమే.



కమిందు మెండిస్

కమిందు ఉపయుక్తమైన స్పిన్నర్ కూడా. విశేషం ఏంటంటే.. అతను రెండు చేతులతోనూ బౌలింగ్ చేయగల సవ్యసాచి. భారత్‌తో సిరీస్‌లోనే కాక కొన్ని మ్యాచ్‌ల్లో ఈ ప్రతిభను ప్రదర్శించాడు కూడా. క్రీజులో ఉన్న బ్యాటర్లను బట్టి శైలి మార్చుకుని ఓవర్లు వేస్తుంటాడు.

మయాంక్‌కు పిలుపు

- నితీశ్, వరుణ్‌లకు చోటు
- బంగ్లాతో టీ20 సిరీస్‌కు భారత జట్టు


మయాంక్

దిల్లీ: బంగ్లాదేశ్‌తో మూడు టీ20ల సిరీస్‌లో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. సూర్యకుమార్ సారథ్యం వహిస్తున్న ఈ 15 మంది సభ్యుల బృందంలో యువ పేసర్ మయాంక్ యాదవ్‌కు తొలిసారి చోటు దక్కింది. ఈ ఐపీఎల్ సీజన్లో 150 కి.మీపైన వేగంతో స్థిరంగా బంతులు వేస్తూ అందరి దృష్టిని ఆకర్షించిన 22 ఏళ్ల మయాంక్.. గాయంతో టోర్నీ మధ్యలో వైదొలిగాడు. ఇప్పుడు కోలుకుని మళ్లీ సత్తా చాటేందుకు సిద్ధమయ్యాడు. ఈ ఏడాది జింబాబ్వేతో సిరీస్‌కు ఎంపికైనా.. గాయంతో అరంగేట్రం చేసే అవకాశాన్ని కోల్పోయిన తెలుగు కుర్రాడు నితీశ్‌కుమార్ రెడ్డికి సెలక్టర్లు మరో అవకాశం ఇచ్చారు. ఆఫ్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి మూడేళ్ల విరామం తర్వాత పునరాగమనం చేశాడు. అతడు చివరిగా 2021 టీ20 ప్రపంచకప్‌లో ఆడాడు. ఐపీఎల్‌లో సత్తా చాటిన రియాన్ పరాగ్, అభిషేక్‌శర్మ, హర్షిత్ రాణాల కూడా బంగ్లాతో సిరీస్‌లో ఆడే అవకాశాన్ని దక్కించుకున్నారు. ఈ జట్టులో సూర్య కాకుండా హార్దిక్ పాండ్య మాత్రమే సీనియర్. భారత్-బంగ్లా మధ్య తొలి టీ20 అక్టోబర్ 6న గ్వాలియర్‌లో.. రెండు, మూడో టీ20లు 9న దిల్లీ, 12న హైదరాబాద్‌లో జరుగుతాయి.

భారత జట్టు: సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్‌శర్మ, సంజు శాంసన్, రింకు సింగ్, హార్దిక్ పాండ్య, రియాన్ పరాగ్, నితీశ్ కుమార్‌రెడ్డి, శివమ్ దూబె, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి, జితేశ్ శర్మ, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, మయాంక్ యాదవ్.

ఆరుగురిని అట్టిపెట్టుకోవచ్చు

ఐపీఎల్ పాలక వర్గం నిర్ణయం

బెంగళూరు



ఐపీఎల్ మెగా వేలం నేపథ్యంలో ఫ్రాంఛైజీలు ఆరుగురు ఆటగాళ్లను అట్టిపెట్టుకోవడానికి ఐపీఎల్ పాలకవర్గం అనుమతినిచ్చింది. ఇందులో ఒక రైట్ టు మ్యాచ్ (ఆర్‌టీఎం) కలిసి ఉంటుంది. అట్టిపెట్టుకున్న అయిదుగురి కోసం రూ.75 కోట్లు ఖర్చు పెట్టాల్సివుంటుంది. జట్టు దగ్గర ఉండే మొత్తం రూ.120 కోట్లు. 2022లో జరిగే మెగా వేలంలో జట్లకు నలుగురిని మాత్రమే అట్టిపెట్టుకోవడానికి అవకాశమిచ్చారు. మరోవైపు వచ్చే సీజన్ (2025) నుంచి లీగ్ మ్యాచ్‌లు ఆడేందుకు ఎంపికైన ఆటగాళ్లందరికీ రూ.7.50 లక్షల మ్యాచ్ ఫీజు (ప్రతి మ్యాచ్‌కు)ను అందించాలని నిర్ణయించారు. అంటే అన్ని లీగ్ మ్యాచ్‌లు ఆడిన ఆటగాడికి అదనంగా రూ.1.05 కోట్ల ఆదాయం లభిస్తుందన్నమాట. ఒక జట్టు ఈ ఫీజుల కోసం మొత్తం రూ.12.60 కోట్లు ఖర్చు చేయాల్సివుంటుంది. వేలం పర్స్ రూ.120 కోట్లకు ఇది అదనం. "అట్టిపెట్టుకున్న మొదటి ఆటగాడికి ఫ్రాంఛైజీ రూ.18 కోట్లు ఇవ్వాలి. రెండో ఆటగాడికి రూ.14 కోట్లు, మూడో ఆటగాడికి రూ.11 కోట్లు చెల్లించాల్సివుంటుంది. ఫ్రాంఛైజీ నాలుగు, అయిదో ఆటగాణ్ని కూడా అట్టిపెట్టుకుంటే తిరిగి వరుసగా రూ.18 కోట్లు, రూ.14 కోట్లు ఇవ్వాల్సివుంటుంది. ఏ ఫ్రాంఛైజీ అయినా అయిదుగురు ఆటగాళ్లను అట్టిపెట్టుకుంటే రూ.45 కోట్లు మాత్రమే మిగులుతాయి. ఆర్‌టీఎం సహా వేలంలో మరో 15 మందిని కొని జట్టును తయారు చేసుకోవడం కోసం ఆ సొమ్ము మాత్రమే ఉంటుంది" అని ఓ సీనియర్ బీసీసీఐ/ఐపీఎల్ పాలకవర్గ సభ్యుడు చెప్పాడు. ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనను కొనసాగించాలని కూడా శనివారం జరిగిన పాలకవర్గ సమావేశంలో నిర్ణయించినట్లు బోర్డు కార్యదర్శి జై షా తెలిపాడు. ముంబయి, కోల్‌కతా, హైదరాబాద్ వంటి బలమైన ఫ్రాంఛైజీలు ఆరు నుంచి ఎనిమిది రిటెన్షన్లవైపు మొగ్గు చూపగా.. బలమైన ఆటగాళ్లు లేని ఇతర ఫ్రాంఛైజీలు అందుకు వ్యతిరేకతను వ్యక్తం చేసినట్లు సమాచారం. నవంబరులో ఐపీఎల్ వేలం జరిగే జరిగే అవకాశముంది.


జై షా

షా ఏం చెప్పాడంటే..: ఐపీఎల్‌లో ఆటగాళ్లకు మ్యాచ్ ఫీజు ఇచ్చే విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు బీసీసీఐ కార్యదర్శి జై షా ప్రకటించాడు. "ఓ చారిత్రక నిర్ణయం తీసుకున్నాం. ఆటగాళ్లకు మ్యాచ్ ఫీజు చెల్లించే విధానాన్ని ప్రవేశపెడుతున్నాం. ఆటగాడికి ఒక్కో మ్యాచ్‌కు రూ.7.5 లక్షల ఫీజు లభిస్తుంది. అన్ని లీగ్ మ్యాచ్‌లు ఆడిన ఆటగాడు రూ.1.05 కోట్లు పొందుతాడు. కాంట్రాక్ట్ మొత్తానికి ఇది అదనం. ప్రతి ఫ్రాంఛైజీ మ్యాచ్ ఫీజుల కోసం రూ.12.60 కోట్లు కేటాయిస్తుంది. ఐపీఎల్‌లో ఇది కొత్త శకం" అని షా 'ఎక్స్'లో పేర్కొన్నాడు.

అలా చేస్తే నిషేధమే..: ఏ ఆటగాడైనా వేలానికి పేరు నమోదు చేసుకుని, జట్టు కొనుక్కున్నాక.. సీజన్ ఆరంభానికి ముందు తాను అందుబాటులో ఉండనని చెబితే అతణ్ని రెండేళ్లు లీగ్ నుంచి నిషేధించాలని ఐపీఎల్ పాలవకర్గం నిర్ణయించింది. ఆర్చర్ వంటి ఆటగాళ్లు ఇలా చేయడం వల్ల గతంలో ఫ్రాంఛైజీలు ఇబ్బందిపడ్డాయి.


ధోని

ఆ ఆటగాడు అన్‌క్యాప్డ్ కింద లెక్క: ఏ భారత ఆటగాడైనా ఐపీఎల్ సీజన్‌కు ముందు అయిదేళ్ల పాటు అంతర్జాతీయ క్రికెట్ తుది ఎలెవన్ (టెస్టు, వన్డే, టీ20)లో ఆడకపోతే లేదా బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ కలిగి ఉండకపోతే.. అతడు అన్‌క్యాప్డ్ ఆటగాడవుతాడు. ఈ నిబంధన భారత ఆటగాళ్లకు మాత్రమే వర్తిస్తుంది. ఈ నిబంధన ప్రకారం మహేంద్ర సింగ్ ధోనిని చెన్నై సూపర్ కింగ్స్ అన్‌క్యాప్డ్ ఆటగాడిగా సొంతం చేసుకోవచ్చు.

గాయత్రి జోడీ పరాజయం


ట్రీసా, గాయత్రి

మకావు: మకావు ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో పుల్లెల గాయత్రి-ట్రీసా జాలీ జోడీ పోరాటం ముగిసింది. శనివారం మహిళల డబుల్స్ సెమీఫైనల్లో భారత జంట 17-21, 21-16, 10-21తో సియ్ పెయ్-హంగ్ జు (చైనీస్ తైపీ) జోడీ చేతిలో ఓడి కాంస్య పతకంతో సరిపెట్టుకుంది.

ముషీర్‌కు ప్రమాదం

కనీసం 3 నెలలు ఆటకు దూరం


ముషీర్

లఖ్‌నవూ: భారత క్రికెటర్ సర్ఫరాజ్ ఖాన్ తమ్ముడు, ముంబయి యువ ఆల్‌రౌండర్ ముషీర్ ఖాన్ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అక్టోబర్ 1న మొదలయ్యే ఇరానీ కప్ కోసం అజామ్‌గఢ్ నుంచి లఖ్‌నవూకు తన తండ్రి నౌషద్‌ఖాన్‌తో కారులో వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్ హైవేపై ముషీర్ ప్రయాణిస్తున్న కారు డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముషీర్ మెడకు గాయాలయ్యాయి. అతడి తండ్రి నౌషద్‌కు కూడా చిన్నపాటి దెబ్బలు తగిలాయి. ముషీర్‌ను హుటాహుటిన లఖ్‌నవూలోని మేదాంతా ఆసుపత్రికి తరలించారు. అతడికి అపాయమేమి లేదని కోలుకోవడానికి సమయం పడుతుందని వైద్యులు తెలిపారు. దీంతో ఇరానీ కప్‌తో పాటు ఈ సీజన్లో కొన్ని రంజీ మ్యాచ్‌లకు కూడా ముషీర్ దూరం కానున్నాడు. "పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్ హైవేలో ముషీర్‌ఖాన్ ప్రమాదానికి గురయ్యాడు. మెడ భాగంలో ఎముక విరిగింది. ఎముకల వైద్య నిపుణుడు ధర్మేంద్ర సింగ్ అతడి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు" అని వైద్యులు వెల్లడించారు. గత ఏడాది నుంచి మంచి ఫామ్‌లో ఉన్న ముషీర్.. తొమ్మిది ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 3 సెంచరీలు, ఒక అర్ధసెంచరీ సాధించాడు.

బ్రూక్, లివింగ్‌స్టన్ మెరుపులు

నాలుగో వన్డేలో ఇంగ్లాండ్ ఘన విజయం


బ్రూక్

లార్డ్స్: ఇంగ్లాండ్-ఆస్ట్రేలియా మధ్య అయిదు వన్డేల సిరీస్ ఆసక్తికరంగా సాగుతోంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఆసీస్ గెలిస్తే.. తర్వాతి రెండు వన్డేలను ఇంగ్లాండ్ నెగ్గి సిరీస్‌ను ఆసక్తికరంగా మార్చింది. నాలుగో మ్యాచ్‌లో ఇంగ్లిష్ జట్టు 186 పరుగుల భారీ తేడాతో కంగారూలను చిత్తు చేసింది. వర్షం కారణంగా ఇన్నింగ్స్‌కు 39 ఓవర్ల చొప్పున కుదించిన ఈ మ్యాచ్‌లో మొదట ఇంగ్లాండ్ 5 వికెట్లకు 312 పరుగులు చేసింది. తాత్కాలిక కెప్టెన్ హ్యారీ బ్రూక్ (87; 58 బంతుల్లో 11×4, 1×6)తో పాటు లివింగ్‌స్టన్ (62 నాటౌట్; 27 బంతుల్లో 3×4, 7×6) మెరుపు ఇన్నింగ్స్ ఆడారు. డకెట్ (63), జేమీ స్మిత్ (39) కూడా రాణించారు. ఛేదనలో ఓపెనర్లు ట్రావిస్ హెడ్ (34), మిచెల్ మార్ష్ (28) ఆసీస్‌కు మెరుపు ఆరంభమే ఇచ్చారు. అయితే వీళ్లిద్దరూ స్వల్ప తేడాతో ఔట్ కావడంతో ఆసీస్ తడబడింది. క్రమం తప్పకుండా వికెట్లు చేజార్చుకుని 24.4 ఓవర్లలో 126 పరుగులకే ఆలౌటైంది. పాట్స్ (4/38), కర్స్ (3/36), ఆర్చర్ (2/33) ప్రత్యర్థి పతనంలో కీలకపాత్ర పోషించారు. సిరీస్ ఫలితాన్ని తేల్చే చివరి వన్డే ఆదివారం బ్రిస్టల్‌లో జరుగుతుంది.

తొలి టీ20 దక్షిణాఫ్రికా సొంతం

అబుదాబి: ఐర్లాండ్‌తో రెండు టీ20ల సిరీస్‌లో దక్షిణాఫ్రికా బోణీ కొట్టింది. తొలి మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో ఐర్లాండ్‌ను చిత్తు చేసింది. మొదట ఐర్లాండ్ 8 వికెట్లకు 171 పరుగులు చేసింది. కాంఫర్ (49), రాక్ (37), డాక్రెల్ (21) రాణించారు. క్రూగర్ (4/27) ప్రత్యర్థిని కట్టడి చేశాడు. ఛేదనలో ఓపెనర్లు రికెల్‌టన్ (76; 48 బంతుల్లో 3×4, 6×6), రీజా హెండ్రిక్స్ (51; 33 బంతుల్లో 5×4, 3×6) మెరుపులతో లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 17.4 ఓవర్లలో 2 వికెట్లే కోల్పోయి అందుకుంది. రికెల్‌టన్-హెండ్రిక్స్ జంట తొలి వికెట్‌కు 136 పరుగులు జత చేసి జట్టును విజయపథంలో నడిపించింది.

గెలుపు బాటలో శ్రీలంక

న్యూజిలాండ్‌తో రెండో టెస్టు


ప్రభాత్

గాలె: న్యూజిలాండ్‌తో సిరీస్‌లో తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోన్న శ్రీలంక చివరిదైన రెండో టెస్టులో ఘన విజయానికి చేరువైంది. అద్భుతం చేస్తే తప్ప ఆ జట్టును కివీస్ అడ్డుకోలేదు. తీవ్రంగా తడబడుతోన్న న్యూజిలాండ్.. ఒక్క రోజే 13 వికెట్లు కోల్పోయి, భారీ పరాజయం ముంగిట నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 22/2తో మూడో రోజు, శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్... ఆతిథ్య జట్టు బౌలర్ల ధాటికి విలవిల్లాడింది. లంచ్ లోపే 88 పరుగులకే కుప్పకూలింది. ఎడమచేతి వాటం స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య (6/42) కివీస్ పతనాన్ని శాసించాడు. అరంగేట్ర ఆఫ్‌స్పిన్నర్ నిశాన్ పెయిరిస్ మూడు వికెట్లు పడగొట్టాడు. శాంట్నర్ (29) టాప్ స్కోరర్.

514 పరుగుల భారీ ఆధిక్యం సంపాదించిన లంక.. కివీస్‌ను ఫాలోఆన్ ఆడించింది. కొండంత లోటుతో బరిలోకి దిగిన న్యూజిలాండ్.. ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది. నిశాన్ పెయిరిస్ మూడు వికెట్లు పడగొట్టాడు. కాన్వే (61), కేన్ విలియమ్సన్ (46) కొద్దిసేపు పోరాడారు. బ్లండెల్ (47), ఫిలిప్ (32) క్రీజులో ఉన్నారు. శ్రీలంక 602/5 వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. మరో రెండు రోజుల ఆట మిగిలి ఉన్న నేపథ్యంలో కివీస్ ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవడం అసాధ్యమే. ఆ జట్టు ఇంకా 315 పరుగులు వెనుకబడి ఉంది. తొలి టెస్టులో కివీస్ 63 పరుగుల తేడాతో ఓడిపోయింది. శ్రీలంక చివరిసారి 2009లో న్యూజిలాండ్‌పై సిరీస్ గెలిచింది.

సంక్షిప్త స్కోరు... శ్రీలంక తొలి ఇన్నింగ్స్: 602/5 డిక్లేర్డ్

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 88 (శాంట్నర్ 29, మిచెల్ 13, రచిన్ 10, కాన్వే 9; ప్రభాత్ జయసూర్య 6/42, నిశాన్ పెయిరిస్ 3/33)

న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: 199/5 (కాన్వే 61, కేన్ విలియమ్సన్ 46, బ్లండెల్ 47 నాటౌట్, ఫిలిప్స్ 32 నాటౌట్; నిశాన్ పెయిరిస్ 3/91)

గుల్వీర్ జాతీయ రికార్డుతో..

దిల్లీ: జపాన్‌లో జరుగుతున్న ప్రపంచ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్‌లో భారత అథ్లెట్ గుల్వీర్ సింగ్ సత్తా చాటాడు. అతడు 5 వేల మీటర్ల పరుగులో జాతీయ రికార్డు సృష్టిస్తూ స్వర్ణం గెలుచుకున్నాడు. గుల్వీర్ 13 నిమిషాల 11.82 సెకన్లలో లక్ష్యాన్ని చేరి పసిడి కైవసం చేసుకున్నాడు. ఈ క్రమంలో తన పేరిటే ఉన్న జాతీయ రికార్డు (13 నిమిషాల 18.92 సె)ను సవరించాడు. ఈ మార్చిలో గుల్వీర్ కాలిఫోర్నియాలో జరిగిన టెన్ ట్రాక్ మీట్‌లో 27 నిమిషాల 41.81 సెకన్లలో లక్ష్యాన్ని చేరి 10 వేల మీటర్ల జాతీయ రికార్డును కూడా బద్దలుకొట్టాడు. 2008లో సురేందర్ సింగ్ (28 నిమిషాల 02.89 సె) పేరిట ఉన్న రికార్డును అధిగమించాడు.

శిరీషకు కాంస్యం

పట్నా: జాతీయ అండర్-23 అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి ముగడ శిరీష సత్తా చాటింది. మహిళల 400 మీటర్ల పరుగులో ఆమె 54.63 సెకన్లలో లక్ష్యాన్ని చేరి కాంస్యం గెలుచుకుంది. దివ్యానిబా (గుజరాత్, 53.53 సె) స్వర్ణం.. రసదీప్ కౌర్ (పంజాబ్, 54.29 సె) రజతం సాధించారు. 1500 మీటర్లలో తోట సంకీర్తన (ఛత్తీస్‌గఢ్) పసిడి సొంతం చేసుకుంది. ఆమె 4 నిమిషాల 33.53 సెకన్లలో లక్ష్యాన్ని చేరి అగ్రస్థానంలో నిలిచింది. లక్ష్మీప్రియ (ఒడిశా, 4 నిమిషాల 34.01 సె), అమన్‌దీప్ (పంజాబ్, 4 నిమిషాల 34.24 సె) రజత, కాంస్యాలు సాధించారు. తన్యా (హ్యామర్‌త్రో, యూపీ), పూర్వ (ట్రిపుల్‌జంప్, మహారాష్ట్ర) మీట్ రికార్డులు సృష్టిస్తూ పసిడి పతకాలను కైవసం చేసుకున్నారు.

ఫైనల్లో యువ భారత్


థింపు (భూటాన్): శాఫ్ అండర్-17 ఫుట్‌బాల్ టోర్నమెంట్లో భారత్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. శనివారం సెమీఫైనల్లో 4-2తో నేపాల్‌ను ఓడించింది. పాకిస్థాన్-బంగ్లాదేశ్ మధ్య సెమీస్ విజేతతో భారత్ టైటిల్ పోరులో తలపడనుంది.

వసుంధర


vasundhara@eenadu.in

ఆమె దర్శకత్వం సూపర్ హిట్!


అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ అనగానే... మన హీరోయిన్ల డ్రెస్‌లు, యాక్సెసరీల గురించే చర్చంతా! ఆ రెడ్ కార్పెట్ మీద నడవడమే గొప్పగా భావిస్తాం. కానీ ఈ ఏడాది తమ ప్రతిభ గురించే మాట్లాడుకునేలా చేశారీ దర్శకురాళ్లు... సినిమా రంగంలో మనవాళ్ల సత్తా చాటారు!




వెండితెర... ఎంతోమంది యువత కల. కానీ దాన్ని బయటపెట్టగానే 'యాక్టరవ్వాలంటే బోలెడంత రాసిపెట్టి ఉండాలి. నీ మొహం అద్దంలో చూసుకున్నావా? సినిమా తిండి పెడుతుందా...' అంటూ ఎన్ని కామెంట్లో! దీంతో ఆ ఆశని మనసు పొరల్లో దాచేసేవారే ఎక్కువ. కానీ కొందరుంటారు... అదే ప్రాణమనుకుని ఉన్నదంతా పెట్టి మరీ ప్రయత్నిస్తారు... అలాంటి వారి కథే... 'సూపర్ బాయ్స్ ఆఫ్ మాలెగావ్'. సినిమా కల నెరవేర్చుకోవడం ఎంత కష్టమో **రీమా కాగతీ**కి బాగా తెలుసు. కాబట్టే... దాన్ని తెరపై అంతే ఆకట్టుకునేలా చూపించగలిగారామె. పిల్లల మ్యాగజీన్లకు కథలు రాసే ఆమెను తొమ్మిదేళ్ల వయసులో సినిమా ఆకర్షించింది. పెద్దయ్యాక దర్శకురాలవుతానంటే ఇంట్లో భయపడ్డారట. ఎలాగోలా వాళ్లను ఒప్పిస్తే... ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ నుంచి తిరస్కరణలు వచ్చాయి. అయినా సోషల్ కమ్యూనికేషన్‌లో పట్టా పొంది... లగాన్, జిందగీ న మిలేగీ దొబారా... లాంటి ఎన్నో సినిమాలకు స్క్రిప్ట్ రైటర్, అసిస్టెంట్ డైరెక్టర్, డైరెక్టర్‌గా పనిచేశారు. ఆమె దర్శకత్వం వహించిన 'సూపర్‌బాయ్స్ ఆఫ్ మాలెగావ్' టొరంటో ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమవడమే కాదు ప్రశంసలూ అందుకుంది.




30ఏళ్ల తర్వాత... కేన్స్‌లో భారతీయ చిత్రం నిలిచింది. అందుకు కారణం... **పాయల్ కపాడియా**. మారుమూల ప్రాంతంలో నర్సులుగా పనిచేసే ఇద్దరు మహిళలు... వారి జీవితం, భావోద్వేగాలే కథ. 'ఆల్ వీ ఇమాజిన్ యాజ్ లైట్' చిత్రంగా తీసుకొచ్చారీమె. సినిమాపై ఇష్టంతో పుణెలోని ఎఫ్‌టీఐఐలో దర్శకత్వ విభాగంలో విద్యాభ్యాసం పూర్తిచేశారు పాయల్. చదువు పూర్తవకముందే ఆమె షార్ట్‌ఫిల్మ్ 'కేన్స్'కి ఎంపికైంది. ఆపై తన 'ఎ నైట్ ఆఫ్ నోయింగ్ నథింగ్' ఉత్తమ డాక్యుమెంటరీగా నిలిచింది. సగటు మహిళల జీవితాలే పాయల్ కథాంశాలు. అలాంటి కథే 'ఆల్ వీ ఇమాజిన్ యాజ్ లైట్' కూడా. 'విశ్వజనీయ కథ... భావోద్వేగాలతో కట్టిపడేస్తోంది' అంటూ కితాబులు అందుకోవడమే కాదు... కేన్స్ వేదికపై 'గ్రాండ్ పిక్స్' పురస్కారాన్నీ అందుకుంది.



మణిపూర్ రాష్ట్ర పరిస్థితుల్ని 'బూంగ్'లో చిన్న పిల్లల ద్వారా చెప్పించే ప్రయత్నం చేశారు **లక్ష్మీప్రియా దేవి**. భారత సరిహద్దుల్లో ఉంటాడో కుర్రాడు. తండ్రి చిన్నప్పుడే దూరమవుతాడు. అంతా చనిపోయారన్నా... సరిహద్దుకు ఆవల ఉన్న ఊళ్లో ఇంకా బతికే ఉన్నాడని ఆశగా ఆ కుర్రాడు వెతకడమే కథ. పీకే, రంగ్‌దే బసంతి, డుంకీ, స్వదేశ్... అసిస్టెంట్ డైరెక్టర్‌గా దశాబ్దానికిపైగా అనుభవమున్నా... లక్ష్మీప్రియకిది దర్శకురాలిగా తొలి సినిమా. టొరంటో ఫిల్మ్ ఫెస్టివల్‌లో దీన్ని ప్రీమియర్ షోగా వేశారు. గత కొన్నేళ్లలో ఒక డైరెక్టర్ తొలిసినిమా ప్రీమియర్‌కి వచ్చిన ఆనవాళ్లే లేవట.




ఆస్కార్ బరిలో...



చనిపోయిన భర్త స్థానంలో పోలీసు ఉద్యోగం వస్తుందామెకి. అలా ఉద్యోగంలో చేరిందో లేదో ఓ హత్య కేసు ఛేదించాల్సి వస్తుంది. అధికారం, రాజకీయ అంశాలు వ్యవస్థపై ముఖ్యంగా మహిళలపై ఎలా ప్రభావం చూపుతాయన్న కోణంలో సాగుతుందీ 'సంతోష్' కథ. మేథమేటిక్స్‌లో డిగ్రీ పట్టా. టీచర్‌గా పనిచేసిన అనుభవం ఉన్న **సంధ్యా సూరి** దర్శకత్వం వహించిన చిత్రమిది. కెమెరాపై ప్రేమ డాక్యుమెంటరీ ఫిల్మ్‌మేకింగ్ చదివేలా చేసిందావిడని. గతంలో రెండు డాక్యుమెంటరీలు, ఒక షార్ట్‌ఫిల్మ్ మాత్రమే తీసినా ఎన్నో అవార్డులు అందుకున్నారు. 'సంతోష్' కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమవడమే కాదు... తాజాగా ఆస్కార్ బరిలోనూ స్థానం సంపాదించింది.

కట్టుకున్నవాడి ఊరు కూడా తెలియదో అమ్మాయికి. చదువుకోవాలనుకునే మరో అమ్మాయి కలకి పెళ్లే అడ్డవుతుంది. ఇద్దరూ అనుకోకుండా తారుమారవుతారు. జీవితంలో కోరుకున్న గమ్యాన్ని చేరుకోవడంలో వారికి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయనేదే 'లాపతా లేడీస్' కథ. దేశంలో కొన్ని ప్రాంతాల్లోని నిజ సంఘటనల ఆధారంగా రూపొందీ చిత్రం. బాలీవుడ్ డైరెక్టర్, నిర్మాతగా పేరుగాంచిన **కిరణ్‌రావు** దీనికి దర్శకత్వం వహించారు. తాజాగా ఆస్కార్‌బరిలోనూ ఇది నిలిచింది.



పెద్ద నటులు, భారీ బడ్జెట్ ఈ సినిమాల్లో కనిపించవు. కథే హీరో... భావోద్వేగాలు, అంతర్లీనంగా ఉండే సందేశాలే బలాలు. వాటిని ఆయుధాలుగా చేసుకుని అందమైన చిత్రాలుగా తీర్చిదిద్దారీ దర్శకురాళ్లు. అంతర్జాతీయ వేదికపై ప్రేక్షకుల మనసు గెలిచారు. తమ ప్రతిభను నిరూపించుకున్నారు.

నమ్మలేని నిజం

ఆ రహస్య గొంతు ఎవరిది?



అది యూకే... 1984వ సంవత్సరం, పైగా చలికాలం. నలభై ఏళ్ల ఓ మహిళ ఇంట్లో రాత్రిపూట ఒంటరిగా కూర్చొని పుస్తకం చదువుకుంటోంది. అప్పుడే అకస్మాత్తుగా ఓ స్వరం తనతో మాట్లాడడం మొదలుపెట్టింది. "నువ్వు భయపడకు. నేను ఇలా మాట్లాడడం విని నువ్వు ఆశ్చర్యపోతావని తెలుసు. కానీ నీతో మాట్లాడడానికి నాకు దొరికిన తేలికైన దారి ఇదే. నేనూ, నా స్నేహితుడూ ఇక్కడే పిల్లల ఆసుపత్రిలో పనిచేస్తున్నాం. మేము నీకు సాయం చేయాలనుకుంటున్నాం" అంటూ ఆ స్వరం ముగిసింది. ఈ సంఘటనతో వణికిపోయిన ఆమె వెంటనే డాక్టర్‌ను కలిసింది. ఇది విన్న ఆయన తనను సైకియాట్రిక్ చికిత్సకు రెకమెండ్ చేశారు. ఆ తర్వాత కొన్ని రోజులు ప్రశాంతంగా ఉందామని విదేశానికి విహారయాత్రకు వెళ్లిందామె. అయితే అక్కడా ఆ స్వరం తనను వదల్లేదు. ఈసారి వైద్యులు ఆమెకు ఓ చిరునామా ఇచ్చి, వెంటనే లండన్ వెళ్లమని చెప్పారు. తను లండన్‌లోని వాళ్లిచ్చిన అడ్రస్‌కు వెళ్లింది. ఆశ్చర్యమేంటంటే తనకు వినిపించిన ఆ స్వరంలో వాళ్లు చెప్పిన చిరునామా, ఈ డాక్టర్లు ఇచ్చిన చిరునామా రెండూ ఒక్కటే. అక్కడికి వెళ్లాక, వాళ్లు ఆమె బ్రెయిన్‌లో ట్యూమర్ ఉందని చెప్పి సర్జరీకి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆమెకు అంతా గందరగోళంగా ఉంది. కానీ అత్యవసరమని వెంటనే వైద్యులు సర్జరీ చేసి, ఆమెను కాపాడారు. ఆ ఆపరేషన్ అయ్యాక, ఇక ఆ స్వరాలు మళ్లీ తనకు వినిపించలేదట. ఏ దైవశక్తో తనను కాపాడిందని ఆమె నమ్మేది. ఇంతకూ ఫిజీషియన్లకంటే, రోగికంటే ముందే ఆ రహస్య స్వరాలకు ఈ ట్యూమర్ గురించి ఎలా తెలిసింది? ఆపరేషన్ తర్వాత ఆ స్వరాలు తనకు మళ్లీ ఎందుకు వినిపించలేదు?

ఎందుకంటే...

ఇప్పుడు మాట్లాడుకున్నదంతా ఏ పురాణమో, కట్టుకథో కాదు. నిజానికి ఆ మహిళకు ఇలా ఎందుకు జరిగిందనే విషయాన్ని డాక్టర్ అజుయోన్ బ్రిటిష్ మెడికల్ జర్నల్‌లో వివరించారు. ఆమె మెదడులోని ట్యూమర్ వల్లనే ఇలా జరిగి ఉండొచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఆమెకు వినిపించిన స్వరాలు భ్రమలేనట. మెదడులో ఆ ట్యూమర్ ఉన్న ప్రాంతాన్ని బట్టి, రోగులకు ఇలా అనిపిస్తుందట. ఇటువంటి కేసు మెడికల్ చరిత్రలో లేనప్పటికీ, ఇలా జరిగే అవకాశం లేకపోలేదంటున్నారు వైద్యులు. తన అనారోగ్యం గురించి తనకు అస్పష్టంగా తెలిసి ఉండడం, ఆ డాక్టర్ల గురించి ఎప్పుడో విని లేదా చదివి ఉండటం వల్ల కూడా తనకు ఇలాంటి భ్రమలు వచ్చి ఉండొచ్చని అంటున్నారు. ఏదేమైనా అప్పట్లో ఈమె కండిషన్ ప్రపంచాన్ని పూర్తి అయోమయ స్థితిలో పడేసిందట. అయితే, మగవాళ్లతో పోలిస్తే ఆడవాళ్లకు సిక్స్త్ సెన్స్ కూడా ఎక్కువగా ఉంటుంది. కాబట్టి, ఈ రకమైన భ్రమలకు లోనై ఉండొచ్చని అభిప్రాయపడ్డారు కొందరు నిపుణులు.

వంటగదిలో జిడ్డా...



పొద్దున్నే హడావుడిగా వంట చేయడం ఒకెత్తయితే ఆ తరవాత చిందర వందరగా పడి ఉన్న ఆహార పదార్థాలు, చిందిన నూనె చుక్కల వల్ల ఏర్పడిన జిడ్డుని వదిలించడం ఇంకో ఎత్తు. వీటిని శుభ్రం చేయడానికి నిత్యం రసాయనిక క్లీనర్లు వాడుతుంటాం. కానీ, వాటి నుంచి వెలువడే వాయువులూ, ఇతర హానికారక టాక్సిన్లు ఆరోగ్యానికి చేటు చేస్తాయంటున్నాయి పలు అధ్యయనాలు. మరి వీటిని ఎలా వదిలించాలన్నదేగా మీ సందేహం. ఇందుకోసం బోలెడు ఇంటి చిట్కాలు ఉన్నాయి. గ్యాస్ వెనకున్న గోడ మీద పేరుకున్న గ్రీజుపైకి దుమ్ముచేరితే మరింత నల్లగా మారిపోతుంది. ఈ ఇలాకాకుండా ఉండాలంటే మార్కెట్లో దొరికే రిమూవబుల్ వాల్ స్టిక్కర్స్‌ని తెచ్చి వంటగదిలో వేయండి. వీటిపై జిడ్డు పడినా ఈజీగా తుడిచేయొచ్చు. ఇందులోనూ ఎన్నో రంగులూ, డిజైన్లు ఉన్నాయి మీకు నచ్చింది ఎంచుకోవచ్చు. అలానే జిడ్డు బాగా పేరుకున్నట్లయితే కాస్త వంటసోడాలో రెండు చుక్కల డిష్‌వాష్ లిక్విడ్ చేర్చి ఆ ప్రదేశంలో రాయండి. ఓ పదినిమిషాలయ్యాక పీచుతో రుద్ది, కడిగేయండి. సులువుగా పోతుంది. అలానే టూత్‌పేస్ట్‌తోనూ జిడ్డు వ్యర్థాలను సులువుగా వదిలించొచ్చు. అదెలాగంటారా? ఓ గిన్నెల్లో కాస్త పేస్ట్, పావుకప్పు బేకింగ్ సోడా, కొద్దిగా వినెగర్ కలిపి గోడలకు పట్టించండి. ఆపై స్క్రబర్‌తో రుద్ది వేణ్నీళ్లతో శుభ్రం చేస్తే సరి. తళతళలాడతాయి. ఈ మిశ్రమంతో రంగు మారిన వైట్ మిక్సీ గ్రైండర్‌లను రుద్ది తుడిస్తే కొత్తగా కనిపిస్తాయి. ఓసారి ప్రయత్నించి చూడండి.

బంగారం-వెండి



28న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ.లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	7,095	7,100
వెండి (గ్రా)	101.00	102.00

	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం (24క్యా)	78,030	77,450	75,825	75,800	77,400	77,400	77,700	77,800	77,120	77,180
ఆర్నమెంట్	71,750	71,000	71,000	71,000	71,670	71,670	71,360	71,430	70,950	71,000
వెండి (కిలో)	92,623	----	94,000	94,000	91,000	91,000	92,900	92,800	90,000	93,000

మనసును చదవలేరుగా..!

సెలవురోజున భర్త తనను బయటకు తీసుకెళతాడనుకుంది రాధ. తీరా అతను స్నేహితులతో బయటకెళ్లడంతో ఆమె మనసు గాయపడింది. 'నీ మనసులో ఉన్నది చెబితేనే కదా తెలిసేది' అనే భర్త మాటలు రాధ కోపాన్ని మరింత పెంచాయి. కానీ అది నిజమే కదా! మీ మనసు చదివే శక్తి వారికి ఉండదుగా అంటున్నారు నిపుణులు.



భార్య తనకు ఇష్టమైన పనులు చేస్తుందని భర్త, తన మనసుకు నచ్చినట్లుగా అతడు నడుచుకుంటాడని భార్య ఆశిస్తారు. ఇరువురూ తాము ఎదురుచూస్తున్న వాటిని మాత్రం భాగస్వామికి చెప్పరు. అయినా ఎదుటివారు తమకు నచ్చినట్లుగా ఉంటారని అంచనా వేసి ఆశగా ఎదురుచూస్తారు. అయితే రోజువారీ జీవితంలో ఇటువంటి ఆలోచనలు దంపతుల మధ్య సమస్యలను తెస్తాయి. తాము అనుకున్నట్లుగా భాగస్వామి లేరనుకుని, వాళ్లు తమకు తగినవారు కాదనే అపోహలోకి వెళతారు. ఇటువంటి అంచనాలను 'సైలెంట్ డిమాండ్స్' అంటున్నారు నిపుణులు. సంసారంలో వీటికి చోటిస్తే, భార్యాభర్తల మధ్య అనుబంధం దూరమవుతుంది. వీటివల్ల అపార్థాలు చోటు చేసుకోవడమేకాదు, కొన్నిసార్లు తీవ్ర ద్వేషానికీ కారణమవుతాయి. దాంపత్య బంధాన్ని బలహీనపరుస్తాయి.

అపోహ...

పెళ్లైన కొత్తలో ఒకరి మనసు మరొకరు చదవగలమనే నమ్మకం ఉంటుంది. దంపతులిద్దరూ ఒకేలా ఆలోచిస్తున్నామని భావిస్తారు. ఇవన్నీ అపోహలే. కొత్తలో కేవలం ఒకరి మార్గాన్ని మరొకరు అనుసరిస్తారు. తమలాగే భాగస్వామి ఆలోచిస్తున్నారని బలంగా నమ్ముతారు. కాలం గడిచేకొద్దీ ఇరువురికీ అసలు విషయం అర్థమవుతుంది. దాంతో ఎదుటివారు తమ మనసును తెలుసుకోవాలనీ, దానికి తగ్గట్లుగా ఉండాలనీ ఎదురుచూడటం మొదలుపెడతారు. ఎదుటివారిపై ఇలా మొత్తం భరోసా వేయకుండా, ఇరువురూ కలిసి సరదాగా గడపడానికి సమయాన్ని కేటాయించుకోవాలి, ఇల్లు, పిల్లల బాధ్యతలను కలిసి పంచుకోవాలి. ఒకరి మనసును మరొకరు పూర్తిగా చదవలేకపోయినా, ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. మనసులోని ఆలోచనలను దాచకుండా భాగస్వామితో చెప్పాలి. అప్పుడే అవతలివారు మీగురించి తెలుసుకొని మీకు నచ్చినట్లుగా నడుచుకోవడానికి ప్రయత్నిస్తారు. దీంతో దంపతులమధ్య సాన్నిహిత్యం పెరుగుతుంది. బంధం మరింత బలపడుతుంది.

మరీ... అంత జోక్యం వద్దు!




పిల్లలు మంచి పద్ధతులు, అలవాట్లు నేర్చుకోవాలని తల్లిగా తాపత్రయపడుతుంటాం. అలాంటి లక్షణాలు ఉన్నవారితోనే వాళ్లు స్నేహం చేయాలనుకుంటాం. ఓ తల్లిగా ఇలా ఆలోచించడంలో తప్పేమీ లేదు కానీ, స్నేహితుల ఎంపిక విషయంలో మరీ అంతగా జోక్యం చేసుకోవద్దంటున్నారు పరిశోధకులు. దీనివల్ల పిల్లల్లో ప్రవర్తనా లోపాలు వచ్చే అవకాశం ఉందట. తోటివారితో కలవడంలోనూ, సర్దుకుపోవడంలోనూ ఇబ్బందులు వస్తాయని ఫ్లోరిడా అట్లాంటిక్ యూనివర్సిటీ చేసిన పరిశోధనలు చెబుతున్నాయి. 9 నుంచి 14ఏళ్ల వయసున్న స్కూలుకెళ్లే పిల్లలపై ఈ పరిశోధన చేశారు. తల్లులు 'వాళ్లతో స్నేహం చేయొద్దు... వీళ్లతో మాట్లాడొద్దు...' అంటూ హద్దులు పెట్టేకొద్దీ, వారికి స్నేహితులు దూరమవడం, కొత్త పిల్లలూ అంతగా కలవడానికి ఇష్టపడకపోవడం వంటి కారణాలతో స్నేహాల్ని ఏర్పరచుకోవడంలో పిల్లలు వెనకబడతారట. అందుకే, అలా నేరుగా వద్దని చెప్పడంకంటే సానుకూల పద్ధతిలో వారికి అర్థమయ్యేలా వివరించడం ముఖ్యమని చెబుతున్నారు పరిశోధకులు. రకరకాల యాక్టివిటీల్లో భాగస్వాములను చేస్తూ మెల్లగా వాళ్లతో సమయం గడపకుండా చూడాలని సూచిస్తున్నారు.

బేబీ బొటాక్స్ అంటే?

నాకు 30 ఏళ్లు. ముఖంపై ముడతలు మొదలయ్యాయి. స్నేహితురాలు బేబీ బొటాక్స్ ప్రయత్నించమంది. బొటాక్స్‌కీ దీనికీ ఏంటీ తేడా? – ఓ సోదరి

బేబీ బొటాక్స్... దీన్నే మైక్రో బొటాక్స్ అంటాం. దీనికీ సంప్రదాయ బొటాక్స్‌కీ పెద్ద తేడా ఏమీలేదు. కాకపోతే దీన్ని చాలా తక్కువ మొత్తంలో సమస్య ఉన్నచోట ఇంజెక్ట్ చేస్తామంతే. పెదవుల మీద గీతలు, ముడతలు పోవడానికీ, నుదురు, మెడ దగ్గర చర్మం సాగిపోయి గీతలు కనిపిస్తున్నా ఇది బాగా పనిచేస్తుంది. 30-50లోపు వారికి ముడతలు, గీతలు కాస్త తక్కువగా ఉంటాయి కాబట్టి, వారికిది పనిచేస్తుంది. అదీ నాలుగు నెలలే! ముడతలు, గీతలు తీవ్రంగా ఉంటే బొటాక్స్ కావాలి. నిజానికి బొటాక్స్‌ని తక్కువ మొత్తంలోనే ఇవ్వాలి. లేదంటే ముఖం అసహజంగా ఎలాంటి స్పందనా లేనట్లు కనిపిస్తుంది. కాబట్టి, ముడతలు పోయి, సహజంగా కనిపించేలా చేసే బేబీ బొటాక్సే మేలు. చేసే ఉద్యోగం, జీవనశైలి, ఒత్తిడి... ఇవన్నీ ముడతలకు ప్రధాన కారణాలే. మీకిప్పుడే మొదలయ్యాయి కాబట్టి, వీటన్నింటి కంటే ముందు చర్మతీరుకు తగ్గ స్కిన్ కేర్ రొటీన్‌ని ప్రారంభించండి. ఆల్కహాల్ లేని, గ్లిజరిన్, యాంటీ ఆక్సిడెంట్లు ఉన్న టోనర్, విటమిన్ సి, రెటినాల్, కొల్లాయిడల్ ఓట్ మీల్, పెప్టైడ్స్ ఉన్న క్రీములు వాడండి. ఇవన్నీ ముడతలు, గీతలు పెరగకుండా చూస్తాయి. స్క్రబ్ వారానికి ఒకసారికి మించకూడదు. మైల్డ్ క్లెన్సర్, సన్‌స్క్రీన్ తప్పకవాడాలి. రోజంతా ఏసీలో ఉన్నా కనీసం 3 లీటర్ల నీటిని తాగండి. కెమికల్ పీల్స్‌నీ ప్రయత్నించొచ్చు. అయితే చికిత్సలపైనే ఆధారపడొద్దు. పోషకాహారం, 8గం. నిద్రకీ ప్రాధాన్యమివ్వాలి. వీటితో సమస్య అదుపులోకి వస్తుంది. ఆలివ్ నూనె, కలబంద, అరటి గుజ్జును రోజూ రాసుకున్నా మంచిదే.

డియర్... వసుంధర



డా. శైలజ సూరపనేని
సౌందర్య నిపుణులు

బార్బీ సర్దుకుంటుంది ... కారు గ్యారేజ్‌కెళుతుంది!

పిల్లలు ఆడుకున్న తర్వాత బొమ్మలతో ఇల్లంతా కిష్కింధ అవుతుంది. వాటన్నింటినీ సర్దేసరికి మన తల ప్రాణం తోకకొస్తుంది. ఇలాకాకుండా పాపాయి తన మనసుకు నచ్చిన బార్బీ బొమ్మను అలమరలో సర్దేసేలా, బుజ్జిగాడు తన కార్లన్నింటినీ గ్యారేజ్‌కు పంపేసేలా నయా ఆలోచన ఏంటంటే...

కిడ్స్ కార్నర్



కంటికెదురుగా...

అందమైన బార్బీ బొమ్మలు, కుక్కపిల్ల, ఎలుగుబంటి వంటి ఊలు బొమ్మలను ఇష్టపడని పాపాయిలుండరు. చింటూ...మున్నీ.. అంటూ మనసుకు నచ్చిన పేర్లతో పిలుస్తూ, వాటినెత్తుకుని కబుర్లు చెబుతూ ఆడతారు. ఆపై ఎక్కడివక్కడ వదిలి ఇంటిని చిందరవందర చేస్తారు. అలాకాకుండా, ప్రత్యేకంగా రెండు మూడు అరలతో గోడకు ఓ అలమరను ఏర్పాటు చేయడం మంచిది. ప్రతి అలమరకు మధ్యలో సన్నని తాడు లేదా కర్రను బిగించాలి. బార్బీ బొమ్మలన్నింటినీ వరసగా ఈ తాడువెనక పిల్లలతో సర్దించాలి. బార్బీలను సర్దడానికి వీలుగా రంధ్రాలున్న టేబుల్స్ కూడా దొరుకుతున్నాయి. ఆడుకున్న తర్వాత బొమ్మలను వీటిలో సర్దడం బుజ్జాయిలకు అలవాటు చేయాలి. అలాగే డోర్ వెనకవైపు విడివిడిగా చిన్నచిన్న సంచులు అటాచ్డ్‌గా ఉన్న క్లాత్‌ను తగిలించి వాటిల్లో బొమ్మలన్నింటినీ సర్దించినా చాలు. దీంతో పిల్లలకు నచ్చినవన్నీ కంటికెదురుగా కనిపిస్తూ, ఆట తర్వాత తిరిగి బొమ్మలన్నింటినీ అందులో ఉంచాలనే ఆలోచన వచ్చేలా చేస్తాయి.






గ్యారేజీకి...

నచ్చిన కారు బొమ్మను ఇంటికి తెచ్చేవరకు పిల్లలు నిద్రపోరు. అలాగని అరగంటకన్నా ఎక్కువసేపు ఆడరు. పోనీ పడేద్దామంటే ఒప్పుకోరు. దీంతో ఇల్లంతా కారు బొమ్మలతో నిండిపోవాల్సిందే. ఈ సమస్యకు పరిష్కారమే బుజ్జాయిలకు బుజ్జి గ్యారేజీ ఏర్పాటు. ఏడెనిమిది అరలున్న చెక్క అలమర చేసి, అందులో సర్దడానికి ట్యూబ్ కార్డ్‌బోర్డ్‌ని పొడవుగా కత్తిరించండి. దానిపైన రంగు కాగితం అతికించి అందులో సర్దేయండి. ఇప్పుడు ఒక్కో కారు ఒక్కోదానిలో పెట్టండి. వీటిని పిల్లలకు అందే ఎత్తులో ఏర్పాటు చేస్తే సరి. అలాగే చక్రాలున్న కారు ఆకారంలో షెల్ఫ్‌లూ లభ్యమవుతున్నాయిప్పుడు. వీటిని పిల్లల గదిలో గోడకు అమర్చేయొచ్చు. ఆట తర్వాత కారును ఈ పార్కింగ్ గ్యారేజీల్లో సర్దేయడం అలవాటు చేస్తే చాలు. ఆపై తమ కార్ల కలెక్షన్ చూసుకొని బుజ్జాయిలు మురిసిపోవడం ఖాయం.













అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలో హరికేన్ హెలెనా తీవ్రతకు ఇంటిపై పడ్డ భారీ వృక్షం

అమెరికాలో హెలెనా బీభత్సం..
52 మంది మృతి

ఫ్లోరిడా: అతి తీవ్రమైన హరికేన్ హెలెనా ఆగ్నేయ అమెరికాలో విధ్వంసం సృష్టిస్తోంది. తుపాను కారణంగా కనీసం 52 మంది మృతి చెందినట్లు అధికారులు పేర్కొన్నారు. ఫ్లోరిడా, జార్జియా, నార్త్ కరోలినా, సౌత్ కరోలినా, వర్జీనియా రాష్ట్రాల్లో కేటగిరీ- 4 హరికేన్ ప్రభావం అధికంగా ఉందన్నారు. హెలెనా తుపాను కారణంగా దాదాపు 52 మంది మృతి చెందగా.. అందులో ముగ్గురు అగ్నిమాపక సిబ్బంది, ఓ 89ఏళ్ల వృద్ధురాలు, ఒక మహిళ, ఆమెకు నెల క్రితం జన్మించిన కవలలు సైతం ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. జార్జియాలోని పలు ఆసుపత్రుల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఫ్లోరిడాలో తుపాను తీరం దాటేటప్పుడు గంటకు 225 కి.మీ. వేగంతో గాలులు వీచినట్లు అధికారులు పేర్కొన్నారు. అట్లాంటాలో 48 గంటల్లో 28.24 సెం.మీ.ల వర్షపాతం నమోదవగా.. 1886లో నమోదైన 24.36 సెం.మీ. రికార్డును బద్దలు కొట్టినట్లు తెలిపారు ఇదిలా ఉండగా.. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పేర్కొన్నారు.


16 ఏళ్లకే ఉగ్రబాట

- 32 ఏళ్లకే హెజ్‌బొల్లాకు అధినేత
- కూరగాయల వ్యాపారి కుమారుడు నస్రల్లా ప్రస్థానమిదీ..

ఈనాడు ప్రత్యేక విభాగం

లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో హెజ్‌బొల్లా అధినేత షేక్ హసన్ నస్రల్లా మృతి చెందాడు. మిలిటెంట్ సంస్థ అయిన హెజ్‌బొల్లాను నడిపించడంలో అతడిదే కీలక పాత్ర. దీంతో అతడిని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ శుక్రవారం జరిపిన దాడిలో నస్రల్లాతోపాటు అతడి కుమార్తె మరణించింది. షియా మత పెద్దగా ఆ వర్గంలో గౌరవమైన సయ్యద్ పేరును కలిగి ఉన్న నస్రల్లా మరణం హెజ్‌బొల్లాకు భారీ దెబ్బే. పశ్చిమాసియాలో ప్రభావం చూపగల వ్యక్తిగా పేరొందిన నస్రల్లా బీరుట్ తూర్పు శివారు ప్రాంతంలోని బౌర్జ్ హమౌద్‌లో జన్మించాడు. బాల్యం అక్కడే గడిచింది. అతడి తండ్రి అబ్దుల్ కరీం ఓ చిన్న కూరగాయల దుకాణం నడిపేవాడు. తొమ్మిది మంది తోబుట్టువుల్లో పెద్ద వాడైన నస్రల్లా.. చిన్నప్పుడే మత విద్యను అభ్యసించాడు. ఇరాక్‌లోని నజాఫ్‌లో ఉన్న మత విద్యా సంస్థలో 3 ఏళ్లపాటు చదువుకున్నాడు. 16 ఏళ్ల వయసులోనే షియా పొలిటికల్, పారామిలిటరీ గ్రూప్ అయిన అమల్ ఉద్యమంలో చేరాడు. ఫాతిమా యాసిన్‌ను పెళ్లి చేసుకున్నాడు. అతడికి నలుగురు పిల్లలున్నారు.

ఇరాక్ నుంచి బహిష్కరణ



షియాల తరఫున ఆందోళనల్లో పాల్గొంటున్నాడని పేర్కొంటూ నస్రల్లాను 1978లో సద్దాం హుస్సేన్ ఇరాక్ నుంచి బహిష్కరించాడు. అప్పుడే తన రాజకీయ మెంటార్ అబ్బాస్ అల్-ముసావీతో పరిచయం ఏర్పడింది. లెబనాన్‌ను ఇజ్రాయెల్ ఆక్రమించడంతో 1982 జూన్‌లో హెజ్‌బొల్లా ఏర్పాటైంది. అమల్‌లో పొందిన శిక్షణతో హెజ్‌బొల్లా బాధ్యతలను నస్రల్లా చేపట్టాడు. 1992లో ఇజ్రాయెల్ జరిపిన హెలికాప్టర్ దాడిలో ముసావీ మృతి చెందడంతో హెజ్‌బొల్లా అధినేతగా నస్రల్లా నియమితుడయ్యాడు. అప్పుడు అతడి వయసు 32 ఏళ్లు.

పవర్ బ్రోకర్‌గా..

లెబనాన్ రాజకీయాల్లో అత్యంత ప్రభావిత పవర్ బ్రోకర్‌గా నస్రల్లా ఎదిగాడు. ఆరోగ్యం, విద్య, సామాజిక సేవా కార్యక్రమాల్లో అతడిదే ఆధిపత్యం. ఇరాన్ ప్రాంతీయ శక్తిగా ఎదగడానికి సహకరించాడు. జెరూసలెంకు స్వేచ్ఛ కల్పించాలనేది అతడి లక్ష్యం. ఇందుకోసం యూదులంతా తమ స్వదేశాలకు వెళ్లి పోవాలని, అప్పుడు ఏకైక పాలస్తీనాలో ముస్లింలు, యూదులు, క్రైస్తవులు స్వేచ్ఛగా నివసిస్తారని అంటుండేవాడు. రాజకీయ, మిలిటెంట్ నేతగా ఎదిగిన నస్రల్లా.. లెబనాన్ సరిహద్దులు దాటి ప్రభావంచూపే నేతగా ఎదిగాడు.

■ దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఇజ్రాయెల్‌తో హెజ్‌బొల్లా చేసిన భీకర పోరాటాల తర్వాత నస్రల్లా పేరు అరబ్ దేశాల్లో మార్మోగింది. 18 ఏళ్లపాటు దక్షిణ లెబనాన్‌ను ఆక్రమించుకున్న ఇజ్రాయెల్ దళాలు 2000లో జరిగిన యుద్ధం తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయాయి. నాటి పోరులో నస్రల్లా నేతృత్వంలో హెజ్‌బొల్లా కీలక పాత్ర పోషించింది. ఆ తర్వాత 2006లో లెబనాన్‌లో 34 రోజులపాటు జరిగిన యుద్ధంలో ఇజ్రాయెల్‌ను ఓడించడంలో అతడు కీలక పాత్ర పోషించాడు. అప్పటి నుంచే ఇజ్రాయెల్‌కు బద్ధ శత్రువుగా మారాడు.

ఎప్పుడూ బంకర్లలోనే!

నస్రల్లాను అంతమొందించేందుకు ఇజ్రాయెల్ అనేక సార్లు ప్రయత్నించింది. ఈ హత్యాయత్నాల నుంచి తప్పించుకునేందుకు అతడు ఎప్పుడూ బంకర్లలోనే ఉండేవాడంటారు. ఇప్పటికీ అతడి స్థిర నివాసం ఎక్కడదన్నది ఎవరికీ స్పష్టంగా తెలియదు.

ప్రాంతీయ యుద్ధభయం?

- మరింత తీవ్రం కానున్న ఇజ్రాయెల్, హెజ్‌బొల్లా ఘర్షణ
- గట్టిగా మద్దతివ్వనున్న ఇరాన్!

హెజ్‌బొల్లా అధినేత నస్రల్లా హత్యతో పశ్చిమాసియా ప్రాంతీయ యుద్ధం దిశగా పయనిస్తోందనే అనుమానాలు బలపడుతున్నాయి. హమాస్‌కు మద్దతుగా దాదాపు ఏడాదిగా ఇజ్రాయెల్‌పై పోరాడుతున్న బలమైన హెజ్‌బొల్లాకు నస్రల్లా మృతితో గట్టి దెబ్బ తగిలింది. దీంతో హెజ్‌బొల్లా మరింత తీవ్రంగా ఇజ్రాయెల్‌పై విరుచుకుపడే అవకాశముంది. దీనికి ఇరాన్ గట్టిగా మద్దతిచ్చే అవకాశముంది. నస్రల్లాకు లెబనాన్‌లోనే కాకుండా సిరియా, ఇరాన్‌లలోనూ మద్దతుంది. ఇది ప్రాంతీయ యుద్ధానికి దారితీసే అవకాశముందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

■ ప్రాంతీయ యుద్ధంలో ఇరాన్ పాల్గొనే అవకాశం లేకపోలేదని ఈ ప్రాంత రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

■ ఇజ్రాయెల్‌పై యెమెన్, లెబనాన్, సిరియా తీవ్రంగా విరుచుకుపడే అవకాశముంది. ఈ దాడులకు ఇరాన్ అండగా నిలవనుంది.

■ ఇరాన్‌ను బలహీనపరచాలనే లక్ష్యంతో ఉన్న ఇజ్రాయెల్.. దీనిని ప్రాంతీయ యుద్ధంగా మార్చాలని చూస్తోంది. తద్వారా అమెరికాను రంగంలోకి దింపాలనేది దాని వ్యూహం.

■ ప్రత్యర్థులు అణు బాంబులను వినియోగించే దాకా ఇరాన్ వాటిని ప్రయోగించే అవకాశం లేదు. ఎందుకంటే ఆ దేశం దగ్గర అవి ఉన్నాయా లేదా అనేది తెలియడం లేదు. ఈ విషయాన్ని తెలుసుకోవాలని ఇజ్రాయెల్ కూడా ప్రయత్నిస్తోంది.



ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో శనివారం ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న నిరసనకారులు

బలంగానే హెజ్‌బొల్లా

ఇటీవల హెజ్‌బొల్లా కీలక కమాండర్లలో దాదాపు అందరినీ ఇజ్రాయెల్ మట్టుబెట్టింది. అయినా ఇంకా చాలా మంది ఆ మిలిటెంట్ సంస్థలో ఉన్నారు. ఆయుధాలను ఎలాగూ ఇరాన్ సరఫరా చేస్తుంది. గైడెడ్, దీర్ఘ శ్రేణి క్షిపణులు దాని దగ్గర ఉన్నాయి. ఇజ్రాయెల్ సైనిక, పౌర లక్ష్యాలను అది దెబ్బతీయగలదు. గతంలోనూ దాడులతో ఇజ్రాయెల్‌ను దెబ్బతీసింది. ఉత్తర ఇజ్రాయెల్‌పై కొద్ది రోజుల్లో దాడి జరగడం ఖాయమని హెజ్‌బొల్లా వ్యవహారాలను అధ్యయనం చేసే అమల్ సాద్ అభిప్రాయపడ్డారు. గత బుధవారం బాలిస్టిక్ క్షిపణితో ఏకంగా టెల్ అవీవ్‌పైనే హెజ్‌బొల్లా దాడికి దిగడం దీనికి ఉదాహరణ అని ఆయన వ్యాఖ్యానించారు.



ఈ ఒక్క నైపుణ్యం ఉంటే మీకు తిరుగుండదు

మీరు ఎలాంటి నైపుణ్యాలు నేర్చుకోవాలనుకున్నా, ఏ రంగంలో స్థిరపడాలనుకున్నా అన్నింటికన్నా ముందు నేర్చుకోవాల్సిన శక్తిమంతమైన నైపుణ్యం ఒకటుంది. అదేంటంటే ఎలాంటి కఠిన పరిస్థితులు ఎదురైనా, ఎన్ని అవాంతరాలు వచ్చినా మీ ప్రయత్నాలను ఆపకపోవడం. మీ పనులు ప్రణాళిక ప్రకారం సాగకపోయినా, మీ బృందసభ్యులు నిరుత్సాహంతో తప్పుకొంటున్నా మీరు మాత్రం వెనకడుగు వేయొద్దు. ప్రయత్నాలను ఆపేద్దామనే ఆలోచన వచ్చిందంటే మీలో ఎన్ని నైపుణ్యాలున్నా వృధానే.

– కీగెన్ హ్యాడ్లీ, స్ట్రాటజిక్ స్టోరీ టెల్లర్

ఉగ్రవాదుల కాల్పుల్లో హెడ్ కానిస్టేబుల్ మృతి

అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌కు గాయాలు

జమ్ము: ఉగ్రవాదులతో జరిగిన పోరాటంలో ఓ హెడ్‌కానిస్టేబుల్ ప్రాణాలు కోల్పోగా.. అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్(ఏఎస్సై) గాయపడ్డారు. జమ్మూ-కశ్మీర్‌లోని కఠువా జిల్లాలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. జిల్లాలోని కోగ్-మండ్లి గ్రామంలో పోలీసులు, భద్రతా బలగాలు సంయుక్తంగా గాలింపు చేపట్టాయని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో ముష్కరులు, పోలీసుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయని వెల్లడించారు. ఈ ఘటనలో ఓ హెడ్‌కానిస్టేబుల్ మృతిచెందగా. . ఏఎస్సై గాయపడ్డారని పేర్కొన్నారు.

కుల్గాం జిల్లాలో ఇద్దరు ముష్కరుల హతం

శ్రీనగర్: జమ్మూ-కశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో ఇద్దరు ముష్కరులను భద్రతాదళాలు మట్టుబెట్టాయి. ఈ ఘటనలో ఓ అధికారి సహా ఐదుగురు భద్రతా సిబ్బంది కూడా గాయపడినట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు.

జమ్మూకశ్మీర్‌లో పూర్తి మెజారిటీతో
భాజపా సర్కారు ఖాయం: మోదీ



జమ్మూ: జమ్మూకశ్మీర్ ఎన్నికల్లో భాజపా విజయం సాధిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. జమ్మూలోని మౌలానా ఆజాద్ స్టేడియంలో శనివారం నిర్వహించిన తుదివిడత ఎన్నికల ప్రచారసభలో మోదీ మాట్లాడారు. "జమ్మూకశ్మీర్‌లో మొదటిసారిగా భాజపా ప్రభుత్వం ఏర్పాటు కానుంది. పూర్తి మెజారిటీతో అధికారంలోకి వస్తాం" అని విశ్వాసం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీని అర్బన్ నక్సల్స్ ప్రభావితం చేస్తున్నారని ప్రధాన ప్రతిపక్షంపై మరోమారు విరుచుకుపడ్డారు. ఎన్సీ, పీడీపీ, కాంగ్రెస్ పార్టీలు రాజ్యాంగానికి అతిపెద్ద శత్రువులని.. ఈ మూడు కుటుంబ పార్టీలను ప్రజలు మళ్లీ కోరుకోవడం లేదన్నారు. జమ్మూకశ్మీర్ ప్రజలు శాంతిని కోరుకుంటున్నారని.. అవినీతి, ఉగ్రవాదం, వేర్పాటువాదం ఊసు లేని ప్రభుత్వం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఇక్కడి పిల్లలకు మంచి భవిష్యత్తు కావాలని ఆశిస్తున్నారన్నారు. తొలి రెండు దశల్లో భారీ పోలింగు నమోదవడం దీనికి సూచికగా ప్రధాని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా మార్చిన నిర్ణయం తాత్కాలికమేనని, త్వరలో భాజపా సర్కారు ఈ ప్రాంత రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తుందన్నారు. దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన జవాన్ల విలువ కాంగ్రెస్‌కు తెలియదంటూ ఆ పార్టీపై మోదీ ధ్వజమెత్తారు. "2016లో ఇదే రోజున (సెప్టెంబరు 28) సర్జికల్ స్ట్రైక్ జరిగింది. శత్రువుల భూభాగంలోకి వెళ్లి దాడి చేయగలిగిన సరికొత్త భారత్‌ను నాడు ప్రపంచమంతా చూసింది. ఈ దాడులపై కాంగ్రెస్ పాక్ భాషలో మాట్లాడి ఆధారాలు కోరింది" అని ప్రధాని విమర్శించారు.

అమరుల కుటుంబాలకు
రూ.2 కోట్లు

- రైతు సంక్షేమానికి కొత్తగా కమిషన్
- హరియాణాకు కాంగ్రెస్ మరిన్ని హామీలు

చండీగఢ్: హరియాణాకు చెందిన సైనికులు దేశం కోసం ప్రాణత్యాగం చేయాల్సి వస్తే వారి కుటుంబాలకు రూ.2 కోట్ల చొప్పున పరిహారం ప్రకటిస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. రైతు సంక్షేమానికి కొత్తగా ఒక కమిషన్‌ను నియమిస్తామని, వారికి డీజిల్‌ను రాయితీపై సరఫరా చేస్తామని తెలిపింది. శాసనసభ ఎన్నికల ప్రణాళికలో ఏడు గ్యారంటీలను ఇదివరకే పేర్కొన్న కాంగ్రెస్ పార్టీ తాజాగా దానికి మరిన్ని చేర్చింది. హరియాణా పీసీసీ అధ్యక్షుడు ఉదయ్ భాన్, శాసనసభ విపక్ష నేత భూపీందర్‌సింగ్ హుడ్డా, రాజస్థాన్ మాజీ సీఎం అశోక్ గహ్లోత్ తదితర నాయకులు శనివారం వీటిని విడుదల చేశారు. అన్ని వర్గాలతో చర్చించి, ఆర్థిక భారాన్ని గమనంలో తీసుకుని కొత్త హామీలు ఇస్తున్నట్లు వారు తెలిపారు. సాగు చట్టాల రద్దు కోసం పోరాటంలో అమరులైన రైతులకు స్మారక చిహ్నం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది.


హరియాణా సంపదను భాజపా లాక్కొంది: రాహుల్

దిల్లీ: పదేళ్లుగా హరియాణా కష్టాల్లో ఉందని, త్వరలో అధికారంలోకి రానున్న తమ ప్రభుత్వం వాటిని తీర్చి ప్రజాకాంక్షలను నెరవేరుస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికల అదనపు మ్యానిఫెస్టో విడుదల అనంతరం శనివారం ఆయన 'ఎక్స్'లో భాజపాపై విమర్శలు గుప్పించారు. "హరియాణా ప్రజల కలల్ని, సంపదను, అధికారాన్ని భాజపా లాగేసుకుంది. యువత ఆశల్ని అగ్నివీర్ పథకం, నిరుద్యోగం; మహిళల స్వయం సమృద్ధిని ద్రవ్యోల్బణం దూరం చేశాయి. రైతుల హక్కుల్ని నల్ల చట్టాలు, చిన్న వ్యాపారస్థుల లాభాలను పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ దెబ్బతీశాయి" అని దుయ్యబట్టారు.

ఎయిరిండియా భోజనంలో బొద్దింక



దిల్లీ: ఎయిరిండియా విమానంలో ప్రయాణికులకు సరఫరా చేసిన ఆహారంలో బొద్దింక కనిపించిందని ఓ ప్రయాణికురాలు ఆందోళన వ్యక్తం చేస్తూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'సెప్టెంబరు 17న దిల్లీ నుంచి న్యూయార్క్ వెళ్తున్న విమానం ఆన్‌బోర్డ్ భోజనంలో మేము బొద్దింకను కనుగొనే సమయానికి నాతోపాటు నా రెండేళ్ల బిడ్డ సగానికిపైగా ఆమ్లెట్ తిన్నాం. ఫుడ్ పాయిజన్‌తో ఇబ్బంది పడ్డాం' అని ఆమె తెలిపారు. విమానంలో అందించిన ఆహార పదార్థాల వీడియో, చిత్రాలను జత చేసి ఎయిరిండియా, ఏవియేషన్ రెగ్యులేటర్ డీజీసీఏ, విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడులకు తన ఫిర్యాదును ట్యాగ్ చేశారు. దీనిపై ఎయిరిండియా స్పందించింది. 'మీరు పడ్డ ఇబ్బంది గురించి ఆందోళన చెందుతున్నాం. తదుపరి దర్యాప్తు కోసం క్యాటరింగ్ సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించాం. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటాం' అని తెలిపింది.



దిల్లీలో శనివారం సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభలో మాట్లాడుతున్న లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ. చిత్రంలో సీపీఐ నాయకుడు డి.రాజా, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీపీఎం నాయకుడు ప్రకాశ్ కారాట్, డీఎంకే నాయకురాలు కనిమొళి, ఎన్సీపీ నాయకురాలు సుప్రియా సూలే తదితరులు

ఇండియా కూటమి ఏర్పాటులో
ఏచూరి పాత్ర కీలకం

- సంస్మరణ సభలో విపక్ష నేతల నివాళి

దిల్లీ: ఇండియా కూటమిగా ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకతాటిపైకి రావడం వెనుక సీపీఎం ప్రధాన కార్యదర్శిగా సీతారాం ఏచూరి కీలక పాత్ర పోషించారని విపక్ష నేతలు కొనియాడారు. ఆయన మరణం తమ కూటమికి తీరని లోటని అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ సెప్టెంబరు 12న తుదిశ్వాస విడిచిన ఏచూరి సంస్మరణ సభను శనివారం ఇక్కడ నిర్వహించారు. లోకసభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సహా ఇండియా కూటమి నేతలు పలువురు హాజరై ఏచూరి స్మృతికి నివాళులు అర్పించారు. యూపీఏ సర్కారులో, తాజాగా విపక్ష కూటమి ఏర్పాటులోనూ కాంగ్రెస్ పార్టీకి, ఇతర పార్టీలకు కనిపించని వారధిలా పనిచేసిన ఏచూరిని రాజకీయ వ్యవస్థను నడిపిన మిత్రుడిగా తాను గుర్తు చేసుకొంటానని రాహుల్‌గాంధీ తెలిపారు. సోనియాగాంధీతో పలుమార్లు సమావేశమై విభిన్న పార్టీలను ఒకే గొడుగు కిందికి ఏచూరి తెచ్చారని, ఇది తమ ఘనతే అని చెప్పు కొన్న వ్యక్తులు మాత్రం బయటకు వెళ్లిపోయారని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. బిహార్ సీఎం నీతీశ్‌ను దృష్టిలో పెట్టుకొని ఖర్గే ఈ పరోక్ష వ్యాఖ్యలు చేశారు.

జ్యోతిబసు ప్రధాని అయితే భారత్ ఇలా ఉండేది కాదు

"వామపక్షాలపై నాకు చాలా ఫిర్యాదులు ఉన్నాయి. 1996లో పశ్చిమబెంగాల్ సీఎం జ్యోతిబసును ప్రధాని చేసే అవకాశం వచ్చినా వీళ్లు నిరాకరించారు. ఆరోజు జ్యోతిబసు ప్రధానిగా బాధ్యతలు స్వీకరించి ఉంటే భారత్ నేడు ఇలా ఉండేది కాదు" అని జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, ఎన్సీ అధినేత ఫరూఖ్ అబ్దుల్లా అన్నారు. సోషలిస్టు భారతదేశం కోసం ఏచూరి కలలు కన్నారని సీపీఎం సీనియర్ నేత ప్రకాశ్ కారాట్ తెలిపారు. భారతదేశ చరిత్ర, రాజకీయాలపై ఎంతో అవగాహన ఉన్న మార్క్సిస్టు సిద్ధాంతకర్తగా ఏచూరిని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అభివర్ణించారు. ఇంకా ఇండియా కూటమిలోని పలు పార్టీల నేతలు మాట్లాడారు. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కారాట్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆర్థికవేత్త ప్రభాత్ పట్నాయక్, సామాజిక కార్యకర్త తీస్తా సీతల్వాద్, 'ది హిందూ' మాజీ ఎడిటర్ ఇన్ చీఫ్ ఎన్.రామ్ సైతం సభలో పాల్గొని ప్రసంగించారు.

అధినేతలే లక్ష్యం!

- పలువురి హతం
- గురితప్పని ఇజ్రాయెల్

ఈనాడు ప్రత్యేక విభాగం

పశ్చిమాసియాలో తమతో ఘర్షణ పడే దేశాల్లోని నేతలను, మిలిటెంట్ సంస్థల అధిపతులను అంతమొందించడంలో ఇజ్రాయెల్ ప్రణాళిక ప్రకారం వ్యవహరిస్తుంటుంది. ప్రపంచంలో ఎక్కడున్నా వారిని లక్ష్యంగా చేసుకుని దాడులు చేసి చంపుతుంది. ఆ దేశ గూఢచార సంస్థ మొస్సాద్‌ది అందెవేసిన చేయి. ఇజ్రాయెల్ చేసిన ఆపరేషన్లలో ముఖ్యమైన దాడులివీ..

■ 11 మంది ఇజ్రాయెల్ అథ్లెట్లను చంపినందుకు ప్రతీకారంగా 1972లో పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్ (పీఎల్‌వో) ఇటలీ ప్రతినిధి అబ్దుల్ వాయెల్‌ను రోమ్‌లో మొస్సాద్ ఏజెంట్లు కాల్చేశారు.

■ 1973 ఏప్రిల్ 9న లెబనాన్ రాజధాని బీరుట్‌లో ఫతా నిఘా సంస్థ నేత అబు యూసుఫ్‌ను అంతమొందించింది.

■ 1988లో పీఎల్‌వో ఉప నేత ఖలీల్ అల్ వజీర్‌ను (అబు జిహాద్) టునీసియాలో చంపేసింది.



లెబనాన్‌లోని షుయేఫాట్ నగరంపై శనివారం ఇజ్రాయెల్ వైమానిక దాడి చేయడంతో నామరూపాల్లేకుండా ధ్వంసమైన భవనం

■ 1992లో హెజ్‌బొల్లా నేత అబ్బాస్ అల్-ముసావీని హెలికాప్టర్ దాడితో ఇజ్రాయెల్ చంపేసింది.

■ 2004లో హమాస్ సహ వ్యవస్థాపకుడు, మత గురువు అయిన అహ్మద్ యాసిన్‌ను మొస్సాద్ అంతమొందించింది.

■ 2008లో హెజ్‌బొల్లా మిలిటరీ చీఫ్ ఐమద్‌ను కారు బాంబుతో చంపేసింది.

■ 2024 జనవరి 8న హెజ్‌బొల్లా రాద్వాన్ యూనిట్ చీఫ్ విస్సం హసన్ అల్ తావిల్‌ను ఇజ్రాయెల్ హతమార్చింది.

■ 2024 జనవరి 9న హెజ్‌బొల్లా వైమానిక దళ కమాండర్ అలీ హుస్సేన్ బుర్జీ హతమయ్యాడు.

■ 2024 మార్చి 29న హెజ్‌బొల్లా రాకెట్ విభాగం డిప్యూటీ కమాండర్ అలీ అబేద్ అక్షన్ నాయమ్ హతమయ్యాడు.

■ 2024 మార్చి 31న సీనియర్ కమాండర్ ఇస్మాయిల్ అల్ జిన్‌ను ఇజ్రాయెల్ చంపేసింది.

■ 2024 మే 15న హెజ్‌బొల్లా దక్షిణ ప్రాంత సీనియర్ కమాండర్ హుస్సేన్ మక్కీని చంపేసింది.

■ 2024 జూన్ 12న హెజ్‌బొల్లా సీనియర్ కమాండర్ తాలెబ్ అబ్దుల్లా హతమయ్యాడు.

■ 2024 జులై 3న హెజ్‌బొల్లా సీనియర్ కమాండర్ మహమ్మద్ నాజర్ ఇజ్రాయెల్ దాడిలో మృతి చెందాడు.

■ 2024 జులై 30న హెజ్‌బొల్లా టాప్ కమాండర్ ఫవాద్ షుకుర్‌ను హతమార్చింది.

■ 2024 జులై 31న హమాస్ రాజకీయ వ్యవహారాల చీఫ్ ఇస్మాయిల్ హనియేను ఇరాన్‌లో అంతమొందించింది.

■ 2024 సెప్టెంబరు 20న హెజ్‌బొల్లా ఆపరేషన్స్ కమాండర్ ఇబ్రహీం అఖీల్‌ను హతమార్చింది.

■ 2024 సెప్టెంబరు 25న హెజ్‌బొల్లా నేత ఖుబైసీని అంతమొందించింది.

■ 2024 సెప్టెంబరు 26న హెజ్‌బొల్లా డ్రోన్ విభాగం చీఫ్ మహమ్మద్ సురూర్‌ను ఇజ్రాయెల్ హతమార్చింది.

■ 2024 సెప్టెంబరు 27న బీరుట్‌లో జరిపిన దాడిలో హెజ్‌బొల్లా చీఫ్ హసన్ నస్రల్లాను చంపేసింది.

2.55 లక్షల పంచాయతీల్లో
అక్టోబరు 2న గ్రామసభలు

దిల్లీ: పంచాయతీలు వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26) వాటి అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయడంలో మార్గనిర్దేశం చేసేందుకు అక్టోబరు 2న దేశవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించనున్నట్లు కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వశాఖ తెలిపింది. 'సబ్‌కీ యోజన.. సబ్‌కా వికాస్' అభియాన్ కింద దేశవ్యాప్తంగా 2.55 లక్షల గ్రామ పంచాయతీలు, 6,700 బ్లాక్ పంచాయతీలు, 665 జిల్లా పంచాయతీల్లో ఈ శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొంది. ఐఐటీ దిల్లీ సమన్వయంతో 20 వేల మంది కళాశాల విద్యార్థులు ఈ అభియాన్‌లో భాగస్వాములు కానున్నారు. గ్రామసభలకు ముందస్తు కసరత్తుగా సోమవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ శాఖలు, శిక్షణ సంస్థల బోధకులు, పంచాయతీల ప్రజాప్రతినిధులతో కేంద్ర పంచాయతీరాజ్ శాఖ జాతీయ కార్యశాల నిర్వహించనుంది.

దక్షిణాఫ్రికాలో కాల్పులు..
17 మంది మృతి

జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాలో ఘోరం చోటుచేసుకుంది. ఒకే పట్టణంలో జరిగిన రెండు సామూహిక కాల్పుల ఘటనలో 17 మంది మృత్యువాత పడ్డారు. ఈ ఘటనలో 15 మంది మహిళలు సహా, మరో ఇద్దరు పురుషులు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. ఆగ్నేయ దక్షిణాఫ్రికాలోని ఈస్టర్న్ కేప్ ప్రావిన్సు లుసికిసికి పట్టణం శివారులో పక్కపక్కనే ఉన్న రెండు ఇళ్లలో శుక్రవారం రాత్రి ఈ కాల్పులు జరిగినట్లు పేర్కొన్నారు. మొదటి ఇంట్లో ఓ పురుషుడితో పాటు 12 మంది మహిళలు.. మరో ఇంట్లో ముగ్గురు మహిళలు, ఓ పురుషుడు చనిపోయారని పోలీసులు వెల్లడించారు. ఈ హేయమైన హత్యల వెనుక ఉన్న వారిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

నస్రల్లా హతం మాకు అతి ముఖ్యం: నెతన్యాహు

బీరుట్: హెజ్‌బొల్లా అధినేత హసన్ నస్రల్లాను అంతమొందించడం తమ యుద్ధ లక్ష్యాలను సాధించడంలో అతిముఖ్యమైన విషయమని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు వ్యాఖ్యానించారు. నస్రల్లా హత్యానంతరం ఈ ఘటనపై నెతన్యాహు మొదటిసారిగా శనివారం బహిరంగంగా స్పందించారు. హెజ్‌బొల్లాకు చెందిన ఇతర టాప్ కమాండర్లను తాము చంపినా, నస్రల్లాయే అసలు లక్ష్యమన్నారు. ఇజ్రాయెల్‌ను నాశనం చేయాలన్న ప్రణాళికకు సూత్రధారిగా అతడు వ్యవహరించాడని నెతన్యాహు దుయ్యబట్టారు.

సీబీఎస్‌ఈ పరీక్షలకు
సీసీ టీవీ నిఘా

ఇంటర్నెట్ డెస్క్: వచ్చే ఏడాది నిర్వహించనున్న 10, 12 బోర్డు పరీక్షలను సీసీ టీవీ నిఘాలో జరపాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) నిర్ణయించింది. ఈ మేరకు అనుబంధ పాఠశాలలకు ఆదేశాలు జారీ చేసింది. పరీక్ష కేంద్రాల్లో నిఘా కెమెరాలు తప్పనిసరి అని ఓ ప్రకటనలో వెల్లడించింది. 2025లో సీబీఎస్‌ఈ పరీక్షలకు భారత్‌తోపాటు 26 దేశాల్లో కలిపి సుమారు 44 లక్షలమంది హాజరవుతారని బోర్డు అంచనా. ఈ మేరకు సుమారు 8,000 పాఠశాలల్ని పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేసింది. ఈ కేంద్రాల్లో సీసీ టీవీ నిఘా తప్పనిసరి చేస్తూ ఆయా పాఠశాలలకు తాజాగా ఆదేశాలు జారీ చేసింది. సీసీటీవీ సౌకర్యం లేని ఏ పాఠశాలనూ పరీక్ష కేంద్రంగా పరిగణించేది లేదని స్పష్టం చేసింది. రికార్డ్ ఫుటేజీ సంబంధిత అధికారులు మాత్రమే చూసేందుకు వీలుంటుందని, పరీక్ష ఫలితాలు వచ్చిన రెండు నెలల వరకు ఈ ఫుటేజీ భద్రంగా ఉంటుందని పేర్కొంది. ప్రతి పది గదులకు లేదా 240 మంది విద్యార్థుల బాధ్యత తీసుకొనేందుకు ప్రత్యేకంగా ఓ అధికారిని నియమిస్తున్నట్లు తెలిపింది. సీసీటీవీ విధానం ద్వారా పారదర్శకత, పర్యవేక్షణ సామర్థ్యాలు పెరుగుతాయని సీబీఎస్‌ఈ భావిస్తోంది.

హింస గురించి పాక్ మాట్లాడటం వంచనే

- షెహబాజ్ వ్యాఖ్యలపై ధ్వజమెత్తిన భారత్

వాషింగ్టన్: ఐక్యరాజ్య సమితి (ఐరాస)లో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కశ్మీర్ అంశాన్ని లేవనెత్తడంపై భారత్ తీవ్రంగా స్పందించింది. ఉగ్రవాదం, మాదకద్రవ్యాల వ్యాపారం, అంతర్జాతీయ నేరాల్లో కీర్తి గడించిన పాక్.. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంపై విమర్శలు చేస్తోందంటూ భారత్ దీటుగా సమాధానమిచ్చింది. "మా దేశ పార్లమెంటుపై, ఆర్థిక రాజధాని ముంబయిపై, తీర్థయాత్ర మార్గాలపై పాకిస్థాన్ ఉగ్ర దాడులు చేసింది. ఇలా చెప్పుకొంటూ పోతే ఆ జాబితా చాలా పెద్దదే. ఇటువంటి దేశం హింసపై మాట్లాడటం వంచనే' అంటూ ఐక్యరాజ్య సమితి సర్వ ప్రతినిధి సభలో భారత కార్యదర్శి భవికా మంగళానందన్ పాక్ తీరును ఎండగట్టారు. 'పరస్పర వ్యూహాత్మక నియంత్రణ పాలన' కోసం తమ ప్రతిపాదనలను భారత్ తిరస్కరించిందన్న పాక్ ప్రధాని షరీఫ్ వ్యాఖ్యలపై స్పందిస్తూ.. ఉగ్రవాదంతో పొత్తు కుదరదని ఆమె తేల్చి చెప్పారు. 'వాస్తవమేమిటంటే.. ఆ దేశం మా భూభాగాన్ని కోరుకుంటోంది. జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలకు అవాంతరం కలిగించేందుకు నిరంతరం ఉగ్రవాదాన్ని ఉపయోగిస్తోంది' అని మంగళానందన్ అన్నారు. సిమాంతర ఉగ్రవాదాన్ని పొరుగుదేశాలపై ఆయుధంగా పాక్ ఎలా వినియోగించుకుంటుందో ప్రపంచానికి తెలుసన్నారు.

ముంబయికి ఉగ్రముప్పు హెచ్చరికలు

- మహారాష్ట్ర పోలీసులు అప్రమత్తం

ముంబయి: దేశ వాణిజ్య రాజధాని ముంబయికి ఉగ్రముప్పు పొంచి ఉన్నట్లు కేంద్ర నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. దీంతో మహారాష్ట్ర పోలీసులు అప్రమత్తమయ్యారు. ముంబయి వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రార్థనా మందిరాలు, ఇతర రద్దీ ప్రాంతాల్లో ముమ్మరంగా సోదాలు నిర్వహించారు. వివిధ జోన్లకు చెందిన డీసీపీలు తమ ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉన్నతాధికారులు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం వస్తే ముందుజాగ్రత్త చర్యగా తమకు తెలియజేయాలని పేర్కొన్నారు. వివిధ ముఖ్యమైన ప్రదేశాల్లో పోలీసు బలగాలు పెద్ద ఎత్తున మోహరించాయి. ముంబయిలో ఏటా దుర్గా పూజ, దీపావళి పండగలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ సమయంలో ఉగ్రముప్పు హెచ్చరికలు రావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.

ఆనందం.. 'వరి'ంచింది

నంద్యాల జిల్లా అవుకు రిజర్వాయర్ ప్రాంతంలో రైతులు వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ ప్రాంతంలో చుట్టూ కొండల నడుమ పంట పొలాలు పచ్చని తివాచీ పరిచినట్లు కనువిందు చేస్తున్నాయి. సుమారు మూడువేల ఎకరాల్లో వరి సాగవుతోంది. అవుకు జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 4.18 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.4 టీఎంసీలు ఉంది.

– ఈనాడు, కర్నూలు



ఒకవైపు అవుకు జలాశయం.. మరోవైపు పంట పొలాల సోయగం

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



ఆలయం ఎదుట కుటుంబసభ్యులతో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.కృష్ణమోహన్

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.కృష్ణమోహన్ శనివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ దర్శనం సమయంలో కుటుంబసభ్యులతో శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం, తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు

న్యాయవాదుల సమస్యలు పరిష్కరిస్తాం

న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు

కర్నూలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే: న్యాయవాదుల సమస్యలు పరిష్కరిస్తామని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు అన్నారు. శనివారం ఆయన కర్నూలులో జిల్లా బార్ అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, కార్యదర్శి రవికాంత్‌ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. న్యాయవాదులు కొత్త చట్టాలపై పట్టు సాధించి ప్రజలకు న్యాయవ్యవస్థపై నమ్మకం పెంపొందించాలన్నారు. న్యాయవ్యవస్థ పటిష్ఠంగా ఉండాలంటే న్యాయమూర్తులు, న్యాయవాదులు సమష్టిగా పని చేయాలన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన న్యాయవాదుల నుంచి అర్జీలు తీసుకున్న ఆయన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.



మీ తొలి ఉద్యోగం ఎలా ఉండాలి?

యువతకు నాదో సలహా. కెరీర్ ఆరంభంలో మీరు ఎక్కువ వేతనం ఇచ్చే ఉద్యోగాల కోసం వెంపర్లాడకండి. ఉత్తమ శిక్షణ, అద్భుతమైన వృద్ధి అవకాశాలు, విస్తృత నెట్‌వర్కింగ్‌లో అంతర్భాగమయ్యే వాతావరణాన్ని కల్పించే ఉద్యోగాలపై దృష్టి పెట్టండి. దీర్ఘకాలంలో మీ విలువ పెరిగేది మీరు సంపాదించే డబ్బుపై కాదు, మీరు నేర్చుకొనే విభిన్న నైపుణ్యాలపై ఆధారపడి ఉంటుంది.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

సెయిల్‌లో విలీనానికి సాంకేతిక సమస్యలు

- అయినా ముందుకే వెళ్తున్నాం
- విశాఖ ఉక్కు భవిష్యత్తుపై కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ



ఈనాడు, దిల్లీ: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేయడానికి కొన్ని సాంకేతిక సమస్యలు అడ్డంకిగా ఉన్నాయని, అయినా ముందుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నట్లు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ చెప్పారు. పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ అయిన సెయిల్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న అన్ని సంస్థలూ లాభాల్లో నడుస్తున్నాయని, అందులో విశాఖ ఉక్కును విలీనం చేసే విషయమై చర్చలు సాగుతున్నట్లు చెప్పారు. ఆయన శనివారం ఇక్కడ విలేకర్లతో మాట్లాడారు. 'రెండు మూడేళ్ల తర్వాత మరో ప్యాకేజీ అవసరం రాకుండా శాశ్వత పరిష్కారం కనుక్కొని, విశాఖ ఉక్కు పరిశ్రమను లాభాల్లో నడిపించి, ఉద్యోగులకు భద్రత కల్పించేందుకు కసరత్తు చేస్తున్నాం. కేంద్రం ద్వారా సాయం అందించి, లాభాల్లోకి తీసుకురావాలనే దానిపై లోతుగా అధ్యయనం చేస్తున్నాం. రాబోయే రోజుల్లో పరిశ్రమను సొంతకాళ్లపై నిలిపేందుకు కసరత్తు చేస్తున్నాం. దీనిపై సెయిల్ అధికారులతో సమావేశమయ్యాను. అది లిమిటెడ్ కంపెనీ. ప్రస్తుతం నష్టాల్లో ఉన్న విశాఖ ఉక్కును అందులో విలీనం చేసేందుకు కొన్ని సాంకేతిక సమస్యలు వస్తాయి. వాటిని ఎలా అధిగమించవచ్చనే అంశంపై చర్చిస్తున్నాం. విశాఖ స్టీల్‌ప్లాంట్ వద్ద ఉన్న అదనపు భూమిలో 1,500 ఎకరాలను ఎన్‌ఎండీసీకి ఇచ్చి, ఆర్థిక వనరుల్ని సమీకరించుకొని పెల్లెట్ పరిశ్రమను ఏర్పాటుచేయాలనే ఆలోచన ఉంది. దీనిపై ఎన్‌ఎండీసీ ఛైర్మన్‌తో చర్చించాం' అని శ్రీనివాసవర్మ వివరించారు.

తిరుమల ప్రతిష్ఠను జగన్ దెబ్బతీశారు

జగన్ తన పాలనలో తిరుమలను కుటుంబ భక్తుల గుప్పిట్లో పెట్టి స్వామివారి ప్రతిష్ఠను దెబ్బతీశారని శ్రీనివాసవర్మ విమర్శించారు. కల్తీనెయ్యి వివాదంపై విలేకర్ల ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. 'వైవీ సుబ్బారెడ్డిని, భూమన కరుణాకరరెడ్డిని తితిదే ఛైర్మన్లుగా చేసి జగన్ ఇష్టానుసారం వ్యవహరించారు. నెయ్యికల్తీపై వచ్చిన ఆరోపణలు వాస్తవమే. కేంద్రం ఈ విషయంలో చాలా సీరియస్‌గా ఉంది. పరిణామాల్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటోంది. కల్తీనెయ్యి వ్యవహారంలో వాస్తవాలను రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ వెలికితీస్తుంది' అని వర్మ చెప్పారు.

సిలికా, క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలపై సీఐడీ విచారణ!

- అధికంగా పర్మిట్లు తీసుకున్న లీజుదారులు, లైసెన్సుదారులపై దృష్టి
- సీఎం వద్దకు చేరిన దస్త్రం



ఈనాడు, అమరావతి: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో గత వైకాపా ప్రభుత్వంలో.. ఆ పార్టీ నేతల ద్వారా జరిగిన క్వార్ట్జ్, సిలికాశాండ్ దోపిడీపై సీఐడీ విచారణకు రంగం సిద్ధమైంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక గనులశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఏయే లీజుదారులు, మినరల్ డీలర్ లైసెన్సుదారులు (ఎండీఎల్స్) అక్రమాలు చేశారనేది గుర్తించారు. రెండు జిల్లాలోనూ భారీగా దందా చేసిన 49 మంది లీజుదారులు, 133 మంది మినరల్ డీలర్ లైసెన్సుదారులపై సీఐడీ విచారణకు సిఫార్సు చేస్తూ దస్త్రాన్ని సిద్ధం చేశారు. దీనికి గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆమోదం తెలపడంతో.. దస్త్రం సీఎం చంద్రబాబు వద్దకు వెళ్లింది. ఒకటి, రెండు రోజుల్లో క్వార్ట్జ్, సిలికాశాండ్ అక్రమాలపై సీఐడీ విచారణకు ప్రభుత్వం ఆదేశించనున్నట్లు తెలిసింది.

ఒక్క ఏడాదే నాలుగైదు రెట్ల దోపిడీ

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో లభించే హైగ్రేడ్ క్వార్ట్జ్‌కు ఇటీవల అనూహ్యంగా డిమాండ్ ఏర్పడింది. దీంతో గత రెండేళ్లలో వైకాపా నేతలు ఈ లీజుదారులు, మినరల్ డీలర్ లైసెన్సుదారులపై పడ్డారు. ఎడాపెడా దోపిడీ చేశారు. గతంలో ఈ జిల్లా నుంచి ఏటా సగటున లక్ష నుంచి లక్షన్నర టన్నుల క్వార్ట్జ్ తవ్వి తరలించేవారు. ఆ మేరకు గనులశాఖ నుంచి పర్మిట్లు తీసుకునేవారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 6 లక్షల టన్నులకు పైగా క్వార్ట్జ్ తరలించినట్లు గుర్తించారు. వీటిలో కొంత ఖనిజమే అనుమతులున్న లీజుల నుంచి తరలించారని నిర్ధారించారు. ఎక్కువ ఖనిజాన్ని గతంలో తవ్వకాలు నిలిపేసిన లీజుల నుంచి, ప్రభుత్వ, అటవీ, పట్టా భూముల నుంచి తవ్వి తరలించినట్లు తేల్చారు. గత ప్రభుత్వానికి చెందిన ఇద్దరు మాజీ మంత్రులు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయిన ఓ వైకాపా నేత.. ఈ దోపిడీలో కీలకంగా వ్యవహరించారు. ఓ మాజీమంత్రి.. ప్రతి ఒక్కరి నుంచి టన్నుకు రూ.7వేల చొప్పున బలవంతంగా వసూలు చేశారు. ఆ సొమ్ము చెల్లించినోళ్లకే క్వార్ట్జ్ తరలించేందుకు అనుమతించారు. మరో మాజీ మంత్రి ఇతరుల లీజుల్లోకి అక్రమంగా చొరబడి భారీగా క్వార్ట్జ్ తవ్వి తరలించారు. కొందరు మినరల్ డీలర్ లైసెన్సుదారులు కూడా ప్రభుత్వ భూముల్లో తవ్విన క్వార్ట్జ్‌ను కొనుగోలుచేసి, వాటికి పర్మిట్లు తీసుకొని తరలించారు. వీటన్నింటిలో భాగస్వామ్యులైన 29 మంది లీజుదారులు, 30 మంది మినరల్ డీలర్ లైసెన్సుదారులు పెద్దఎత్తున అక్రమాలు చేసినట్లు ప్రాథమికంగా గుర్తించారు. వీరిపై సీఐడీ విచారణ చేయాలని గనుల శాఖ సిఫార్సుచేసింది.

నాలుగు ఎండీఎల్స్ కీలకం..

తిరుపతి జిల్లాలోని చిల్లకూరు, కోట మండలాల్లోని సిలికాశాండ్ వ్యాపారాన్ని వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రాగానే గుప్పిట్లోకి తీసుకుంది. చెన్నై మైనింగ్ వ్యాపారి బంధువులు.. వామన ఎంటర్‌ప్రైజెస్, వామన ఫ్యూచర్‌జెన్, గామ ఎంటర్‌ప్రైజెస్, వెంకటేశ్వరా ఎంటర్‌ప్రైజెస్ పేరిట ఎండీఎల్స్ తీసుకొని.. మూడున్నరేళ్ల పాటు దందా చేశారు. పలు లీజులను తమ చేతుల్లోకి తీసుకొని, సిలికాశాండ్‌ను తవ్వి తరలించారు. ఆ లీజుల పక్కనే ఉన్న ప్రభుత్వ భూముల్లోనూ ఖనిజం తవ్వేశారు. ఇతర మినరల్ డీలర్ లైసెన్సుదారులు.. వీరి నుంచే సిలికాశాండ్ కొనేలా హుకుం జారీచేశారు. టన్నుకు రూ.1,400 వసూలుచేసి, రూ.700కే అధికారికంగా లెక్కచూపారు. తర్వాత వైకాపా కీలక పెద్దలతో వచ్చిన విభేదాలతో.. ఆ నాలుగు మినరల్ డీలర్ లైసెన్సుదారులను పక్కనపెట్టి, స్థానిక నేతల ఆధ్వర్యంలో దోపిడీ చేశారు. మొత్తంగా 20 లీజులు, 103 మినరల్ డీలర్ లైసెన్సుదారుల ద్వారా భారీఎత్తున సిలికాశాండ్ దందా జరిగినట్లు గుర్తించారు.

మిగిలిన వారికి జరిమానాలు..

కొందరు లీజుదారులు, ఎండీఎల్స్.. క్వార్ట్జ్, సిలికాశాండ్‌లో పరిమితంగా ఉల్లంఘనలకు పాల్పడ్డారు. వీరికి గనులశాఖ ద్వారా ఇప్పటికే షోకాజ్ నోటీసులు ఇచ్చారు. వీరికి జరిమానాలతో కూడిన డిమాండ్ నోటీసులు ఇవ్వనున్నారు. ఆ జరిమానాలు చెల్లించిన వారికి.. తాజాగా పర్మిట్లు జారీచేసేందుకు గనులశాఖ సిద్ధమవుతోంది.



నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో శనివారం జరిగిన స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నుంచి పతకాన్ని అందుకుంటున్న విద్యార్థులు. వేదికపై తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, నల్సార్ ఛాన్సలర్ జస్టిస్ ఆలోక్ అరాధే, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్.నరసింహ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ధనవంతులతో సమానంగా పేదలకు న్యాయం దక్కడంలేదు

- ఈ పరిస్థితుల్లో మార్పు రావాలి
- నల్సార్ 21వ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

ఈనాడు, హైదరాబాద్: ధనవంతులతో సమానంగా పేదలకు న్యాయం అందడంలేదని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో మార్పు రావాల్సి ఉందని ఆకాంక్షించారు. భవిష్య తరాల న్యాయనిపుణులుగా ఈ మార్పును విద్యార్థుల నుంచి ఆశిస్తున్నానన్నారు. నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో శనివారం జరిగిన 21వ స్నాతకోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మాట్లాడారు. 'పీఠిక, ప్రాథమిక హక్కుల్లో పొందుపరిచిన సమాన న్యాయం ప్రభుత్వ ఆదర్శ సూత్రాల్లో ఒకటి. మహిళల భద్రత కోసం దేశవ్యాప్తంగా మహిళా న్యాయవాదులు, న్యాయ విద్యార్థులతో కలసి నెట్‌వర్క్ ఏర్పాటుకు నల్సార్ సాయం చేయాలి. ఈ నెట్‌వర్క్ మహిళలపై జరిగే అఘాయిత్యాలను అడ్డుకోవడానికి, వీటికి సంబంధించిన కేసులను పరిష్కరించడానికి సంఘటితంగా పనిచేయాలి. వృత్తిపరమైన ప్రగతికి, సామాజిక న్యాయం అందించడానికి సాంకేతికతను విద్యార్థులు వినియోగించుకోవాలి' అని రాష్ట్రపతి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ గవర్నరు జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్. నరసింహ, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, నల్సార్ ఛాన్సలర్ జస్టిస్ ఆలోక్ అరాధే, రిజిస్ట్రార్ ఎన్.వాసంతి, పలువురు హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు. భారతదేశ వారసత్వ సంస్కృతి, సంప్రదాయ పరిరక్షణ మన బాధ్యతగా భావించాలని ద్రౌపదీ ముర్ము అన్నారు. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో కేంద్ర పర్యాటక, సాంస్కృతికశాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'భారతీయ కళా మహోత్సవ్'ను శనివారం ఆమె ప్రారంభించారు.



రాష్ట్రపతి నిలయంలో ఈశాన్య రాష్ట్రాల సంప్రదాయ కళాకారులతో ద్రౌపదీ ముర్ము నృత్యం

పంచాయతీరాజ్‌లో పారదర్శకంగా బదిలీలు

- సమర్థ అధికారులను నియమించాం
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



ఈనాడు, అమరావతి: 'కూటమి ప్రభుత్వ పాలన వంద రోజులు దాటింది. ప్రజాప్రయోజనం, అభివృద్ధే లక్ష్యాలుగా.. నేను చేపట్టిన శాఖల్లో పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని నిశ్చయించుకున్నా. ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం రాష్ట్ర ప్రభుత్వం ఆశ్రితపక్షపాతం లేకుండా ప్రజలకు మేలు చేసేలా పని చేస్తుందని చెప్పారు. అందుకు అనుగుణంగానే పంచాయతీరాజ్ శాఖలో బదిలీలు పారదర్శకంగా.. లంచాలకు తావులేని విధంగా పూర్తిచేశాం' అని అటవీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'బదిలీల్లో అధికారుల ప్రతిభ, సమర్థత, నిబంధనలు కొలమానాలుగా తీసుకోవాలని చెప్పాను. ప్రజాప్రతినిధులు, సహచర మంత్రుల నుంచి వచ్చిన సిఫార్సులు కూడా నిర్దేశించుకున్న కొలమానాలకు అనుగుణంగా ఉంటేనే పరిగణనలోకి తీసుకోవాలని తెలిపాను. ఏ దశలోనూ బదిలీల సిఫార్సుల్లో ఆర్థిక లావాదేవీలు లేకుండా చూసుకున్నాం. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి అధికారులకు మాత్రమే డ్వామా పీడీ, ఏపీడీ, జడ్పీ సీఈవో పోస్టులు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం. రాయలసీమలోని ఓ జిల్లాలో ఒక అధికారి చేరి, రెండు దశాబ్దాలు దాటినా జిల్లాస్థాయి పోస్టు చేయలేదని మా దృష్టికి వచ్చింది. ఆయనకు తగిన పోస్టింగు ఇచ్చాం. ఆరోపణలున్న వారికి కీలక పోస్టులు ఇవ్వలేదు' అని వివరించారు.

నిధులిచ్చేందుకు కేంద్రం సిద్ధం

'ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి తగిన నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రామస్థాయి నుంచి అభివృద్ధి మొదలుకావాలని స్పష్టమైన లక్ష్యాలు ఇచ్చారు. ఈ వంద రోజుల్లోనే కేంద్రం నుంచి రూ. 4,500 కోట్ల ఉపాధి హామీ నిధులను ఏపీ పొందింది. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 1,987 కోట్లు వచ్చాయి. 2027 నాటికి జల్‌జీవన్ మిషన్ ద్వారా 95.44 లక్షల ఇళ్లకు కుళాయిల ద్వారా రక్షిత నీరు సరఫరా చేయాలనేది లక్ష్యం. రూ. 215.8 కోట్లతో రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్ వార్షిక ప్రణాళికను కేంద్రం ఆమోదించింది. ఈ పనులన్నీ పకడ్బందీగా చేసేందుకు సమర్థ అధికారులను నియమించాం. సీఎం చంద్రబాబు మా శాఖల సమీక్షల్లో, జిల్లా కలెక్టర్ల సదస్సులో చేసిన సూచనలు విలువైనవి. వాటి ఆధారంగా పంచాయతీలకు పునరుజ్జీవం కల్పిస్తున్నాం' అని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు.

నిర్మలా సీతారామన్‌పై బెంగళూరులో కేసు

ఈనాడు, బెంగళూరు: ఎన్నికల బాండ్ల పేరిట కార్పొరేట్ కంపెనీల నుంచి రూ.వేల కోట్లు వసూలుచేశారన్న ఆరోపణలపై కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, పలువురు ఈడీ అధికారులు, భాజపా నేతలు బి.వై.విజయేంద్ర, నళిన్‌కుమార్ కటీల్ తదితరులపై బెంగళూరులో శనివారం కేసు నమోదైంది. నగరంలోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానంలో నిర్మలా సీతారామన్‌పై కేసు నమోదుకు శుక్రవారమే కోర్టు ఆదేశాలు జారీచేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం స్థానిక తిలక్‌నగర్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. జనాధికార సంఘర్ష్ పరిషత్తు సహాధ్యక్షుడు ఆదర్శ్ అయ్యర్ చేసిన ఫిర్యాదు నేపథ్యంలో ఐపీసీ 384, 120బీ, 34 సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. ఈడీ అధికారాలను వినియోగించుకుని కార్పొరేట్ సంస్థలపై సోదాల ద్వారా ఒత్తిడి తెచ్చి రూ.8వేల కోట్లు ఎన్నికల బాండ్ల రూపంలో వసూలు చేశారనేది అభియోగం. ఈ దోపిడీకి ఈడీ అధికారులకు ఆర్థికమంత్రి సహకరించినట్లు ఈ ఏడాది ఏప్రిల్‌లోనే ఏసీఎంఎం కోర్టులో ఫిర్యాదుచేసినా, ఇన్ని రోజులకు కేసు నమోదు చేశారని ఆదర్శ్ అయ్యర్ పేర్కొన్నారు.

కమిటీల రద్దుతో అక్రమ నిర్మాణాలు పైపైకి!

- తెదేపా హయాంలో ఏర్పాటైన వ్యవస్థకు వైకాపా సర్కారు మంగళం
- నగరాల్లో ఇష్టారాజ్యంగా బహుళ అంతస్తుల నిర్మాణాలు
- వైకాపా నేతల ఒత్తిడితో కమిషనర్లు, పట్టణ ప్రణాళిక అధికారుల ప్రేక్షకపాత్ర

ఈనాడు, అమరావతి: బహుళ అంతస్తుల నిర్మాణాలకు అనుమతులపై పరిశీలన కమిటీలను గత వైకాపా ప్రభుత్వం రద్దు చేసి అక్రమాలకు గేట్లు తెరిచింది. పర్యవేక్షణ, పరిశీలన లోపించడంతో గత ఐదేళ్లలో నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా నిర్మాణాలు వెలిశాయి. ప్రభుత్వ భూములు, స్థలాలను ఆక్రమించేసి నిర్మాణాలు చేపట్టారు. వైకాపా నేతల జోక్యంతో పట్టణ ప్రణాళిక అధికారులు సైతం ప్రేక్షకపాత్ర వహించారు. అనుమతుల్లో పారదర్శకత, బహుళ అంతస్తుల నిర్మాణాల్లో నిబంధనలు విధిగా పాటించేలా తెదేపా ప్రభుత్వ హయాంలో అధికారులతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశారు. బహుళ అంతస్తుల నిర్మాణాలకు ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకున్నాక వాటికి సంబంధించిన దస్త్రాలను కమిటీలు పరిశీలించి (పోస్ట్ వెరిఫికేషన్) లోపాలుంటే బిల్డింగ్ ప్లాన్లు రద్దు చేసేవి. రాజధాని ప్రాంత అభివృద్ధి సాధికార సంస్థ (సీఆర్‌డీఏ) మొదలుకుని పుర, నగరపాలక సంస్థలు, గ్రామ పంచాయతీల వరకు అప్పట్లో కమిటీలు ఏర్పాటయ్యాయి. సంబంధిత పట్టణ స్థానిక సంస్థల కమిషనర్, పట్టణ ప్రణాళిక అధికారులతోపాటు ఇంజినీర్లనూ వీటిలో భాగస్వాములను చేశారు. ప్రతి కమిటీలోనూ రాష్ట్ర పట్టణ ప్రణాళిక విభాగం డైరెక్టర్‌ను చేర్చారు.

అక్రమాలకు ఇలా చెల్లుచీటీ

తప్పుడు దస్తావేజులతో అనుమతులు తీసుకుని భవన నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నించే అనేక మందిని ప్రాథమిక దశలోనే కమిటీలు గుర్తించేవి. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, నెల్లూరు నగరపాలక సంస్థల పరిధిలో ఎక్కువగా అప్పట్లో ఇలాంటివి కట్టడి చేశారు. ప్రభుత్వ భూములు, స్థలాలకు తప్పుడు దస్తావేజులు సృష్టించి వాటిలో భవన నిర్మాణాలకు అనుమతులు తీసుకోవాలని చాలామంది ప్రయత్నించారు. వేరొకరి స్థలానికి తప్పుడు దస్తావేజులు తయారు చేసి వాటిలో భవన నిర్మాణానికి అనుమతులు తీసుకోవాలని చూశారు. పోస్ట్ వెరిఫికేషన్‌లో ఇలాంటి అనేక బాగోతాలు బయటపడడంతో అనుమతులు రద్దు చేసేవారు. నిర్మాణంలో ఉన్న భవనాల పరిశీలన ద్వారా అనుమతికి మించి అదనపు అంతస్తులు వేసినా, పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కలిపేసినా గుర్తించే వీలుండేది. విమానాశ్రయ అధికారులు, అగ్నిమాపక శాఖల నుంచి నిరభ్యంతర ధ్రువీకరణ పత్రాలు తీసుకోకుండా చేపట్టిన బహుళ అంతస్తుల నిర్మాణాలను కమిటీలు అడ్డుకున్న సందర్భాలున్నాయి.

కమిటీల రద్దుతో విచ్చలవిడిగా నిర్మాణాలు

2020 అక్టోబరులో వైకాపా ప్రభుత్వం పరిశీలన కమిటీలను రద్దు చేసి, అక్రమాలకు ఊతమిచ్చింది. ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకుని స్థానికంగా కమిషనర్, పట్టణ ప్రణాళిక అధికారులను 'మంచి' చేసుకుని కొందరు ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేసేశారు. విశాఖపట్నం, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, ఒంగోలు, కడప, కర్నూలు, అనంతపురం తదితర నగరాల్లో భారీగా అక్రమ నిర్మాణాలు వెలిశాయి. నెల్లూరు, విశాఖపట్నం, కడపల్లో ప్రభుత్వ స్థలాల్లోనూ వైకాపా నేతలు నిర్భీతిగా నిర్మాణాలు చేపట్టారు. వైకాపా నేత అంబటి మురళీకృష్ణకు చెందిన నిర్మాణ సంస్థ గుంటూరులో చేపట్టిన బహుళ అంతస్తు నిర్మాణ విషయంలో అధికారుల వైఫల్యంగా స్పష్టంగా కనిపిస్తోంది. అక్కడ జీ+5 నిర్మాణానికి తాత్కాలిక అనుమతులు తీసుకుని ఏకంగా 15 అంతస్తులు కట్టే వరకు అధికారులు ఏం చేశారనే ప్రశ్న సర్వత్రా వినిపిస్తోంది. ఈ విషయంలో పట్టణ ప్రణాళిక విభాగం ఉన్నతాధికారులూ తమకు సంబంధం లేదన్నట్లుగా వదిలేశారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, నెల్లూరులో గత ప్రభుత్వంలో అనుమతులు తీసుకుని ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తులను ప్రభుత్వం ప్రత్యేక బృందాలతో పరిశీలన చేయిస్తే గుంటూరు తరహా నిర్మాణాలు అనేకం బయటపడతాయి.

గనుల దోపిడీ డొంక ఏ ప్యాలెస్‌లో ఉన్నా కదలాలి

- వెంకటరెడ్డి తీగ మాత్రమే
- ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల



ఈనాడు డిజిటల్, అమరావతి: గత వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన గనుల దోపిడీలో ఆ శాఖ పూర్వ డైరెక్టర్ వెంకటరెడ్డి లాంటి తీగలే కాదు.. పెద్ద డొంకలు కూడా కదలాలని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల పేర్కొన్నారు. ఆ పెద్ద డొంక ఏ ప్యాలెస్‌లో ఉన్నా.. విచారించాలని 'ఎక్స్' వేదికగా శనివారం ఆమె డిమాండు చేశారు. 'మైనింగ్ కుంభకోణంలో చిన్న చేపల్ని ఆడించి సొమ్ము చేసుకున్న పెద్ద తిమింగలాన్ని పట్టుకునేలా దర్యాప్తు చేయాలి. రూ. 2,566 కోట్ల దోపిడీకి పాల్పడ్డ ఘనుడు వెంకటరెడ్డి అయితే.. తెరవెనుక ఉండి, రూ.వేల కోట్లు కాజేసిన ఆ ఘనాపాటి ఎవరో ప్రజలందరికీ తెలుసు. ఈ కుంభకోణంపై రాష్ట్రప్రభుత్వం కేంద్రాన్ని సీబీఐ దర్యాప్తు కోరాలి' అని పేర్కొన్నారు.

'ప్రజావేదిక' ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ

- ఏ రోజు అర్జీలు ఆ రోజు సీఎంవోకు
- అక్కడి నుంచి సంబంధిత శాఖలకు

ఈనాడు డిజిటల్, అమరావతి: వైకాపా నేతల భూకబ్జాలు, రీసర్వేలో భూమిని తక్కువగా చూపించడం, ఆన్‌లైన్‌లో పేర్లు మార్చి కబ్జాదారుల పేరుతో పాసుపుస్తకాల మంజూరు, తెదేపా ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టులు దక్కించుకొన్నారనే అక్కసుతో బిల్లుల పెండింగ్, వైకాపాకు ఓటేయలేదనే కక్షతో అన్ని అర్హతలున్నా పింఛన్ రద్దు, వంద శాతం వైకల్యం ఉన్నా పింఛన్ నిరాకరణ.. ఇలా వందల సమస్యలతో బాధితులు రోజూ తెదేపా కార్యాలయానికి తరలివచ్చి గోడు వెళ్లబోసుకుంటున్నారు. వారి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, తెదేపా నేతలు వినతులు స్వీకరిస్తూ బాధితులకు భరోసా కల్పిస్తున్నారు. ఫిర్యాదుల పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

స్వయంగా వినతులు స్వీకరిస్తున్న సీఎం

గత ప్రభుత్వం ప్రజాసమస్యల్ని పూర్తిగా గాలికొదిలేసింది. వైకాపా నేతలు, నాయకులు యథేచ్ఛగా ప్రజల ఆస్తుల్ని, భూముల్ని దోచుకున్నారు. ఈ అరాచకాల్ని ప్రశ్నించినవారిపై తప్పుడు కేసులు బనాయించి జైళ్లలో పెట్టి వేధించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మారింది. బాధితులు ధైర్యంగా బయటకొచ్చి తమకు జరిగిన అన్యాయాన్ని చెబుతున్నారు. దీంతో తెదేపా కేంద్ర కార్యాలయంలో 'ప్రజావేదిక' పేరుతో ఫిర్యాదుల స్వీకరణకు సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. తప్పనిసరిగా రోజుకో మంత్రి ఈ కార్యక్రమంలో పాల్గొనాలని, పార్టీ తరఫున ముఖ్యనేతలూ భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. ప్రతి శనివారం చంద్రబాబే వచ్చి బాధితుల నుంచి అర్జీలు, ఫిర్యాదుల్ని స్వీకరిస్తున్నారు.


'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
J.SUBBAMMA గారు, మీ అర్జీ నంబర్ (Grievance No#) PRA [illegible] నమోదు చేయబడినది. గౌరవనీయులైన Collector & District Magistrat వారికి పరిష్కారం కొరకు పంపబడినది. మీరు మీ Grievance No # ని ఉపయోగించి http://meekosam.ap.gov.in లో మీ అర్జీ పై తదుపరి పురోగతిని తెలుసుకోవచ్చు
ధన్యవాదములు –ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం

అర్జీ ఇచ్చాక ఫిర్యాదుదారుకు వచ్చిన సందేశం

ఇలా జూన్‌లో ప్రారంభమైన ప్రజావేదిక నిరాటంకంగా కొనసాగుతోంది.

కొన్ని సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం

కుటుంబ తగాదాలు, గట్టు పంచాయితీలు, పోలీసులు, అధికారుల వేధింపులు, భార్యాభర్తల గొడవలు ఇలా చాలా ఫిర్యాదుల్ని నేతలు అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు. సంబంధిత అధికారులు, పోలీసులతో మాట్లాడి చర్యలు తీసుకోవాల్సిందిగా సూచిస్తున్నారు. మిగతా ఫిర్యాదుల్ని సంబంధిత శాఖలు, మంత్రులు, ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, స్థానిక ప్రజాప్రతినిధులకు రిఫర్ చేస్తున్నారు. వీటిపై తెదేపా గ్రీవెన్స్ సెల్ స్టాంపు, తేదీ వేసి ఏ రోజు అర్జీల్ని ఆ రోజు సీఎంవోకు పంపిస్తున్నారు. సీఎంవో సిబ్బంది వాటిని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. ప్రతి ఫిర్యాదుకు గ్రీవెన్స్ నంబర్ కేటాయించి.. దీన్ని ఫిర్యాదుదారు సెల్‌ఫోన్‌కు సంక్షిప్త సమాచారం చేరవేస్తున్నారు. పీజీఆర్ఎస్ పోర్టల్‌లో ఈ నంబర్ నమోదు చేయడం ద్వారా అర్జీ పరిష్కార పురోగతిని తెలుసుకొనే అవకాశం కల్పించారు.



అర్జీల పురోగతి తెలుసుకోవడానికి రూపొందించిన పీజీఆర్ఎస్ పోర్టల్

సీఎంవో నుంచి క్షేత్రస్థాయికి..

సీఎంవో సిబ్బంది ఫిర్యాదుల్ని విభజించి ఆయా శాఖలకు.. అక్కడి నుంచి జిల్లా కలెక్టర్లకు పంపిస్తున్నారు. అనంతరం అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలోకి వెళ్లి విచారిస్తున్నారు. ప్రతి సమస్యనూ 30-45 రోజుల్లో పరిష్కరించాలనే లక్ష్యం పెట్టుకొన్నారు. సిబ్బంది విచారణ చేసి ఇచ్చిన నివేదికను పీజీఆర్ఎస్ వెబ్‌సైట్‌లో ఉంచుతున్నారు. సమస్య పరిష్కారం అయ్యిందీ, లేనిదీ ఫిర్యాదుదారుకు తెలియజేస్తున్నారు. ఫిర్యాదుల పరిష్కారంలో క్షేత్రస్థాయి సిబ్బంది అలసత్వం వహించినా, బాధితుడితో మాట్లాడకుండా తప్పుడు సమాచారంతో సమస్య పరిష్కరించినట్లు నివేదికలు ఇచ్చినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఫిర్యాదును పునర్విచారణకు పంపిస్తున్నారు.

ముఖ్యమంత్రికి 4,396 వినతులు..
3,327 పరిష్కారం

ప్రజావేదికలో భాగంగా ఇప్పటివరకు చంద్రబాబుకు 4,396 వినతులు అందాయి. అత్యధికంగా గుంటూరు జిల్లా నుంచి 429, ఎన్టీఆర్ జిల్లా నుంచి 358 వచ్చాయి. అతి తక్కువగా పార్వతీపురం మన్యం జిల్లా నుంచి 45 వచ్చాయి. వీటిల్లో 3,327 వినతులను పరిష్కరించారు.

అత్యధికం రెవెన్యూ సమస్యలే..

ప్రజావేదికలో వచ్చే ఫిర్యాదుల్లో 60-70% రెవెన్యూశాఖవే ఉంటున్నాయి. వీటి పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా 45 రోజులు గ్రామస్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించింది. ప్రతి గ్రామానికి తహసీల్దార్ సహా ఏడుగురు సభ్యుల బృందం వెళ్లేలా, బాధితుల ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ చేసి ఆ వివరాల్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా కార్యాచరణ రూపొందించారు. ఇప్పటికే ఈ సదస్సులు ప్రారంభం కావాల్సి ఉన్నా వరదల కారణంగా తాత్కాలికంగా వాయిదా పడింది.

ఆగం చేసిన వరద ఆదుకుంటున్న దాతలు!

ఆగస్టు అయిపోతోంది చినుకు జాడలేదని ఆకాశం వైపు చూస్తుండగా.. ఒక్కసారిగా మేఘం పగిలిందా అన్నట్లు కుంభవృష్టి మొదలైంది. అది రోజుల తరబడి వెంటాడింది. ఆ ధాటికి రాష్ట్రం తడిసి ముద్దయింది. చెరువులు, వాగులు, ఏర్లు ఏకమై పల్లెలు, పట్టణాలు, పొలాలను సముద్రంలా మార్చేశాయి. రైతులు, వ్యాపారులు, పిల్లలు, పెద్దలు అని తేడా లేకుండా ఆ వరద అందరిపై విరుచుకుపడింది. మాటలకందని ఆ మహా విషాదం నుంచి బాధితులు త్వరగా కోలుకోవాలని మనసున్న మారాజులెందరో ముందుకొస్తున్నారు. చేతనైన సాయంతో భరోసా ఇస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితులకు అండగా నిలిచేందుకు రామోజీ గ్రూపు తరఫున రూ.5 కోట్లతో ఏర్పాటు చేసిన 'ఈనాడు సహాయనిధి'కి ఉదారంగా విరాళాలు ఇస్తున్న దాతలకు కృతజ్ఞతలు. ఈనాడు పిలుపు అందుకొని స్పందిస్తున్న సహృదయుల వివరాలు..



డి.వి.ఎస్.ఎస్.ఆర్. స్వామి, ప్రొప్రైటర్, శ్రీ సత్య టెక్నాలజీస్, సికింద్రాబాద్
విరాళం: 1,00,000



జాస్తి విజయభూషణ్ కుమార్(బుజ్జి), సెక్రటరీ, పుణ్య ఛారిటీస్, చిన్న అవుటపల్లి, కృష్ణా జిల్లా
విరాళం: 1,00,000

ఈనాడు సహాయనిధికి విరాళాలిచ్చిన దాతలు

వ్యక్తులు / సంస్థలు	సాయం (రూ.లలో)
శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం, ఖాదీ కాలనీ, తిరుపతి	26,200
మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, బాపట్ల	25,116
వాసిరెడ్డి వెంకట శ్రీనివాసప్రసాద్, తెనాలి	25,000
సూరపనేని శశిధర్, సూరపనేని సింధూరి, విజయవాడ	20,116
కూరపాటి ప్రసాదరావు, ఏలూరు	10,120
వీరమాచనేని శ్రీనివాసరావు (ఆడిటర్), హైదరాబాద్	10,116
కొరిపెల్ల శేషగిరిరావు, వాకతిప్ప, తూర్పుగోదావరి జిల్లా	10,000
బి.గోపాలరావు, గుంటూరు	10,000
ఉప్పలపాటి రామ్మోహన్‌రావు అండ్ ఫ్యామిలీ, హైదరాబాద్	10,000
డా.మధుసూదన్ జూలూరి, హైదరాబాద్	10,000
పుట్టగుంట కృష్ణకుమారి, విజయవాడ	10,000
బిట్ర దుర్గారావు, విజయవాడ	10,000
కొణిదెన మదనగోపాల్, తిరుపతి	10,000
శ్రీ ప్రత్యూష ఎడ్యుకేషనల్ సొసైటీ(హైస్కూల్), పుల్లంపేట, అన్నమయ్య జిల్లా	5,500
ఎం.వి.ఎల్.నరసింహశాస్త్రి, విజయవాడ	5,116
రాధిక, ఫణిబాబు దగ్గుబాటి, ఆస్టిన్, అమెరికా	5,116
గోళ్ల శ్రీమన్నారాయణ, బెంగళూరు	5,116
ఎ.ఫణిభూషణరావు, విజయవాడ	5,116
సూరపనేని రామబ్రహ్మం, విజయవాడ	5,116
కూరపాటి వెంకట సుబ్బారావు, గుంటూరు	5,111
అడుసుమిల్లి నాగరాజు, హైదరాబాద్	5,001
కాట్రగడ్డ సత్యనారాయణ, కాటవరం, తూర్పుగోదావరి జిల్లా	5,000
ధవళ కృష్ణ, హైదరాబాద్	5,000
పిప్పాల పండు, కేశంపేట, రంగారెడ్డి జిల్లా	5,000
బొమ్మన లక్ష్మీసంయుక్త, రాజమహేంద్రవరం	5,000
బొమ్మన ప్రవీణ్, రాజమహేంద్రవరం	5,000
బొమ్మన రాజేశ్‌కుమార్, రాజమహేంద్రవరం	5,000
బొమ్మన స్వాతి, రాజమహేంద్రవరం	5,000

ముంచెత్తింది జలం మనం చేద్దాం ఉపకారం

RAMOJI GROUP

విరాళాలు పంపవలసిన ఎకౌంట్ వివరాలు

ఈనాడు రిలీఫ్ ఫండ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సైఫాబాద్ బ్రాంచి,
SB A/C No: 370602010006658
IFSC: UBIN0537063

దాతలకు ముఖ్య సూచన: మీరిచ్చే విరాళాలకు రసీదులు పొందేందుకు ఈ వివరాలు పంపవలసిందిగా మనవి.
1. దాత పేరు 2. పూర్తి చిరునామా 3. పాన్‌కార్డు నంబరు.
- ఈ వివరాలను 9154990933 నంబరుకు లేదా relieffund@eenadu.in ఈ మెయిల్ ఐడీకి పంపగలరు.

వైకాపా అసత్య ప్రచారాల్ని గట్టిగా తిప్పికొట్టాలి

మంత్రులు, పార్టీ నేతలకు సీఎం నిర్దేశం

ఈనాడు, అమరావతి: ప్రభుత్వంపై బురదజల్లడమే ఎజెండాగా వైకాపా నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాల్ని సమర్థంగా తిప్పికొట్టాలని మంత్రులు, తెదేపా నేతలకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు శనివారం పార్టీ కార్యాలయానికి వచ్చిన ఆయన అందుబాటులో ఉన్న మంత్రులు, ఇతర ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. వైకాపా పదేపదే ప్రచారం చేస్తున్న అబద్ధాల్ని తిప్పికొట్టేందుకు ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో పనిచేయాలన్నారు. వైకాపా నాయకుల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు అవసరమైన సమాచారం కోసం ముఖ్యమంత్రి కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. డిక్లరేషన్‌పై సంతకం చేయడం ఇష్టం లేక తిరుమల పర్యటన రద్దుచేసుకున్న జగన్.. ప్రభుత్వమే తనను అడ్డుకున్నట్లుగా చేస్తున్న అసత్య ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టామని అభిప్రాయపడ్డారు. అనంతపురం జిల్లాలో రాములవారి రథానికి నిప్పుపెట్టిన ఘటనలో విచారణ పూర్తికాకుండానే, దానిలో రాజకీయ ప్రమేయం లేదని జిల్లా ఎస్పీ చెప్పడం సరికాదని తెదేపా నేతలు కొందరు అభిప్రాయపడ్డారు. వైకాపావారే నిప్పు పెట్టారంటూనే, రాజకీయ ప్రమేయం లేదని పోలీసులు నిర్ధారించి చెప్పేయడం సమంజసం కాదన్నారు. సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, డోలా బాలవీరాంజనేయస్వామి, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, ఎమ్మెల్సీ అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

యాసిడ్ పోసి నా కుమారుడి హత్య

- గుండెపోటుగా చిత్రీకరించిన కాంతిరాణా, విశాల్‌గున్నీ
- ముఖ్యమంత్రి చంద్రబాబుకు బాధితురాలి ఫిర్యాదు

ఈనాడు డిజిటల్, అమరావతి: తన కుమారుని పేరుపై ఉన్న ఆస్తిని కొట్టేయడానికి కొందరు హత్య చేస్తే.. దానిని అప్పటి విజయవాడ కమిషనర్ కాంతిరాణా తాతా, డీసీపీ విశాల్‌గున్నీ గుండెపోటు మరణమని పేర్కొంటూ కేసును పక్కదారి పట్టించారని ఓ మహిళ సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర నలుమూలల వచ్చిన బాధితుల నుంచి చంద్రబాబు శనివారం వినతులు స్వీకరించారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందిన విజయారాణి ఆయనకు ఫిర్యాదు చేస్తూ.. 'నా కుమారుని పేరుపై రూ.50 కోట్ల ఆస్తి ఉంది. దాన్ని కొట్టేయాలనే ఉద్దేశంతో నా భర్త రెండో భార్య కుమారుడు నా కుమారుని ముఖంపై యాసిడ్ పోసి హత్య చేశాడు. దీనిపై అప్పటి విజయవాడ కమిషనర్ కాంతిరాణా తాతా, డీసీపీ విశాల్‌గున్నీకి ఫిర్యాదు చేశాం. అయితే వారు మా కుమారుడు గుండెపోటుతో చనిపోయాడని కేసును పక్కదారి పట్టించారు. 19 నెలలుగా న్యాయం కోసం పోరాడుతూనే ఉన్నా. మాకు న్యాయం చేయండి' అని సీఎంను కోరారు. కేసును మళ్లీ విచారించి న్యాయం చేస్తానని బాధితురాలికి సీఎం హామీ ఇచ్చారు. వినతులను సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తన పేషీ అధికారులను ఆదేశించారు.



కుమారుని ఫొటో చూపిస్తూ కన్నీటి పర్యంతమవుతున్న విజయారాణి

■ 300 యూనిట్లకు పైగా విద్యుత్ వినియోగించామనే కారణంతో తన పింఛను తొలగించారని గుంటూరు జిల్లా గోరంట్లకు చెందిన తన్నీరు సామ్రాజ్యం అనే దివ్యాంగురాలు వాపోయారు. పింఛన్ పునరుద్ధరించి ఆదుకోవాలని కోరారు.

■ వారసత్వంగా ఇచ్చిన రెండెకరాల భూమిని గత ప్రభుత్వంలో వైకాపా నాయకులు ఆక్రమించి, దొంగ పట్టాలు సృష్టించారని పల్నాడు జిల్లా పమిడిమర్రు గ్రామానికి చెందిన గుర్రపుశాల శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు.



బాధితుల నుంచి విన్నపాలు స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

■ తమ గ్రామంలో పైవంతెన నిర్మించకపోవడంతో అంబులెన్స్‌లు రావడంలేదని అరకు మండలంలోని పెదబులుడు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

■ గుంటూరు, విజయవాడ జాతీయ రహదారిపై గోవుల అక్రమ రవాణా జరుగుతోందని, దీన్ని అరికట్టేందుకు మంగళగిరి సమీపంలో గోశాలను ఏర్పాటు చేయాలని కృష్ణధర్మ రక్షణ సమితి నాయకులు కోరారు.

కటకటాల వెనుక కుటుంబం.. ఇంట్లో పెద్ద కుమారుడి మరణం

అంత్యక్రియలకు తాత్కాలిక బెయిల్ మంజూరు

కర్నూలు న్యాయవిభాగం, పెద్దకడబూరు, న్యూస్‌టుడే: కుటుంబంలో ఒక్కరు మినహా మొత్తం జైల్లో ఉండగా, ఇంటివద్ద ఉన్న ఏకైక వ్యక్తి చనిపోయి అంత్యక్రియలు చేసేవారు లేకపోవడంతో న్యాయమూర్తి మానవతా దృక్పథంతో స్పందించి వారికి తాత్కాలిక బెయిల్ మంజూరుచేసిన ఘటన కర్నూలు జిల్లాలో చోటుచేసుకుంది. పెద్దకడబూరు మండలం కల్లుకుంటకు చెందిన లక్ష్మీదేవికి ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. దివ్యాంగుడైన పెద్దకుమారుడు రాగప్ప(45)కు పెళ్లి కాలేదు. ఈ నెల 13న ఇతరులతో జరిగిన ఘర్షణలో లక్ష్మీదేవి కుటుంబసభ్యులు పదిమందిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసి రిమాండ్‌పై జైలుకు తరలించారు. రాగప్పకు ఈ కేసుతో సంబంధం లేకపోవడంతో ఇంటివద్దే ఉంటున్నారు. 15 రోజులుగా ఆయనను పట్టించుకునేవారు లేకపోవడంతో శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబసభ్యుల విడుదల కోసం వారి న్యాయవాది బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి పి.పాండురంగారెడ్డి రెండు రోజులు తాత్కాలిక బెయిల్ మంజూరు చేశారు. దీంతో శనివారం జైలు నుంచి విడుదలైన కుటుంబ సభ్యులు అంత్యక్రియలు పూర్తిచేశారు.

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల తెదేపా ఎమ్మెల్సీ అభ్యర్థిగా రాజశేఖర్?

ఈనాడు, అమరావతి: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలు, ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేసే తెదేపా అభ్యర్థుల్ని సోమవారం ప్రకటించే అవకాశం ఉన్నట్టు సమాచారం. కృష్ణా, గుంటూరు జిల్లాల అభ్యర్థిగా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేరును తెదేపా నాయకత్వం ఇప్పటికే దాదాపు ఖరారు చేసింది. ఉభయగోదావరి జిల్లాల అభ్యర్థి ఎంపికపై పార్టీ కసరత్తు చేస్తోంది. పదిమంది పోటీకి ఆసక్తిగా ఉన్నా.. వివిధ రాజకీయ, సామాజిక సమీకరణల్ని దృష్టిలో ఉంచుకుని కోనసీమకుచెందిన పేరాబత్తుల రాజశేఖర్ అభ్యర్థిత్వంపై మొగ్గుచూపుతున్నట్టు పార్టీవర్గాలు తెలిపాయి. తెనాలి నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జిగా ఉన్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఇటీవల ఎన్నికల్లో పోటీకి అవకాశం లభించలేదు. ఆ స్థానాన్ని జనసేనకు కేటాయించడంతో ఆయన త్యాగం చేయాల్సి వచ్చింది. దానికి ప్రతిఫలంగా ఇప్పుడు ఎమ్మెల్సీ టికెట్ దక్కుతోంది. ఐ.పోలవరం మండలానికి చెందిన రాజశేఖర్.. గతంలో ఆ మండలానికి ఎంపీపీగా, జడ్పీటీసీ సభ్యుడిగా పనిచేశారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు కార్యక్రమాల పర్యవేక్షణ కమిటీ సభ్యుడిగా వ్యవహరించారు. ఇటీవలి ఎన్నికల్లో కాకినాడ గ్రామీణ టికెట్‌ను ఆశించారు. కానీ ఆ స్థానం జనసేనకు కేటాయించడంతో రాజశేఖర్‌కు అవకాశం రాలేదు. ఇప్పుడు ఆయనకు ఎమ్మెల్సీ టికెట్ ఖాయం అని పార్టీవర్గాల్లో ప్రచారమవుతోంది. ఉమ్మడిగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కాపు లేదా ఎస్సీ సామాజికవర్గానికి చెందినవారిని అభ్యర్థిగా ఎంపిక చేయాలని తెదేపా భావించింది. మాజీ మంత్రి కేఎస్ జవహర్ సహా పలువురి పేర్లు పరిశీలించింది. ఆ రెండు ఉమ్మడి జిల్లాల్లో సంఖ్యాపరంగా బలమైన కాపు సామాజికవర్గానికి చెందిన రాజశేఖర్‌కు అవకాశమిచ్చే యోచనలో పార్టీ నాయకత్వం ఉందని తెలిసింది.



స్వర్ణాంధ్ర సాధనకు సూచనలివ్వండి

ప్రజలకు సీఎం చంద్రబాబు పిలుపు

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తుకు స్వర్ణాంధ్ర సాకారానికి సూచనలివ్వాలని ప్రజలకు సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. అభిప్రాయాలు, సూచనల్ని నేరుగా ప్రభుత్వానికి తెలియజేసి, ప్రశంసా పత్రాన్ని ఈ-సర్టిఫికెట్ రూపంలో పొందవచ్చని 'ఎక్స్'లో శనివారం పేర్కొన్నారు. '2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల రాష్ట్ర స్థూల ఉత్పత్తి, 43వేల డాలర్ల తలసరి ఆదాయంతో దేశంలో ఏపీని అగ్రస్థానంలో నిలపడమే మన లక్ష్యం. అందుకు అనుగుణంగా 2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్ వైపు అడుగులు వేస్తున్నాం. ఉజ్వలమైన రాష్ట్ర రూపకల్పన పౌరులుగా మీ విలువైన సూచనల్ని ఆహ్వానిస్తున్నాం. ప్రతి సూచన విలువైనది. ప్రతి అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుంటాం. కలిసికట్టుగా స్వర్ణాంధ్రను నిర్మించుకుందాం' అని చంద్రబాబు పేర్కొన్నారు. అభిప్రాయాలు http://swarnandhra.ap.gov.in/suggestions వెబ్‌సైట్‌కు పంపించొచ్చు.

మంత్రి కార్యాలయం ఎదుట తెదేపా ధర్నా

ధర్మవరం పురపాలక కమిషనర్‌ను బదిలీ చేయాలని డిమాండ్

ధర్మవరం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డికి అనుకూలంగా పనిచేసిన పురపాలక కమిషనర్ మల్లికార్జునను మళ్లీ ధర్మవరానికి ఎలా తీసుకువస్తారని ప్రశ్నిస్తూ శనివారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ కార్యాలయం ఎదుట తెదేపా శ్రేణులు ధర్నాకు దిగాయి. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలోని మంత్రి కార్యాలయంలో నిర్వహిస్తున్న పురపాలక అధికారుల సమీక్ష సమావేశానికి కమిషనర్ హాజరయ్యారు. ఈ విషయం తెలియడంతో తెదేపా నాయకులు, కార్యకర్తలు అక్కడికి పెద్దఎత్తున చేరుకొని నిరసనకు దిగారు. కమిషనర్‌ను బయటకు పంపాలని డిమాండ్ చేశారు. వందలమంది ఆందోళన చేపట్టడంతో ఈ మార్గంలో రాకపోకలు స్తంభించాయి. కార్యాలయం వైపు దూసుకొస్తున్న తెదేపా శ్రేణులకు పోలీసులు సర్దిచెప్పి అడ్డుకున్నారు. కమిషనర్ మల్లికార్జునను మంత్రి కార్యాలయం నుంచి పోలీసు వాహనంలో తరలించారు. తర్వాత మంత్రి కిందకు రావడంతో ఒక్కసారిగా తెదేపా శ్రేణులు ఆయన్ను చుట్టుముట్టాయి. భాజపా అనంతపురం జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరెడ్డికి వ్యతిరేకంగా నినదించాయి. ఈ నేపథ్యంలో పోలీసులు తెదేపా కార్యకర్తలను పక్కకు పంపడంతో మంత్రి అక్కడి నుంచి వెళ్లిపోయారు.



మంత్రి చుట్టూ చేరిన తెదేపా కార్యకర్తలు

జగన్ ఎందుకు డిక్లరేషన్ ఇవ్వరు?: బండి సంజయ్

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఏపీ మాజీ సీఎం జగన్.. తిరుమల దర్శనానికి డిక్లరేషన్ ఇచ్చేందుకు ఎందుకు జంకుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. అన్యమతస్థులు డిక్లరేషన్ సమర్పించాకే దర్శనానికి వెళ్లే సౌకర్యముందని, తాను క్రైస్తవుడినని జగనే చెప్పారని గుర్తుచేశారు. దళితులను ఆలయంలోకి రానివ్వరని అసత్య ప్రచారం చేస్తున్నారని, వారే అసలైన హిందువులన్నారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై విచారణ జరపాలని కోరారు. పవిత్రమైన లడ్డూను అపవిత్రం, వివాదాస్పదం చేయొద్దని విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడారు.

విశాఖ తీరంలో ఉల్లంఘనలు!

- వైకాపా హయాంలో సీఆర్‌జడ్ నిబంధనలకు పాతర
- అనుమతుల్లేకుండా శాశ్వత నిర్మాణాలు
- చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌కు సీజడ్ఎంఏ లేఖ

ఈనాడు, విశాఖపట్నం: వైకాపా పాలనలో విశాఖ తీరంలో అక్రమ నిర్మాణాలు దర్జాగా సాగాయి. ఎంపీ విజయసాయిరెడ్డి ఉత్తరాంధ్ర వైకాపా ఇన్‌ఛార్జిగా ఉన్నప్పుడు నిబంధనల ఉల్లంఘన అంటూ తెన్నేటి పార్కు నుంచి భీమిలి వరకు కొన్ని నిర్మాణాలు తొలగించారు. తర్వాత బాధితులు కొందరు వైకాపా తీర్థం పుచ్చుకోగా.. తిరిగి మళ్లీ నిర్మాణాలు కొనసాగాయి. ఇటీవల భీమిలి వద్ద తీరంలో విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి స్థలంలో కట్టడాలు కూల్చివేయగా.. మరికొన్ని ఉల్లంఘనలు గుర్తించి చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌కు కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ(సీజడ్ఎంఏ) లేఖ రాసింది.



నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన విరాగో పబ్

'విరాగో' బాగోతం వెలుగులోకి..

భీమిలి సమీప కాపులుప్పాడ గ్రామపరిధిలో తిమ్మాపురం వద్ద నిర్మించిన విరాగో పబ్ ఉల్లంఘనలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నట్లు ఆగస్టు 27న ఏపీసీజడ్ఎంఏకు ఫిర్యాదు అందింది. దీనిపై విచారణ చేయగా ఉల్లంఘనలు వాస్తవమేనని, చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌కు అథారిటీ లేఖ రాసింది. 'సీజడ్ఎంఏ నుంచి అనుమతుల్లేకుండా సీఆర్‌జెడ్-3 పరిధిలో ఏడాదిన్నరగా పబ్ నిర్వహిస్తున్నారు. కానీ బార్ అండ్ రెస్టారెంట్ పేరుతో అనుమతులున్నాయి. నివాస ప్రయోజనాల కోసం జీవీఎంసీ నుంచి ప్లాన్‌ను తీసుకుని.. దానిలో వాణిజ్య కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. 30మీటర్ల మాస్టర్‌ప్లాన్ రహదారిని ఆనుకుని నిర్మాణాలున్నాయి. ఖాళీస్థలాల పన్ను రూ.20 లక్షలు చెల్లించలేదు' అని లేఖలో పేర్కొన్నారు.

విజయసాయిరెడ్డి హయాంలో..

విజయసాయిరెడ్డి ఉత్తరాంధ్ర వైకాపా ఇన్‌ఛార్జిగా ఉన్నప్పుడు సీ-హార్స్ బార్ నిర్మాణాన్ని తొలగించారు. తర్వాత పంచాయితీ చేసి వైకాపా నాయకులు దాన్ని లాక్కొన్నట్లు విమర్శలున్నాయి. అప్పట్లో ఇచ్చిన ఎక్సైజ్ లైసెన్సుతోనే ప్రస్తుతం నిర్మాణాలు కొనసాగించి బార్ పేరు మార్చి నిర్వహిస్తున్నారు. కాంక్రీట్ నిర్మాణాలపై స.హ. చట్టం కింద పట్టణ ప్రణాళికాధికారులను ఈ నెల 6న వివరాలు కోరగా 'జీవీఎంసీ ఎలాంటి అనుమతులూ ఇవ్వలేదు. దస్త్రం షార్ట్‌ఫాల్‌లో పెట్టగా దరఖాస్తుదారుడు విత్‌డ్రా చేసుకున్నారు' అని సమాధానం ఇచ్చారు. సీజడ్ఎంఏ నుంచి సైతం అనుమతులు తీసుకోలేదని పేర్కొన్నారు. మరోవైపు... భీమిలి సమీప తొట్లకొండ వద్ద పర్యాటకశాఖ లీజుకిచ్చిన 'బే-వాచ్' పార్కులోనూ సీఆర్‌జడ్ నిబంధనలు ఉల్లంఘించారు. శాశ్వత నిర్మాణాలు జరిపారు. కీలక వైకాపా నేతల చేతిలో ఇది ఉన్నట్లు సమాచారం.




సోషల్ మీడియా లాంటిదే మన జీవితం

మన జీవితం సోషల్ మీడియా అల్గారిథం లాంటిది. సామాజిక మాధ్యమాల్లో మంచి అంశాలను చదువుతుంటే తరచూ అలాంటి పోస్టులనే అల్గారిథం మనకు చూపిస్తుంది. ఎందుకూ ఉపయోగపడని చెత్త పోస్టులపై ఆసక్తి చూపితే, ప్రతిసారీ అలాంటివే మనకు కనిపిస్తుంటాయి. అలాగే జీవితంలోనూ మంచి అంశాలపై దృష్టి పెడితే మన ఆలోచనలు ఉత్తమంగా మారి మనకు మంచి జరుగుతుంది. అదే అనవసర విషయాలతో సమయం వృథా చేసుకుంటే మన బుర్రలో చెత్త పేరుకుపోయి జీవితం పాడవుతుంది.

– టైలిన్ జాన్ సిమండ్స్, కంటెంట్ మార్కెటింగ్ మెంటార్

ఆదాయానికి తగ్గట్టుగా జరిమానా!

- శ్రీమంతులు వేగపరిమితిని మించితే భారీవడ్డన
- ఆలోచింపజేస్తున్న ఫిన్లాండ్ ట్రాఫిక్ నియమం
- అత్యల్ప ప్రమాద మరణాల రేటుతో ఆదర్శం



☛ ఓ వ్యక్తి జాతీయ రహదారిపై కారులో వేగంగా ప్రయాణిస్తూ ట్రాఫిక్ పోలీసుకు దొరికిపోయారు. అప్పుడు ఆయనకు విధించిన జరిమానా ఎంతో తెలుసా..? 1,21,000 యూరోలు. అంటే ఏకంగా రూ.1.1 కోట్లు. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం. ఆ వ్యక్తి పేరు అండర్స్ విక్లాఫ్. ఆ దేశం ఫిన్లాండ్. 30 కి.మీ. వేగపరిమితిని మించినందుకు విక్లాఫ్‌కు ఈ జరిమానా విధించారు. ట్రాఫిక్ నియమాన్ని ఉల్లంఘించిన వ్యక్తి ఆదాయాన్ని బట్టి జరిమానా విధించే ఆనవాయితీ ఫిన్లాండ్‌లో ఉండటమే అందుకు కారణం. విక్లాఫ్ సంపన్నుడు కావడంతోనే అతడికి అంత భారీగా వడ్డించారు. అంతటి కఠిన నిబంధనను పాటిస్తున్నందునే ప్రపంచంలోనే అత్యల్ప రోడ్డు ప్రమాద మరణాల రేటు కలిగిన దేశంగా ఫిన్లాండ్ స్థిరపడింది.

ఫిన్లాండ్ రష్యన్ సామ్రాజ్యం నుంచి స్వాతంత్ర్యం పొందిన మూడేళ్ల తర్వాత అంటే.. 1920లో ట్రాఫిక్ ఉల్లంఘనలకు ఆదాయ ఆధారిత జరిమానాల వ్యవస్థను అమల్లోకి తెచ్చింది. ప్రపంచంలోనే అలాంటి వ్యవస్థను అమలు చేసిన తొలి దేశంగా రికార్డుల్లోకి ఎక్కింది. తొలినాళ్లలో ఉల్లంఘనకు పాల్పడిన వ్యక్తినే అతడి ఆదాయం గురించి అడిగేవారు. ఆ సమయంలో ఉల్లంఘనులు చెప్పిన ఆదాయానికి తగ్గట్టుగా జరిమానా విధించేవారు. డిజిటలైజేషన్ ప్రక్రియ ఆరంభమయ్యాక ఆదాయపన్ను వివరాల ఆధారంగా జరిమానాలను విధించడం ఆరంభించారు. పోలీసుల స్మార్ట్‌ఫోన్లను సెంట్రల్ ట్యాక్స్‌పేయర్ డేటాబేస్‌కు అనుసంధానం చేయడం ద్వారా ఉల్లంఘనుల ఆదాయాన్ని తక్షణం తెలుసుకునే వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు.

రోజువారీ ఆదాయం ఆధారంగా జరిమానా

ఫిన్లాండ్‌లో ట్రాఫిక్ జరిమానాలను 'డే ఫైన్స్' గా పిలుస్తుంటారు. ఉల్లంఘన తీవ్రతతోపాటు ఉల్లంఘనుల రోజువారీ ఆదాయం ఆధారంగా ఈ జరిమానా విధిస్తారు. నెలవారీ సంపాదనలో ఆదాయపన్ను పోను మిగిలిన దాంట్లో 1/60 వంతును రోజువారీ ఆదాయంగా పరిగణిస్తారు. అలాగే ఒక ఉల్లంఘనకు 20 రోజుల జరిమానా విధించాల్సి వచ్చిందనుకుందాం. అప్పుడు అతడి రోజువారీ సంపాదన 100 యూరోలు గనక ఉంటే 2 వేల యూరోలు జరిమానాగా విధిస్తారు.

ప్రపంచ సగటు కంటే చాలా తక్కువ..

ఈ విధానాన్ని 1931లో స్వీడన్.. 1939లో డెన్మార్క్.. 1975లో జర్మనీ.. 1990లో స్విట్జర్లాండ్ అనుసరించాయి. 1983లో ఫ్రాన్స్ ఇదే విధానాన్ని అనుసరించి 2007లో మరింత విస్తరించింది. ఇలాంటి కఠినచట్టం కారణంగానే ఫిన్లాండ్‌లో రోడ్డుప్రమాద మరణాల సంఖ్య గణనీయంగా తగ్గినట్లు చెబుతున్నారు. ఫిన్లాండ్‌లో ప్రతి లక్ష మంది నివాసితులకు 3.8 మంది రోడ్డుప్రమాదాల్లో మరణిస్తున్నారు. ఈ విషయంలో ప్రపంచ సగటు 17.4 కావడం గమనార్హం. భారత్‌లో 15.6గా ఉంది.

దేశంలో పెరిగిన మరణాలు..

2010–21 మధ్యకాలంలో ప్రపంచవ్యాప్తంగా రోడ్డుప్రమాద మరణాలకు సంబంధించి ప్రపంచ ఆరోగ్య సంస్థ గతేడాది డిసెంబరులో నివేదిక విడుదల చేసింది. దీని ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఈ మరణాల్లో 5 శాతం తగ్గుదల కనిపిస్తే.. భారత్‌లో పెరుగుదల నమోదైంది. ఈ పదకొండేళ్లలో భారత్‌లో మరణాలు సగటున 1.34 లక్షల నుంచి 1.54 లక్షలకు పెరిగినట్లు నివేదిక వెల్లడించింది. దీన్నిబట్టి భారత్‌లో ఉల్లంఘనులను నియంత్రించాలంటే ఫిన్లాండ్ తరహా జరిమానాల వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

- ఈనాడు, హైదరాబాద్

రూ.250 స్టాంప్‌ను ఆవిష్కరించిన బార్ కౌన్సిల్



స్టాంప్‌ను ఆవిష్కరిస్తున్న బార్ కౌన్సిల్ ఛైర్మన్ ద్వారకానాథరెడ్డి, వైస్ ఛైర్మన్ కృష్ణమోహన్, బార్ కౌన్సిల్ సభ్యులు

ఈనాడు, అమరావతి: ఏపీ న్యాయవాదులు, వారి గుమస్తాల సంక్షేమనిధి కోసం ఏపీ బార్ కౌన్సిల్ రూ.250 సింగిల్ స్టాంప్‌ను ఆవిష్కరించింది. న్యాయస్థానాల్లో దాఖలుచేసే వకాలత్‌లు/మెమో ఆఫ్ అప్పియరెన్స్‌లపై ఈ స్టాంప్‌ను అంటించాలని జిల్లాల్లోని వివిధ బార్ అసోసియేషన్లు, న్యాయవాదులను కోరింది. శనివారం ఏపీ బార్ కౌన్సిల్ కార్యాలయంలో ఛైర్మన్ నల్లారి ద్వారకానాథరెడ్డి, వైస్‌ఛైర్మన్ సిరిపురపు కృష్ణమోహన్, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బార్ కౌన్సిల్ సభ్యులు, బార్ కౌన్సిల్ కార్యదర్శి బి.పద్మలత రూ.250 స్టాంప్‌ను ఆవిష్కరించారు. ద్వారకానాథరెడ్డి మాట్లాడుతూ ఈ స్టాంప్ విక్రయం ద్వారా వచ్చిన సొమ్మును న్యాయవాదులు, వారి గుమస్తాల సంక్షేమం కోసం వినియోగిస్తామని తెలిపారు.

నేడు గోమాత పూజలు

కిసాన్‌మోర్చా వెల్లడి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో 'గోవు ఘోషను విను గోవిందా' కింద పేరిట ఆదివారం గోమాత పూజలు చేపట్టనున్నట్లు భాజపా కిసాన్‌మోర్చా ప్రకటించింది. దేవాలయాలను గోపంచకంతో శుద్ధిచేస్తామని అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. గత వైకాపా ప్రభుత్వం తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు కలిసిన నెయ్యిని ఉపయోగించి, లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసినందుకు గోవులు ఘోషిస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు.

వరద బాధితులకు జీవీఆర్ ఇన్‌ఫ్రా రూ.కోటి విరాళం


ఈనాడు డిజిటల్, అమరావతి: వరద బాధితుల సహాయార్థం జీవీఆర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ రూ.కోటి విరాళం ప్రకటించింది. ఆ సంస్థ ప్రతినిధులు రామచంద్రరాజు, గంగాప్రసాద్ శనివారం ఉండవల్లి నివాసంలో సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేశారు.

సీఎమ్మార్ గ్రూప్ రూ.50 లక్షలు

సీఎం సహాయ నిధికి సీఎమ్మార్ గ్రూప్ రూ.50 లక్షల విరాళం అందించింది. ఆ గ్రూపు ఛైర్మన్ మావూరి వెంకటరమణ విరాళానికి సంబంధించిన చెక్కును చంద్రబాబుకు అందజేశారు.

★ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో తుళ్లూరుకు చెందిన ఆలూరి వెంకటరావు, ఆలూరి ఆదినారాయణ రూ.50 వేల చొప్పున విరాళం అందించారు. ఎం.శ్యామలరావు రూ.25 వేలు, కె.రాజేశ్వరి రూ.25 వేలు, విజయనగరానికి చెందిన కె.హారిక రూ.15వేల విరాళం ఇచ్చారు.





సీఎం చంద్రబాబుకు విరాళం అందజేస్తున్న జీవీఆర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రతినిధులు రామచంద్రరాజు, గంగాప్రసాద్ ★ సీఎమ్మార్ గ్రూప్ ఛైర్మన్ మావూరి వెంకటరమణ

పండగలకు చేనేత వస్త్రాలు ధరిద్దాం

నారా భువనేశ్వరి పిలుపు

ఈనాడు డిజిటల్, అమరావతి: రానున్న పండగలకు చేనేత వస్త్రాలను ధరించాలని సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ప్రజలకు పిలుపునిచ్చారు. ఇలా నేతన్నలకు అండగా నిలవాలని 'ఎక్స్' వేదికగా శనివారం విజ్ఞప్తి చేశారు. 'తెలుగు రాష్ట్రాల్లో మంగళగిరి, వెంకటగిరి, ఉప్పాడ, పోచంపల్లి, సిరిసిల్ల, గద్వాల్ ప్రాంతాలు చేనేత వస్త్రాలకు ప్రసిద్ధి. 'నిజం గెలవాలి' యాత్ర సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికుల్ని కలిశా. వారి కష్టాలు తెలుసుకున్నా. వారికి సంఘీభావంగా రాబోయే పండగలకు నేత వస్త్రాల్ని కొనుగోలు చేద్దాం. మన చేనేత, మన సంస్కృతి, మన సంప్రదాయం' అని పేర్కొన్నారు.

'వక్ఫ్ సవరణ'పై అభిప్రాయాల వెల్లడి

- చంద్రబాబు కృషితోనే జేపీసీకి బిల్లు
- మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్

ఈనాడు డిజిటల్, అమరావతి: వక్ఫ్ సవరణ బిల్లులో ముస్లింలకు మేలు చేసే అంశాల్ని సమర్థిస్తూనే వివాదాస్పదమైన వాటిపై అభ్యంతరాలు తెలిపినట్లు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ తెలిపారు. వక్ఫ్ సవరణ బిల్లుపై అభిప్రాయ సేకరణకు శనివారం హైదరాబాద్‌కు వచ్చిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) ఛైర్‌పర్సన్ జగదాంబికా పాల్‌తో రాష్ట్ర బృందం సమావేశమైనట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ, మైనారిటీ స్టేక్‌హోల్డర్స్ ఆలోచనల్ని కమిటీకి వివరించినట్లు తెలిపారు. జేపీసీకి వక్ఫ్ సవరణ బిల్లు వెళ్లేలా సీఎం చంద్రబాబు కృషి చేశారని ఫరూఖ్ తెలిపారు. భేటీ సందర్భంగా పలు అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, జేపీసీ సభ్యుల మధ్య చర్చ జరిగింది. కీలకమైన ఒకటి, రెండు అంశాలపై అభ్యంతరాలను సున్నితంగా తెలియజేసినట్లు తెలిసింది.

ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థులకు 'ఐరిస్' హాజరు

- జ్ఞానభూమి పోర్టల్‌కు అనుసంధానించేలా యాప్ రూపకల్పన

ఈనాడు, అమరావతి: ఉన్నత విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు ఐరిస్ హాజరు నమోదు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. డిగ్రీ, పోస్టుగ్రాడ్యుయేషన్ కోర్సులు చదివే విద్యార్థులందరికీ అమలు చేయాలని ఆదేశాలు జారీచేసింది. ఎంతమంది తరగతులకు హాజరవుతున్నారు? ఎంతమంది రెగ్యులర్‌గా కళాశాలకు వస్తున్నారు? అనే విషయాలను తెలుసుకునేందుకు ఐరిస్ హాజరును తీసుకువస్తోంది. గతంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఈ విధానంలో విద్యార్థుల హాజరు నమోదుచేసినా ఇటీవల దీన్ని నిలిపివేశారు. ప్రైవేటులో ఎలాంటి వివరాలూ ఉండటం లేదు. దీంతో అన్నింటికీ ఐరిస్ హాజరు అమలు చేయాలని నిర్ణయించింది. యాప్ ద్వారా ముఖ గుర్తింపు హాజరు నమోదుచేయనుంది. ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో చేరుతున్నవారిలో దాదాపు 40% మంది మధ్యలో ఆపేస్తున్నారు. ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో ఉత్తీర్ణత 57%గా ఉంటోంది. ఎంబీఏ లాంటి కోర్సుల్లో 52%మంది ఉత్తీర్ణులవుతున్నారు. దీనిలో మార్పు తీసుకొచ్చేందుకు విద్యార్థులపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రభుత్వం విద్యార్థుల ఐరిస్ హాజరును జ్ఞానభూమి పోర్టల్‌కు అనుసంధానం చేయనుంది. విద్యార్థుల ఐరిస్‌ను ఒకసారి యాప్‌లో అప్‌లోడ్ చేస్తే ఆ వివరాలు మూడేళ్ల వరకు అందుబాటులో ఉంటాయి. తరగతిలో యాప్ ఆన్ చేసి, విద్యార్థి వద్ద పెడితే వివరాలు ప్రత్యక్షమవుతాయి. వాటిని ఓకే చేస్తే హాజరు నమోదు పూర్తవుతుంది. ఒకేసారి ముగ్గురు, నలుగురి హాజరు నమోదుచేసేలా ప్రభుత్వం యాప్‌ను తీసుకొస్తోంది.

★ బోధన రుసుముల చెల్లింపునకు 75% హాజరు ఉండాలనే నిబంధన కారణంగా విద్యార్థులకు ఆ స్థాయిలో హాజరు ఉండేలా ప్రైవేటు యాజమాన్యాలు చూస్తున్నట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు వచ్చాయి. ఐరిస్ హాజరుతో బోధన రుసుముల చెల్లింపుల్లోనూ కచ్చితత్వం వస్తుంది. సక్రమంగా చదువుకునేవారికే చెల్లింపులు జరుగుతాయి.

1న శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు అక్టోబరు 4 నుంచి 12 వరకు జరగనున్న నేపథ్యంలో అక్టోబరు 1న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నట్లు తితిదే తెలిపింది. ఆ రోజున అష్టదళ పాదపద్మారాధన సేవను రద్దుచేసినట్లు పేర్కొంది. వీఐపీ బ్రేక్‌దర్శనాన్ని కూడా ప్రొటోకాల్ వీఐపీలకు మినహా మిగిలిన వారికి రద్దుచేశారు. దీంతో ఈ నెల 30న ఎటువంటి సిఫార్సు లేఖలు స్వీకరించరు.

వేడుకగా గ్రేటర్ వాషింగ్టన్ తెలుగు సంఘం స్వర్ణోత్సవాలు



గ్రేటర్ వాషింగ్టన్ తెలుగు కల్చరల్ సంఘం ప్రతినిధులతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఆయన సతీమణి పద్మావతి

ఈనాడు డిజిటల్, అమరావతి: గ్రేటర్ వాషింగ్టన్ తెలుగు కల్చరల్ సంఘం స్వర్ణోత్సవాలు రెండురోజుల పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకగా జరిగాయి. వాషింగ్టన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఆయన సతీమణి పద్మావతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. 'విదేశాల్లో ఉన్నప్పటికీ తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం గర్వించదగ్గ విషయం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారిని ఏకం చేయడానికి ఇలాంటివి ఎంతగానో తోడ్పడుతున్నాయి' అని తెలిపారు.

రూ. 30 కోట్ల భూమిపై సింహాచలం దేవస్థానానికి అనుకూలంగా తీర్పు

విశాఖపట్నం(సింహాచలం), న్యూస్‌టుడే: సింహాచలం అప్పన్నస్వామి భూములకు సంబంధించిన 25 కేసుల్లో దేవస్థానానికి అనుకూలంగా హైకోర్టు తీర్పునిచ్చింది. స్వామికి చెందిన భూములపై తమకు హక్కులున్నాయని పలువురు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. 2014 నుంచి ఆయా కేసులు నడుస్తున్నాయి. రెండు రోజుల క్రితం జరిగిన తుది వాదనల్లో 25 కేసులనూ కొట్టివేస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించినట్లు దేవస్థానం లీగల్ విభాగం ఏఈవో రమణమూర్తి తెలిపారు. ఈ కేసుల్లో 13 కేసులు అడివివరం 275వ సర్వే నంబరులోని సీతమ్మధార ప్రాంతానికి చెందినవి. తాజా తీర్పు కారణంగా సుమారు రూ.30 కోట్ల విలువగల ఎకరా భూమి దేవస్థానానికి తిరిగి దక్కిందని ఏఈవో వెల్లడించారు.

డ్రెడ్జర్లే తేలేదు.. తవ్వేశారట!

- 2024 ఆగస్టులోనూ ఎస్ఈ నుంచి గుత్తేదారుకు నోటీసులు
- మే నాటికే రూ.50 కోట్ల పని చేశామంటున్న గుత్తేదారు
- కాటన్ బ్యారేజి డ్రెడ్జింగ్‌లో లోతులెన్నో!

ఈనాడు, అమరావతి: తూర్పుగోదావరి జిల్లాలో కాటన్ బ్యారేజి ఎగువన ఎడమ, కుడివైపు డ్రెడ్జింగ్ అవకతవకల్లో అనేక అంశాలు వెలుగుచూస్తున్నాయి. ఈ పనులు చేపట్టిన రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ కుడిగట్టు వైపు 12%, ఎడమగట్టున 25% పని చేశామని, ఆ మేరకు బిల్లులు చెల్లించాలని జలవనరుల శాఖ ఉన్నతాధికారులకు లేఖ రాసింది. 2024 మే నెలాఖరుకే పూడిక తీసిన ఇసుకను గట్టుమీద పెట్టామని ఆ లేఖలో పేర్కొంది. క్యూబిక్ మీటరుకు దాదాపు రూ.150 వంతున ఎంత లేదన్నా రూ.52 కోట్ల పని చేసినట్లు ఆ లేఖలో చెప్పారు. అదే సమయంలో జలవనరులశాఖ ఉన్నతాధికారులు అంతకు ముందు రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి పలుమార్లు నోటీసులు జారీచేశారు. పనులు సవ్యంగా చేయట్లేదని, కాటన్ బ్యారేజి వద్దకు డ్రెడ్జర్లనూ తేలేదని నోటీసులిచ్చారు. గోదావరి డెల్టా ఎస్ఈ 2024 ఆగస్టు 14న రాసిన లేఖలో రాఘవ కంపెనీ సంతృప్తికరంగా పనులు చేయట్లేదని పేర్కొన్నారు. కానీ, రాఘవ కంపెనీ సెప్టెంబరు 4న రాసిన లేఖలో ఒప్పందం కుదిరిన తర్వాత నాలుగు కట్టర్ సెక్షన్ డ్రెడ్జర్లను తీసుకొచ్చామని, 500 ఎంఎం డయాతో ఉన్న యంత్ర పరికరాలు, కన్వెన్షన్ బోట్లు ఏర్పాటుచేశామని, పనివారిని పెట్టామని తెలిపింది. 2024 మే నాటికే తాము గోదావరి కుడిగట్టు వైపు 8,88,105 క్యూబిక్ మీటర్లు, ఎడమవైపు 21,56,686 క్యూబిక్ మీటర్ల ఇసుక పూడిక తీశామని లేఖ రాయడం జలవనరుల శాఖలో చర్చనీయాంశమవుతోంది. ఆగస్టు వరకు ఏజెన్సీ డ్రెడ్జర్లు తీసుకురాలేదని ఎస్ఈ చెబుతుంటే.. మరోవైపు ఏజెన్సీ తాము రూ.50 కోట్ల కన్నా విలువైన పని చేశామని ఎలా చెబుతోందనేది పెద్ద వివాదంగా మారింది. ఈఎన్‌సీ ఈ అంశంపై జలవనరులశాఖ అధికారులకు మెమో పంపినా, ఇంతవరకు వారినుంచి సమాధానం రాలేదు.

ఒప్పందం నుంచి విచారణ అవసరం

గోదావరిలో డ్రెడ్జింగ్ చేసి పూడిక తీసేందుకు సుమారు రూ.272.46 కోట్ల విలువతో రెండు ప్యాకేజీలుగా 2022 మే నెలలో టెండర్లు పిలిచారు. గోదావరి ఎడమగట్టు మూడో కిలోమీటరు నుంచి 12.150 కిలోమీటరు వరకు ఇసుక తవ్వకాలకు రూ.144.23 కోట్లతో టెండర్లు పిలిచారు. కుడివైపు వరదగట్టు మూడో కిలోమీటరు నుంచి 12.150 కిలోమీటరు వరకు రూ.128.23 కోట్ల అంచనా విలువతో టెండర్లు పిలిచారు. ఒక ప్యాకేజికి ముగ్గురు, మరో ప్యాకేజికి ఒక్కరే టెండర్లు దాఖలు చేశారు. రెండు పనులకూ రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ టెండర్లు దాఖలు చేసింది. రాఘవ కంపెనీకి సాంకేతిక అర్హత లేదని, ఈ పని చేసేంత విలువైన పని గతంలో ఎక్కడా చేయలేదని అప్పటి ఎస్ఈ ప్రభుత్వానికి లేఖ రాశారు. అయినా ఆ గుత్తేదారుకు పనులు అప్పచెప్పాలని రాజకీయ ఒత్తిళ్లు రావడంతో ఆయన సెలవు పెట్టి వెళ్లిపోయారు. ఆ సమయంలో మరో ఎస్ఈని ఇన్‌ఛార్జిగా పూర్తి బాధ్యతల్లో నియమించారు. ఆ సమయంలో రాఘవ కంపెనీతో ఒప్పందం కుదిరింది. తర్వాత కమిషనర్ ఆఫ్ టెండర్ల పోస్టులో ఉన్న సీఈ స్థాయి అధికారి సైతం ఈ ఒప్పందంపై సంతకానికి ససేమిరా అన్నారు. ఇందులో తప్పిదాలు ఉన్నాయని గుర్తించడంతోనే ఇద్దరు అధికారులు సెలవుపై వెళ్లిపోయారు. నాటి ఈఎన్‌సీ నారాయణరెడ్డి మూడు పోస్టులకు ఇన్‌ఛార్జిగా ఉండి సంతకాలు పెట్టి ఈ పనులు అప్పజెప్పారు. ఇప్పుడు బిల్లుల చెల్లింపు వివాదమవుతోంది. ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సి ఉంది.

తిరుపతిలో తెలుగు భాషా సభలు

ఫిబ్రవరి 27, 28 తేదీల్లో నిర్వహణ

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు విభాగం-ప్రాచ్య పరిశోధనా సంస్థ(ఓఆర్ఐ) - తెలుగు సంపద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు భాషా సభలు జరగనున్నాయి. ఫిబ్రవరి 27, 28 తేదీల్లో తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో వీటిని నిర్వహించనున్నారు. నిర్వహణ ఏర్పాట్లపై వీసీ అప్పారావుతో తెలుగు విభాగాధిపతి రాజేశ్వరమ్మ, ఓఆర్ఐ సంచాలకులు వెంకటేశ్వర్లు, తెలుగు సంపద సంస్థ ప్రధాన సలహాదారు రేమిళ్లమూర్తి శనివారం చర్చించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ సభల్లో పలు విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పరిశోధనా సంస్థలకు చెందిన అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొంటారని వారు తెలిపారు. తెలుగు సాహిత్యంపై నిపుణులతో ప్రసంగాలు, పరిశోధనా పత్రాల సమర్పణ వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

బాలికపై హత్యాచారం.. కామాంధుడికి ఉరిశిక్ష

బెంగళూరు(మల్లేశ్వరం), న్యూస్‌టుడే: ఇంటి ముందు ఆడుకుంటున్న ఓ బాలిక (6)పై లైంగిక దాడికి పాల్పడి, ఆమెను హతమార్చిన నిందితుడు ఉద్దప్ప రామప్ప గాణిగేరకు ఉరిశిక్ష విధిస్తూ కర్ణాటకలోని బెళగావి పోక్సో న్యాయస్థానం శనివారం తీర్పు వెలువరించింది. నిందితుడు 2017లో బాలికకు చాక్లెట్లు ఇస్తానని నమ్మించి, తన ఇంటిలోకి తీసుకెళ్లి అకృత్యానికి పాల్పడ్డాడు. విషయం బయటకు వస్తుందన్న భయంతో చిన్నారిని హత్య చేశాడు. నేరం రుజువు కావటంతో న్యాయస్థానం అతనికి ఉరిశిక్షతో పాటు రూ.45 వేల జరిమానా విధించింది. బాలిక కుటుంబసభ్యులకు రూ.3 లక్షల పరిహారం ఇప్పించాలని న్యాయసేవ ప్రాధికార సంస్థకు సూచించింది.

'ది అమరరాజ బెటర్ వే అవార్డ్స్'కు దరఖాస్తుల ఆహ్వానం

రేణిగుంట, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతల్లో ఉపాధి కల్పించే వ్యక్తులకు, సంస్థలకు 'ది అమరరాజ బెటర్ వే అవార్డ్స్'ను రెండో ఏడాది అందిస్తున్నట్లు చిత్తూరు జిల్లా కరకంబాడి అమరరాజ పరిశ్రమల పీఆర్‌వో బాబ్జీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో మహిళా ఉపాధి, గ్రామీణ ఆదాయ ఉత్పత్తి, ఉత్తమ వ్యవసాయ ఆధారిత వ్యాపారం వంటి మూడు విభాగాల్లో రూ.3 లక్షలతో అవార్డులను అందజేస్తామని వివరించారు. ఈ పురస్కారాలకు అక్టోబరు 30వ తేదీలోపు తమ సంస్థ గ్రూపు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మీ పిల్లల మధ్య పోటీ పెట్టకండి



మీ పిల్లల మధ్య ఎప్పుడూ సరదాకు కూడా పోటీ పెట్టకండి. త్వరగా అన్నం తిన్నవారికి ముద్దిస్తానని చెప్పడం, మంచి మార్కులు తెచ్చుకున్నవారికి బహుమతి ఇస్తానని ఆశచూపడం.. ఇలాంటివి తల్లిదండ్రులకు సాధారణ విషయాల్లాగా అనిపించవచ్చు, కానీ పిల్లలపై అవి ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. గెలుపోటములతో తోబుట్టువుల మధ్య శత్రుత్వం పెరగొచ్చు. వారు పెరిగే క్రమంలో అది మరింత బలపడొచ్చు. పిల్లల పెంపకం పోటీలు నిర్వహించడం కానే కాదు. పిల్లలకు వారి సామర్థ్యాలతో సంబంధం లేకుండా సమాన స్థాయిలో ప్రేమను పంచండి. వారు ఒకరికొకరు తోడుగా ఉండటం నేర్పండి. మంచి స్నేహితుల్లా మెలిగేలా వారిని ప్రోత్సహించండి.

– ఆస్కార్ హెరెరా, ఇన్వెస్టర్

'యాపిల్'కు రూ.లక్ష జరిమానా

- సీఎంఆర్ఎఫ్‌కు జమ చేయాలన్న వినియోగదారుల కమిషన్
- ఐఫోన్ కొంటే ఇయర్ పాడ్స్ ఉచితంగా ఇస్తామని మోసగించారని కేసు


కాకినాడ (మసీదు సెంటర్), న్యూస్‌టుడే: ఐఫోన్ కొంటే ఇయర్ పాడ్స్ ఉచితంగా ఇస్తామనే ప్రకటన చూసి ఫోన్ కొన్నానని, తనకు ఇయర్ పాడ్స్ ఇవ్వకుండా మోసం చేశారంటూ ఓ వ్యక్తి వేసిన కేసులో యాపిల్ సంస్థకు రూ.లక్ష జరిమానా విధిస్తూ కాకినాడ వినియోగదారుల కమిషన్ శనివారం తీర్పు చెప్పింది. ఈ మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్)కి చెల్లించాలని ఆదేశించింది. రూ.14,900 విలువైన ఇయర్ పాడ్స్ లేదా ఆ మేరకు నగదు, కొనుగోలుదారును మానసిక క్షోభకు గురిచేసినందుకు రూ.10 వేలు, కోర్టు ఖర్చులుగా రూ.5 వేలు చెల్లించాలనీ ఆదేశాలు జారీచేసింది. కమిషన్ సభ్యురాలు చెక్కా సుశీ తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ సూర్యారావుపేటకు చెందిన చందలాడ పద్మరాజు 2021 అక్టోబర్ 13న యాపిల్ అధికారిక వెబ్‌సైట్ నుంచి రూ.85,800 విలువైన ఫోన్ కొనుగోలు చేశారు. ఆ సమయంలో ఫోన్ కొన్నవారికి రూ.14,900 విలువైన ఇయర్ పాడ్స్ ఉచితంగా అందిస్తామని ఆ సంస్థ ప్రకటించింది. ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించిన తర్వాత ఫోన్ పంపారు. ఇయర్ పాడ్స్ ఇవ్వలేదని యాపిల్ సంస్థ ప్రతినిధులు, కస్టమర్ కేర్‌లను ఆన్‌లైన్‌లో సంప్రదించినా వారు స్పందించలేదంటూ బాధితుడు 2022 ఫిబ్రవరి 15న కమిషన్‌ను ఆశ్రయించారు. వాదనలు విన్న అనంతరం కమిషన్ అధ్యక్షుడు చెరుకూరి రఘుపతి వసంతకుమార్, సభ్యులు చెక్కా సుశీ, చాగంటి నాగేశ్వరరావు.. ముంబయి కేంద్రంగా పనిచేస్తున్న యాపిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు జరిమానా విధిస్తూ ఆదేశించారు.

గుంటూరు ఛానల్ విస్తరణకు చర్యలు తీసుకుంటాం

కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: గుంటూరు ఛానల్ ఆధునికీకరణ, విస్తరణ పనులను సీఎం సహకారంతో ప్రారంభించి వేగంగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామని కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఆయన జలవనరులు, నైపుణ్యాభివృద్ధి శాఖలపై సమీక్షించారు. గుంటూరు ఛానల్‌ను పొడిగించాలని రైతులు ఎప్పటినుంచో కోరుతున్నారని, గత తెదేపా ప్రభుత్వం రివర్ ఫ్లడ్ బ్యాంకు పటిష్ఠత, ఛానల్ ఆధునికీకరణ, విస్తరణ పనులకు ఆమోదం తెలిపిందని, కానీ.. వైకాపా ప్రభుత్వం వాటిని విస్మరించిందని పేర్కొన్నారు. ఛానల్ ఆధునికీకరణ, విస్తరణ, గుంటూరు నల్ల, నల్లమడ డ్రెయిన్ల ఆధునికీకరణకు మొత్తంగా సుమారు రూ.800-900 కోట్ల వరకు అవసరం ఉందని, బడ్జెట్ సమావేశాల్లో కనీసం రూ.వంద కోట్లయినా కేటాయించేలా చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నామని చెప్పారు.

కొండలు, గుట్టలూ కబ్జాలమయమే



వైకాపా హయాంలో ప్రకృతి వనరుల దోపిడీకి సజీవ సాక్ష్యం ఈ చిత్రం. అనంతపురం నగరాన్ని ఆనుకుని ఉన్న బుక్కరాయసముద్రం శివారు అడ్డతిప్పగుట్ట ఆనవాళ్లు కోల్పోయి కనమరుగయ్యే స్థితికి చేరుకుంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీకి స్థలాలు కేటాయించారు. జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణం పేరుతో అప్పటి స్థానిక వైకాపా నాయకులు అడ్డతిప్పగుట్ట కొండను సగానికిపైగా తవ్వేసి మట్టి తరలించేశారు. అడిగేవారు లేక ఇలా సహజ వనరులను తమ ఇష్టానికి అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. పచ్చగా ఉండాల్సిన ఈ కొండ అక్రమ తవ్వకాలతో రూపు కోల్పోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక స్థానిక ప్రజాప్రతినిధులు ప్రశ్నించడంతో వనరుల దోపిడీకి అడ్డుకట్ట పడింది.

–ఈనాడు, అనంతపురం, న్యూస్‌టుడే, బుక్కరాయసముద్రం

‘విజయ’ బ్రాండ్ అద్దెకిచ్చారు!

- ఆ పేరుపై ప్రైవేటు ఉత్పత్తుల విక్రయం
- ప్యాకెట్‌కు పావలా చాలంటూ.. గత ప్రభుత్వ నిర్వాకం
- ప్రభుత్వ ప్రతిష్ఠను పణంగా పెట్టిన జగన్ సర్కారు

ఈనాడు, అమరావతి: ‘విజయ’ బ్రాండ్ అంటే వినియోగదారుల్లో ఓ నమ్మకం. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ పేరుతో విక్రయించే ప్రతీ ఉత్పత్తికి ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తున్నట్లే. అందులో ఏ తేడా వచ్చినా.. ప్రభుత్వ ప్రతిష్ఠకే మచ్చ. అందుకే.. ‘విజయ’ గొప్పదనాన్ని, బ్రాండ్‌ను కాపాడేందుకు ప్రభుత్వమే బాధ్యత తీసుకుంటుంది. తెలంగాణలో అలా ఉన్నందుకే అన్ని దేవాలయాల్లో ‘విజయ’ నెయ్యినే వాడాలని ఇటీవల అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది. ఏపీలో మాత్రం గత వైకాపా ప్రభుత్వం ‘విజయ’ను పట్టించుకోకపోగా.. ఆ బ్రాండ్‌ను ప్రైవేటు వ్యాపారులకు అద్దెకిచ్చేసింది. ప్యాకెట్‌కు పావలా ఇచ్చి.. బ్రాండ్ పేరు వేసుకొనే అవకాశం ఇచ్చింది. అంటే ప్రభుత్వ ప్రతిష్ఠను పావలాకు కుదువపెట్టింది. రాష్ట్రంలో ఇప్పటికే పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్యను నిర్వీర్యం చేసిన గత ప్రభుత్వం.. విజయ బ్రాండ్‌నూ రాయల్టీ ప్రాతిపదికన ప్రైవేటుకు అప్పగించడంతో దాన్నుంచి చెప్పుకోదగ్గ ఆదాయమూ రావడం లేదు.

పాల ఉత్పత్తులూ ప్రైవేటుకే

- వంట నూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించేందుకు వీలుగా ఏపీ ఆయిల్‌ఫెడ్ ఏర్పాటు చేశారు. దీని పరిధిలోని విజయ బ్రాండ్ పప్పులు, మసాలా ఉత్పత్తులు, ఇతర నిత్యావసరాల్ని విక్రయించుకునేందుకు గత ప్రభుత్వం ప్రైవేటు సంస్థకు అనుమతిచ్చింది. పరిస్థితులు అనుకూలించక ఆ సంస్థ ఒప్పందం నుంచి వైదొలిగింది.
- ఆంధ్రప్రదేశ్ పాడిపరిశ్రమాభివృద్ధి సమాఖ్య(ఏపీడీడీసీఎఫ్) పరిధిలో విజయ బ్రాండ్ ద్వారా పాలు, పాల ఉత్పత్తుల అమ్మకాలు జరిగేవి. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ ప్రభుత్వం కూడా విజయ పేరుతో అమ్మకాలు చేస్తోంది. ఏపీడీడీసీఎఫ్ మాత్రం పాలు, పాల ఉత్పత్తుల అమ్మకాల ప్రాసెసింగ్, ప్యాకింగ్, మార్కెటింగ్ బాధ్యతల్ని రాయల్టీపై ప్రైవేటుకు అప్పగించేసింది. ఆ ఉత్పత్తుల నాణ్యతలో తేడా వస్తే ప్రభుత్వంపైనే పడుతుందనే అంశాన్ని విస్మరించింది. ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో పాల ఉత్పత్తుల సేకరణ, అమ్మకాలూ విజయ పేరుతోనే సాగుతున్నాయి. ఇదే సమయంలో ఏపీడీడీసీఎఫ్ నుంచి అనుమతి పొందిన వారూ విజయ పేరుతో ఉత్పత్తుల్ని విక్రయిస్తుండటంతో వినియోగదారులు గందరగోళానికి గురవుతున్నారు. కొత్త ప్రభుత్వం విజయ బ్రాండ్ ప్రాధాన్యాన్ని గుర్తించి.. ‘బ్రాండ్’ ప్రతిష్ఠను కాపాడేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తల్లి, చెల్లిపై ప్రేమలేని మీకు దేశంపై ఉంటుందా?

జగన్‌పై సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజం

ఈనాడు డిజిటల్, అమరావతి: కన్నతల్లి, తోడబుట్టిన చెల్లిపై ప్రేమ లేని జగన్‌కు దేశంపై ప్రేమ ఉంటుందా? అని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రశ్నించారు. ఊహ తెలిసినప్పటి నుంచి ఎంతోమంది నాయకులను చూశాం కానీ, జగన్ లాంటి దిగజారుడు నాయకుడిని చూడలేదని మండిపడ్డారు. శనివారం విడుదల చేసిన ఓ వీడియోలో ఆయన మాట్లాడుతూ.. ‘నేటికీ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరుకు, ఎంపీ మిథున్‌రెడ్డి రాజంపేటకు వెళ్లలేకపోతున్నారు. మీ అడుగులకు మడుగులొత్తిన ముగ్గురు ఐపీఎస్‌లు కేసుల్లో ఇరుక్కున్నారు. రాయలసీమలో పుట్టిన మీరూ తిరుపతికి వెళ్లలేని స్థితికి దిగజారారు. చివరికి దేశాన్ని, మతాన్ని ప్రశ్నించే స్థితికి చేరుకోవడం సిగ్గుచేటు. తిరుమలలో సంతకం పెడితే క్రైస్తవుల ఓట్లు రావనేది మీ భయం. మీ తండ్రి రాజశేఖరరెడ్డి, తల్లి విజయమ్మ మా కొడుకుతో వేగలేకపోతున్నామని మాజీ సీఎం రోశయ్య వద్ద భోరుమన్నారు. ఇప్పుడు రాష్ట్రమే మీతో వేగలేకపోయింది. ఇప్పటికైనా దేశానికి, హిందువులకు, రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పి ఇంట్లో కూర్చో’ అని జగన్‌పై నిప్పులు చెరిగారు.

గోరకల్లును గాలికొదిలేశారు

- ప్రాజెక్టు పనులను నిలిపివేసిన వైకాపా ప్రభుత్వం
- ఫలితంగా రిజర్వాయర్‌లో అనేక సమస్యలు
- పలుచోట్ల రివిట్‌మెంట్ కుంగుబాటు
- డ్యాం భద్రతకూ ముప్పు



గోరకల్లు జలాశయం

ఈనాడు, అమరావతి: రాయలసీమలో కీలకమైన గోరకల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ మట్టికట్ట జారిపోతోంది. భద్రతాపరంగా అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. అనూహ్యంగా అధిక వరద వస్తే ఆ నీటిని మళ్లించడంలోనూ ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడనున్నాయి. 2020లో జగన్ ప్రభుత్వ హయాంలో ఈ రిజర్వాయర్ పనులు పూర్తిచేయకముందే గుత్తేదారుతో ఒప్పందం రద్దు చేసుకున్నారు. మిగిలిన పనులు అత్యవసరం కావని, తక్షణమే చేయాల్సిన అవసరం లేదంటూ వాటిని పక్కన పెట్టేశారు. నాడు ఆ పనులు నిలిపివేయడంతో ఇప్పుడు గోరకల్లుకు సమస్యలు ఎదురవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. వీటన్నింటినీ సరిదిద్దేందుకు వారు మూడు రకాల ప్రతిపాదనలు పంపించారు. జలాశయం రక్షణ పనులకు రూ.99.20 కోట్లు, బెర్మ్ పనులు చేపట్టేందుకు రూ.17.05 కోట్లు, ఇతర పనులకు మరో రూ.6.74 కోట్లు మంజూరు చేయాలని కోరారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదనలన్నీ ఆర్థికశాఖ, జలవనరులశాఖలో పెండింగ్‌లో ఉన్నాయి.



మట్టికట్టపై ఇష్టారాజ్యంగా వదిలేసిన బండరాళ్ల వ్యర్థాలు

12.44 టీఎంసీల నీటినిల్వతో..

ఎస్ఆర్‌బీసీ ఆయకట్టు స్థిరీకరణతో పాటు గాలేరు నగరి సుజల స్రవంతి పథకానికి ఈ జలాశయం నుంచి నీటిని సరఫరా చేస్తారు. శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా 44 వేల క్యూసెక్కుల నీళ్లు శ్రీశైలం కుడి ప్రధాన కాలువ ద్వారా తీసుకువెళ్తారు. అక్కడి నుంచి బనకచర్ల రెగ్యులేటర్ తర్వాత మూడు కాలువల్లోకి ఆ నీళ్లు చేరతాయి. ఇందులో 21,700 క్యూసెక్కులు ఎస్ఆర్‌బీసీ ద్వారా ప్రవహిస్తాయి. ఆ నీటిని గోరకల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో నిల్వ చేస్తారు. ఈ జలాశయంలో 12.44 టీఎంసీల నీటిని నిల్వ చేసేందుకు ఆస్కారం ఉంది. కాంక్రీటు, మట్టికట్టతో ఈ డ్యాంను 45.6 మీటర్ల ఎత్తుతో నిర్మించారు. మొత్తం 3,526 మీటర్ల మేర డ్యాం ఉంటుంది. గుర్రాలవాగు మడుగుపై గేట్లు లేని స్పిల్‌వేగా దీన్ని నిర్మించారు. ఒకవేళ అధికంగా వరద వస్తే స్పిల్ వే ద్వారా కుందూ నదిలోకి వదులుతారు. అత్యవసర పరిస్థితుల్లో డిప్లీటింగ్ స్లూయిస్ ద్వారా నీళ్లు వదిలేస్తారు. 2005లో తొలుత రూ.528 కోట్ల పాలనామోదంతో పనులు ప్రారంభించారు. 2023 వరకు మొత్తం మీద రూ.858 కోట్ల వరకు పాలనామోదం పెరిగింది. ఇంతవరకు 91 శాతం పనులు జరిగాయి. రూ.617 కోట్లు ఖర్చు చేశారు.



గోరకల్లు మట్టికట్టపై కోతకు గురైన ప్రాంతం

ఇవీ సమస్యలు

గోరకల్లు జలాశయం వద్ద సీపేజీ సమస్య పరిష్కారం కాలేదని భూగర్భజలవనరులశాఖ నివేదిక ఇచ్చింది. అనేకచోట్ల జలాశయం రివిట్‌మెంట్ దెబ్బతింది. తాత్కాలికంగా రూ.92 లక్షలతో రక్షణ పనులు చేశారు. తర్వాత జలవనరులశాఖ ఉన్నతాధికారులు పరిశీలించి పూర్తిస్థాయిలో పనులు చేపట్టకపోతే డ్యాం భద్రతకే ముప్పు ఏర్పడుతుందని నివేదిక కూడా ఇచ్చారు. అనంతరం ఈ ఏడాది జనవరిలో ఓటీ రెగ్యులేటర్ వద్ద రాతికట్ట దెబ్బతిందని అధికారులు గుర్తించారు. అక్కడి నుంచి రాళ్లు నీటి మళ్లింపు మార్గం వద్దకు చేరడంతో.. ఓటీ రెగ్యులేటర్ గేట్ల నిర్వహణకూ సమస్యలు తలెత్తుతున్నాయి.

అవినీతి ఆరోపణలున్న అధికారికి కీలక పోస్టింగ్‌కు ప్రతిపాదన

- డీఈఓలు, ఆర్జేడీలు, ఏడీల బదిలీలపై కసరత్తు
- మొదటిసారి ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్‌గా రెవెన్యూ అధికారి

ఈనాడు, అమరావతి: వైకాపాతో అంటకాగి, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ మండలి డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డికి కీలక పోస్టు ఇచ్చేందుకు ప్రతిపాదనలు పెట్టినట్లు తెలిసింది. ఈయనకు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ పోస్టు కట్టబెట్టేలా కొందరు తెర వెనుక చక్రం తిప్పుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రతాప్‌రెడ్డి గత ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కడప ఇన్‌ఛార్జి ఆర్జేడీగా పోస్టింగ్ వేయించుకొని మరీ వైకాపాకు అనుకూలంగా పనిచేశారన్న విమర్శలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు ఉపాధ్యాయుల ఓట్లను భారీగా చేర్పడంతోపాటు వైకాపా అభ్యర్థులను గెలిచిపించేందుకు రహస్యంగా సమావేశాలు నిర్వహించారు. దీంతోపాటు ఎస్‌సీఈఆర్టీలో అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. పాఠ్యపుస్తకాల డీటీపీ పేరుతో రూ. కోట్ల నిధులను దారి మళ్లించారు. వీటిపై విచారణకు డైరెక్టర్ మస్తానయ్యను నియమించారు. ఇలాంటి అధికారిపై చర్యలు తీసుకోకపోగా.. కీలక పోస్టింగ్ ఇచ్చేందుకు ప్రతిపాదనలు పెట్టడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. మరోవైపు ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్‌గా ఆర్డీఓ ఖాజావలీ పేరును పాఠశాల విద్యాశాఖ పరిశీలిస్తోంది. మొదటిసారి బయట వ్యక్తులను ఆ పోస్టులో నియమించనున్నారు. జిల్లా విద్యాధికారులు, ఆర్జేడీలు, అదనపు డైరెక్టర్ల బదిలీలపై విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. డీఈఓలు, ఆర్జేడీలు, ఏడీలను మార్చనున్నారు. బదిలీలపై రెండు రోజుల్లో ఉత్తర్వులు విడుదల కానున్నాయి. రాష్ట్రస్థాయిలో కొన్ని పోస్టులను కలిపి విభాగాలుగా ఏర్పాటు చేయబోతున్నారు. సార్వత్రిక విద్యాపీఠం, వయోజన విద్య, గ్రంథాలయాలు, జవహర్ బాల భవన్, ఐటీని కలిపి ఒక విభాగంగా చేయనున్నారు. దీనికి అదనపు డైరెక్టర్‌ను ఇన్‌ఛార్జిగా నియమించనున్నారు. ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల సొసైటీ, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలను కలిపి మరో విభాగంగా ఏర్పాటు చేయబోతున్నారు. ఇందులోనే ఆదర్శ పాఠశాలలను కలపనున్నారు.

తిరుమల వెళ్లడం ఇష్టం లేకే కులాల మధ్య చిచ్చు

- జగన్‌పై హోంమంత్రి అనిత ధ్వజం

ఈనాడు డిజిటల్, అమరావతి: మాజీ సీఎం జగన్‌కు తిరుమల వెళ్లడం ఇష్టం లేకనే కులాల మధ్య చిచ్చుపెడుతూ.. దళితులను తెరపైకి తీసుకువస్తున్నారని హోంమంత్రి వంగలపూడి అనిత మండిపడ్డారు. జగన్ హయాంలో తితిదే బోర్డులో ఒక్క దళితుడికైనా అవకాశం కల్పించకుండా ఇప్పుడు మొసలి కన్నీరు కార్చుతున్నారని విమర్శించారు. మంగళగిరి తెదేపా కార్యాలయంలో శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. ‘10వేల మందితో జగన్ తిరుమలకు వస్తారని సామాజిక మాధ్యమాలలో ప్రచారం జరిగింది. ఆయన పర్యటనను అడ్డుకుంటామని ప్రజాసంఘాలు, ధార్మిక సంఘాలు ప్రకటించాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా పోలీసులు సెక్షన్ 30 అమలుచేశారు. అంతేకానీ ఏ వైకాపా నాయకుడినీ ముందస్తు అరెస్టు చేయలేదు. జగన్‌ను తిరుమల రాకూడదని చెప్పలేదు. ఆయన వస్తే అరెస్టు చేస్తామని కూడా అనలేదు. కానీ.. తప్పుడు ప్రచారం చేసి ప్రజలను మభ్యపెట్టాలని ప్రయత్నిస్తున్నారు’ అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కన్వీనర్ కోటా బీడీఎస్ వెబ్ ఆప్షన్లకు నోటిఫికేషన్

ఈనాడు, వరంగల్: తెలంగాణలోని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయానికి అనుబంధ ప్రభుత్వ, ప్రైవేటు, ఆర్మీ డెంటల్ కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద వెబ్ ఆప్షన్లు పెట్టుకునేందుకు శనివారం వర్సిటీ తొలి విడత నోటిఫికేషన్ జారీ చేసింది. అర్హులైన విద్యార్థుల ప్రవేశాల కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని గతంలో వర్సిటీ నోటిఫై చేయడంతో విద్యార్థులు తమ ధ్రువపత్రాలు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సమయంలో అప్‌లోడ్ చేశారు. ఈ క్రమంలో సంబంధిత అధికారులు ధ్రువపత్రాలను పరిశీలించి అర్హులైన వారి పేర్లను యూజీ ప్రవేశాల కింద తుది మెరిట్ జాబితాలో పొందుపర్చి ఈ నెల 26న వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. వీరంతా వెబ్ ఆప్షన్లను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. దివ్యాంగులు, ఆంగ్లో ఇండియన్, సీఏపీ, ఈడబ్ల్యుఎస్ కోటాతో సహా ప్రొవిజినల్ తుది మెరిట్ జాబితాలో పేర్లున్న వారంతా సెప్టెంబరు 29 నుంచి అక్టోబరు ఒకటో తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు వెబ్ ఆప్షన్లను పెట్టుకోవాలని వర్సిటీ తెలిపింది.

EENADU Vol: 51, Iss: 50 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

దివ్యాంగ బాలల సమస్యలపై స్పందించాలి

• సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్



దిల్లీ: మానసిక, శారీరక లోపాలతో బాధపడుతున్న దివ్యాంగ బాలల సమస్యలను పోలీసుస్టేషన్ల నుంచి న్యాయస్థానాల వరకు అందరూ అర్థం చేసుకొని తగిన విధంగా స్పందించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ డి.వై.చంద్రచూడ్ పిలుపునిచ్చారు. బాలల సంరక్షణపై దిల్లీలో రెండు రోజుల పాటు జరిగిన వార్షిక సమావేశంలో శనివారం సీజేఐ ప్రసంగించారు. దివ్యాంగ బాలలు కేవలం శారీరక సమస్యలనే కాదు సమాజం నుంచి దుర్వివక్షలను, అపోహలను ఎదుర్కొంటున్నారని గుర్తుచేశారు. కులం, మతం, జాతి, సామాజిక-ఆర్థిక హోదాపరమైన వ్యత్యాసాలు వారిని పీడిస్తున్నాయన్నారు. వీటి నుంచి దివ్యాంగ బాలలకు చట్టపరంగా రక్షణ కల్పించాలని ప్రభుత్వాలకు సూచించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సమస్యలు, వాటి పరిష్కారంలో సాంకేతికత వినియోగంపై అవగాహన కల్పించేందుకు ఉద్దేశించిన పుస్తకాన్ని ప్రధాన న్యాయమూర్తి విడుదల చేశారు. కేంద్ర మంత్రి అన్నపూర్ణా దేవి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న, యునిసెఫ్ ప్రతినిధి సింథియా మెక్కాఫ్రీ తదితరులు ఈ సమావేశంలో ప్రసంగించారు.

అక్రమ వలసల వేడి

మెక్సికో సరిహద్దును సందర్శించిన హారిస్ • ఎన్నికల వేళ సమస్య గుర్తొచ్చిందా?: ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికలు దగ్గరపడుతున్నకొద్దీ ప్రధాన ప్రత్యర్థుల మధ్య మాటల మంటలు రేగుతున్నాయి. అక్రమ వలసల విషయం తాజాగా రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్, డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్ మధ్య చిచ్చురేపింది. అమెరికా-మెక్సికో సరిహద్దు ప్రాంతాన్ని హారిస్ సందర్శించారు. దేశంలోకి అక్రమ వలసలను నివారించేందుకు సరిహద్దుల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తానని చెప్పారు. వలస విధానాన్ని చక్కదిద్దుతానని హామీఇచ్చారు. ఏళ్లతరబడి అమెరికాలో నివసిస్తున్నా, ఎలాంటి ధ్రువీకరణ పత్రాలైనా లేని వలసదారులకు పౌరసత్వం కల్పించడానికి కృషి చేస్తానన్నారు. 'అధ్యక్షుడిగా ట్రంప్ ఉన్న నాలుగేళ్లలో వలస విధానాన్ని సరిదిద్దే చర్యలేవీ తీసుకోలేదు. దేశంలోకి ప్రజలు ప్రవేశించడానికి చట్టబద్ధమైన మార్గాలను రూపొందించలేదు. రాజకీయాలు చేయడానికి ప్రజలను ఉపయోగించుకునే వారికంటే దేశ భద్రత గురించి శ్రద్ధ తీసుకునేవారికి ఎన్నికల్లో ప్రజలు మద్దతు ఇవ్వాలి' అని హారిస్ పిలుపునిచ్చారు. సరిహద్దు భద్రత, చట్టాలను అమలుచేయడంపై తనకు అవగాహన ఉందని తెలిపారు. తుపాకులు, మాదకద్రవ్యాలు, మానవుల అక్రమ రవాణా వంటి విషయాల్లో అంతర్జాతీయ క్రిమినల్ సంస్థల్ని గతంలో తాను విచారించినట్లు గుర్తుచేశారు.



అమెరికా-మెక్సికో సరిహద్దు ప్రాంతంలో అధికారితో మాట్లాడుతున్న డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్

అధికారులకు అనుమానాస్పద పొట్లాలు

ఎన్నికల నేపథ్యంలో అమెరికాలో అనుమానాస్పద పొట్లాలు కలకలం సృష్టిస్తున్నాయి. ఎన్నికల అధికారులకు తపాలా ద్వారా ఇవి వస్తున్నాయి. ఈ నెలలో 15 రాష్ట్రాల్లో ఇవి చోటుచేసుకున్నాయి. తాజాగా మిన్నెసోటా 'సెక్రటరీ ఆఫ్ స్టేట్స్ ఆఫీసు'కు కూడా ఈ పోస్టు రావడంతో కొన్ని గంటలపాటు కార్యాలయాన్ని ఖాళీ చేయాల్సివచ్చింది. పంపినవారి చిరునామా 'యునైటెడ్ స్టేట్స్ ట్రెయిటర్ ఎలిమినేషన్ ఆర్మీ' అని ప్యాకెట్లపై ఉంది. దీనిపై అమెరికా భద్రతా సంస్థ ఎఫ్‌బీఐ, తపాలా శాఖ దర్యాప్తు చేస్తున్నాయి. పొట్లాల్లో గుర్తుతెలియని పదార్థం ఉందని ఎఫ్‌బీఐ వెల్లడించింది.

మరి నాలుగేళ్లుగా ఎందుకు పట్టించుకోలేదు?

హారిస్ వ్యాఖ్యలపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. నాలుగేళ్లుగా సరిహద్దు వద్దకు వెళ్లని హారిస్‌కు ఎన్నికలవేళ అక్రమ వలసల సమస్య గుర్తొచ్చిందా అని ప్రశ్నించారు. సరిహద్దులకు వెళ్లి ప్రసంగించడానికి ఇది సరైన సమయం కాదన్నారు. హింసాత్మక ముఠాలు అమెరికాలో ప్రవేశించి హత్యలు, అత్యాచారాలు చేస్తున్నా ఆమె పట్టించుకోలేదని మండిపడ్డారు. గూగుల్‌పై ట్రంప్ విరుచుకుపడ్డారు. 'గూగుల్ నా గురించి తప్పుడు కథనాలు మాత్రమే చూపిస్తుంది. కమలా హారిస్ గురించి మాత్రం సానుకూల కథనాలే ప్రదర్శిస్తుంది. ఇది చట్టవిరుద్ధమైన చర్య. తిరిగి శ్వేతసౌధంలో పగ్గాలు చేపడితే ఈ టెక్ దిగ్గజంపై విచారణ జరిపిస్తా. ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకున్నందుకు న్యాయశాఖ క్రిమినల్ విచారణ జరుపుతుందని ఆశిస్తున్నా. లేకపోతే నేనే ఆ విచారణను ఆదేశిస్తా' అని ఆయన పేర్కొన్నారు. ఏ రాజకీయ అభ్యర్థికి అనుకూలంగా ఉండేలా సెర్చ్ ఫలితాలు తారుమారు చేయలేదని గూగుల్ ఖండించింది.



ఉక్రెయిన్‌లోని సుమీలో రష్యా డ్రోన్ దాడిలో ధ్వంసమైన వైద్య కేంద్రం

వైద్య కేంద్రంపై రష్యా దాడి.. ఉక్రెయిన్‌లో 8 మంది మృతి

కీవ్: ఈశాన్య ఉక్రెయిన్ నగరమైన సుమీలో ఓ వైద్య కేంద్రంపై రష్యా శనివారం జరిపిన డ్రోన్ దాడిలో కనీసం 8 మంది ప్రాణాలు కోల్పోయారు. మొదటి దాడిలో ఒకరు చనిపోయారు. రోగుల్ని, సిబ్బందిని హుటాహుటిన వేరేచోటుకు తరలిస్తుండగా రష్యా మరోసారి విరుచుకుపడింది. షాహెద్ డ్రోన్‌తో జరిపిన ఈ దాడిలో మరో ఏడుగురు చనిపోగా 11 మంది గాయపడ్డారు. శుక్రవారం రాత్రి రష్యా ప్రయోగించిన 73 డ్రోన్లలో 69ని, నాలుగు క్షిపణుల్లో రెండింటిని కూల్చివేశామని ఉక్రెయిన్ వాయుసేన తెలిపింది. ఒక్క కీవ్‌పైనే 15 డ్రోన్లను కూల్చివేసినట్లు వెల్లడించింది. బెల్గొరోద్ ప్రాంతంలో నాలుగు, కర్స్క్ ప్రాంతంలో ఒకటి చొప్పున ఐదు ఉక్రెయిన్ డ్రోన్లను తాము కూల్చివేశామని రష్యా రక్షణశాఖ తెలిపింది.

పేలుడులో 13 మంది దుర్మరణం

మాస్కో: రష్యాలోని డగెస్తాన్‌లో ఓ గ్యాస్‌స్టేషన్‌లో పేలుడు జరిగి 13 మంది దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటనలో గ్యాస్‌స్టేషన్‌తో పాటు దానిలోని కెఫ్టెరియా కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి. పేలుడు కారణాలు తెలుసుకునేందుకు విచారణకు ఆదేశించారు.

కాంగ్రెస్‌లో అందరూ సీఎంలే: మోదీ



హిసార్: హరియాణాలో ముఖ్యమంత్రి పదవి కోసం కాంగ్రెస్ నేతలు అపుడే పోటాపోటీగా ఉవ్విళ్లూరుతున్నారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎద్దేవా చేశారు. తండ్రీకొడుకులు (భూపిందర్‌సింగ్ హుడ్డా, దీపేందర్‌సింగ్ హుడ్డా) కూడా ఈ పోటీలో ఉన్నారని, స్థిరత్వమనేది కాంగ్రెస్ పార్టీకి చాలా దూరమన్నారు. పార్టీ నాయకులను ఏకతాటిపైకి తీసుకురాలేని కాంగ్రెస్ రాష్ట్రంలో స్థిరత్వాన్ని ఎలా సాధిస్తుందని ప్రశ్నించారు. శనివారం హిసార్ ఎన్నికల సభలో మోదీ మాట్లాడుతూ.. దేశంలో అతిపెద్ద మతతత్వ పార్టీ కాంగ్రెస్ అని, హరియాణా దీని ఫలితాలను ఇప్పటికీ అనుభవిస్తోందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి ఆగకూడదని కోరుకొంటున్న స్థానికులు 'భరోసా దిల్ సే, బీజేపీ ఫిర్ సే' (మనసు నిండా విశ్వాసం, మళ్లీ భాజపా ఖాయం) అంటున్నారని తెలిపారు. పోలింగు గడువు సమీపించేకొద్దీ కాంగ్రెస్ ప్రభావం తగ్గుతోందన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్‌ను గెలిపించిన ప్రజలు 'క్యా హువా తేరా వాదా?' (నువ్వు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?) అని అడుగుతున్నారని, దీనికి బదులుగా ఆ పార్టీ 'తుమ్ కౌన్?' (మీరెవరు?) అని ప్రజలను ప్రశ్నిస్తోందని సినీ పరిభాషలో ప్రధాని వ్యాఖ్యలు చేశారు. దిల్లీ రాజకుటుంబం ఆ రాష్ట్ర ప్రజలను వంచించిందని, నేడు హిమాచల్‌లో ఉద్యోగుల జీతభత్యాలకు కూడా బడ్జెట్ లేదన్నారు. గతంలో హరియాణాలో దళితులపై కాంగ్రెస్ సాగించిన దమనకాండకు ఈ రాష్ట్ర ప్రజలు ఆ పార్టీని ఎన్నటికీ క్షమించబోరని తెలిపారు. అర్బన్ నక్సలైట్ల కబంధ హస్తాల్లో ఉన్న కాంగ్రెస్ పార్టీ నేతలు విదేశాలకు వెళ్లి భారత్‌కు వ్యతిరేకంగా మాట్లాడే వ్యక్తులతో సమావేశమవుతున్నట్లు మోదీ ధ్వజమెత్తారు.

మేమొస్తే జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా: ప్రియాంక



జమ్మూ: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ తెలిపారు. దేశవ్యాప్తంగా భావోద్వేగాలను రాజేయడానికి జమ్మూకశ్మీర్‌ను ఓ పావుగా భాజపా వాడుకుంటోందని ఆరోపించారు. శనివారం బిష్నాలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆమె మాట్లాడారు. జమ్మూకశ్మీర్‌పై కాంగ్రెస్‌కు స్పష్టమైన విధానం ఉందని అన్నారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే సీజన్ వారీగా జమ్మూ, శ్రీనగర్ మధ్య ప్రభుత్వ కార్యాలయాల మార్పిడి పద్ధతిని పునరుద్ధరిస్తామని చెప్పారు. తన నానమ్మ ఇందిరాగాంధీకి జమ్మూకశ్మీర్‌తో ఉన్న అనుబంధాన్ని ప్రస్తావించారు. ఆమె హత్యకు గురి కావడానికి నాలుగైదు రోజుల ముందే.. కశ్మీర్ అందాలను చూడాలనుకుంటున్నట్లు తమతో చెప్పారని ప్రియాంక గుర్తుచేసుకున్నారు. 'మీకు రాష్ట్ర హోదా కావాలంటే తమకు ఓటేయండని అమిత్‌షా అడుగుతున్నారు. వాస్తవానికి రాష్ట్ర హోదా తొలగించిందే వారు' అని ఎద్దేవాచేశారు.

హెలికాప్టర్ విషయంలో కుట్ర

ఇదిలా ఉండగా ప్రియాంక ప్రయాణిస్తున్న హెలికాప్టర్ కఠువా జిల్లాలోని బిలావర్‌లో దిగలేకపోవడం వెనుక జమ్మూకశ్మీర్ యంత్రాంగం కుట్ర ఉందని కాంగ్రెస్ ఆరోపించింది. సభ జరిగే ప్రదేశానికి 35 కి.మీ. దూరంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేయడమేమిటని ప్రశ్నించింది. పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీకి శుక్రవారం ఇలాంటి పరిస్థితే ఎదురైందని పేర్కొంది.

ఏళ్లుగా బయట కనిపించలేదు.. అయినా!



నస్రల్లా

ఇంటర్నెట్ డెస్క్: హెజ్‌బొల్లా.. లెబనాన్‌కు చెందిన మిలిటెంట్ సంస్థ.. దీనిని ఉగ్రవాద సంస్థగా అమెరికా ప్రకటించింది. ఇరాన్ అండతో ఎదిగిన దీనికి ప్రపంచంలో ఏ ఉగ్ర సంస్థకూ లేని ఆయుధాలు, మానవ వనరులున్నాయి. దాదాపు లక్ష రాకెట్లతోపాటు 50వేల నుంచి లక్ష వరకూ ఫైటర్లున్నారు. హమాస్‌కు మద్దతుగా హెజ్‌బొల్లా ఇజ్రాయెల్‌పై దాడులకు దిగడంతో మరోసారి ఘర్షణ తీవ్రమైంది. ఈ నేపథ్యంలో హెజ్‌బొల్లా కీలక నేతలపై ఇజ్రాయెల్ దృష్టి పెట్టింది. షుకుర్, ఇబ్రహీం అఖీల్ తదితరులను వైమానిక దాడులతో చంపేసింది. దీంతో అధినేత నస్రల్లా జాగ్రత్తగా ఉంటున్నాడు. అతడు సాధారణంగా బయట కనిపించడు. వీడియోలు, టీవీల ద్వారానే సందేశమిస్తాడు. బీరుట్‌లోని పెద్ద భవనాల కింద ఉన్న సెల్లార్లలో ఉంటాడన్న సమాచారం ఇజ్రాయెల్ దగ్గర ఉంది. ఈ మేరకు ఆ సెల్లార్లను పేల్చివేసింది.

మణిపుర్‌లో బంద్.. రెండు జిల్లాలపై ప్రభావం

ఇంఫాల్: మణిపుర్‌లో కుకీ బృందాలు ఇచ్చిన బంద్ రాష్ట్రంలోని పలు జిల్లాలపై ప్రభావం చూపింది. ఉగ్రవాదులు బయటినుంచి రాష్ట్రంలోకి వస్తున్నారని భద్రతా సలహాదారు కుల్దీప్ సింగ్ చేసిన ప్రకటనకు నిరసనగా ఆదివాసి గిరిజన నాయకుల ఫోరం (ఐటీఎల్ఎఫ్), కుకీ విద్యార్థి సంఘం (కేఎస్‌వో) ఇచ్చిన బంద్ చురాచంద్‌పుర్, కాంగ్‌పోక్పీ జిల్లాలపై ప్రభావం చూపినట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు జిరిబామ్ జిల్లాలో మరోసారి హింస చెలరేగినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని మోంగ్‌బాంగ్ గ్రామ సమీప కొండప్రాంతంపై నుంచి గ్రామ వాలంటీర్లే లక్ష్యంగా సాయుధమూకలు కాల్పులు జరిపారు. దీంతో మహిళలు, చిన్నారులు, వృద్ధులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు పేర్కొన్నారు.

రాహుల్ అతిపెద్ద అబద్ధాలకోరు: భాజపా

• అయోధ్య వేడుకపై వ్యాఖ్యల మీద మండిపాటు

దిల్లీ: అయోధ్య ప్రాణప్రతిష్ఠ వేడుకను తారల ఆటపాటల కార్యక్రమంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొనడంపై భాజపా మండిపడింది. ఆయనో అతిపెద్ద అబద్ధాలకోరు అని ఆరోపించింది. హిందుత్వం పట్ల గాంధీ కుటుంబం అసలైన వైఖరి ఏమిటనేది ఈ వ్యాఖ్యలే చాటుతున్నాయంది. హరియాణాలోని బర్వాలాలో గురువారం ఎన్నికల ప్రచార సభలో రాహుల్ చేసిన వ్యాఖ్య సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. 'అమితాబ్ బచ్చన్, అంబానీ, అదానీలను అయోధ్యకు పిలిచి పేదల్ని, కూలీల్ని, రైతుల్ని మాత్రం ఆహ్వానించలేదు. అక్కడ జరిగిందంతా నాచ్-గానా (నాట్యం-పాటలు). అందుకే అయోధ్య ఉన్న లోక్‌సభ స్థానాన్నీ భాజపా కోల్పోయింది' అని రాహుల్ పేర్కొన్నారు.

పదేపదే అవమానిస్తున్నారు: త్రివేది

రామాలయాన్ని కాంగ్రెస్ పదేపదే అవమానిస్తోందని భాజపా జాతీయ అధికార ప్రతినిధి సుధాన్షు త్రివేది ఆరోపించారు. రామాలయ నిర్మాణ కూలీల్ని ప్రధాని మోదీ సత్కరించి, పూలరేకులు వారిపై జల్లారని గుర్తుచేశారు. లోక్‌సభలో 'దైవసాక్షిగా' అని రాహుల్‌గాంధీ ప్రమాణం చేయలేదని, అలాంటి వ్యక్తి.. మతపరమైన విషయాల్లో అర్థంపర్థం లేకుండా మాట్లాడుతున్నారని శనివారం విలేకరుల సమావేశంలో విమర్శించారు. అఫ్గాన్‌లో మొగల్ చక్రవర్తి బాబర్ సమాధిని గాంధీ కుటుంబంలోని మూడు తరాలు సందర్శించి నివాళులర్పించాయని, రామాలయంపై వైఖరి వారి అసలు నైజాన్ని, హిందుత్వంపై తిరస్కార ధోరణిని చాటుతున్నాయని చెప్పారు. అయోధ్యలో సామాన్యులకు ఇచ్చిన గౌరవాన్ని చూడడానికి రాహుల్ కళ్లు మూసుకుపోయాయా అని భాజపా అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ప్రశ్నించారు. విదేశానికి చెందిన క్రైస్తవ మహిళకు, పార్సీ తండ్రికి జన్మించిన వ్యక్తికి.. 500 ఏళ్ల పోరాటం తర్వాత నిర్మితమైన ఆలయం వేడుక ఆటపాటల కార్యక్రమంగా కనిపిస్తోందని భాజపా ఐటీ విభాగాధిపతి అమిత్ మాలవీయ అన్నారు. 'అబద్ధాలకు రారాజు రాహుల్. దేశ సంస్కృతిని, హిందూ ధర్మాన్ని, సమాజాన్ని అవమానపరిచే ఎలాంటి అవకాశాన్నీ ఆయన వదులుకోరు' అని విశ్వ హిందూ పరిషత్ సంయుక్త ప్రధాన కార్యదర్శి సురేంద్ర జైన్ విమర్శించారు. హిందువుల్ని రాహుల్ అవమానించారని, దానిపై క్షమాపణ చెప్పాలని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ డిమాండ్ చేశారు. ప్రజల నమ్మకాలను, విశ్వాసాలను దెబ్బతీయాలనుకోవడం ఎంతమాత్రం సమర్థనీయం కాదన్నారు.



బిహార్‌లోని గోపాల్‌గంజ్‌లో ప్రభుత్వ ఆసుపత్రిలోకి చేరిన వరద నీరు

బిహార్‌లో వరదలు.. ఉప్పొంగుతున్న నదులు

పట్నా: బిహార్‌లో కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నదులు పొంగిపొర్లుతున్నాయి. బీర్‌పుర్, కోసీ బ్యారేజీల్లో 5.31లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో రాష్ట్రంలో వరదలు ముంచెత్తే అవకాశాలు ఉన్నట్లు శనివారం ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. ఇప్పటికే భారీ వర్షాల కారణంగా 12 జిల్లాల్లో దాదాపు 13.5లక్షల మంది నష్టపోయారు. తాజా వరదతో వారి పరిస్థితి మరింత దిగజారే అవకాశాలు ఉన్నాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కోసి, గండక్, భాగమతి, కమలా బలాన్, మహానందా, గంగా నదుల్లో నీటి మట్టాలు పెరుగుతున్నాయి. నేపాల్‌లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నదులు ప్రమాద స్థాయి మించి ప్రవహిస్తున్నాయని అధికారులు వెల్లడించారు.

నేపాల్‌లో వరదల బీభత్సం.. 59 మంది మృతి

కాఠ్‌మాండూ: నేపాల్‌లో వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆకస్మిక వరదలు ముంచెత్తడంతో 59 మంది మృతిచెందారు. మరో 44మంది గల్లంతయ్యారని, 36మంది గాయపడ్డారని శనివారం అధికారులు ప్రకటించారు. ఒక్క కాఠ్‌మాండూ లోయలోనే 37 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. వెయ్యి మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు పేర్కొన్నారు. 226 ఇళ్లు పూర్తిగా నీట మునిగిపోయాయి. ముంపు ప్రాంతాల్లో దాదాపు 3,000 మంది భద్రతా సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నారని అధికారులు వెల్లడించారు.

భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం ఇవ్వాల్సిందే

• ఐరాసలో భూటాన్ ప్రధాని

ఐరాస: స్థిరమైన ఆర్థిక వృద్ధిని కొనసాగిస్తూ.. వర్ధమాన దేశాలకు సమర్థ నాయకత్వం వహిస్తున్న భారత్‌కు ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని భూటాన్ అభిప్రాయపడింది. శుక్రవారం జరిగిన ఐరాస సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఆ దేశ ప్రధాని షెరింగ్ టాగ్‌బే ఈ మేరకు వ్యాఖ్యానించారు.



తల్లి ఎలుగు దెబ్బకు తోకముడిచిన పులి

ఇంటర్నెట్‌డెస్క్: ఓ ఎలుగుబంటి తన కూనను కాపాడుకోవడానికి పులికి ఎదురెళ్లిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మహారాష్ట్రలోని తాడోబా-అంధేరి టైగర్ రిజర్వ్‌ఫారెస్టులో నివసించే ఓ ఎలుగుబంటి తన పిల్లలతో తిరుగుతుండగా.. ఆ సమయంలో ఒక్కసారిగా పులి ఓ ఎలుగు కూనపై దాడి చేసింది. దీంతో ఎలుగుబంటి తన పిల్లను కాపాడుకోవడానికి ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఏకంగా పులిని బెదిరించడమే కాక పరుగులు పెట్టించింది. ఆ విరోచిత పోరాటానికి పులి తోక ముడిచి అక్కడినుంచి పారిపోయింది.

కశ్మీర్లో భాజపా ప్రయత్నాలు వమ్ము: ఒమర్

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో తొలి రెండు దశల ఎన్నికల్లో భాజపా ప్రయత్నాలను తాము, కాంగ్రెస్ కలిసి వమ్ము చేశామని నేషనల్ కాన్ఫరెన్స్ నేత, మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా చెప్పారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనుకుంటున్న కమలనాథుల ఆశలపై ఓటర్లు నీళ్లు జల్లారని, మూడో దశలోనూ అలాంటి స్పందనే వస్తుందని శనివారం బారాముల్లా జిల్లాలో విలేకరులకు చెప్పారు. దక్షిణ, మధ్య కశ్మీర్ ప్రాంతాల్లో తమ కూటమికి అనుకూలంగా ఓటర్లు పెద్దఎత్తున స్పందించారని తెలిపారు.

కమలనాథులకు అధికారం కల్ల: ఫరూఖ్

జమ్మూకశ్మీర్ ఓటర్లు తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా పిలుపునిచ్చారు. దిల్లీ నుంచి పంపిన వ్యక్తుల్ని తిరస్కరించాలని, వారంతా మేకవన్నె పులులని పేర్కొన్నారు. ఎన్నికల్లో కమలనాథులకు అధికారం కల్ల అని, తమ కూటమికి విజయం ఖాయమని చెప్పారు. ఓటు వేసేముందు ఓటర్లు ఆచితూచి నిర్ణయించుకోవాలన్నారు.

370ని కేంద్రమే పునరుద్ధరించగలదు: ఆజాద్

జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరిస్తామని కాంగ్రెస్-ఎన్‌సీ కూటమి ఇస్తున్న హామీని 'డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ' (డీపీఏపీ) ఛైర్మన్ గులాంనబీ ఆజాద్ తోసిపుచ్చారు. 370 అధికరణాన్ని, రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరణను కేంద్రం మాత్రమే చేయగలదని చెప్పారు. రాష్ట్ర హోదాపై ప్రధాని, కేంద్ర హోంమంత్రి ఇప్పటికే హామీ ఇచ్చారని గుర్తుచేశారు.

నిరుద్యోగులంతా భాజపాను ఓడిస్తారు: ఖర్గే

దిల్లీ: దేశంలో నేడు నిరుద్యోగం కన్నా పెద్ద సమస్య మరొకటి లేదని.. ప్రభుత్వ విధానాల వల్ల ఉపాధి దొరక్కుండాపోయిన యువతీ యువకులంతా ఇక నుంచి ప్రతి ఎన్నికల్లో భాజపా ఓటమికే ఓటు వేస్తారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ గ్రహించాలని శనివారం 'ఎక్స్' వేదికగా హెచ్చరించారు. నిరుద్యోగం వల్ల యువత నిస్సహాయ స్థితిలోకి జారిపోయినట్లు నియత కాల కార్మిక భాగస్వామ్య సర్వే (పీఎల్ఎఫ్ఎస్) వెల్లడించిందన్నారు. ఈ వాస్తవాన్ని ప్రభుత్వం దాచలేకపోయిందన్నారు. 2023-24లో దేశంలో యువజన నిరుద్యోగిత 10.2 శాతానికి పెరిగిందన్నారు.

ప్రతి నలుగురు మధుమేహుల్లో ఒకరికి గుండె దెబ్బతినే ప్రమాదం

దిల్లీ: ప్రతి నలుగురు మధుమేహుల్లో ఒకరికి హృదయం దెబ్బతినే ప్రమాదం అధికంగా ఉన్నట్లు ముంబయి, దిల్లీలోని రెండు ల్యాబ్‌లలో నిర్వహించిన తాజా సర్వేలు నివేదించాయి. దిల్లీ పరివాహక ప్రాంతంలో నివసిస్తోన్న దాదాపు 2 వేల మంది మధుమేహుల నమూనాలపై డాక్టర్ డాంగ్స్ ల్యాబ్ పరీక్షలు నిర్వహించింది. వీరిలో 15శాతం మంది రోగుల్లో హెచ్‌బీఏ1సీ 6.5శాతం కన్నా అధికంగా ఉన్నట్లు వెల్లడైంది. ఇది గుండె ఆరోగ్యానికి సంబంధించి ప్రమాదకరమైన సంకేతమని పేర్కొంది. టైప్-2 డయాబెటీస్‌తో బాధపడుతోన్న 34శాతం రోగుల్లో గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం అధికంగా ఉన్నట్లు ముంబయిలో 1,054 మంది మధుమేహులపై నిర్వహించిన పరీక్షల్లో వెల్లడైంది.

అండాశయ లోపాలతో ఆటోఇమ్యూన్ రుగ్మతలు

దిల్లీ: కొందరు మహిళల్లో అండాశయాలు అర్ధాంతరంగా అండాల ఉత్పత్తిని ఆపేస్తుంటాయి. ఇలాంటివారు కీళ్లవాతం, హైపర్‌థైరాయిడిజం వంటి ఆటోఇమ్యూన్ రుగ్మతల బారినపడే ప్రమాదం 2.5 రెట్లు ఎక్కువని శాస్త్రవేత్తలు తేల్చారు. 40 ఏళ్ల లోపు మహిళల అండాశయాల్లో ఇలాంటి పరిస్థితి తలెత్తుతుంటుంది. తొలుత వారి రుతుచక్రంలో క్రమపద్ధతి లోపిస్తుంది. ఆ తర్వాత అది ఆగిపోతుంది. కొందరిలో మెనోపాజ్ లక్షణాలూ కనిపిస్తుంటాయి. ప్రపంచవ్యాప్తంగా 3.5 శాతం మంది మహిళల్లో ఈ సమస్య ఉందని మునుపటి అధ్యయనాల్లో వెల్లడైంది. దాదాపు 20వేల మంది మహిళల ఆరోగ్య బీమా రికార్డులను పరిశీలించడం ద్వారా ఫిన్లాండ్ శాస్త్రవేత్తలు తాజా నిర్ధారణకు వచ్చారు. వీరిలో దాదాపు 4వేల మందికి అండాశయ రుగ్మత కారణంగా ఆటోఇమ్యూన్ వ్యాధులు వచ్చినట్లు గుర్తించారు. శరీర రోగనిరోధక వ్యవస్థ పొరపాటున ఆరోగ్యకర కణజాలంపై దాడి చేయడం వల్ల ఇలాంటి రుగ్మతలు వస్తుంటాయి.

నేపాల్ అభివృద్ధి ప్రాజెక్టులకు భారత్ రూ.29 కోట్ల సాయం

కాఠ్‌మాండూ: నేపాల్‌లో విద్యా, వైద్యం, వ్యవసాయం వంటి వివిధ రంగాల్లో 12 ప్రాజెక్టుల నిర్మాణానికి సాయం చేసేందుకు భారత్ ముందుకొచ్చింది. ఈ ప్రాజెక్టుల నిర్మాణం కోసం 474 మిలియన్ల నేపాలీ రూపాయలు (రూ.29.6 కోట్లు) కాఠ్‌మాండూకు అందించింది. ఈ అంశంలో శుక్రవారం ఇరు దేశాలు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశాయి. బానెపు- హులు నీటి సరఫరా ప్రాజెక్టు, వ్యవసాయ ప్రోత్సాహక కేంద్ర భవనం, ప్రసవానంతర ఆరోగ్య కేంద్రం, కంటి ఆసుపత్రి భవనం, ఓ పాఠశాల భవనం సహా 12 ముఖ్యమైన ప్రాజెక్టులను నిర్మించనున్నారు. 2003 నుంచి నేపాల్‌లో 563 అధిక ప్రభావ అభివృద్ధి ప్రాజెక్టుల(హెచ్ఐసీడీపీఎస్)ను భారత్ చేపట్టింది.

పట్టణ ఓటర్లలో అనాసక్తి ఆందోళనకరం

• మహారాష్ట్రలో పోలింగ్ శాతం పెంపునకు కృషి : సీఈసీ

ముంబయి: పట్టణ ఓటర్లు పోలింగులో పాల్గొనడానికి అనాసక్తత చూపడం ఆందోళనకరమని, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో గరిష్ఠ ఓటింగు జరిగేలా చూస్తామని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్‌కుమార్ తెలిపారు. శాసనసభ గడువు ముగిసే నవంబరు 26 లోపు జరగనున్న మహారాష్ట్ర ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించడానికి సహ ఎన్నికల కమిషనర్లు జ్ఞానేశ్‌కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధూలతో కలిసి శనివారం సీఈసీ ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ముంబయిలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నగరానికి చుట్టుపక్కల కొలాబా, కల్యాణ్ ప్రాంతాల్లో ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో అతితక్కువ పోలింగు నమోదైనట్లు తెలిపారు. అసంఘటిత రంగంలోని రోజువారీ కూలీలకు పోలింగు రోజున వేతనంతో కూడిన సెలవు లభిస్తుందని అధికారులు ప్రచారం చేయాలని సూచించారు. మూడేళ్లకు మించి ఒకేచోట, అలాగే సొంత జిల్లాల్లో పనిచేస్తున్న ప్రభుత్వాధికారులను బదిలీ చేసి.. రెండు మూడు రోజుల్లో తమకు నివేదిక ఇవ్వాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించామన్నారు. మొత్తం 288 అసెంబ్లీ స్థానాలున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లకు డబ్బు, ఇతర కానుకలు ఇవ్వడానికి హెలికాప్టర్లను ఉపయోగించకుండా నిఘా పెడుతున్నట్లు చెప్పారు. ఎన్నికల వేళ సామాజిక మాధ్యమాల ద్వారా బోగస్ వార్తలు, డీప్‌ఫేక్ వీడియోలు వ్యాపింపజేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోసం 1,00,186 పోలింగు కేంద్రాలను ఏర్పాటుచేస్తామని సీఈసీ తెలిపారు. ఎన్నికల సన్నద్ధతపై రాజకీయ పార్టీలు, అధికారులు సహా అందరితో సమావేశమై చర్చించినట్లు వెల్లడించారు. అభ్యర్థులకు నేరచరిత్ర ఉంటే, రాజకీయ పార్టీలు ఆ విషయాన్ని ఓటర్లకు తెలియజేయాల్సి ఉంటుందన్నారు.

యూథనేసియాపై కొత్త మార్గదర్శకాలు

దిల్లీ: ఎంత చికిత్స చేసినా బతికే ఆశ లేని రోగులకు ఆక్సిజన్ తదితర జీవ సౌకర్యాలను ఆపేయాలంటే నాలుగు మార్గదర్శకాలను పాటించాలని కేంద్ర ఆరోగ్యశాఖ ప్రతిపాదిస్తోంది. అందులో మొదటిది.. రోగి మెదడు పని చేయడం మానేయడం. వ్యాధి బాగా ముదిరిపోయి ఇక ఏ చికిత్సా పని చేయని స్థితికి చేరడం.. రోగిగానీ, అతడు, ఆమె కుటుంబ సభ్యులుగానీ యాంత్రిక వెంటిలేటర్ల ద్వారా ఆక్సిజన్ ఎక్కించడం మానేయాలని, డయాలసిస్ తదితర జీవ సౌకర్యాలను నిలిపివేయాలని కోరడం.. వంటివి మిగతా మార్గదర్శకాలు. కేసుల్లో సుప్రీంకోర్టు నియమాలను పాటించడం.. జీవ సౌకర్యాలను కొనసాగించినా రోగికి ప్రయోజనం ఉండకపోగా మరిన్ని బాధలు పడతాడని, హుందాగా జీవించే పరిస్థితి ఉండదని భావించినప్పుడు వైద్య సహాయంతో అనాయాస మరణంకు (యూథనేసియా) ముసాయిదా మార్గదర్శకాలు సిఫార్సు చేస్తున్నాయి. వీటిపై అక్టోబరు 20కల్లా సలహాలు, సూచనలు పంపాల్సిందిగా ప్రజలను, వైద్యులను, న్యాయ నిపుణులను కేంద్రం కోరింది. ఆక్సిజన్ కృత్రిమ సరఫరా, ఇతర యంత్రాల వినియోగం ద్వారా రోగి జీవితాన్ని అనవసరంగా పొడిగిస్తున్నారనే అభిప్రాయం తప్పని, ఈ భావన వైద్యులపై న్యాయ నిఘాకు తావిస్తుందని భారత వైద్యుల సంఘం (ఐఎంఏ) అధ్యక్షుడు అశోకన్ వ్యాఖ్యానించారు. రోగి, అతడు, ఆమె కుటుంబంతో కలిసి కూర్చుని మాత్రమే వైద్యులు యూథనేసియా నిర్ణయాలు తీసుకుంటారని వివరించారు. ఇలాంటి నిర్ణయాలను వారికే వదిలేయాలన్నారు. ఇంటెన్సివ్ కేర్ యూనిట్లలో (ఐసీయూ) ఉండే రోగులలో కొంత మంది ఎన్ని చికిత్సలు చేసినా బతక్కపోవచ్చు. జీవించే అవకాశం లేని రోగుల్లో కొందరు జీవ సౌకర్యాలు వద్దని, తమకు యూథనేసియా చేయాలని కోరుతూ చట్టబద్ధమైన లిఖిత పత్రాన్ని సమర్పించలేకపోవచ్చు. అలాంటి కేసుల్లో వైద్యులతో సంఘాలను ఏర్పాటుచేసి యూథనేసియాపై నిర్ణయం తీసుకోవాలని మార్గదర్శకాలు సూచిస్తున్నాయి.

కంగన తీరుపై స్పందించండి

• భాజపా అధిష్ఠానానికి టికాయిత్ లేఖ

దిల్లీ: రద్దు చేసిన సాగు చట్టాలపై భాజపా ఎంపీ, బాలీవుడ్ నటి కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై భారతీయ కిసాన్ యూనియన్ నేత రాకేశ్ టికాయిత్ స్పందించారు. కంగన తీరుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే ఆమె వ్యాఖ్యలపై స్పందించాలని కోరుతూ భాజపా అధ్యక్షుడు నడ్డాకు లేఖ రాశారు. 'దేశంలోని అతి పెద్ద పార్టీని నడిపిస్తున్న మీరు.. భాజపా సిద్ధాంతాన్ని పాటిస్తూ ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మీపై ఉంది. కానీ, 2024 లోక్‌సభ ఎన్నికల్లో హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి స్థానంలో.. దేశ పరిస్థితులపై అంతగా అవగాహన లేని వ్యక్తిని బరిలోకి దింపారనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఎంపీ కంగనా రనౌత్ వ్యవసాయ సమాజాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఆమె తీరు గ్రామస్థులను అవమానించేలా ఉంది" అని లేఖలో పేర్కొన్నారు.

కాఫీ కావాలి

- మిలీనియల్స్, జెన్-జడ్ తరాల నుంచి అధిక గిరాకీ
- భిన్న రుచులపై ఆసక్తి
- దేశీయ విపణిలో ఏటా 10- 15% వృద్ధి



కాఫీ మార్కెట్లో ఆసక్తికర మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఫిల్టర్ కాఫీ, బ్రూ వంటి ఇన్‌స్టంట్ పొడితో కాఫీ మాత్రమే నిన్నటి తరానికి తెలుసు. ప్రస్తుత యువతరం కాఫీని అధికంగా ఇష్టపడుతున్నా.. వారు ఇందులోనే పలు రకాల ఫ్లేవర్స్ (రుచులను) కోరుకుంటున్నారు. మిలీనియల్స్ (1981-1996 మధ్య జన్మించిన వారు), జెన్- జడ్ (1997 తరవాత పుట్టినవారు) తరం వారు పనిచేసుకుంటూ, సరదా కాలక్షేపానికీ కాఫీ షాప్‌లకు దారి తీస్తున్నారు.

మొత్తంమీద అన్ని తరాల అభిరుచుల వల్ల కాఫీ వినియోగంలో ఏటా 10-15% వృద్ధి నమోదవుతోంది. ఖరీదు ఎక్కువే అయినా యువతను ఆకట్టుకునేలా భిన్న ఫ్లేవర్స్‌ను ఆవిష్కరించడానికి ఇన్‌స్టెంట్ కాఫీ సంస్థలు ప్రయత్నాలు చేస్తున్నాయి. కోరుకున్న వెంటనే వేడి నీరు/పాలతో చిటికలో కాఫీ తయారు చేసుకోవడానికి అనువైన ఇన్‌స్టెంట్ కాఫీని చిన్న సాచెట్లు, ప్యాక్‌లుగా విక్రయించేందుకు పోటీ పడుతున్నాయి. ఆర్‌టీడీ (రెడీ-టు-డ్రింక్), కాఫీ పాడ్స్, డ్రిప్ బ్యాగ్స్, మిక్స్ ఫార్మాట్స్. తదితర కాఫీ ఉత్పత్తులు మార్కెట్లోకి వస్తున్నాయి. కొందరు వినియోగదార్లు మొబైల్ యాప్‌ల ద్వారా నచ్చిన కాఫీ ఆర్డర్ చేసి, ఇల్లు/కార్యాలయానికీ తెప్పించుకుంటున్నారు.

ఈనాడు బిజినెస్ వారాంతం

సవాళ్లూ ఉన్నాయ్

ఇన్‌స్టెంట్ కాఫీ కంపెనీలకు ఒక పక్క మంచి అవకాశాలు కనిపిస్తుండగా, మరోపక్క అనుకోని సవాళ్లు కూడా ఎదురవుతున్నాయి. గ్రీన్ కాఫీ (కాఫీ గింజల) ధర పెరగడం, తగినంతగా లభ్యత లేకపోవటం ఆయా సంస్థలకు ఇబ్బందికరంగా మారింది. గత నాలుగేళ్లుగా ప్రపంచ కాఫీ మార్కెట్లో గ్రీన్ కాఫీ లభ్యత క్షీణించింది. వియత్నాం, ఇండోనేషియాల్లో కరవు, మారిన వాతావరణ పరిస్థితుల వల్ల కాఫీ గింజల ఉత్పత్తి తగ్గింది. బ్రెజిల్, కొన్ని ఆఫ్రికా దేశాల్లో కాఫీ గింజల ఉత్పత్తి కొంత మెరుగ్గా ఉన్నా, మొత్తం మీద చూస్తే రెండేళ్లుగా కాఫీ గింజల లభ్యత తగినంతగా లేదు. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్లో గ్రీన్ కాఫీ ధరలు అనూహ్యంగా పెరిగాయి. అందువల్లే మన రిటైల్ మార్కెట్లో ఇన్‌స్టెంట్, ఫిల్టర్ కాఫీ పొడి ధరలు పెరుగుతున్నాయి.



ఇన్ని కంపెనీలు

మన దేశంలో ఇన్‌స్టెంట్ కాఫీ ఉత్పత్తిలో హిందుస్థాన్ యునిలీవర్, టాటా కాఫీ, నెస్లే, సీసీఎల్ ప్రోడక్ట్స్, వింటేజ్ కాఫీ సహా మరికొన్ని కంపెనీలు నిమగ్నమై ఉన్నాయి. ఇందులో ఉత్పత్తి సామర్థ్యం ప్రకారం చూస్తే, సీసీఎల్ ప్రోడక్ట్స్ పెద్ద సంస్థ. ఈ సంస్థకు మన దేశంతో పాటు వియత్నాం, స్విట్జర్లాండ్ దేశాల్లో కాఫీ ప్లాంట్లు ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో దేశాల్లో ఇన్‌స్టెంట్ కాఫీని విక్రయిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో సీసీఎల్ ప్రోడక్ట్స్, ఏకీకృత ఖాతాల ప్రకారం రూ.2,653 కోట్ల టర్నోవర్‌పై రూ.250 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. ఇన్‌స్టెంట్ కాఫీ మార్కెట్లో మెరుగైన వృద్ధి కనిపిస్తున్నందున, సమీప భవిష్యత్తులో ఆదాయాలు, లాభాలు ఇంకా పెరుగుతాయని ఆ సంస్థ అంచనా వేస్తోంది. ఇంతకాలం ఐరోపా, ఉత్తర అమెరికా దేశాల్లో కాఫీ వినియోగం అధికంగా ఉండగా, ఇటీవల ఆసియా దేశాల్లో కాఫీ వినియోగం పెరుగుతోంది. పశ్చిమ దేశాల జీవన విధానాలను ఆసియా దేశాల ప్రజలు అనుసరిస్తున్నారు. ఆ దేశాల మాదిరిగానే భిన్నమైన రుచుల కాఫీని ఆస్వాదించడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. దీనికి తగ్గట్లుగా కాఫీ కంపెనీలు పరిశోధన-అభివృద్ధి, ఉత్పత్తి కార్యకలాపాలను పెంచడంపై దృష్టి సారిస్తున్నాయి.

- ఈనాడు, హైదరాబాద్

రాడో కొత్త వాచీలు





హైదరాబాద్: స్విట్జర్లాండ్‌కు చెందిన ప్రముఖ సంస్థ రాడో నుంచి రెండు కొత్త వాచీలు విపణిలోకి విడుదలయ్యాయి. ఇందులో ఒకటి కెప్టెన్ కుక్ హై-టెక్ సిరామిక్ స్కెలిటన్ కాగా, మరొకటి సెంట్రిక్స్ ఓపెన్ హార్ట్ సూపర్ జూబిలీ. రాడో బ్రాండ్ అంబాసిడర్లుగా ఉన్న బాలీవుడ్ తారలు హృతిక్ రోషన్, కత్రినా కైఫ్‌లు వీటిని ఆవిష్కరించారు. కెప్టెన్ కుక్ హై-టెక్ సిరామిక్ స్కెలిటన్ గులాబీ-బంగారు అలంకారాలతో మాట్ బ్లాక్ మోనోబ్లాక్ కేస్‌లో లభిస్తోంది. రాడో సెంట్రిక్స్ ఓపెన్ హార్ట్ జూబిలీ గులాబీ-బంగారు రంగు కేస్, ముదురు గోధుమ రంగు మదర్ ఆఫ్ పెర్ల్ డయల్ - 12 డైమండ్ ఇండెక్స్‌లను కలిగి ఉంది. 'వాచీలను కేవలం చేతికి పెట్టుకునే వస్తువుగా కాకుండా జీవితంలోని అత్యంత మధుర క్షణాలకు చిహ్నాలుగా మేం భావిస్తాం. హృతిక్ రోషన్, కత్రినా వంటి అగ్ర తారలతో కలిసి పని చేయడం సంతోషంగా ఉంద'ని రాడో సీఈఓ అడ్రియాన్ బాస్‌హార్డ్ తెలిపారు.

బాస్మతియేతర బియ్యంపై ఎగుమతి సుంకం మినహాయింపు

దిల్లీ: బాస్మతియేతర బియ్యం ఎగుమతులపై ఉన్న ఆంక్షలను ప్రభుత్వం ఎత్తివేస్తున్నట్లు శనివారం ప్రకటించింది. అలాగే ఎగుమతి సుంకాన్ని కూడా మినహాయిస్తున్నట్లు పేర్కొంది. దేశీయ సరఫరాను ప్రోత్సహించేందుకు వీలుగా 2023 జులై 20న బాస్మతియేతర బియ్యం ఎగుమతులపై ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. బాస్మతియేతర బియ్యం ఎగుమతులను నిషేధిత జాబితా నుంచి సవరించినట్లు, కనీస ఎగుమతి ధర (ఎంఈపీ) టన్నుకు 490 డాలర్లు (సుమారు రూ.40,700) ఉండేలా చూసుకోవాలని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది వెంటనే అమల్లోకి వస్తుందని, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఇది కొనసాగుతుందని అందులో పేర్కొంది. ముడి బియ్యం(బ్రౌన్ రైస్), వడ్లపై ఎగుమతి సుంకాన్ని 20 శాతం నుంచి 10 శాతానికి తగ్గించింది.

కోడి గుడ్లు

29న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	510
వరంగల్	512
విజయవాడ	535
గోదావరి	535
విశాఖపట్నం	535
చిత్తూరు	523

హైదరాబాద్ జీసీసీల హవా

ఏఐ, సైబర్ సెక్యూరిటీ పరిశోధనల్లో ముందంజ



ఈనాడు, హైదరాబాద్: జీసీసీ (గ్లోబల్ కేపబులిటీ సెంటర్)లు టెక్ పరిశోధనల్లో తమ ప్రత్యేకత చాటుతున్నాయి. ఈ విషయంలో హైదరాబాద్‌లోని జీసీసీలు ఎంతో ముందంజలో ఉన్నాయి. కృత్రిమ మేధ (ఏఐ), సైబర్ సెక్యూరిటీ విభాగాల్లో అనూహ్య సాంకేతిక పరిష్కారాలను ఇవి ఆవిష్కరిస్తున్నాయి. ఐటీ రంగానికి మానవ వనరులను అందించడం, శిక్షణ కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్న టీమ్ లీజ్ డిజిటల్ అనే సంస్థ అధ్యయనం ప్రకారం సాంకేతిక పరిశోధనల్లో (టెక్ ఇన్నోవేషన్) హైదరాబాద్ క్రియాశీలక పాత్ర పోషిస్తోంది. ఇక్కడి జీసీసీల్లోని మానవ వనరుల్లో 45% మంది అత్యాధునిక టెక్నాలజీలపై పనిచేస్తున్నారు.

ఈ విభాగాల్లో బెంగళూరు

బెంగళూరులోని జీసీసీలు హైటెక్ పరిశ్రమలకు అవసరమైన అత్యాధునిక సేవలను అందిస్తున్నాయి. బీఎఫ్ఎస్ఐ, కన్సల్టింగ్, తయారీ రంగాలకు సేవలు అందించే మానవ వనరులు బెంగళూరులో అధికం. ఎలక్ట్రానిక్స్, ఆరోగ్య సంరక్షణ, ఇ-కామర్స్, సెమీకండక్టర్, విద్యుత్తు వాహనాలు (ఈవీ), ఏవియేషన్- డిఫెన్స్, ఇంజినీరింగ్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్‌అండ్‌డీ) విభాగాల్లో బెంగళూరు జీసీసీలు క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నాయి.

- ముంబయి/పుణెలోని జీసీసీలు వాహన రంగానికి సేవలు అందిస్తూ తమ ప్రత్యేకత చాటుకుంటున్నాయి.
- ఎన్‌సీఆర్ దిల్లీలోని జీసీసీలు ఆయిల్ అండ్ గ్యాస్ పరిశ్రమకు అండగా నిలుస్తున్నాయి. ఏడబ్ల్యూఎస్, అజూరే, డేటా మోడలింగ్, ఐఓటీ ప్లాట్‌ఫామ్స్‌పై పనిచేస్తున్నాయి.

హైదరాబాద్ జీసీసీలు క్రియాశీలకంగా ఉన్న టెక్నాలజీ విభాగాలు

- క్లౌడ్ కంప్యూటింగ్
- ఏఐ
- సైబర్ సెక్యూరిటీ
- బ్లాక్ చైన్
- రోబోటిక్స్
- డేటా అనలిటిక్స్

ఈ రంగాల్లో 30% వృద్ధి

జీసీసీల చొరవ వల్ల ఆరోగ్య సంరక్షణ, బీఎఫ్ఎస్ఐ, రిటైల్ రంగాల్లో విశేష వృద్ధి నమోదవుతున్నట్లు టీమ్‌లీజ్ డిజిటల్ విశ్లేషించింది. 2021- 23 మధ్యకాలంలో ఈ రంగాల్లో 30% చొప్పున సగటు వార్షిక వృద్ధి (సీఏజీఆర్) కనిపించినట్లు పేర్కొంది. అదే సమయంలో మొత్తం ఐటీ రంగాన్ని పరిశీలిస్తే క్షీణత నమోదైందని వివరించింది. జీసీసీ సాఫ్ట్‌వేర్, ఇంటర్నెట్ సెక్టార్ స్థిర వృద్ధి సాధిస్తున్నట్లు, 2027 వరకు సగటున 6.2% సగటు వార్షిక వృద్ధి ఉంటుందని అంచనా వేసింది. రిటైల్, ఇ-కామర్స్ విభాగాల్లో 8.4%, హెల్త్‌కేర్‌లో 7.5% సగటు వార్షిక వృద్ధి నమోదు కావచ్చని వివరించింది.

పరిశోధనలకు ప్రాధాన్యం వల్లే

కొంతకాలంగా జీసీసీలు టెక్ పరిశోధనలు, ఉద్యోగాల కల్పనలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నట్లు టీమ్ లీజ్ డిజిటల్ సీఈఓ నీతి శర్మ అన్నారు. హైదరాబాద్‌లోని జీసీసీలు పరిశోధనలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని, క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ, సైబర్ సెక్యూరిటీ విభాగాల్లో ప్రపంచ వ్యాప్తంగా వినియోగదార్లకు సేవలు అందిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ తరుణంలో జీసీసీల్లోని సాంకేతిక నిపుణులకు తగిన శిక్షణ అందించడానికి తాము కృషి చేస్తున్నట్లు తెలిపారు.

రూ.9,000 కోట్లతో టాటా మోటార్స్ కొత్త ప్లాంట్



శంకుస్థాపన కార్యక్రమంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్, టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ తదితరులు

చెన్నై, న్యూస్‌టుడే: టాటా మోటార్స్ రూ.9,000 కోట్లతో 5,000 మందికి ఉద్యోగావకాశాలు కల్పించేలా తమిళనాడులోని రాణిపేట జిల్లా సిప్కాట్ పనపాక్కం పారిశ్రామికవాడలో అత్యాధునిక వాహన తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది. శనివారం జరిగిన కార్యక్రమంలో ప్లాంట్ నిర్మాణానికి తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు కింద వందశాతం పునరుత్పాదక ఇంధనశక్తిని ఉపయోగించి టాటా మోటార్స్‌తో పాటు జాగ్వార్ ల్యాండ్ రోవర్(జేఎల్ఆర్) కోసం ఎస్‌యూవీలు, స్పోర్ట్స్ కార్లను తయారు చేస్తారు. ఈ ప్లాంటు వచ్చే 5-7 ఏళ్లలో 2.5 లక్షల యూనిట్ల వార్షిక సామర్థ్యాన్ని దశలవారీగా చేరగలదని కంపెనీ భావిస్తోంది. కార్యక్రమంలో టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్, టాటా మోటార్స్ ఎండీ శైలేష్, జేఎల్ఆర్ డైరెక్టర్ ఫ్రాంక్ లడ్విగ్ తదితరులు పాల్గొన్నారు.

ఎవర్‌నార్త్‌లో 700 ఉద్యోగాలు

ఈనాడు, హైదరాబాద్: ఆరోగ్య సంరక్షణ రంగంలోని సిగ్నా గ్రూపు ఆధ్వర్యంలోని ఎవర్‌నార్త్ హెల్త్‌సర్వీసెస్ ఇండియా హైదరాబాద్‌లో ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేసింది. ఈ కార్యాలయం 1.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. దీన్ని 4.80 లక్షల చదరపు అడుగుల వరకూ విస్తరించాలనే లక్ష్యాన్ని పెట్టుకుంది. ఇప్పటికే ఈ హబ్‌లో 300లకు పైగా ఉద్యోగులను నియమించుకున్నట్లు సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నీల్ చోపెడ్కర్ తెలిపారు. కృత్రిమ మేధ(ఏఐ), మెషిన్ లెర్నింగ్‌లలో సాంకేతిక నిపుణులను తీసుకుంటున్నట్లు వివరించారు. రానున్న 12 నెలల్లో కొత్తగా 700 మందిని పైగా నియమించుకోబోతున్నట్లు తెలిపారు. ఈ కేంద్రం అంతర్జాతీయంగా ఉన్న తమ వినియోగదారులకు అవసరమైన పరిష్కారాలను అందిస్తుందని ఎవర్‌నార్త్ ఇండియా ఎండీ అశోక్ వెంకటాచలం తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోని ఇంజినీరింగ్ కళాశాలలతో భాగస్వామ్యం కుదుర్చుకొని, విద్యార్థులకు అధునాతన సాంకేతికతలపై శిక్షణ ఇచ్చేందుకు ఇన్నోవేషన్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు హెచ్ఆర్ డైరెక్టర్ యదు కిశోర్ నందికొల్ల తెలిపారు.

మానసిక ఒత్తిడి నివారణకు కంపెనీలు మరిన్ని చర్యలు చేపట్టొచ్చు

ఎక్కువ మంది ఉద్యోగుల అభిప్రాయమిదే: నివేదిక




దిల్లీ: పని ప్రదేశాల్లో ఉద్యోగుల మానసిక ఒత్తిడి నివారణకు ఇప్పటికే దేశంలోని కార్పొరేట్ రంగం పలు చర్యలు చేపడుతున్నప్పటికీ.. ఇంకా మరిన్ని కార్యక్రమాలు చేయొచ్చని ఉద్యోగులు భావిస్తున్నట్లు ఓ సర్వేలో వెల్లడైంది. జీనియస్ కన్సల్టెంట్స్ నిర్వహించిన ఈ సర్వేలో 79 శాతం మంది పై విధమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 'ఉద్యోగుల ఆరోగ్యం అనేది సంస్థ విజయంలో ఎంతో ముఖ్యం. పని ప్రదేశంలో మానసిక ఒత్తిడికి లోనవుతున్న ఉద్యోగుల సంఖ్య గణనీయంగా ఉందని గణాంకాలు చెబుతున్నాయి. మానసిక ఒత్తిడి, ఉద్యోగ- వ్యక్తిగత జీవిత సమతుల్యతకు ప్రాధాన్యం ఇచ్చేలా కంపెనీలు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంద'ని జీనియస్ కన్సల్టెంట్స్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టరు ఆర్.పి.యాదవ్ తెలిపారు. వివిధ రంగాల్లోని 1,783 మంది ఉద్యోగులపై ఈ ఏడాది ఆగస్టు 5 నుంచి సెప్టెంబరు 2 వరకు నిర్వహించిన సర్వే ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు.

- సోమవారం మళ్లీ ఆఫీసుకు వెళ్లాలంటూ ప్రతి ఆదివారం సాయంత్రం మానసికంగా ఒత్తిడికి లోనవుతున్న ఉద్యోగుల సంఖ్య 45 శాతమని సర్వే వెల్లడించింది. 13% మంది ఈ విషయంలో మిశ్రమ భావనతో ఉన్నారు.
- ఒత్తిళ్లు, యాజమాన్యం, సహోద్యోగుల ప్రవర్తన లాంటివి పని ప్రదేశాన్ని కఠినంగా మారుస్తున్నాయని 78 శాతం మంది సర్వేలో తెలిపారు. అయితే 17 శాతం మంది మాత్రం ఈ అభిప్రాయంతో ఏకీభవించలేదని నివేదిక తెలిపింది. మానసిక ఒత్తిడి నివారణకు సంస్థల యాజమాన్యాల నుంచి మరింత సహకారం అవసరమని వీళ్లు ప్రస్తావించినట్లు పేర్కొంది.
- ప్రస్తుత పని విధానాన్ని అధిక భారంగా భావిస్తున్నట్లు 66 శాతం మంది తెలిపారు. దీని వల్ల తమ వ్యక్తిగత- ఉద్యోగ జీవితం సమతుల్యతపై తీవ్ర ప్రభావం పడుతోందని వెల్లడించారు. ఉద్యోగ, వ్యక్తిగత జీవితాన్ని సమర్థంగా నిర్వహించడంలో ఎక్కువ మంది ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని ఇది తెలియజేస్తోందని నివేదిక వివరించింది.

2027 కల్లా రూ.83 లక్షల కోట్లకు కృత్రిమ మేధ మార్కెట్

- ఏటా 40-55% వృద్ధికి అవకాశం
- బెయిన్ అండ్ కంపెనీ వార్షిక నివేదిక



దిల్లీ: కృత్రిమ మేధ(ఏఐ) సంబంధిత ఉత్పత్తులు, సేవల అంతర్జాతీయ మార్కెట్ ఏటా 40-55 శాతం వృద్ధి రేటుతో 2027 కల్లా 990 బి. డాలర్ల(దాదాపు రూ.83 లక్షల కోట్లు) స్థాయికి చేరగలదని అంచనా. బెయిన్ అండ్ కంపెనీ ఇటీవల విడుదల చేసిన అయిదో వార్షిక 'గ్లోబల్ టెక్నాలజీ రిపోర్ట్'లో ఆ మేరకు తెలిపింది. అలాగే ఏఐ పనిభారం 2027 నాటికి ఏటా 25-35% మేర పెరగగలదనీ వెల్లడించింది. నివేదికలోని ముఖ్యాంశాలు.

డేటా సెంటర్ల వృద్ధి

ఏఐ రాకతో ప్రస్తుతం 50-200 మెగావాట్ల డేటా సెంటర్లు కాస్తా 1 గిగావాట్ సామర్థ్యాన్ని మించి చేరొచ్చు. ప్రస్తుతం ఒక డేటా సెంటర్ ఏర్పాటుకు 1-4 బి. డాలర్ల వ్యయం అవుతుంటే.. అయిదేళ్లలో 10-25 బి. డాలర్లతో పెద్ద డేటా సెంటర్లు ఏర్పాటు కావచ్చు.

- డేటా సెంటర్లు అధికం కావడంతో ఏఐ ఆధారిత గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్ల(జీపీయూలు)కు గిరాకీ పెరగవచ్చు. విడిభాగాలకు 2026 కల్లా 30% మేర వృద్ధి కనిపించొచ్చు. ఇది కాస్తా సెమీకండక్టర్ల కొరతకు దారి తీయొచ్చు.

40% వచ్చే మూడేళ్లు ఏటా ఏఐ సంబంధిత హార్డ్‌వేర్ మార్కెట్ వృద్ధి అంచనా

55% వచ్చే మూడేళ్లు ఏటా ఏఐ సంబంధిత సాఫ్ట్‌వేర్ మార్కెట్ వృద్ధి అంచనా

780-990 బి. డాలర్లు మూడేళ్లలో ఏఐ అంతర్జాతీయ మార్కెట్ విలువ అంచనా

ఏఐ రాకతో వీటిల్లో పెనుమార్పు

- క్లౌడ్ సర్వీస్ ప్రొవైడర్లు
- సాఫ్ట్‌వేర్ వెండార్లు
- డేటా మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్
- స్టోరేజ్ టెక్నాలజీ
- చాలా వరకు టెక్ సేవలు కాస్తా సాఫ్ట్‌వేర్‌తో భర్తీ కావొచ్చు.

రత్నాభరణాల ఎగుమతులు తగ్గాయ్

ఆగస్టులో 18.79% క్షీణించి 2 బి. డాలర్లకు



ముంబయి: అంతర్జాతీయ గిరాకీ స్తబ్దుగా ఉండడంతో భారత రత్నాభరణాల ఎగుమతులు ఆగస్టులో 18.79% తగ్గి 2.01 బిలియన్ డాలర్ల(దాదాపు రూ.17,000 కోట్లు)కు పరిమితమయ్యాయని రత్నాభరణాల ఎగుమతి ప్రోత్సాహకాల మండలి(జీజేఈపీసీ) పేర్కొంది. ఆగస్టు 2023లో ఇవి 2.47 బి. డాలర్లుగా ఉన్నాయి. అయితే ఈ ఏడాది జులై నాటి 1.66 బి. డాలర్లతో పోలిస్తే మాత్రం తాజా ఎగుమతులు అధికమనే చెప్పాలి. 'అమెరికా, చైనా వంటి కీలక ఎగుమతి దేశాల గిరాకీ తగ్గట్లుగా ప్రయత్నించడానికి మనం కష్టపడాలి. మధ్య స్థాయి తయారీ కంపెనీలు అటు గిరాకీ, ఇటు లాభదాయకత విషయంలో ఇబ్బందులు పడుతున్నాయ'ని జీజేఈపీసీ ఛైర్మన్ విపుల్ షా పేర్కొన్నారు.

- కట్ చేసిన, పాలిష్ చేసిన వజ్రాల ఎగుమతులు 26% తగ్గి 1.36 బి. డాలర్ల నుంచి 1 బి. డాలర్లకు పరిమితం అయ్యాయి.
- స్థూల పసిడి ఆభరణాల ఎగుమతులు 1.15% తగ్గి 687.69 మి. డాలర్లుగా నమోదయ్యాయి.

ఐపీఓకు రాబోతున్న హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్



దిల్లీ: బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ మెగా పబ్లిక్ ఇష్యూ తర్వాత మరో అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీ అయిన హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఐపీఓకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిర్దేశించిన తప్పనిసరి లిస్టింగ్ నిబంధనల మేరకు త్వరలోనే మార్కెట్ల నియంత్రణాధికారి సంస్థ సెబీ వద్ద ముసాయిదా పత్రాలు దాఖలు చేయబోతున్నట్లు మర్చంట్ బ్యాంకింగ్ వర్గాల ద్వారా తెలుస్తోంది. తన మాతృ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బోర్డు నుంచి గత వారమే హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఐపీఓకు వచ్చేందుకు అనుమతి పొందింది. రూ.2,500 కోట్ల వరకు తాజా షేర్ల జారీతో పాటు ఇప్పటికే ఉన్న వాటాదార్లు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)లో షేర్లను విక్రయించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది.

- క్యాపిటల్ మార్కెట్‌లో అధిక నాణ్యత కలిగిన వ్యాపారాలకు బలమైన గిరాకీని పరిగణనలోకి తీసుకుని, చాలా వరకు బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీలు) పబ్లిక్ ఇష్యూకు వచ్చేందుకు సన్నాహాలు చేసుకుంటున్నట్లు నిపుణులు చెబుతున్నారు. ఆర్‌బీఐ లిస్టింగ్ నిబంధనలను చేరుకోవడమే కాకుండా తమ వ్యాపార వృద్ధి కోసం నిధుల సేకరణకు దీన్ని ఒక మార్గంగా కంపెనీలు చూస్తున్నాయని తెలిపారు.
- పీవీసీ బ్లెండ్ ఆధారిత బిల్డింగ్ మెటీరియల్ ఉత్పత్తుల తయారీ సంస్థ కుమార్ ఆర్క్ టెక్ రూ.740 కోట్ల నిధుల్ని సమీకరించేందుకు తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు రాబోతోంది. ఈ మేరకు సెబీ వద్ద ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. ప్రతిపాదిత ఐపీఓలో రూ.240 కోట్ల తాజా షేర్లను జారీ చేయబోతోంది. రూ.500 కోట్ల విలువైన ప్రమోటర్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)లో విక్రయించనున్నారు.

2018లో ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ దివాలా తీయడం, ఆ తర్వాత మరో ఎన్‌బీఎఫ్‌సీ డీహెచ్ఎఫ్ఎల్ కూడా పతనం కావడంతో ఆర్‌బీఐ 2021 అక్టోబరులో రివైజ్డ్ స్కేల్-బేస్డ్ రెగ్యులేషన్ (ఎస్‌బీఆర్)ను తీసుకొచ్చింది. ఎస్‌బీఆర్ ఫ్రేమ్‌వర్క్ ప్రకారం, ఎన్‌బీఎఫ్‌సీలను 4 లేయర్ల కింద వర్గీకరించింది. వాటి పరిమాణం, కార్యకలాపాలు, రిస్క్ ఆధారంగా బేస్ లేయర్, మిడిల్ లేయర్, అప్పర్ లేయర్, టాప్ లేయర్‌లుగా విభజించింది. అప్పర్ లేయర్ (యూఎల్) ఎన్‌బీఎఫ్‌సీలు తప్పనిసరిగా మూడేళ్ల లోపు స్టాక్ మార్కెట్‌లో నమోదు కావాలనే నిబంధన విధించింది.

చమురు విషయంలో భారత్ ఇలా.. చైనా అలా..

భారత్‌కు ముడి చమురుకు విడదీయరాని సంబంధం ఉంది. ప్రపంచంలోని దిగ్గజ దేశాల కంటే ఎక్కువగా ఇక్కడ గిరాకీ ఉంటోంది. అమెరికా, చైనా, బ్రెజిల్, కొరియా, ఇరాన్‌ల కంటే కూడా ఈ ఏడాది అధిక గిరాకీ ఉంటోంది. 2024 మొత్తం మీద అంతర్జాతీయ చమురు గిరాకీలో అతిపెద్ద వాటాదారుగా భారత్ నిలవబోతోందని విశ్లేషకులు అంటున్నారు. విచిత్రం ఏమిటంటే అంతర్జాతీయ జీడీపీకి భారత్ అందిస్తున్న వాటా 8 శాతమే. అంతర్జాతీయ చమురు గిరాకీ వృద్ధిలో మన వాటా మాత్రం 22 శాతంగా ఉంది. ప్రపంచ జీడీపీకి అయిదో వంతునందించే చైనా మాత్రం 20 శాతం మాత్రమే వాడుకోనుంది. అంటే ప్రపంచ దేశాలకు వాటి జీడీపీకి మధ్య చమురు పెద్దగా ప్రాధాన్య అంశంగా ఉండడం లేదు. మనకు మాత్రం అలా కాదు. డీజిల్, పెట్రోలు, ఎల్‌పీజీ.. దేశ నిర్మాణంలో ప్రముఖ పాత్రను పోషించనున్నాయి.

చైనాకు మనకు తేడా అదే..

చైనా గతేడాది ఏకంగా 200 గిగావాట్ల మేర పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని పోగేసుకుంది. అంతేకాదు అక్కడున్న హైస్పీడ్ రైళ్ల కారణంగా ప్రజలు రోడ్ల మీద కంటే రైళ్లలోనే ఎక్కువ కనిపిస్తారు. దీంతో చమురు గిరాకీ తగ్గుతోందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా చెబుతోంది. భారత్‌లో మాత్రం పరిస్థితి వేరుగా ఉండడంతో వచ్చే కొన్నేళ్లలో ఏటా 3-4 శాతం మేర చమురు వినియోగం పెరుగుతూనే ఉంటుందని అంచనా. చైనాలో ఈ ఏడాది కొత్త ప్యాసింజరు కార్లలో ఈవీల వాటా 50 శాతంగా ఉంటే.. మన దేశంలో అది 2-3 శాతం మాత్రమే ఉంటోంది. చైనా, ఇతర దేశాల్లో చమురు వినియోగానికి, భారత్‌లో చమురు వినియోగానికీ కూడా తేడా ఉంది. మనది అభివృద్ధి చెందుతున్న దేశం కావడంతో చమురు వినియోగంలో వృద్ధి అధికంగా ఉంటోంది. ముఖ్యంగా అమెరికా విషయానికే వస్తే 2024లో అది కేవలం 8 శాతం అదనపు చమురును ఉపయోగించుకోనుంది. అయితే అంతర్జాతీయ జీడీపీకి మాత్రం మూడో వంతును అందిస్తోంది.



2024లో చమురు గిరాకీ వృద్ధి అంచనా

(రోజుకు వేల బ్యారెళ్లలో)

భారత్	210
అమెరికా	70
చైనా	120–180
బ్రెజిల్	110
కొరియా	70
ఇరాన్	50

మనం ఏం చేయాలి?

అభివృద్ధి చెందుతున్న దేశం నుంచి అభివృద్ధి చెందిన దేశంగా మారే క్రమంలో చమురు వినియోగం తప్పదు. ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ(ఐఈఏ) అంచనా ప్రకారం.. 2023 నుంచి 2030 దాకా అంతర్జాతీయ చమురు గిరాకీ వృద్ధిలో భారత్‌దే అగ్రస్థానం. బలమైన ఆర్థిక వృద్ధికి ఇది అవసరమని అంటోంది. అయితే నెమ్మదినెమ్మదిగా ఈ వినియోగాన్ని తగ్గించుకుంటూ వెళ్లాల్సిన అవసరమైతే ఉంది. హైస్పీడ్ రైళ్లు, విద్యుత్ వాహనాలను మరింత అందుబాటులోకి తీసుకురావాలి. పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని భారీ ఎత్తున పెంచాలి. అపుడే చమురు దిగుమతీ తగ్గుతుంది. అందుకయ్యే ఖర్చూ కిందకు వస్తుంది. ద్రవ్యలోటుపై భారమూ పరిమితమవుతుంది.

ఈనాడు సినిమా



వెంకటేశ్, చిరంజీవి, బాలకృష్ణ




సమంత

చిరంజీవికి ప్రతిష్ఠాత్మక ఐఫా పురస్కారం

అగ్ర కథానాయకుడు చిరంజీవికి ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిలిం అకాడమీ(ఐఫా) - 2024 పురస్కారాల్లో ప్రతిష్ఠాత్మకమైన 'ఔట్ స్టాండింగ్ అచీవ్‌మెంట్ ఇన్ ఇండియన్ సినిమా' గౌరవం దక్కింది. అబుధాబిలో జరుగుతున్న ఈ వేడుకలకు చిరంజీవి హాజరై ఈ పురస్కారాన్ని స్వీకరించారు. మరో అగ్ర కథానాయకుడు బాలకృష్ణ గోల్డెన్ లెగసీ పురస్కారాన్ని, ప్రముఖ దర్శకుడు ప్రియదర్శన్ ఔట్ స్టాండింగ్ కాంట్రిబ్యూషన్ ఆఫ్ ఇండియన్ సినిమా, కథానాయిక సమంత 'ఉమెన్ ఆఫ్ ది ఇయర్' పురస్కారాల్ని అందుకున్నారు. ఉత్తరాది, దక్షిణాది సినీ పరిశ్రమలకు చెందిన ప్రముఖుల సమక్షంలో ఈ పురస్కార వేడుకలు ఘనంగా జరిగాయి. నాని - శ్రీకాంత్ ఓదెల కలయికలో ప్రేక్షకుల ముందుకొచ్చిన 'దసరా' చిత్రానికి పలు విభాగాల్లో పురస్కారాలు దక్కాయి. ఉత్తమ చిత్రంతోపాటు, ఉత్తమ కథానాయకుడిగా నాని, ఉత్తమ ప్రతినాయకుడిగా షైన్ టామ్ చాకోకి పురస్కారాలు దక్కాయి. 'భగవంత్ కేసరి' చిత్రానికిగానూ ఉత్తమ దర్శకుడిగా అనిల్ రావిపూడి పురస్కారం అందుకున్నారు. ఉత్తమ ఛాయాగ్రాహకుడిగా 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' చిత్రానికిగానూ నీరవ్ షాకు పురస్కారం దక్కింది. తెలుగు నుంచి అగ్ర కథానాయకులు చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్ కలిసి సందడి చేయడం వేడుకకి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఐశ్వర్యారాయ్, మణిరత్నం, ఏఆర్ రెహమాన్, కరణ్ జోహార్ తదితరులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

వీరమల్లు కోసం పవన్ గానం?



పవన్‌కల్యాణ్

అగ్ర కథానాయకుడు పవన్ కల్యాణ్‌లో మంచి గాయకుడు ఉన్నారు. 'తమ్ముడు', 'ఖుషి' మొదలుకొని కుదిరినప్పుడల్లా ఆయన గొంతు సవరించుకుని మైక్ ముందుకొచ్చారు. 'హరి హర వీరమల్లు' కోసం కూడా ఆయన ఓ పాట పాడినట్టు తెలిసింది. కీరవాణి స్వరకల్పనలోని ఆ పాటని ఇప్పటికే పవన్‌కల్యాణ్ ఆలపించడంతోపాటు, చిత్రీకరణ కూడా పూర్తి చేశారని, అది సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని సమాచారం. పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'హరి హర వీర మల్లు' చిత్రీకరణ ఇటీవలే పునః ప్రారంభమైంది. విజయవాడలో ప్రస్తుతం కీలక పోరాట ఘట్టాల్ని తెరకెక్కిస్తున్నారు. క్రిష్ జాగర్లమూడి, జ్యోతికృష్ణ ఈ చిత్రానికి దర్శకులు. ఏఎమ్ రత్నం సమర్పణలో ఎ.దయాకర్ రావు నిర్మిస్తున్నారు. నిధి అగర్వాల్ కథానాయిక. బాబీ దేవోల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. మార్చి 28న ఈ చిత్రం రానుంది. మొఘల్ సామ్రాజ్యం నేపథ్యంలో సాగే ఈ చిత్రం రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానున్న సంగతి తెలిసిందే.

లగ్గం నామ సంవత్సరం



సుధీర్ బాబు

సాయిరోనక్, ప్రగ్యా నగ్రా ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన 'లగ్గం' అక్టోబరు 25న విడుదల కానుంది. ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ద్వారా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తున్నట్టు సినీ వర్గాలు శనివారం ప్రకటించాయి. కథానాయకుడు సుధీర్ బాబు విడుదల తేదీ పోస్టర్‌ని విడుదల చేశారు. తెలంగాణ ప్రాంత పెళ్లి నేపథ్యంలో సాగే ఈ చిత్రానికి రమేశ్ చెప్పాల దర్శకుడు. వేణుగోపాల్ రెడ్డి నిర్మాత. రాజేంద్రప్రసాద్, ఎల్బీ శ్రీరామ్, రోహిణి, సప్తగిరి, కృష్ణుడు, రఘుబాబు తదితరులు కీలక పాత్రలు పోషించారు. దర్శకుడు మాట్లాడుతూ "పెళ్లి నేపథ్యంలో సాగే చిత్రమిది. ఈ కథలో జరిగిన ఓ పెళ్లి ప్రత్యేకత ఏమిటనేది తెరపైనే చూడాలి. మా సినిమాతో ఈ ఏడాది లగ్గం నామ సంవత్సరంగా మారబోతోంద"ని తెలిపారు. కీలక పాత్ర పోషించిన రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ "కుటుంబమంతా కలిసి చూడాల్సిన చిత్రమిద"న్నారు. ప్రతి ఆడపిల్ల తండ్రి తన కూతురికి పెళ్లి చేసే ముందు ఈ సినిమా చూడాలన్నారు ఎల్బీ శ్రీరామ్. ఈ చిత్రానికి నేపథ్య సంగీతం: మణిశర్మ, సంగీతం: చరణ్ అర్జున్, ఛాయాగ్రహణం: బాల్‌రెడ్డి.

ఈటీవీ విన్‌లో 'ఆర్టీఐ'



ప్రజలకు ఆర్టీఐ (సమాచార హక్కు) చట్టం గురించి అవగాహన కల్పించడమే లక్ష్యంగా రూపొందిన చిత్రం 'ఆర్టీఐ'. వరలక్ష్మి శరత్ కుమార్, రాజేంద్రప్రసాద్, రవిశంకర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ కోర్టురూమ్ డ్రామా థ్రిల్లర్‌ను సురేశ్ కృష్ణ తెరకెక్కించారు. ఓ 16ఏళ్ల బాలిక హత్య చుట్టూ తిరిగే ఈ చిత్రంలో వికలాంగురాలైన న్యాయవాది పాత్రలో కనిపించి తన నటనతో ప్రేక్షకులను అలరించింది వరలక్ష్మి. 'జనాలకు ఆర్టీఐ పవర్ ఏంటో తెలియాలి' లాంటి సంభాషణలతో సినీప్రియులను ఆకట్టుకున్న ఈ సినిమా ఇప్పుడు ప్రముఖ ఓటీటీ ఈటీవీ విన్ వేదికగా ప్రసారమవుతోంది. మరి ఈ సమాచార హక్కు గురించి.. ఈ చట్టానికి 16ఏళ్ల బాలిక మరణానికి మధ్య ఉన్న సంబంధం ఏంటనేది తెలుసుకోవాలంటే మీరూ ఓటీటీలో ఈ చిత్రాన్ని చూసేయండి.

మరిన్ని చిత్రాలు రావాలి.. మరింత రక్షణ కావాలి

తెరపై అందం, అభినయంతో ప్రేక్షకులను ఉర్రూతలూగించే మన అందాల తారలు.. సందర్భం వచ్చినప్పుడు, అవకాశం దొరికినప్పుడు మహిళా సాధికారత, చిత్రపరిశ్రమలోని నటీమణుల సమస్యలు, మహిళా ప్రాధాన్య చిత్రాలు, మాతృత్వం తదితర అంశాల గురించి మాట్లాడుతుంటారు. సందడిగా జరిగిన ఐఫా వేడుకల్లోనూ పలువురు తారలు మహిళలకు సంబంధించిన పలు అంశాలపై స్పందించారు.

అమ్మాయిల్ని గొప్పగా చూపించడం ఇష్టం: మృణాల్ ఠాకూర్



"నేను గొప్ప గొప్ప దర్శకులతో పనిచేయాలని అనుకుంటున్నాను. మంచి కథలు వింటూ అందులో భాగం అవ్వాలనుకుంటున్నాను. 'సీతారామం', 'హాయ్‌నాన్న' లాంటి కథల్లో మహిళలకు ప్రాధాన్యం ఎక్కువ. అలా అమ్మాయిల్ని గొప్ప గొప్ప పాత్రల్లో చూపించే చిత్రాలపైనే నాకు ఎక్కువ ఆసక్తి. ప్రస్తుతం అలాంటి కథల కోసమే వెతుకుతున్నాను. కథలో ప్రాధాన్యం ఉండి అందులో నేను పోషించే పాత్ర చిన్నదైనా అది ప్రేక్షకుల్ని మెప్పిస్తే చాలు. ఆ కథలో భాగం అవుతాను. చిత్రసీమలో మహిళా చిత్రాల సంఖ్య మరింత పెరగాల్సిన అవసరం ఉంది".

రిస్క్ తీసుకొనైనా మహిళా ప్రాధాన్య చిత్రాల్ని తెరకెక్కించాలి: కృతి సనన్



"భిన్నమైన కథలతో, భారీ బడ్జెట్‌తో కొంచెం రిస్క్ తీసుకొని అయినా మహిళా ప్రాధాన్య చిత్రాలను తెరకెక్కిస్తారని ఆశిస్తున్నాను. ప్రస్తుతం దర్శకనిర్మాతలు సైతం ఆ దిశగానే అడుగులు వేస్తున్నారు. నేను నటించిన 'మిమీ', 'బరేలీ కీ బర్ఫీ' చిత్రాలు ఈ కోవకు చెందినవే. మహిళలు ఎలాంటి పాత్రలోనైనా ఒదిగిపోగలరని నిరూపించిన చిత్రాలివి. ఈ మధ్య కాలంలో నేను విభిన్నమైన కథల్లో నటించడానికే ప్రయత్నిస్తున్నాను. ఇటీవల విడుదలైన 'క్రూ' సినిమా కథ కూడా భిన్నమైనదే. మరికొద్ది రోజుల్లో మీ ముందుకు రాబోతున్న 'దో పత్తి' మీరు ఊహించని విధంగా ఉంటుంది".

ఏదైనా చేయగలిగేది తల్లి మాత్రమే: ఐశ్వర్య రాయ్

"తల్లి స్థానంలో ఉన్న ప్రతి మహిళకు మాతృత్వం గురించి సలహాలు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎందుకంటే పిల్లలకు ఏది ఉత్తమమో తల్లులకు బాగా తెలుసు. ఏదైనా చేయగలిగేది ఒక తల్లి మాత్రమే. ప్రస్తుతం ఇలా ఎంతో మంది నటీమణులు మాతృత్వాన్ని ఆస్వాదిస్తూనే.. మహిళా ప్రాధాన్య కథలపై ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు".




అన్ని చిత్రపరిశ్రమల్లోనూ హేమ కమిటీలు అవసరం: ప్రియమణి



"తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ చిత్ర పరిశ్రమల్లో పనిచేసే మహిళలు ఎప్పటినుంచో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేరళ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ హేమ కమిటీ లాంటి కమిటీలను ఇతర సినీ పరిశ్రమల్లో కూడా ఏర్పాటు చేయాలి. మహిళలకు పని ప్రదేశాల్లో సురక్షిత వాతావరణాన్ని కల్పించాలి."

21 శతాబ్దంలోనూ రక్షణ లేదు: షబానా ఆజ్మీ



"మనం 21వ శతాబ్దంలో ఉన్నాం. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా మహిళలకు ఇంకా రక్షణే లేదు. కానీ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ సాధికారతను పెంపొందిస్తున్నారు. ఇప్పటి వరకు ఎంతో సాధించారు. ఇంకా సాధించాల్సింది ఎంతో ఉంది" (కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై జరిగిన అత్యాచార ఘటన, మలయాళ చిత్ర సీమలో మహిళలపై జరుగుతున్న అరాచకాల నేపథ్యంలో చేసిన వ్యాఖ్యలు ఇవి)


జాన్వీ మనసుని వరుణ్ ఎలా గెలిచాడు?



జాన్వీ కపూర్

'బవాల్'తో గతేడాది ప్రేక్షకులను మెప్పించారు బాలీవుడ్ కథానాయకుడు వరుణ్ ధావన్, జాన్వీ కపూర్. ఇప్పుడీ హిట్ కలయికలో రాబోతున్న మరో చిత్రం 'సన్నీ సంస్కారికీ తులసి కుమారి'. శశాంక్ ఖైతాన్ తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా మొదటి షెడ్యూల్ చిత్రీకరణ పూర్తి చేసుకుంది. "ఓ స్వచ్ఛమైన ప్రేమకథ నేపథ్యంలో దీన్ని తీర్చిదిద్దుతున్నారు. సన్నీ అనే ఓ యువకుడు తన ప్రియురాలు ప్రేమను గెలుచుకోవడానికి చేసిన ప్రయత్నాల చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుంది. ఇందులో తులసి పాత్రలో జాన్వీ, సన్నీగా వరుణ్ కనిపించనున్నారు" అని చిత్ర వర్గాలు తెలిపాయి. సన్యామల్హోత్రా, అక్షయ్ ఒబెరాయ్ నటిస్తున్నారు. కరణ్ జోహార్, అపూర్వ మెహతా నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 18న విడుదల కానుంది. ప్రస్తుతం ఎన్టీఆర్‌తో కలిసి జాన్వీ నటించిన 'దేవర' థియేటర్లలో సందడి చేస్తోంది.


థాయ్‌లాండ్‌లో 'ధురంధర్' ముగించాడు



రణ్‌వీర్ సింగ్

'ఉరి: ది సర్జికల్ స్ట్రైక్'తో ప్రశంసలు పొందిన దర్శకుడు ఆదిత్య ధర్. ఆయన బాలీవుడ్ కథానాయకులు రణ్‌వీర్ సింగ్, సంజయ్ దత్, అక్షయ్ ఖన్నా, ఆర్.మాధవన్, అర్జున్ రాంపాల్‌తో భారీ యాక్షన్ థ్రిల్లర్‌ను తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో వీళ్లు ఇండియన్ ఇంటెలిజెన్స్ అధికారులుగా కనిపించనున్నారు. రాజకీయం, గ్యాంగ్‌వార్ నేపథ్యంలో రూపొందుతోన్న చిత్రమిది. దీనికి 'ధురంధర్' అనే పేరు పరిశీలనలో ఉంది. భారతీయ గూఢచార సంస్థలోని వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపొందుతోన్నట్లు సమాచారం. ఇటీవల ఈ సినిమా మొదటి షెడ్యూల్‌ను థాయ్‌లాండ్‌లో పూర్తి చేసినట్లు చిత్ర బృందం తెలిపింది. రెండో షెడ్యూల్‌ను నవంబరులో ప్రారంభించనున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.

ధూమ్ 4లో రణ్‌బీర్ కపూర్?



'ధూమ్'.. అదిరిపోయే యాక్షన్ సన్నివేశాలతో బాలీవుడ్‌లో ట్రెండ్ సెట్ చేసిన చిత్రమిది. 2004లో రూపొందిన ఈ చిత్రానికి ఇప్పటికే పలు సీక్వెల్స్ వచ్చి.. బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిచాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్ రాజ్ ఫిల్మ్స్ తీర్చిదిద్దిన ఈ ఫ్రాంఛైజీలో 'ధూమ్ 4'ను తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ నాల్గో భాగంలో బాలీవుడ్ కథానాయకుడు రణ్‌బీర్ కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. "'ధూమ్' అనేది ఆదిత్య చోప్రాకు ఎంతో ఇష్టమైన ఫ్రాంఛైజీ. దీన్ని ప్రస్తుత కాలానికి అనుగుణంగా తీర్చిదిద్దాలని నిర్ణయించుకున్నారు. మునుపటి భాగాల మాదిరిగానే 'ధూమ్ 4' స్క్రిప్ట్‌ను ఆదిత్య చోప్రా.. విజయ్ కృష్ణ ఆచార్యతో కలిసి సిద్ధం చేస్తున్నారు. ఈ నాల్గో భాగంతో మునుపెన్నడూ లేని విధంగా సినిమాటిక్ అనుభూతిని సృష్టించాలనే ఆలోచనలో ఉన్నారు. దీని కోసమే చాలా కాలంగా రణ్‌బీర్‌తో చర్చలు జరుపుతున్నారు ఆదిత్యచోప్రా. ఇందులో నటించడానికి ఆయన కూడా చాలా ఉత్సాహంగా ఉన్నాడు. రణ్‌బీర్ 25వ చిత్రమిది. అందుకే దీన్ని ప్రత్యేకంగా రూపొందించాలని నిర్ణయించుకుంది చిత్రబృందం" అని ఆదిత్య చోప్రా సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం 'రామాయణ'తో బిజీగా ఉన్నాడు రణ్‌బీర్.

స్టెప్పులు మర్చిపోయారని షారుక్.. సల్మాన్‌లకు మమత చివాట్లు

ఫ్లాష్‌బాక్



భిన్నమైన కథలతో మూడు దశాబ్దాలుగా హిందీ చిత్రపరిశ్రమను ఏలుతున్నారు అగ్రకథానాయకులు షారుక్ ఖాన్, సల్మాన్ ఖాన్. ఎంతో మంది అభిమానుల్ని సొంతం చేసుకున్న ఈ ఇద్దరినీ.. కథానాయిక మమతా కులకర్ణి ఓ సినిమా సెట్లో తిట్టిందట. ఇది నిజమేనా అని ఆశ్చర్యపడకండి. ..వందశాతం నిజమే. ఎందుకంటే ఈ విషయాన్ని షారుక్ స్వయంగా ఇటీవల ఓ కార్యక్రమంలో చెప్పారు. షారుక్, సల్మాన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కరణ్ అర్జున్'. రాకేశ్ రోషన్ తెరకెక్కించిన ఈ చిత్రంలోనే వీరిద్దరూ తొలిసారి కలిసి నటించారు. ఈ సినిమాలోని "భాంగ్డా పాలే.." పాట షూటింగ్ సమయంలో సల్మాన్, షారుక్‌లు స్టెప్పులు మర్చిపోయినందుకు మమత వారిని తిట్టినట్లు ఓ సందర్భంలో గుర్తుచేసుకున్నారు షారుక్. "ఇప్పటి వరకు సెట్లో నన్ను, సల్మాన్‌ను ఎవరూ తిట్టింది లేదు. కానీ ఆ అవకాశాన్ని మమతా కులకర్ణి కొట్టేసింది (నవ్వుతూ). 'భాంగ్డా పాలే..' పాట చిత్రీకరిస్తున్నప్పుడు.. మేము స్టెప్పులు మర్చిపోయాము. దీంతో మమ్మల్ని ఈ పాటను పాడు చేస్తున్నారని మమత తిట్టింది. ఆమె మమ్మల్ని అంటుంటే.. వేళ్లను చప్పరిస్తూ పక్కన నిలబడి వింటున్నాం. స్టెప్పులు సరిగ్గా వేసేందుకు ఎక్కువసార్లు రిహార్సల్స్ చేయమని సలహా ఇచ్చింది. ఆమె మమ్మల్ని అంత తిట్టినా.. మళ్లీ మాతో మాట్లాడకుండా ఉండలేకపోయింది" అని ఆనాటి సరదా సంగతులను పంచుకున్నారు.

వారెవా లోబియా మసాలా



మష్రూమ్ మటర్ మసాలా




చికెన్, మటన్, చేపలు, రొయ్యలు.. వీటిని చూస్తే చాలు.. నాన్‌వెజ్‌ప్రియులకు నోట్లో నీళ్లూరతాయి. శాకాహారం అంటే మాత్రం నాలుక చప్పరించేస్తారు. నిజానికి కాయగూరలతోనూ అద్భుతాలు చేయచ్చంటారు పాకశాస్త్ర నిపుణులు. అక్టోబరు 1 శాకాహార దినోత్సవం సందర్భంగా మాంసాహారాలను మరిపించే వంటలు మీకోసం..

మష్రూమ్ మటర్ మసాలా

కావలసినవి: పుట్టగొడుగులు - అర కిలో, గోధుమపిండి - చారెడు, పచ్చిబఠాణీలు - 2 కప్పులు, ఉల్లిపాయలు, టొమాటోలు, పచ్చిమిర్చి - 4 చొప్పున, కొత్తిమీర తరుగు - అర కప్పు, ధనియాల పొడి, అల్లం వెల్లుల్లి పేస్టు - 2 చెంచాల చొప్పున, నూనె - 2 టేబుల్ స్పూన్లు, ఉప్పు - రుచికి సరిపడా, జీలకర్ర, కశ్మీరీ కారం - చెంచా చొప్పున, పసుపు - అర చెంచా, గరంమసాలా, మెంతి ఆకుల పొడి - టేబుల్‌స్పూన్ చొప్పున

తయారీ: ఉల్లి, టొమాటో, పచ్చిమిర్చిలను ముక్కలుగా కోసుకోవాలి. మష్రూమ్స్‌ను సగానికి కోసి, గోధుమ పిండి వేసి ముక్కలకు పట్టుకునేలా కలపాలి. వాటిని నీళ్లలో ముంచి మరో పాత్రలోకి తీయాలి. అడుగు భాగం మందంగా ఉన్న గిన్నెలో నూనె కాగనిచ్చి జీలకర్ర, కూరగాయ ముక్కలు, పచ్చిబఠాణీలు, అల్లం వెల్లుల్లి పేస్టులను వేయించాలి. కాస్త వేగిన తర్వాత.. పుట్టగొడుగులు, ధనియాల పొడి, కశ్మీరీ కారం, పసుపు, ఉప్పు, గరంమసాలా వేసి కలిపి మూత పెట్టాలి. మెత్తగా ఉడికిందనుకున్నాక.. మెంతి ఆకుల పొడి, కొత్తిమీర తరుగు వేసి ఇంకో నిమిషం ఉంచి దించేస్తే సరి.. ఘుమఘుమలాడే మష్రూమ్ మటర్ మసాలా రెడీ.

సాగ్ ఆలూ



కావలసినవి: బంగాళదుంపలు - 4, పాలకూర - 2 కట్టలు, ఉల్లి తరుగు - అర కప్పు, పచ్చిమిర్చి - 2, అల్లం - అంగుళం ముక్క, నూనె - 2 చెంచాలు, పసుపు, ధనియాల పొడి, నిమ్మ రసం - అర చెంచా చొప్పున, జీలకర్ర - చెంచా, వెల్లుల్లి రెబ్బలు - 3, ఉప్పు - రుచికి సరిపడా, ఇంగువ - పావు చెంచా

తయారీ: పాలకూర, అల్లం, పచ్చిమిర్చిలను తరగాలి. బంగాళ దుంపలను పీల్ చేసి, ముక్కలు కోసి, కొంచెం మెత్తబడేదాకా ఉడికించి పక్కనుంచాలి. కడాయిలో నూనె వేడయ్యాక.. జీలకర్ర, వెల్లుల్లి రెబ్బలు, అల్లం తరుగు, పచ్చిమిర్చి ముక్కలు, ఉల్లి తరుగు, ఉప్పు వేసి దోరగా వేయించాలి. తర్వాత పసుపు, ధనియాల పొడి, ఇంగువ వేసి కలియతిప్పాలి. పాలకూర తరుగు జోడించి, సన్న సెగ మీద ఐదు నిమిషాలుంచాలి. అందులో కొంత ఉడికించిన బంగాళదుంప ముక్కలు చేర్చి ఇంకో రెండు నిమిషాలు మగ్గనివ్వాలి. దించేసి నిమ్మరసం చల్లితే సరి.. రుచికరమైన సాగ్ ఆలూ తయారైపోతుంది.



లోబియా మసాలా

కావలసినవి: లోబియా (అలసందలు) - కప్పు, టొమాటో గుజ్జు, ఉల్లి తరుగు, పాలు - ముప్పావు కప్పు చొప్పున, పచ్చిమిర్చి తరుగు - ఒకటిన్నర చెంచా, నూనె - 2 టేబుల్ స్పూన్లు, కారం, గరం మసాలా, ధనియాల పొడి, అల్లంవెల్లుల్లి ముద్ద - 2 చెంచాల చొప్పున, జీలకర్ర, జీలకర్ర పొడి, సోంపు, మిరియాల పొడి, పసుపు, పంచదార - చెంచా చొప్పున, దాల్చినచెక్క - అంగుళం ముక్క, ఉప్పు - రుచికి సరిపడా, కొత్తిమీర తరుగు - అర కప్పు

తయారీ: అలసందలు కడిగి ముందు రాత్రి నానబెట్టాలి. ఉదయం ఆ నీళ్లు వడకట్టేసి, తగినన్ని నీళ్లు పోసి ప్రెషర్ కుక్కర్‌లో మూడు విజిల్స్ వచ్చేవరకూ ఉడికించాలి. అదనంగా నీళ్లుంటే తీసేసి, గింజలను పక్కనుంచాలి. కడాయిలో నూనె వేడయ్యాక.. దాల్చినచెక్క, సోంపు, జీలకర్రలు వేయాలి. అవి వేగాక.. అల్లంవెల్లుల్లి ముద్ద, ఉల్లి, పచ్చిమిర్చి తరుగులను వేయించాలి. అవి దోరగా వేగాక.. టొమాటో గుజ్జు, జీలకర్ర పొడి, మిరియాల పొడి, పసుపు, ఉప్పు, పంచదారలు జతచేయాలి. దగ్గరగా అయ్యాక.. ఉడికించిన అలసందలు చేర్చి ఇంకో నాలుగు నిమిషాల పాటు మగ్గనివ్వాలి. తర్వాత పాలు పోసి, సెగ తగ్గించాలి. చివర్లో కొత్తిమీర తరుగు వేసి దించేస్తే రుచికరమైన లోబియా మసాలా సిద్ధం.

వీగన్ బటర్ చికెన్

కావలసినవి: ఎక్స్‌ట్రా ఫర్మ్ టోఫు - 400 గ్రా., ఉల్లి తరుగు - అర కప్పు, టొమాటో ప్యూరీ, కొబ్బరి తురుము - కప్పు చొప్పున, కొత్తిమీర తరుగు - అర కప్పు, జీడిపప్పు - ముప్పావు కప్పు, యాపిల్ సైడర్ వెనిగర్, నిమ్మరసం - టేబుల్ స్పూన్ చొప్పున, గరం మసాలా, వెన్న - 2 టేబుల్ స్పూన్ల చొప్పున, అల్లం వెల్లుల్లి తరుగు - రెండు చెంచాలు, లవంగాలు - 4, యాలకులు - 3, దాల్చినచెక్క - అంగుళం ముక్క, బిర్యానీ ఆకులు - 2, జీలకర్ర, కశ్మీరీ కారం, పసుపు, బ్రౌన్ షుగర్ - చెంచా చొప్పున, మిరియాల పొడి - అర చెంచా, ఉప్పు - రుచికి సరిపడా

తయారీ: టోఫును పళ్లెంలో ఉంచి, దాని మీద బరువైన పాత్ర పెట్టి అరగంట వదిలేస్తే.. గట్టిపడుతుంది. దాన్ని ముక్కలుగా కోసి.. మిక్సింగ్ బౌల్‌లో వేయాలి. జీడిపప్పు, నిమ్మరసం, యాపిల్ సైడర్ వెనిగర్, గరం మసాలా, కొన్ని నీళ్లు జార్‌లో వేసి బ్లెండ్ చేసి, టోఫులో వేసి, ఎగరేసినట్లు చేయాలి. ఈ ముక్కలను బేకింగ్ ట్రేలో సమంగా సర్ది, 15 నిమిషాలు బేక్ చేయాలి. ఈలోగా వెన్నలో లవంగాలు, యాలకులు, దాల్చినచెక్క, బిర్యానీ ఆకులు, జీలకర్ర, ఉల్లి, అల్లం వెల్లుల్లి తరుగులను వేయించాలి. అందులో మిరియాల పొడి, గరం మసాలా, పసుపు, టొమాటో ప్యూరీ వేసి ఉడికించాలి. నాలుగు నిమిషాల తర్వాత కొబ్బరి తురుము, బ్రౌన్ షుగర్, కశ్మీరీ కారం, ఉప్పు వేసి కలియబెట్టాలి. అందులో బేక్ చేసిన టోఫు ముక్కలు, కొత్తిమీర తరుగు వేసి రెండు నిమిషాలుంచి దించేయాలి.

నవరతన్ కుర్మా



కావలసినవి: క్యారెట్, క్యాలీఫ్లవర్, బంగాళదుంపలు, పనీర్ - 200 గ్రాముల చొప్పున, పచ్చిబఠాణీలు, బీన్స్ - 100 గ్రా. చొప్పున, ఉల్లి తరుగు - కప్పున్నర, పైనాపిల్ చంక్స్ - పావు కప్పు, జీడిపప్పు - ముప్పావు కప్పు, కిస్‌మిస్ - చారెడు, వెల్లుల్లి రెబ్బలు - 4, అల్లం - అంగుళం ముక్క, జీలకర్ర, ధనియాల పొడి, గరం మసాలా - చెంచా చొప్పున, కారం - చెంచా, పసుపు - అర చెంచా, ఉప్పు - రుచికి సరిపడా, బిర్యానీ ఆకు - 1, మెంతి ఆకుల పొడి - టేబుల్ స్పూన్, కొబ్బరి తురుము - అర కప్పు, నూనె - 2 టేబుల్ స్పూన్లు,

తయారీ: కూరగాయలు, దుంపలను తరిగి ఉంచాలి. ఉల్లి తరుగు, అల్లం, వెల్లుల్లి, పన్నెండు జీడిపప్పులను జార్‌లో వేసి బ్లెండ్ చేయాలి. అడుగుభాగం మందంగా ఉన్న పాత్రలో నూనె వేడయ్యాక.. మిగిలిన జీడిపప్పులు, కిస్‌మిస్, పైనాపిల్ చంక్స్‌ను వేయించాలి. వాటిని తీసి బిర్యానీ ఆకు, జీలకర్ర వేయాలి. అవి వేగాక.. ఉల్లి మిశ్రమం జోడించాలి. అది కాస్త రంగు మారాక.. కూరగాయ ముక్కలు, కారం, పసుపు, ధనియాల పొడి, కప్పున్నర నీళ్లు పోసి.. కలియబెట్టి ఉడికించాలి. అందులో వేయించిన జీడిపప్పులు, కిస్‌మిస్, పైనాపిల్ చంక్స్, కొబ్బరి తురుము, మెంతి ఆకుల పొడి, గరం మసాలా వేసి కలిపి, ఇంకో మూడు నిమిషాలుంచి, దించేస్తే సరిపోతుంది.

పాఠక వంట

నిమిషంలో గోధుమ మిఠాయి



అరిసెలు, బూరెలు, కజ్జికాయలు లాంటి పిండివంటలు నోరూరించే మాట నిజమే కానీ వండటమే కొంచెం కష్టమైన వ్యవహారం. అంత ప్రయాస లేకుండా త్వరగా పనైపోతుందనుకోండి.. అప్పుడిక కష్టం అనిపించదు. అలాంటిదే ఈ గోధుమ మిఠాయి. దీన్ని చేసేందుకు రెండు కప్పుల బెల్లం, కప్పున్నర గోధుమపిండి, మూడు టేబుల్‌స్పూన్ల నెయ్యి, బాదం, పిస్తా, జీడిపప్పుల పలుకులన్నీ కలిపి అర కప్పు, అర చెంచా యాలకుల పొడి అవసరమవుతాయి. ఎలా చేయాలంటే.. ముందుగా బెల్లంలో కొన్ని నీళ్లు పోసి పాకం పట్టాలి. కడాయిలో రెండు టేబుల్‌స్పూన్ల నెయ్యి వేడయ్యాక.. బాదం, పిస్తా, జీడిపప్పుల పలుకులు వేయాలి. అవి దోరగా వేగాక.. గోధుమపిండి, యాలకుల పొడి జోడించి కలియతిప్పాలి. కాస్త వేగి.. మంచి వాసన వస్తున్నప్పుడు.. అందులో వడకట్టినబెల్లం పాకాన్ని పోయాలి. ఉండలు కట్టకుండా కలియబెడుతూ సన్న సెగ మీద ఐదు నిమిషాలు ఉడికించాలి. చివర్లో మిగిలిన నెయ్యి కూడా వేసి దించేస్తే సరిపోతుంది. నిమిషంలో తయారయ్యే ఈ స్వీటు వారెవా అనిపిస్తుంది. రుచీ, ఆరోగ్యకరం కూడా. నచ్చితే మీరూ చేసి చూడండి. **- ఉమాబాల, చెన్నై**

హోటల్ స్టయిల్ పనీర్ బ్రెడ్ రోల్



షెఫ్ స్పెషల్

కావలసినవి: మిల్క్‌బ్రెడ్ స్లైసులు - 12, ఉల్లితరుగు - పావు కప్పు, కారం, చాట్ మసాలా - అర చెంచా చొప్పున, పసుపు: చిటికెడు, నిమ్మ రసం - చెంచా, ఉప్పు - రుచికి సరిపడా, నూనె - తగినంత, బంగాళదుంపలు - 3, పనీర్ - 100 గ్రాములు పచ్చిమిర్చి - 2 , మైదా - 2 టేబుల్ స్పూన్లు

తయారీ: బంగాళదుంపలను ఉడికించి, ముక్కలు కోయాలి. పచ్చిమిర్చి సన్నగా తరగాలి. పనీర్‌ను తురమాలి. ప్యాన్‌లో రెండు టేబుల్ స్పూన్ల నూనె వేసి.. ఉల్లి తరుగును గోధుమరంగు వచ్చే వరకు ఫ్రై చేయాలి. అందులో అల్లం వెల్లుల్లి పేస్టు వేసి, పచ్చి వాసన పోయే వరకు వేయించి.. పసుపు, చాట్ మసాలా, కారం, పచ్చిమిర్చి తరుగు జతచేసి 3 నిమిషాలు వేయించాలి. పనీర్, బంగాళ దుంపల ముక్కలు, రుచికి సరిపడా ఉప్పు జోడించి మరో రెండు నిమిషాలు వేగనివ్వాలి. ఆఖర్లో నిమ్మరసం వేసి దించేయాలి. బ్రెడ్ స్లైసుల అంచులను కట్ చేయాలి. ఒక స్లైసు మీద చెంచాడు పనీర్ మసాలా వేసి.. మరో బ్రెడ్‌ను దాని మీద ఉంచి, అంచులను కప్పేయాలి. మసాలా బయటకు రాకుండా మెల్లగా రోల్ చేయాలి. మిగతా స్లైసులూ ఇలాగే చేయాలి. కొన్ని నీళ్లతో మైదాపిండిని కలపాలి. అందులో బ్రెడ్ రోల్స్‌ని ముంచి తీసి, కాగుతున్న నూనెలో బంగారు రంగు వచ్చే వరకూ వేయించాలి. వాటిని టిష్యూ పేపర్ మీదికి తీస్తే ఎక్కువగా ఉన్న నూనెను పీల్చేసుకుంటాయి. వేడి వేడి పనీర్ రోల్స్‌ను టొమాటో సాస్ లేదా నచ్చిన చట్నీతో సర్వ్ చేసుకోండి.



- పవన్ సిరిగిరి, షెఫ్, హైదరాబాద్



రోలింగ్ కటర్ సర్కిల్

ఇప్పుడిప్పుడే వంట నేర్చుకుంటున్న వాళ్లకి పూరీలు గుండ్రంగా రావాలంటే కుదరదు.. కొంచెం పరిశ్రమే. ఆ శ్రమను తగ్గిస్తుంది రోలింగ్ కటర్ సర్కిల్. పెద్ద చపాతీ చేసి రోలింగ్ కటర్‌ను దొర్లిస్తే అందులో ఉన్న బ్లేడ్ క్షణాల్లో చిన్న పూరీల్లా కత్తిరించేస్తుంది. ఈ పరికరంతో కుకీస్, కజ్జికాయలు కూడా చేసుకోవచ్చు. బాగుంది కదూ!

సౌకర్యం



ఆహారం ఆరోగ్యం

ఎముకల దృఢత్వానికి గుమ్మడి గింజలు



గుమ్మడి గింజలను మిఠాయిల్లో వేస్తాం కానీ.. విడిగా పెద్దగా తినం. నిజానికి ఇవి కూడా బాదం, జీడిపప్పుల్లానే బలాన్నిస్తాయి. వీటిలో భాస్వరం, పొటాషియం, మెగ్నీషియం, కాల్షియం, ఐరన్, జింక్, సోడియం, మాంగనీస్, కాపర్, ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్లు ఉన్నాయి. గుమ్మడి గింజలు తినడం వల్ల రోగనిరోధకశక్తి పెరుగుతుంది. రక్తపోటు క్రమబద్ధంగా ఉంటుంది. టైప్ 2 డయాబెటిస్ నుంచి ఉపశమనం లభిస్తుంది. గుండె జబ్బులు వచ్చే అవకాశం తగ్గుతుంది. ఊబకాయం రాదు. మూత్రపిండాలు ఆరోగ్యంగా ఉంటాయి. వీటిలోని పీచు జీర్ణప్రక్రియను మెరుగుపరిస్తే.. ట్రిప్టోఫాన్, అమినో యాసిడ్స్ చక్కగా నిద్రపట్టేలా చేస్తాయి. గుమ్మడి గింజలు రొమ్ము క్యాన్సర్‌ను నివారించడంలో తోడ్పడతాయి. ఎముకలు, దంతాలు దృఢంగా ఉంటాయి. వీటిలో ప్రొటీన్ల శాతం ఎక్కువగా ఉండటాన తగినంత మోతాదులోనే తినాలి. ఒక్కోసారి ఇవి గొంతులో అడ్డుపడి ఊపిరాడకుండా చేసే అవకాశం ఉంది. కనుక నెమ్మదిగా తినాలి. ఈ గింజలను పచ్చిగానూ తినొచ్చు, వేయించీ తినొచ్చు. స్వీట్లు, కూరలు, సలాడ్స్, స్మూథీస్‌లో వేస్తే అదనపు రుచి, బలం.

పాస్తా మసాలా పౌడర్ ఎలా చేయాలంటే..



పిల్లలకు నూడుల్స్‌లానే పాస్తా అంటే మహా ఇష్టం. ఆ రుచి పాస్తాలో కాదు.. అందులో వేసే మసాలాలోనే ఉంటుంది. ఆ పొడి ఇంట్లోనే చేసుకోవచ్చు. ఇది ఆరోగ్యమే కాదు, మనమే చేశామన్న సంతృప్తీ దక్కుతుంది. ఈ పౌడర్ చేసేందుకు.. కారం, మిరియాల పొడి, మొక్కజొన్న పిండి, సాంబార్ పొడి, గరం మసాలా, గార్లిక్ పౌడర్, ఆనియన్ పౌడర్‌లు టేబుల్‌స్పూన్ చొప్పున, డ్రై జింజర్ పొడి, పంచదారలు చెంచా చొప్పున, ఆమ్‌చూర్ పౌడర్, సోంపు పొడి అర చెంచా చొప్పున అవసరమవుతాయి. వీటన్నింటినీ ఒక పాత్రలో వేసి కలిపి, తడిలేని, గాలి చొరబడని సీసాలో భద్రం చేసుకుంటే సరిపోతుంది. ఇది నెల రోజులు తాజాగా ఉంటుంది. పాస్తా ఉడికించి, తగినంత పౌడరు వేస్తే చాలు.. ఘుమఘుమలాడుతుంది. నూరడం, నానబెట్టడం, వండటం లాంటి శ్రమేదీ లేకుండా ఎంత సులువో కదా!


పొరుగు రుచి

కన్నడిగుల దిల్‌పసంద్



మనలో చాలామందిమి బ్రెడ్ తింటాం. కానీ దానికి బదులు దిల్‌పసంద్ ఉందనుకోండి.. పేరుకు తగ్గట్టే దిల్ పసంద్దైపోతుంది. దీనికి దిల్‌కుష్ అనే పేరు కూడా ఉంది. ఇది దేశమంతా ప్రసిద్ధమైనా పుట్టింది కర్నాటకలో. దీన్నెలా చేస్తారంటే.. ముందుగా రెండు కప్పుల మైదా, అరకప్పు పాలు, అరచెంచా డ్రై ఈస్ట్, పంచదార, నూనె రెండు టేబుల్ స్పూన్ల చొప్పున, రుచికి తగినంత ఉప్పు వేసి పిండి కలిపి, రెండు గంటలు పక్కనుంచాలి. మరో పాత్రలో కప్పు కొబ్బరితురుము, టూటీఫ్రూటీ అర కప్పు, పంచదార పావు కప్పు, వెన్న రెండు టేబుల్‌స్పూన్లు, చారెడు చెర్రీ పండ్లు, జీడిపప్పులు పన్నెండు, బాదంపప్పులు ఐదారు, పావుచెంచా యాలకులపొడి వేసి కలపాలి. పిండిని రెండు భాగాలు చేసి మందమైన రొట్టెలుగా వత్తుకోవాలి. ఒక రొట్టెను అవెన్ సేఫ్ ప్లేటు మీద ఉంచి, కొబ్బరి స్టఫింగ్‌ను అంచుల దగ్గర కాస్త వదిలేసి.. మిగిలిన భాగంలో సమానంగా పరవాలి. రెండో రొట్టెను దాని మీద ఉంచి, అంచులను సీల్ చేసినట్టుగా కలపాలి. అరగంట అలా ఉంచేస్తే రొట్టె ఉబ్బి, రెట్టింపు సైజు అవుతుంది. దాని మీద చెంచా పాలు పోసి.. మధ్యలో ఇంటూ మార్కులా గాటు పెట్టి.. ప్రీహీట్ చేసి అవెన్‌లో 180 డిగ్రీల వద్ద అరగంట బేక్ చేయాలి. బయటకు తీసి టేబుల్‌స్పూన్ వెన్నను సిలికాన్ కుంచెతో అద్దినట్లు చేయాలి. పది నిమిషాల తర్వాత స్లైసులుగా కట్ చేసుకోవాలి. వీటిని గోరు వెచ్చగానూ తినొచ్చు. కొంతసేపు ఫ్రిజ్‌లో ఉంచి చల్లగానూ తినొచ్చు.

చిత్రంగా






అంబకు పండ్లమాలలు!

అమ్మవారి మహిమ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిందేముంది?! ఆ తల్లిని దర్శించుకుంటే.. ఎలాంటి అలజడులు, ఆందోళనలైనా ఇట్టే తొలగిపోతాయి. మనసు ప్రశాంతంగా ఉంటుంది. దేవీనవరాత్రులు ప్రారంభమవుతున్న సందర్భంగా పండ్లు, కూరగాయలతో అలంకరించిన దుర్గామాతను చూసి తరించండి!



విద్యుత్ ప్రవాహాల వల్ల అయస్కాంతతత్వం ఏర్పడుతుంది. దీన్ని పరమాణువు నుంచి గ్రహాల వరకు, ఇంట్లోని చిన్న అయస్కాంతం నుంచి భూ అయస్కాంతతత్వం వరకు చూడొచ్చు. మానవాళి భూమిపై మనుగడ సాగించడంలో గాలి, నీరు మొదలైనవాటితో పాటు భూ అయస్కాంతతత్వం కూడా తోడ్పడుతోంది. ఇదే లేకపోతే ఎన్నో ఆవేశిత కణాలు భూమిపై దాడి చేసేవి.



ఏపీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

ఫిజిక్స్

ఆ ఆవేశిత కణాలే... వ్యాన్ అలెన్ పట్టీలు..!

అయస్కాంతతత్వం

కూలుమ్స్ విలోమ వర్గ నియమం (*Coulomb's Inverse Square Law of Magnetism*)

✦ రెండు అయస్కాంతాలకు చెందిన రెండు ధృవాల మధ్య పని చేసే ఆకర్షణ లేదా వికర్షణ బలం కింది విధంగా ఉంటుంది.

1. ఆ రెండిటి ధృవసత్వాల లబ్ధానికి అనులోమానుపాతంలో ఉంటుంది.
2. ఆ రెండిటి మధ్య ఉండే దూర వర్గానికి విలోమానుపాతంలో ఉంటుంది.

✦ ధృవాల ధృవసత్వాలు వరుసగా m_1, m_2; వాటి మధ్య దూరం d అయితే, ఈ నియమం ప్రకారం

$F \propto m_1, m_2$

$F \propto \frac{1}{d^2}$

$F \propto \frac{m_1 m_2}{d^2}$

లేదా $F = K\frac{m_1 m_2}{d^2}$

ఇక్కడ K = అనుపాత స్థిరాంకం

✦ ధృవాల మధ్య శూన్యం ఉన్నప్పుడు $K = \frac{\mu_0}{4\pi}$;

$\mu_0 = 4\pi \times 10^{-7}$ హెన్రీ/ మీటర్


∴ μ_0 ని గాలి లేదా శూన్యయానకపు 'ప్రవేశ్యశీలత' అంటారు.

✦ యానకం ద్వారా జరిగే అయస్కాంత క్షేత్ర ప్రసారానికి ప్రవేశ్యశీలత అనేది ఒక కొలమానం.

అయస్కాంత ప్రేరణం (Magnetic Induction)

అయస్కాంత క్షేత్రంలోని ఏదైనా బిందువు వద్ద దాని ప్రభావ తీవ్రతను తెలిపేదే అయస్కాంత ప్రేరణం. దీన్ని $\vec{B}$ తో సూచిస్తారు.

❖ m ధృవసత్వాన్ని కలిగిన అయస్కాంత ధృవం నుంచి d దూరంలో ఉన్న అయస్కాంత ప్రేరణాన్ని లెక్కించడానికి అక్కడ ఒక ఏకాంక ఉత్తర ధృవాన్ని (Unit North Pole) ఉంచాలి. దానిపై పనిచేసే కూలుమ్ బలమే ఆ బిందువు వద్ద $\vec{B}$ విలువకు సమానం.



$m_1 = m, m_2 = 1$ అయితే కూలుమ్ నియమం ప్రకారం

$F = \frac{\mu_0}{4\pi}\frac{m_1 m_2}{d^2} = \frac{\mu_0}{4\pi}\frac{m}{d^2} = \overline{B}$

$\therefore \overline{B} = \frac{\mu_0}{4\pi}\frac{m}{d^2}$

$\vec{B}$ సదిశరాశి. దీనికి SI ప్రమాణం $NA^{-1}m^{-1}$ లేదా $\frac{Wb}{m^2}$ లేదా టెస్లా (T).

అయస్కాంత బల (క్షేత్ర) రేఖలు

ఒక దండాయస్కాంతంపై పలచటి అట్టని ఉంచి దానిపై కొంత ఇనుప రజను (Iron Filings)ను చల్లి, అట్టముక్కను నెమ్మదిగా తడితే దానిపై కొన్ని రేఖల చిత్రం ఏర్పడుతుంది. ఈ రేఖలనే అయస్కాంత బల రేఖలుగా పేర్కొంటారు.

- అయస్కాంత క్షేత్రంలోని ఏకాంక ఉత్తర ధృవం కదిలే లేదా కదిలేందుకు ఇష్టపడే మార్గాన్ని అయస్కాంత బలరేఖ అంటారు. ఇవి దండాయస్కాంత ఉత్తర ధృవం వద్ద ప్రారంభమై, దక్షిణ ధృవం వద్ద అంతమైనట్లుగా కనిపిస్తాయి.
- కానీ బలరేఖలు సంవృత వలయాలు. ఎందుకంటే అయస్కాంతాలన్నీ ద్విధృవాలు కావడమే.
- బలరేఖల సాంద్రత అధికంగా ఉండే ప్రదేశాల్లో ముఖ్యంగా ధృవాల వద్ద అయస్కాంత ప్రేరణ ఎక్కువగా ఉంటుంది.
- దండాయస్కాంతం మధ్య బిందువు వద్ద బలరేఖల సంఖ్య, క్షేత్రం తక్కువ విలువలను కలిగి ఉంటాయి.
- ఏ రెండు బలరేఖలు పరస్పరం ఖండించుకోవు. అయస్కాంత క్షేత్రంలోని ఏదైనా వైశాల్యానికి లంబంగా ప్రసరించే రేఖల సంఖ్యను అయస్కాంత అభివాహం (Magnetic Flux) 'Ø' అంటారు. దీనికి SI ప్రమాణం వెబర్ (Wb).

అయస్కాంత క్షేత్రం

ఒక అయస్కాంతం చుట్టూ దాని ప్రభావం ఎంత మేరకు విస్తరించి ఉంటుందో ఆ ప్రదేశం లేదా అంతరాళాన్ని దాని అయస్కాంత క్షేత్రంగా పేర్కొంటారు.

- ఒకదాని క్షేత్రంలోకి మరొక అయస్కాంత ధృవం వెళ్తే, రెండో దానిపై మొదటిది ప్రభావాన్ని (ఆకర్షణ/ వికర్షణ) చూపిస్తుంది.
- అయస్కాంత క్షేత్రానికి బలరేఖల చిత్రం ప్రాతినిధ్యం వహిస్తుంది. అయస్కాంత ధృవం నుంచి దూరంగా వెళ్లే కొద్దీ క్షేత్రం విలువ తగ్గుతుంది.

అయస్కాంత క్షేత్రంలో ఆవేశిత కణం

q ఆవేశంతో, v వేగంతో కదిలే ఆవేశిత కణం (charged particle) B ప్రేరణంతో ఉండే అయస్కాంత క్షేత్రంలోకి ప్రవేశిస్తే దానిపై క్షేత్రం కలిగించే అపవర్తన బలం

$F = q(\vec{v} \times \vec{B})$

$F = qvB \sin\theta$

$\theta = \vec{v}, \vec{B}$ ల మధ్య కోణం

1. $\theta = 90°$ అయితే $F = qvB$. ఇది కణాన్ని వృత్తాకార మార్గంలో తిప్పేందుకు అవసరమయ్యే అభికేంద్ర బలంగా పనిచేస్తుంది. కాబట్టి క్షేత్రంలో కణం వృత్తాకారంలో తిరుగుతుంది.


అపవర్తన బలం = అభికేంద్ర బలం (centripetal force)

$qvB = \frac{mv^2}{r}$

$r = \frac{mv}{qB}$

☛ ఈ సూత్రం ఆధారంగా పార్టికల్ యాక్సిలరేటర్స్ అయిన సైక్లోట్రాన్ (Cyclotron), సింక్రోట్రాన్ (Synchrotron), బీటాట్రాన్ (Betatron) పని చేస్తాయి.

2. $\theta \neq 90°$ అయితే, $\vec{v}$ రెండు అంశాలను కలిగి ఉంటుంది. అవి $\vec{B}$ కి లంబంగా ఉండేది, సమాంతరంగా ఉండేది. దీనివల్ల q ఆవేశిత కణం గుండ్రంగా తిరుగుతూ ముందుకు వెళ్తుంది. దీన్నే 'helical motion' అంటారు.



helical path

3. క్షేత్రంలో స్థిరంగా ఉండే ఆవేశిత కణం (v = 0) పై ఎలాంటి అపవర్తన బలం (deflection force) పనిచేయదు.


4. ఆవేశిత కణంపై అయస్కాంత, విద్యుత్ క్షేత్రాలను ప్రయోగిస్తే, ఈ రెండూ కణాన్ని అపవర్తనం చెందిస్తాయి. రెండు క్షేత్రాలు పరస్పరం లంబంగా ఉంటే వాటిని crossed fields అంటారు. ఈ తరహా క్షేత్రాలను కాథోడ్ రే ట్యూబ్ - CRT (పాత కాలం పిక్చర్ ట్యూబ్)లో ప్రయోగించి జె.జె థామ్సన్ 'ఎలక్ట్రాన్'ని కనుక్కున్నారు.


5. కరెంట్ ప్రవహించే రాగి పలకకి లంబంగా అయస్కాంత క్షేత్రాన్ని ప్రయోగిస్తే దానికి లంబంగా పలక చివర్లో విద్యుత్ క్షేత్రం ఏర్పడటాన్ని Hall effect (హాల్ ఫలితం)లో చూడొచ్చు.

6. 'i' విద్యుత్ ప్రవాహాన్ని తీసుకు వెళ్లే, *l* పొడవైన తీగ అయస్కాంత క్షేత్రం $\overline{B}$ తో θ కోణం చేసే విధంగా ఉంచితే దానిపై పని చేసే అపవర్తన బలం

$F = i(\overline{l} \times \overline{B}) = i/B \sin\theta$

7. గ్రహాంతరాళం నుంచి భూమివైపునకు దూసుకొచ్చే ఎన్నో ఆవేశిత కణాలను భూ అయస్కాంత క్షేత్రం అడ్డగించి మనల్ని కాపాడుతోంది. అవి భూ వాతావరణంలోకి ప్రవేశించకుండా భూ అయస్కాంత క్షేత్ర రేఖలపై సర్పిలాకారంలో తిరుగుతూ బంధితం అవుతున్నాయి. భూవాతావరణంలోకి రాలేక ఆవేశిత కణాలు భూగోళానికి రెండువైపులా రెండు పట్టీల రూపంలో నిలిచిపోయాయి. వీటిని 'వ్యాన్ అలెన్ పట్టీలు' అంటారు.





◆ భూ అయస్కాంత క్షేత్ర రేఖలపై spiral రూపంలో ప్రయాణించే కణాలు ధృవాల వద్ద అయనీకరణం చెందుతాయి. ఈ క్రమంలో అవి వాతావరణంలో ప్రవేశించి శక్తిని కాంతి రూపంలో వెదజల్లుతాయి.

◆ ఉత్తర ధృవం వద్ద కనిపించే కాంతి పుంజాలను 'Aurora borealis' అని, దక్షిణ ధృవం వద్ద కనిపించే వాటిని 'Aurora australis' అని అంటారు.

8. సూర్యుడు, ఇతర నక్షత్రాల్లో శక్తి విడుదలకు కారణం కేంద్రక సంలీనం. ఇలాంటి చర్యను మనం భూమిపై చేయగలిగితే స్వచ్ఛమైన, కాలుష్యరహిత అపార శక్తిని ముఖ్యంగా విద్యుత్‌ను పొందొచ్చు. ఇలాంటి చర్యలో హైడ్రోజన్ కేంద్రకాలను సుమారు 10^6 K ఉష్ణోగ్రత వద్ద సంలీనం చెందించాలి. ఈ స్థితిలో పదార్థం ప్లాస్మా స్థితిలో ఉంటుంది. ప్లాస్మాను బంధించేందుకు అయస్కాంత క్షేత్రాన్ని ఉపయోగిస్తారు. ప్లాస్మాను నిల్వ చేసే పరికరాన్ని 'tokamk' (టోకమాక్) అంటారు. ఇది ఆవేశిత కణాలను అయస్కాంత క్షేత్రం సహాయంతో బంధిస్తుంది.

- ఏకాంక వైశాల్యానికి ప్రసరించే అభివాహాన్ని 'అభివాహ సాంద్రత' అంటారు. ఇది ప్రేరణ క్షేత్రం B కి సమానం.


$B = \frac{Ø}{A} \Rightarrow Ø = \vec{B}.\vec{A}$

- ఏకరీతి అయస్కాంత క్షేత్రానికి బలరేఖలు సమాంతర రేఖలు.

ఉదా: ఇచ్చిన ప్రదేశంలోని భూఅయస్కాంత క్షేత్రం.



రచయిత
దురిశెట్టి అనంత రామకృష్ణ
విషయ నిపుణులు



టోకమాక్

425 Word of the Day

Unabashedly

Telugu meaning: తడబాటు లేకుండా, నిస్సిగ్గుగా

English meaning: The word 'unabashedly' (అన్‌అబాషెడ్లీ) is an adverb that describes doing something without embarrassment, shame, or hesitation.

Synonyms: Boldly, Shamelessly

Antonyms: Timidly, Hesitantly

Usage: **1.** She unabashedly voiced her opinions in the meeting, despite the disapproving looks from others.

2. He admitted his mistake unabashedly and took full responsibility for the failure.

నోటిఫికేషన్స్

కేజీబీవీల్లో ఉద్యోగాలు

ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా సొసైటీ (పాఠశాల విద్యాశాఖ) ఆధ్వర్యంలో నిర్వహించే కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) 2024-25 విద్యా సంవత్సరం (ఏడాది) కాలానికి బోధన, బోధనేతర సిబ్బంది ఖాళీల భర్తీకి ఏపీ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం ఖాళీల సంఖ్య 604. దరఖాస్తు రుసుము రూ.250. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 10 అక్టోబరు 2024.

ఇండస్ట్రియల్ ట్రైనీ ఖాళీలు

నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎల్‌సీ) ఇండస్ట్రియల్ ట్రైనీ (ఫైనాన్స్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టులు 56. అర్హులైన అభ్యర్థులు 2024, అక్టోబరు 10లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

టెక్నీషియన్ పోస్టులు

ఆర్మ్‌ర్డ్ వెహికల్స్ నిగమ్ లిమిటెడ్ (ఏవీఎన్ఎల్)కు చెందిన చెన్నై, ఆవడిలోని హెవీ వెహికల్ ఫ్యాక్టరీ (హెచ్‌వీఎఫ్) ఒప్పంద ప్రాతిపదికన టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 271. దరఖాస్తు ఫీజు రూ.300. ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 9 అక్టోబరు 2024.

దరఖాస్తు చేశారా..?

ఈ ఉద్యోగాలు/ అప్రెంటిస్ పోస్టులకు నేడే (సెప్టెంబరు 29) చివరి తేదీ

☛ న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీలో 170 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులు. ఏదైనా డిగ్రీ/ పీజీ; చార్టర్డ్ అకౌంటెంట్ (ఐసీఏఐ) ఉత్తీర్ణులైనవారు అర్హులు.


☛ ఇండియన్ నేవీలో 250 ఎస్ఎస్‌సీ ఆఫీసర్ ఉద్యోగాలు. డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు నిర్దిష్ట శారీరక/ వైద్య ప్రమాణాలు కలిగి ఉన్నవారు అర్హులు.

☛ పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకులో 213 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులు. డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

☛ హైదరాబాద్ ఈసీఐఎల్‌లో 437 ట్రేడ్ అప్రెంటిస్ పోస్టులు. సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Current Affairs



M V Shreyams Kumar was elected president of the Indian Newspaper Society (INS), an apex body of publishers of newspapers, magazines, and periodicals on 27 September 2024. He is the Managing Director of the Mathrubhumi Printing & Publishing Company. Kumar succeeds Rakesh Sharma of Aaj Samaj newspaper.

India was elected to the fifteen-member steering committee of the GlobE Network following a multi-stage voting process during a plenary session in Beijing. The Central Bureau of Investigation (CBI) announced this on 26 September 2024. The Global Operational Network of Anti-Corruption Law Enforcement Authorities (GlobE Network) is an initiative launched under the G20 framework to address international corruption and financial crime.

India ranked 58th globally, with a talent score of 40.47 in the IMD's World Talent Ranking 2024. In 2023 India was at 56th rank. The ranking assesses nations based on their ability to develop, retain, and attract highly qualified domestic and international talent. In 2022, India was at the 52nd rank.

World Tourism Day is observed every year on September 27. This day was established by the United Nations World Tourism Organization (UNWTO) in 1980 to honour the global influence of travel and to increase public understanding of its importance on social, cultural, and economic development.

- **2024 theme:** "Tourism and Peace."

For more Current Affairs: Scan QR code

Coding - Decoding

1. In a certain code language, FOREST is coded as GOSETT, TRAINED is coded as URBIOEE. Then how is MOTOR coded?
A) UIBAK B) JWNSE
C) UOAJD D) NOUOS

2. In a certain code language SEREN is coded as ESERN, COROP is coded as OCORP then how is KERET coded?
A) EVAKS B) EKERT
C) EKVAJ D) EYUIB

3. In a certain code language COURSE is coded as DUOSRF, KLEANR is coded as LELNAS. Then how is MEANER coded?
A) WUDJVS B) RIBZKC
C) FKCSJB D) NAEENS

4. In a certain code language ROBOT is coded as SQCQU. SARDT is coded as TCSFU. Then how is FORJE is coded?
A) ANSON B) BDOWB
C) GQSLF D) GAOQB

5. In a certain code language FORCED is coded as PGDSEF. KARDOP is coded as BLESQP. Then how is FINALLY coded?
A) JGBOZM B) GAOVQJ
C) BSQBOA D) NSGAKD

RRB Exams

Reasoning

6. In a certain code language PLEASE is coded as ESAELP, CRODTE is coded as ETPORC. Then how is JARTUD is coded?
A) OWBSKS B) PUTRAJ
C) BSOBWI D) HQOBSY

7. In a certain code language POLICE is coded as POLI8, MORSET is coded as MORS25 then how is JAQCUB coded?
A) BAIS89 B) HAKS12
C) BSOB14 D) JAQC23

8. In a certain code language CORPATE is coded as OCPRTAG, MANAGER is coded as AMANEGT then how is SARDINT coded?
A) BSOAVWN B) QIEVANK
C) ASDRNIV D) AHEBKAN

9. In a certain code language SERMON is coded as HVINLM and FLINGE coded as UORMTV then how is RIGHTP coded?
A) IRTSGK B) XKBDJB
C) KVWNKV D) RUONCD

10. In a certain code language LAMENT is coded as MCMEPU, SARGEN is coded as TCRJGO then how is QUONTR coded?
A) QUEBKA B) RWONVS
C) AJSBKQ D) BWKBDJ



11. In a certain code language FONT is coded as 55 and GAME is coded as 26 then how is MAIN coded?
A) 27 B) 37 C) 79 D) 24

12. In a certain code language KRENJ is coded as RKHJN, PLORT is coded as LPRTR then how is SRAIN coded?
A) RSDNI B) HWBKS
C) HSOQN D) HQOBW

13. In a certain code language SYRUP is coded as RYSUP, PQJFC is coded as JQPFC then how is CROWN coded?
A) ORCWN B) HWNAN
C) BSOQN D) QNONC

14. In a certain code language COLONY is coded as LOCYNO, RACEDP is coded as CARPDE then how is NORJED coded?
A) QBOBSV B) RONDEJ
C) GAKBWH D) BSOQNY

15. In a certain code language MANGE is coded as NZMGE, CEOLD is coded as XVLLD then how is KRACE coded?
A) JQOVD B) QBINF
C) AHONF D) PIZCE

16. In a certain code language SORRY is coded as QUTTX, CRAZY is coded as TEBCX then how is MORNG coded?
A) BQOBS B) QOPTR
C) VSOAB D) BDOBQ

17. In a certain code language MENTAL is coded as NEMLAT, CORTIS is coded as ROCSIT then how is WANTED coded?
A) BZOVQJ B) QGOBXN
C) NAWDET
D) HAOBFN

Scan the QR code for Key

*These model questions were prepared by subject experts of **QnA Academy**, Hyderabad*

కరెంట్ అఫైర్స్



✦ గోవాలో ఏటా నిర్వహించే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఐఎఫ్ఎఫ్ఐ) 55, 56వ ఎడిషన్లకు డైరెక్టర్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?

జ: ప్రముఖ భారత దర్శకుడు శేఖర్ కపూర్

✦ 2024–2025 సంవత్సరానికి 'ఆసియా డిజాస్టర్ ప్రిపేర్డ్‌నెస్ సెంటర్ (ఏడీపీసీ) అధ్యక్ష బాధ్యతలను ఇటీవల ఏ దేశం చేపట్టింది? జ: భారత్

మాదిరి ప్రశ్నలు

(ఎన్‌డీఎంఏ సభ్యుడు, విభాగాధిపతి రాజేంద్రసింగ్ 2024, జులై 25న ఏడీపీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు)

✦ దేశంలోనే తొలిసారిగా ఏ ఓడరేవులో సమగ్ర వ్యవసాయ ఎగుమతి సౌకర్యాన్ని (ఇంటిగ్రేటెడ్ అగ్రి ఎక్స్‌పోర్ట్ ఫెసిలిటీ) అభివృద్ధి చేస్తున్నారు? (ఈ ప్రాజెక్టు విలువ రూ.284.19 కోట్లు. విస్తీర్ణం 67,422 చదరపు మీటర్లు. ఈ ఓడరేవు ఇప్పటికే దేశంలో మొదటి 100 శాతం ల్యాండ్ లార్డ్ పోర్టుగా గుర్తింపు పొందింది.)

జ: జవహర్‌లాల్ నెహ్రూ పోర్టు, ముంబయి

✦ 'వరల్డ్ హెపటైటిస్ డే'ను ఏటా ఏ రోజు నిర్వహిస్తారు? ('ఇట్స్ టైం ఫర్ యాక్షన్' అనేది ఈ ఏడాది థీమ్.) జ: జులై 28

✦ దేశంలో 500వ కమ్యూనిటీ రేడియో స్టేషన్ 'అప్నా రేడియో 90.0 FM'ను ఇటీవల ఎక్కడ ప్రారంభించారు? జ: ఐజ్వాల్

మరింత సమాచారం

ప్రిపరేషన్ టెక్నిక్

అన్ని సబ్జెక్టులను చదవడానికి, రివిజన్‌కు వీలు కల్పించే విధంగా స్టడీప్లాన్ సిద్ధం చేసుకోవాలి. సబ్జెక్టుల వారీగా అభ్యర్థుల బలాలు, బలహీనతల ఆధారంగా ఆ ప్రణాళిక ఉండేలా చూసుకోవాలి.

డీఎస్సీ/టెట్ - 2024
తెలుగు కంటెంట్

పదోతరగతి
తెలుగు



ప్రత్యక్ష దైవాలు

తల్లిదండ్రుల సేవను మించిన ధర్మం లేదు!

ప్రశ్నలు జవాబులు

1) 'ప్రత్యక్ష దైవాలు' పాఠం రచించిన కవి గురించి రాయండి. (4 మా.)

జ: 'ప్రత్యక్ష దైవాలు' పాఠం రచించిన కవి ఎఱ్ఱన.

కాలం: క్రీ.శ.14వ శతాబ్దం. **తల్లిదండ్రులు:** పోతమ్మ, సూరనలు. **జననం:** పాకనాడు సీమ (నెల్లూరు జిల్లా కందుకూరు సమీపంలోని గుడ్లూరు గ్రామం). **ఉద్యోగం:** అద్దంకిని రాజధానిగా చేసుకుని పరిపాలించిన ప్రోలయ వేమారెడ్డి ఆస్థాన కవి. **రచనలు:** రామాయణం, హరివంశం, అరణ్యపర్వశేషం, నృసింహపురాణం **బిరుదులు:** శంభుదాసుడు, ప్రబంధ పరమేశ్వరుడు. **రచనా శైలి:** సూక్తి వైచిత్రితో పేరెన్నిక గన్నది. ◆ ప్రస్తుత పాఠ్యాంశాన్ని మహాభారతంలోని అరణ్యపర్వంలోని 5వ ఆశ్వాసం నుంచి గ్రహించారు.

2) వృద్ధాశ్రమాలు పెరిగిపోతున్న నేటి రోజుల్లో 'తల్లిదండ్రుల సేవను మించిన ధర్మం లేదు' అనే ధర్మవ్యాధుడి అభిప్రాయ ప్రాధాన్యతను పాఠం ఆధారంగా వివరించండి. (8 మా.)

జ: తల్లిదండ్రుల సేవను మించిన ధర్మం లేదని మన పురాణాలు, ఇతిహాసాలు, శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. ✦ తల్లిదండ్రులే పిల్లలకు ప్రత్యక్ష దైవాలు. ✦ వారిని కష్టపెట్టకూడదు. ✦ కేవలం అమ్మానాన్నలను పూజించడం తప్ప వేరే దైవాన్ని కూడా పూజించని ధర్మవ్యాధుడు ధర్మాత్ముడు అయ్యాడు. ✦ వేదాలు, శాస్త్రాలు చదివిన కౌశికుడి లాంటి వ్యక్తికి కూడా ధర్మసూక్ష్మాలు తెలిపాడు. ✦ మనకు శరీరాన్నిచ్చి, పెంచి, పోషించి ఒకస్థాయికి తీసుకుని వచ్చిన తల్లిదండ్రులను మించిన దైవం లేదని ధర్మవ్యాధుడు తన మాటలు, ఆచరణ ద్వారా నిరూపించాడు. ✦ తల్లిదండ్రులను పట్టించుకోకుండా ఎంత జ్ఞానం సంపాదించినా, పుణ్య కార్యాలు చేసినా ప్రయోజనం లేదు. ✦ యజ్ఞాలు, వ్రతాలు, పూజలు అన్నీ చేసిన ఫలితం తల్లిదండ్రుల సేవ వల్ల లభిస్తుంది. ✦ ఇంట్లో కన్నవారి రూపంలో ఉన్న ప్రత్యక్ష దైవాలను వదిలి జ్ఞానం, పుణ్యం కోసం ఎక్కడెక్కడికో వెళ్లడం వెర్రితనం.

ముఖ్యమైనవి మరికొన్ని..

8 మార్కుల ప్రశ్నలు

1) ప్రత్యక్ష దైవాలు పాఠం సారాంశాన్ని మీ సొంత మాటల్లో రాయండి.

2) ఈ పాఠం ఆధారంగా ధర్మవ్యాధుడి వ్యక్తిత్వాన్ని విశ్లేషించండి.

జవాబుల కోసం

– చెరుకూరి వేంకట సూర్యనారాయణ శర్మ

మనుగడకు మూలాలు.. ప్రగతి సాధనాలు!

ఇండియన్ జాగ్రఫీ



రావత్‌భటాలోని రాజస్థాన్ అటామిక్ పవర్ ప్రాజెక్ట్ (ఆర్‌పీపీ)

ఆధునిక ప్రపంచం మనుగడ అంతా శక్తివనరులపైనే ఆధారపడి నడుస్తోంది. విద్యుత్తు తయారీకి, వాహనాలు నడిచేందుకు, వివిధ ఉత్పత్తులకు శిలాజ ఇంధనాలే ప్రధాన ఆధారాలు. ఆర్థిక, అభివృద్ధి కార్యకలాపాల్లో వాటిని విస్తృతంగా వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంప్రదాయ ఇంధన వనరులైన బొగ్గు, ముడిచమురు, సహజవాయువు, అణుశక్తికి సంబంధించిన ప్రాథమికాంశాలను పరీక్షార్థులు తెలుసుకోవాలి. దేశంలో వాటి లభ్యత, విస్తరణ, ఉత్పత్తి తీరుతెన్నులు, ఆ కార్యకలాపాల్లో నిమగ్నమైన భారత ప్రభుత్వ సంస్థల గురించి అవగాహన కలిగి ఉండాలి.

శక్తివనరులు

ఆధునిక యుగంలో దేశ ఆర్థిక వ్యవస్థను నిర్దేశించే ప్రధాన కారకం శక్తివనరు. ఏదైనా ఒక దేశం వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి చెందడానికి ఇది చాలా అవసరం. ఒక ప్రదేశ ఆర్థిక అభివృద్ధి, అక్కడి శక్తిసంపద, దాన్ని వినియోగిస్తున్న విధానంపై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం శక్తివనరులను ప్రాథమిక స్థాయి నుంచి అంటే ఆహార పదార్థాలను వండుకోవడం నుంచి ఆధునిక స్థాయి అంటే పరిశ్రమలు, వ్యాపారం, రవాణా, సమాచార అభివృద్ధి వరకు బహుళ ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారు. మూలాధారం, వినియోగం ఆధారంగా శక్తివనరులను రెండు రకాలుగా పేర్కొనవచ్చు. అవి 1) వాణిజ్యేతర శక్తి 2) వాణిజ్య శక్తి. అటవీ ఉత్పత్తులు, కర్రబొగ్గు, ఆవు పేడ, వ్యవసాయ వ్యర్థాలు, పశువుల శక్తి మొదలైనవి వాణిజ్యేతర శక్తి వనరులు. నేలబొగ్గు, సహజవాయువు, జలవిద్యుత్తు, చమురు (క్రూడ్ ఆయిల్), పవనశక్తి, సౌరశక్తి, అణుశక్తి మొదలైనవి వాణిజ్య శక్తికి ఉదాహరణలు. మరోవిధంగా శక్తివనరులు రెండు రకాలు అవి-

> దేశంలో బొగ్గు ఉత్పత్తిలో ముందంజలో ఉన్న రాష్ట్రాలు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్. ప్రస్తుతం 90% బొగ్గు ఉత్పత్తి ఉపరితల గనుల ద్వారా జరుగుతోంది. భారత్ బొగ్గును నేపాల్, బంగ్లాదేశ్, భూటాన్‌కు ఎగుమతి చేస్తూ; ఇండొనేసియా, దక్షిణాఫ్రికాల నుంచి దిగుమతి చేసుకుంటోంది.

1) తరిగిపోయేవి: వాడిన కొద్దీ నిల్వలు తగ్గిపోతూ ఉంటాయి. పునరుత్పత్తి చేయడం కుదరదు. వీటినే సంప్రదాయ ఇంధన వనరులు అంటారు. అవి- బొగ్గు, చమురు, సహజవాయువు, అణుశక్తి, యురేనియం, థోరియం.

2) తరగనివి: ఎంత వాడినా, ఎన్నిసార్లు వాడినా తరిగిపోవు. మళ్లీ మళ్లీ ఉపయోగించవచ్చు. వీటినే సంప్రదాయేతర ఇంధన వనరులు అంటారు. అవి నీరు, గాలి, సూర్యరశ్మి మొదలైనవి.

దేశంలో వాణిజ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని బొగ్గు, ముడిచమురు, అణుశక్తి, సహజవాయువు, జలవిద్యుత్తును వినియోగిస్తున్నారు. నేడు సౌరశక్తి, పవనశక్తి, సముద్ర తరంగాల శక్తి, జీవశక్తి (బయోఎనర్జీ) ఉత్పత్తి, వాడకమూ పెరిగింది.

సంప్రదాయ ఇంధన వనరులు

బొగ్గు: ఇంధన వనరుల్లో ప్రధానమైంది. దేశంలో జరిగే విద్యుత్తు ఉత్పత్తిలో 50% పైగా బొగ్గు ద్వారానే జరుగుతోంది. ప్రపంచంలో అధిక బొగ్గు నిల్వలున్న దేశాల్లో భారత్ 5వ స్థానంలో (2023-24 - 378.21 బి.టన్నులు) ఉంది. (మొదటి నాలుగు స్థానాల్లో అమెరికా, రష్యా, ఆస్ట్రేలియా, చైనా ఉన్నాయి.) ప్రపంచంలో బొగ్గు ఉత్పత్తి దేశాల్లో భారత్‌ది రెండో స్థానం (2023-24- 997.25 మిలియన్ టన్నులు). (మొదటి స్థానంలో చైనా, మూడో స్థానంలో ఇండొనేసియా ఉన్నాయి.) బొగ్గును 'నల్లబంగారం' అంటారు. దేశంలో బొగ్గు నిక్షేపాలు రెండు రకాలు.

గోండ్వానా రకం నిక్షేపాలు: ఇవి కార్బోనిఫెరస్ యుగంలో ఏర్పడ్డాయి. మహానది, సోన్, నర్మద, దామోదర్ నదీ లోయ ప్రాంతాల్లో; తెలంగాణ, ఏపీలోని గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఉన్నాయి. దేశంలోని మొత్తం బొగ్గులో 98% ఈ రకమే. నాణ్యమైన ఆంథ్రసైట్, బిట్యుమినస్ రకానికి చెందింది.

టెర్షియరీ రకం: ఇది లిగ్నైట్ రకానికి చెందింది. అస్సాం, శివాలిక్ కొండల వద్ద రాజస్థాన్, కశ్మీర్‌లో; తమిళనాడులోని కడలూర్ జిల్లా నైవేలి, గుజరాత్‌లోని కచ్ ప్రాంతాల్లో లభిస్తుంది. దేశం బొగ్గు నిల్వల్లో ఈ రకం 2% మాత్రమే.

బొగ్గు రకాలు: బొగ్గు ఏర్పడే క్రమంలో ఒత్తిడి, ఉష్ణోగ్రత, కాలం ఆధారంగా పలు రకాలుగా ఏర్పడతాయి. బొగ్గులో మందం, గట్టిదనం, తేమశాతం, బూడిద రకం వేరుగా ఉంటాయి.

ఆంథ్రసైట్: ఇది నాణ్యమైంది, దృఢమైంది. నలుపు రంగులో ఉంటుంది. ఇందులో 80% పైగా కార్బన్ ఉంటుంది. జమ్ము-కశ్మీర్‌లో లభిస్తుంది. మండేటప్పుడు నీలి రంగులో ఉంటుంది.

బిట్యుమినస్ రకం: మెత్తగా ఉంటుంది. దేశంలో అత్యధికంగా ఉన్నది ఇదే. దీనిలో కర్బనం 40-80%, తేమ 15-40% ఉంటుంది. ఝార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్‌ల్లో లభిస్తుంది.

లిగ్నైట్: దీన్ని గోధుమ రంగు బొగ్గు అంటారు. 40%-50% కర్బనం, 35% తేమ ఉంటుంది. నైవేలి (తమిళనాడు), పల్నా (రాజస్థాన్), లక్ష్మీపుర్ (అస్సాం), కారేవా (జమ్ము-కశ్మీర్)ల్లో లభిస్తుంది. తమిళనాడులో లిగ్నైట్‌నిక్షేపాలు అధికం.

> దేశంలో 1774లో అప్పటి బ్రిటిష్ గవర్నర్ జనరల్ వారెన్ హేస్టింగ్స్ అనుమతితో మొదటిసారిగా పశ్చిమ బెంగాల్‌లోని 'రాణిగంజ్' వద్ద బొగ్గు గనుల తవ్వకం ప్రారంభమైంది.
>
> ప్రపంచ థర్మల్ విద్యుత్తు వినియోగంలో భారత్ మూడో స్థానంలో ఉంది. మొదటి రెండు స్థానాల్లో చైనా, అమెరికా ఉన్నాయి.

పీట్: దీనిలో 40-50% కర్బనం ఉంటుంది. బొగ్గు తయారయ్యే క్రమంలో ఏర్పడుతుంది. దీన్ని కాల్చినప్పుడు పొగ, బూడిద ఎక్కువగా వస్తాయి.

ముడిచమురు: పెట్రోలియం అంటే శిలాజ ఇంధనం. దీని నుంచే పెట్రోలు, డీజిల్, కిరోసిన్ లభిస్తాయి. దేశంలో మొదట అస్సాంలోని మాకూమ్ (1867)లో ముడిచమురు గుర్తించగా, అస్సాంలోని డిగ్బాయ్ (1889)లో తొలుత చమురు వెలికితీశారు. సహర్ కటియ, కాంబట్ సింధుశాఖ, బాంబే హై వద్ద పెట్రోలియం నిల్వలను గుర్తించారు. 1956లో భారత్‌లో ఓఎన్‌జీసీ (ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్) ఏర్పడింది. నాటి నుంచి దీని పర్యవేక్షణలో చమురు నిల్వల అన్వేషణ, వెలికితీత జరుగుతోంది. 2024, సెప్టెంబరు 19 నాటికి భారత్‌లో గుర్తించిన చమురు నిల్వల అంచనా 410.5 మిలియన్ మెట్రిక్ టన్నులు. 2023-24 నాటికి వెలికితీసిన ముడిచమురు 29.4 మిలియన్ మెట్రిక్ టన్నులు.

> ఒక బారెల్ ముడిచమురు నుంచి 42% పెట్రోలు, 22% డీజిల్, 9% జెట్ ఇంధనం, 5% కిరోసిన్, 4% ఎల్‌పీజీ, 18% ఇతర పదార్థాలు వస్తాయి.
>
> ప్రపంచ పెట్రోలు వినియోగంలో భారత్ మూడో స్థానంలో ఉంది. మొదటి స్థానంలో అమెరికా, రెండో స్థానంలో చైనా ఉన్నాయి.

సహజ వాయువు: భారత్‌లో సహజవాయువు పరిశ్రమ 1960ల్లో అస్సాంలోని డిగ్బాయ్, మహారాష్ట్రలోని ముంబయి హై ఫీల్డ్‌లో ప్రారంభమైంది. 2020-21 లెక్కల ప్రకారం దేశంలో మొత్తం సహజవాయువు నిల్వలు 1,372.62 బి.క్యూబిక్ మీటర్లు. మొత్తం నిక్షేపాల్లో సముద్ర తీరప్రాంతాల్లో ఎక్కువగా ఉండగా, పశ్చిమ తీరంలో 23.7%, తూర్పు తీరప్రాంతాల్లో 41%గా ఉంది. దేశంలో ఉత్పత్తి అయ్యేమొత్తం సహజవాయువులో 75% ఓఎన్‌జీసీ ఉత్పత్తి చేస్తుంది.

అణుశక్తి: అణుశక్తికి కావాల్సినవి యురేనియం, థోరియం నిల్వలు. దేశంలో కేరళ, తమిళనాడు రాష్ట్రాల తీరప్రాంతంలో ఇల్మినైట్, మోనోజైట్ ఖనిజాలు లభిస్తాయి. ఇల్మినైట్ నుంచి టిటానియం, మోనోజైట్ నుంచి థోరియం వస్తాయి. యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను 1967లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దేశంలో 6,780 మెగావాట్ల సామర్థ్యంతో 7 వేర్వేరు కేంద్రాల్లో మొత్తం 24 అణువిద్యుత్తు రియాక్టర్లు పనిచేస్తున్నాయి. 1972లో రాజస్థాన్‌లోని కోటా సమీపంలో రెండో అణువిద్యుత్తు కేంద్రాన్ని రావత్‌భటాలో స్థాపించారు.



రచయిత: డాక్టర్ గోపగోని ఆనంద్

రాతిని నేలగా మార్చే లైకేన్లు!

జీవ పరిణామక్రమంలో భూమిపై మొక్కల ఆవిర్భావం ఒక ప్రధాన అంశం. ఇతర జీవరాశులు, ముఖ్యంగా జంతువర్గం మనుగడకు అవసరమైన అనుకూల వాతావరణాన్ని మొక్కలే సృష్టిస్తాయి. పచ్చదనాన్ని పెంచి పర్యావరణంలో జీవ వైవిధ్యానికి అవే కారణమవుతున్నాయి. ఈ మొక్కల వర్గీకరణ, వాటి లక్షణాలు, జరిపే జీవక్రియలు, ఆహార పిరమిడ్ల రూపకల్పనలో వాటికున్న ప్రాధాన్యం, వైవిధ్య లక్షణాలున్న మొక్కలు, ప్రత్యేకతలు, ఉపయోగాల గురించి పోటీ పరీక్షార్థులకు ప్రాథమిక స్థాయి పరిజ్ఞానం ఉండాలి. ఆవరణ వ్యవస్థలో మొక్కల ప్రభావంతో జరిగే మార్పులు, వీటిపై పరిశోధనలు చేసిన శాస్త్రవేత్తలు, వెల్లడించిన ఆసక్తికర అంశాలను తెలుసుకోవాలి.



డీఎస్సీ/టెట్ - 2024
బయాలజీ

మొక్కలు - ఆవరణ శాస్త్రం


1. కిందివారిలో భారతదేశ ఆవరణ శాస్త్ర పిత?
   1) క్యాథిరిన్ ఈసో 2) రామ్‌దేవ్ మిశ్రా
   3) ఎర్నెస్ట్ మేయర్ 4) 2, 3
2. ఆవరణ శాస్త్రంలో గొప్ప ప్రయోగాలు చేసినవారికి గౌరవంగా ఇచ్చే పురస్కారం?
   1) సంజయ్ గాంధీ అవార్డు 2) పద్మవిభూషణ్
   3) పద్మశ్రీ 4) రామన్ మెగసెసె
3. ఒపన్షియా మొక్క నీటిని ఏ రూపంలో నిల్వ చేసుకుంటుంది?
   1) మ్యూసిన్ 2) కొల్లాయిడ్
   3) మ్యూసిలేజ్ 4) అర్ధ ఘన
4. కిందివాటిలో సత్యవాక్యాన్ని ఎన్నుకోండి.
   ఎ) ఒక జీవి నివసిస్తున్న ప్రదేశం చుట్టూ ఉండే భౌతిక పరిసరాలతో గల సంబంధాన్ని ఆవరణ శాస్త్రం అంటారు.
   బి) మొక్కలను మూడు ప్రధాన ఆవరణ సమూహాలుగా వర్గీకరించిన వ్యక్తి- యూజెన్ వార్మింగ్.
   సి) జీవుల్లో కలిగే అనుకూలనాలు జీవిని తన ఆవాసంలో మనుగడ సాగించడంలో సాయపడతాయి.
   1) ఎ 2) ఎ, బి 3) బి, సి 4) ఎ, బి, సి
5. కిందివాటిలో మృత్తికతో సంబంధం లేకుండా నీటి ఉపరితలంపై స్వేచ్ఛగా తేలుతూ ఉండే మొక్కలు?
   1) నింఫియా 2) పిస్టియా
   3) వాలిస్ నేరియా 4) హైడ్రిల్లా
6. ఉప్పు నీటిలో పెరిగే మొక్కలను ఏమంటారు?
   1) హాలోఫైట్స్ 2) ఆగ్జాలోఫైట్స్
   3) సీయోఫైట్స్ 4) పైవన్నీ
7. బంజరు నేలలో పెరిగే మొక్కలకు ఏమని పేరు?
   1) చాస్మోఫైట్స్ 2) ఆగ్జాలోఫైట్స్
   3) చార్సోఫైట్స్ 4) హాలోఫైట్స్
8. కిందివాటిలో అసత్య వాక్యాన్ని గుర్తించండి.
   1) ఆవరణ శాస్త్రం అనే పదాన్ని 1885 లో రీటర్ ప్రతిపాదించారు.
   2) అల్పకాలికాలకు ఉదాహరణ - ట్రిబ్యులస్
   3) ట్రిబ్యులస్ అనేది ఒక రకమైన రసభరిత మొక్క.
   4) కాజురైనా అనేది ఒక ఎడారి మొక్క.
9. కిందివాటిలో లగ్నీకరణ చెంది, నీటిపై తేలే పత్రాలున్న మొక్క?
   1) నింఫియా 2) విక్టోరియా
   3) లెమ్నా 4) 1, 2
10. కిందివాటిలో ఉభయచర మొక్క?
    1) సాజిటేరియా 2) టైఫా
    3) లిమ్నోఫిలా 4) పైవన్నీ
11. కిందివాటిని జతపరచండి.

జాబితా – 1	జాబితా – 2
1) ఒపన్షియా	ఎ) వేరు రసభరితం
2) అలోవెరా	బి) ఆకు రసభరితం
3) ఆస్పరాగస్	సి) కాండ రసభరితం

   1) 1-బి, 2-సి, 3-ఎ 2) 1-సి, 2-బి, 3-ఎ
   3) 1-ఎ, 2-బి, 3-సి 4) 1-సి, 2-ఎ, 3-బి
12. కిందివాటిలో దీర్ఘకాలిక జలాభావ పరిస్థితుల్ని తట్టుకునే బహువార్షిక మొక్క?
    1) కాజురైనా 2) ట్రిబ్యులస్
    3) ఒపన్షియా 4) అలోవెరా
13. కిందివాటిలో సత్య వాక్యాన్ని ఎన్నుకోండి.
    వాదన– ఎ: పూర్తిగా నీటిలో మునిగిన మొక్కల్లో పత్రరంధ్రాలుండవు.
    వాదన– బి: వాయువుల విసరణ కణకవచాల ద్వారా జరుగుతుంది.
    1) ఎ సత్యం, బి అసత్యం 2) ఎ, బి లు సత్యం
    3) ఎ, అసత్యం బి సత్యం 4) ఎ, బి లు అసత్యం
14. లైకేన్లు ఏ ఆమ్లాన్ని స్రవించి రాతిని నేలగా మారుస్తాయి?
    1) హైడ్రోక్లోరిక్ ఆమ్లం 2) సల్ఫ్యూరిక్ ఆమ్లం
    3) కార్బొనిక్ ఆమ్లం 4) పైవన్నీ
15. కిందివాటిలో ఎడారి మొక్కల్లో ఆవరణ సంబంధ అనుకూలనం కానిది?
    1) వేరు విస్తరణ ఉండదు.
    2) కాండాలు చాలా పొట్టిగా, దృఢంగా ఉంటాయి.
    3) ఎడారి మొక్కల్లో పత్రాలు దాదాపు క్షీణించి ఉంటాయి.
    4) పైవన్నీ
16. ఒక ప్రదేశంలోని జాతులు క్రమానుగతంగా సంఘటనంలో ఊహించగల మార్పులకు ఏమని పేరు?
    1) క్రమకీయం 2) క్రమకం
    3) అనుక్రమం 4) 1, 2
17. కిందివాటిలో ప్రాథమిక అనుక్రమానికి ఉదాహరణ?
    1) రాతి నేలలు
    2) కొత్తగా ఏర్పడిన సరస్సు
    3) పాడుబడిన వ్యవసాయ భూమి 4) 1, 2
18. బంజరు భూమిలో మొదటగా ఆవాసం ఏర్పరుచుకునే మొక్కలను ఏమంటారు?
    1) క్రమక మొక్కలు 2) మార్గదర్శక మొక్కలు
    3) విరుద్ధ మొక్కలు
    4) లగ్నీకరణ చెందే మొక్కలు
19. అమెరికాలో 15 – 30% ఆహార ఉత్పత్తికి ఏ పరపరాగ సంపర్క కారకం అవసరం?
    1) గాలి 2) నీరు
    3) జీవులు 4) తేనెటీగలు
20. 180 గ్రాముల గ్లూకోజ్ తయారీకి అవసరమైన CO_2 వినియోగం ఎంత?
    1) 264 గ్రా. 2) 108 గ్రా.
    3) 180 గ్రా. 4) 193 గ్రా.
21. 'నిచ్' అనే పదాన్ని పరిచయం చేసిన వ్యక్తి?
    1) ఓడమ్ 2) ఎర్ హర్ట్
    3) జోసెఫ్ గ్రిన్నెల్ 4) రీటర్
22. కిందివాటిలో బయోటా అంటే....?
    1) సాధారణ వృక్ష సంపద ఉండే కాలం
    2) వృక్ష సంపద లేని ప్రదేశం
    3) జంతు సంపద లేని ప్రదేశం
    4) ఒక ప్రాంతంలోని జంతు, వృక్ష జాతుల సముదాయం
23. కిందివాటిని జతపరచండి.

జాబితా – 1	జాబితా – 2
1) ఆవరణ శాస్త్రం	ఎ) రామ్ దేవ్ మిశ్రా
2) ఆవరణ శాస్త్ర పిత	బి) ఎర్ హర్ట్
3) బయోస్ఫోటీ	సి) జోసెఫ్ గ్రిన్నెల్
4) నిచ్	డి) రీటర్

    1) 1-డి, 2-ఎ, 3-బి, 4-సి
    2) 1-డి, 2-బి, 3-సి, 4-ఎ
    3) 1-డి, 2-సి, 3-ఎ, 4-బి
    4) 1-డి, 2-ఎ, 3-సి, 4-బి
24. కిందివాటిలో సత్య వాక్యాన్ని గుర్తించండి.
    ఎ) ఒక నిర్దిష్ట భౌగోళిక ప్రాంతానికి మాత్రమే పరిమితమయ్యే జాతులను ఎండమిక్ జాతులు అంటారు.
    బి) వాతావరణ కాలుష్య సూచికలను లైకేన్లు అంటారు.
    సి) పతాక స్థాయి జాతి జీవులు - పులి, రైనో, ఏనుగులు.
    డి) ఒక నిర్దిష్ట జీవావరణ వ్యవస్థలోని ఒకే జాతి జీవుల సమూహాన్ని జనాభా అంటారు.
    1) ఎ, బి 2) ఎ, బి, సి, డి
    3) ఎ, సి, డి 4) ఎ, డి
25. జీవావరణ నిచ్‌ను అధికారికంగా ఉపయోగించిన వ్యక్తి?
    1) షెల్ ఫోర్డ్ 2) టాన్స్‌లే
    3) రాచల్ కార్సన్ 4) గ్రిన్నెల్
26. కిందివాటిలో సహ భోజకత్వానికి ఉదాహరణ..
    1) మైకోరైజా 2) సీఅనిమోన్
    3) ప్లాస్మోడియం 4) అమీబా
27. 'సైలెంట్ స్ప్రింగ్' గ్రంథకర్త?
    1) రాచెల్ కార్సన్ 2) ఎల్టన్
    3) ఫ్రాస్టేస్ 4) ఓడమ్
28. కోరింగ మాంగ్రూవ్ అడవుల్లో ఉత్పత్తిదారులు?
    1) మడ అడవులు 2) స్పైరోగైరా
    3) యూగ్లీనా 4) పైవన్నీ
29. కిందివాటిలో కృత్రిమ ఆవరణ వ్యవస్థ కానిది?
    1) సరస్సు 2) పంటపొలాలు
    3) పారిశ్రామిక 4) ఆక్వేరియం
30. ఇండో పసిఫిక్ సముద్రంలో ఒక చదరపు కిలోమీటర్ విస్తీర్ణంలో ఎన్ని జీవజాతులున్నాయి?
    1) 3400 2) 1200 3) 1000 4) 1500
31. భూభాగంలో దాదాపు ఎంత శాతం ఎడారి ఆవరణ వ్యవస్థ ఉంది?
    1) 17% 2) 30% 3) 40% 4) 50%
32. కిందివాటిలో సహజీవనానికి ఉదాహరణ?
    1) లైకేన్స్ 2) రైబోజోమ్స్
    3) మైకోరైజా 4) 1, 3
33. ఒక ప్రధాన ఆవరణ సంబంధ సముదాయాన్ని ఏమంటారు?
    1) సంఘాలు 2) సముదాయం
    3) బయోమ్ 4) 1, 2
34. ఆవరణ వ్యవస్థ అనే పదాన్ని ఎవరు ప్రతిపాదించారు?
    1) ఓడమ్ 2) హెకేల్
    3) టాన్‌స్లే 4) రేచర్
35. ఆవరణ వ్యవస్థలో పరాగసంపర్క సహాయ కారకంగా ఉండే అకశేరుకాల సంఖ్య?
    1) 1,00,000 2) 1,000
    3) 10,000 4) 15,000
36. వాతావరణంలోని జీవ ఆధారిత సేవలకు విలువ కట్టిన శాస్త్రవేత్త?
    1) రాబర్ట్ కాన్‌స్టాంజా 2) రాబర్ట్ మేయర్
    3) రాబర్ట్ హుక్ 4) 1, 3
37. కిందివాటిలో ఆక్సిజన్ విడుదలకు సహాయపడే బ్యాక్టీరియా?
    1) సూడోమోనస్ 2) సయానో బ్యాక్టీరియా
    3) బ్యాక్టీరియం పుటిడే 4) పైవన్నీ
38. ఒక ఎకరం భూమిలోని చెట్లు ఏడాది కాలంలో ఎంతమంది వినియోగించడానికి అవసరమైన ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి?
    1) 18 2) 20 3) 60 4) 100
39. జనాభా అంటే?
    1) ఒక ప్రాంతంలో నివసించే సమూహం.
    2) ఒకే జాతికి చెందిన జీవుల సమూహం.
    3) ప్రాంతీయ జనాభాను జనాభా అంటారు.
    4) పైవన్నీ
40. మంచులో పెరిగే మొక్కలకు ఉన్న పేరు?
    1) ఆగ్జాలోఫైట్స్ 2) క్రయోఫైట్స్
    3) హీలియోఫైట్స్ 4) ఎపిఫైట్స్
41. కస్క్యూటా ప్రజాతుల్లో పాక్షికంగా పత్రహరితాన్ని కలిగిన మొక్క?
    1) కస్క్యూటా 2) కస్క్యూటా రిఫ్లెక్సా
    3) కస్క్యూటా మోనోఫిల్లం 4) 1, 3
42. కిందివాటిలో ఏ మొక్కల్లో పత్రాలు రిబ్బన్ ఆకృతిలో మారి ఉంటాయి?
    1) ఎడారి మొక్కలు 2) సమోద్భిజాలు
    3) నీటి మొక్కలు 4) 2, 3
43. ఏ సంవత్సరంలో 'నేషనల్ కమిటీ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ప్లానింగ్ కో ఆర్డినేషన్'ను స్థాపించారు?
    1) 1970 2) 1972
    3) 1990 4) 1940



రచయిత: వట్టిగొనోళ్ల పద్మనాభం

సమాధానాలు

1-2; 2-1; 3-3; 4-4; 5-2; 6-1; 7-1; 8-3; 9-4; 10-4; 11-2; 12-1; 13-2; 14-3; 15-1; 16-3; 17-4; 18-2; 19-4; 20-1; 21-3; 22-4; 23-1; 24-2; 25-4; 26-2; 27-1; 28-4; 29-1; 30-3; 31-1; 32-4; 33-3; 34-3; 35-1; 36-1; 37-2; 38-1; 39-4; 40-2; 41-2; 42-3; 43-2.

రైతుకు.. ఇంత నమ్మకద్రోహమా?

- రబీకి బీమా లేదు.. గత ఖరీఫ్‌లో ప్రీమియం కట్టలేదు
- రూ. 1,252 కోట్ల బకాయి పెట్టిన గత ప్రభుత్వం
- ఆ మొత్తం చెల్లిస్తేనే రైతుకు రూ. 1,568 కోట్ల పరిహారం
- ఇదీ గత ప్రభుత్వ ఉచిత పంటల బీమా పథకం తీరు

ఈనాడు–అమరావతి: ఒకటీ రెండూ కాదు.. ఐదేళ్ల పాటు రబీ పంటలకు పైసా బీమా లేదు. ఖరీఫ్‌లోనూ తూతూమంత్రమే. ఎక్కువ ప్రీమియం చెల్లించాల్సి వస్తుందంటే చాలు.. వాటిని బీమా నుంచి తప్పించేసింది. సాగు చేసిన ప్రతి ఎకరానికీ బీమా అంటూనే.. సగం విస్తీర్ణానికీ వర్తింపజేయలేదు. ఎవరికి బీమా వస్తుందో, ఎవరికి రాదో.. ఐదేళ్లూ అంతా రహస్యమే. వాస్తవ పంట నష్టంలో పదిశాతం కూడా బీమాగా ఇవ్వలేదు.

- 2023 ఖరీఫ్ పంటల బీమా కింద పైసా కూడా ప్రీమియంగా చెల్లించలేదు.
- మూడు పంట కాలాలకు రూ.1,252 కోట్ల బకాయిలు పెట్టారు. వైకాపా ప్రభుత్వం గొప్పగా చెప్పే ఉచిత పంటల బీమా పథకం అమలైన తీరిది.
- ప్రభుత్వం ఉచిత బీమా చేయలేదు. రైతులకు సొంతంగా చేసుకునే అవకాశమూ ఇవ్వకుండా రెండు విధాలా ముంచేసింది.
- ఇంతకంటే నమ్మకద్రోహం మరోటి ఉంటుందా?

తీవ్రంగా నష్టపోయినా బీమా నామమాత్రమే

గతేడాది ఖరీఫ్, రబీ పంటకాలాల్లో తీవ్ర కరువు కారణంగా రైతులకు కనీవినీ ఎరుగని నష్టం ఎదురైంది. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో వరి పంట ఎండిపోయింది. కృష్ణా, గోదావరి డెల్టాల్లోనూ సాగునీటి కష్టాలు వెంటాడాయి. కోస్తా, రాయలసీమలో పత్తి, మిరప, వేరుశనగ తదితర పంటలు సాగు చేసిన రైతులకూ దిగుబడులు దక్కలేదు. సగటున వేరుశనగ ఎకరాకు 2.64 క్వింటాళ్లు, కంది 1.63 క్వింటాళ్లు, పత్తి (దూది) 117 కిలోల దిగుబడే వచ్చింది. వరి, మిరప సహా ఇతర పంటల దిగుబడులూ తగ్గాయి. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో 37లక్షల టన్నుల తగ్గుదల నమోదైంది. గతేడాది పంటనష్టం రూ. 20 వేల కోట్లపైనే ఉంటుంది. అయితే సాగు చేసిన మొత్తం విస్తీర్ణానికీ బీమా లేదు. ఖరీఫ్‌లో ప్రధానమంత్రి ఫసల్‌బీమా, వాతావరణ ఆధారిత బీమా పథకాల కింద వచ్చే పరిహారం రూ.1,568 కోట్లు మాత్రమే. ఇక్కడా రైతును ముంచేశారు.

- తీవ్ర కరువు కారణంగా గతేడాది ఖరీఫ్, రబీల్లో 47 లక్షల ఎకరాల్లో పంటలు వేయలేదు. ముందస్తు కరువు ప్రకటన ద్వారా పెట్టుబడి రాయితీ, పంటల బీమా కల్పించి ఆదుకోలేదు.

రైతుకు తీరని ద్రోహం

- ఎక్కువ ప్రీమియం కట్టాల్సి వస్తుందని 2019 నుంచి మామిడిని బీమా నుంచి తప్పించింది.
- మిరప, పసుపు పంటలకు నిబంధనల పేరుతో ఎక్కువ పండించే జిల్లాల్లోని రైతులకు పరిహారంలో కోత పెట్టింది.
- జిల్లాలో సంబంధిత పంట సాగు విస్తీర్ణం సరిపడా లేదని అధికశాతం పంటలకు బీమా దక్కకుండా చేసింది.
- వరదలు, తీవ్ర కరువు కారణంగా ఐదేళ్లలో రూ.50 వేల కోట్లకు పైగా పంట నష్టపోతే రూ.7 వేల కోట్ల పరిహారం చెల్లించి సరిపెట్టింది.
- పెద్దఎత్తున బీమా చెల్లించాల్సి రావడంతో.. అధికారులపై ఒత్తిడి తెచ్చి తక్కువ మొత్తంలో పరిహారం నిర్ణయించి అమలు చేసింది.
- ప్రీమియం తగ్గించుకునేందుకు రిస్క్ షేరింగ్ మోడల్ తెచ్చారు. పంటనష్టం 80% లోపు ఉంటే కట్టిన ప్రీమియంలోనే కంపెనీలు ప్రభుత్వానికి తిరిగి

వైకాపా హయాంలో రబీ బీమా తీరు

సంవత్సరం	బీమా
2019-20	బీమా లేదు
2020-21	బీమా అమలు చేయలేదు
2021-22	బీమా అమలు చేయలేదు
2022-23	అమలుచేసినా ప్రీమియం (రూ. 465 కోట్లు) కట్టలేదు. పరిహారం (రూ.106 కోట్లు) కంటే కట్టాల్సిన ప్రీమియం ఎక్కువ
2023-24	ప్రీమియం కట్టలేదు.

స్తాయి. 110% పైన ఉంటే ప్రభుత్వం చెల్లిస్తుంది.

రబీకి బీమా అనేదే లేదు

రాష్ట్రంలో 60 లక్షల ఎకరాల్లో వరి, శనగ, మినుము, మొక్కజొన్న, జొన్న, వేరుశనగ, కూరగాయల పంటలు సాగు చేస్తారు. మామిడి తదితర పండ్ల తోటలకు రబీ పంటకాలమే కీలకం. వైకాపా హయాంలో ఐదేళ్లూ రబీకి బీమా అనేదే లేదు. 2019-20 రబీలో బీమా పరిహారం చెల్లించేందుకు లెక్కలు తయారు చేస్తే.. అధికారుల మెడపై కత్తి పెట్టి సున్నా చుట్టేసింది.


నడుంపైకి బస్సు టైరు ఎక్కడంతో విలవిల్లాడుతున్న ప్రయాణికుడు

ఆగిన బస్సును పరిశీలిస్తుండగా దూసుకొచ్చిన కంటెయినర్

- ఇద్దరి మృతి.. పది మందికి గాయాలు
- యాదాద్రి జిల్లా ఎల్లంబావి వద్ద ఘటన

చౌటుప్పల్ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రయాణికులతో వెళ్తున్న బస్సు బ్రేక్ డౌన్ కావడంతో రోడ్డు పక్కకు నిలిపారు.. ఇంతలో వేగంగా వచ్చిన ఓ కంటెయినర్ లారీ దానిని వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో ఇద్దరు మృతిచెందారు. ఈ సమయంలో బస్సు కిందకు వెళ్లి పరిశీలిస్తున్న ఓ వ్యక్తి నడుముపైకి టైరు ఎక్కడంతో బయటకు రాలేక నొప్పితో చాలాసేపు విలవిల్లాడాడు. తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఎల్లంబావి వద్ద హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఈ ఘటన చోటు చేసుకుంది. ఖమ్మం జిల్లా సత్తుపల్లి నుంచి శ్రీకృష్ణ ట్రావెల్స్ బస్సు 23 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు శుక్రవారం రాత్రి బయలుదేరింది. శనివారం తెల్లవారుజామున 2.45 నిమిషాలకు ఎల్లంబావి వద్ద బ్రేక్‌డౌన్ కావడంతో రోడ్డు పక్కన నిలిపారు. డ్రైవరుతో పాటు కొందరు ప్రయాణికులు కిందకు దిగి పరిశీలిస్తున్నారు. ఇదే సమయంలో ఓ కంటెయినర్ లారీ కోల్‌కతా నుంచి హైదరాబాద్ వెళ్తూ సదరు బస్సును వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఖమ్మం జిల్లా వేంసూరు మండలం వెంకటాపురానికి చెందిన పాల సతీశ్‌కుమార్‌రెడ్డి(46), సింగరేణి మండలం పెద్దమడంపల్లికి చెందిన ఎజ్జు రవీంద్రతేజ(25) అక్కడికక్కడే మృతిచెందారు. మరో పది మంది తీవ్రంగా గాయపడగా పోలీసులు చేరుకొని ఆసుపత్రికి తరలించారు. వీరంతా వృత్తిరీత్యా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు.

ఆ విద్యా సంస్థలను ప్రభుత్వమే నిర్వహించాలి: సీపీఎం

ఈనాడు, అమరావతి: మచిలీపట్నంలోని ఆంధ్ర జాతీయ విద్యాపరిషత్తు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యాసంస్థలను స్వాధీనం చేసుకొని, ప్రభుత్వమే నిర్వహించాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు లేఖ రాశారు. ఈ సంస్థలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. 'పలువురు స్వాతంత్ర్య సమరయోధులు ఆంధ్ర జాతీయ విద్యాపరిషత్, అనుబంధ విద్యాసంస్థలను స్థాపించారు. దీనికి 365 ఎకరాల భూమి, భవనాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ విద్యాసంస్థలు అవినీతిమయంగా మారాయి. వీటికి వ్యవస్థాపక కుటుంబసభ్యుడు కోపల్లె హనుమంతరావు కేంద్ర బిందువుగా ఉన్నారని వార్తలు వస్తున్నాయి. ఈయన పోలీసు శాఖలో పనిచేస్తూ ఈ విద్యా సంస్థలకు వారసుడిగా చలామణి అవుతున్నారు' అని పేర్కొన్నారు.

'ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలి'

గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం

ఈనాడు, అమరావతి: దసరా సందర్భంగా ఐఆర్, డీఏ ప్రకటించాలని రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లను నిలిపివేయడాన్ని రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం స్వాగతిస్తూ శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది.

వైకాపా హయాంలో.. 'స్పేస్ అప్లికేషన్' నిర్వీర్యం!

- సంస్థ ప్రాజెక్టులు మొత్తం ప్రైవేటుకే..
- విపత్తుల నష్టం అంచనాలో సంస్థ సేవలు కీలకం

ఈనాడు, అమరావతి: విపత్తుల సమయంలో నష్టం, ఏటా భూ వినియోగ లెక్కలు అంచనా వేయడంలో కీలకమైన రిమోట్ సెన్సింగ్ కేంద్రం ఏపీఎస్ఏసీ. రాష్ట్రంలోని భూమినంతటినీ వడకట్టి ప్రభుత్వానికి నివేదిక ఇస్తుంది. ఈ వివరాలు ప్రభుత్వం భవిష్యత్తులో చేపట్టబోయే పనులకు ఎంతగానో ఉపకరిస్తాయి. ఒకరకంగా ప్రభుత్వానికి దారిచూపే ఈ సంస్థను జగన్ తన పాలనలో పక్కనపెట్టేశారు. దాని ప్రాజెక్టులనూ ప్రైవేటుకు అప్పగించారు. 2019 వరకు ఇస్రో శాస్త్రవేత్తలు సంస్థ కార్యకలాపాలను పర్యవేక్షిస్తే. . జగన్ ప్రభుత్వంలో ఆ స్థానంలో ఐఎఫ్ఎస్ అధికారిని నియమించింది. ఆయన ఏపీఎస్ఏసీ సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోలేక నిర్లక్ష్యం చేసినట్లు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. సంస్థలో పనిచేసే సుమారు 55 మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికీ సమయానికి జీతాలను విడుదల చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వ తీరే ఇలా ఉండటంతో కేంద్రం తన వాటా నిధులనూ తగ్గించేసింది. ఫలితంగా ఈ ప్రభుత్వ సంస్థ చేష్టలుడిగిపోయింది.

- విశాఖలో 2015లో హుద్‌హుద్ తుపాను నష్టాన్ని ప్రభుత్వ సంస్థ ఏపీ స్పేస్ అప్లికేషన్ సెంటర్(ఏపీఎస్ఏసీ) ఒక్క రోజులో అంచనా వేసి.. సర్కారుకు ఇచ్చింది.
- ఆ సంస్థ ఇటీవల విజయవాడలో వరద నష్టాన్ని అంచనా వేసే స్థితిలో లేకపోవడంతో ప్రభుత్వం ప్రైవేటు సంస్థను ఆశ్రయించాల్సి వచ్చింది.

కారణం: జగన్ తన ఐదేళ్ల పాలనలో ఏపీ ఎస్ఏసీని నిర్వీర్యం చేశారు. సంస్థ నిర్వహించే ప్రాజెక్టులనూ ప్రైవేటుకు అప్పగించారు. దీనివల్ల దాని ప్రాధాన్యం తగ్గింది.

ఏపీఎస్ఏసీ అందించే కీలక సేవలు..

రాష్ట్రంలో భూముల వినియోగ సమాచారాన్ని రిమోట్ సెన్సింగ్ ఆధారంగా రంగాల వారీగా ప్రభుత్వానికి అందిస్తుంది. ఇస్రో, అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్ సెంటర్ సహకారంతో రాష్ట్రంలో ఏటా సాగైన పంటల విస్తీర్ణం, మొత్తం సాగు భూమితో పాటు దిగుబడులనూ అంచనా వేస్తుంది.

- రాష్ట్రంలో అటవీ, పట్టణ ప్రాంత భూములు, చెరువులు, వాటి ఆక్రమణలు ఐదేళ్లకోసారి లెక్కిస్తుంది.
- తీర ప్రాంతం కోత, రోడ్డు నెట్‌వర్క్ ఎక్కడ దెబ్బతిందనే సమాచారాన్ని అందిస్తుంది.
- తెదేపా ప్రభుత్వం గతంలో చేపట్టిన వాటర్‌షెడ్ పథకాలను పర్యవేక్షించడంలో ఏపీఎస్ఏసీ కీలకంగా వ్యవహరించింది. వాటర్‌షెడ్ ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో రైతుల సామాజిక, ఆర్థిక అభివృద్ధిపై నివేదికలను ప్రభుత్వానికి అందించింది. ఇంతగా కీలకమైన సంస్థకు జగన్ ప్రభుత్వం ఒక్క వాటర్ షెడ్ ప్రాజెక్టునూ కేటాయించకపోవడం గమనార్హం.

తెదేపా, వైకాపా ప్రభుత్వ హయాంలో ఏపీఎస్ఏసీ పురోగతి

వివరాలు	2014–19	2019–24
కేంద్ర నిధులు	రూ.11 కోట్లు	రూ.7 కోట్లు
రాష్ట్రం వాటా	రూ.32 కోట్లు	రూ.3 కోట్లు
అందించిన సేవలు	26	17

తెలుగు తేజోమూర్తి గుర్రం జాషువా

సీఎం చంద్రబాబు

ఈనాడు డిజిటల్, అమరావతి: తన జీవితంలో అడుగడుగునా కులవివక్ష ఎదుర్కొంటూనే తెలుగు సాహితీలోకంలో ప్రజ్వరిల్లిన తేజోమూర్తి గుర్రం జాషువా అని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. జాషువా జయంతి సందర్భంగా మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన నివాళి అర్పించారు. విశ్వమానవ సమానత్వం కోసం జాషువా సేవలు ప్రశంసనీయమని శ్లాఘించారు. గబ్బిలం, కొత్తలోకం లాంటి గొప్ప రచనలతో మనుషుల్లో అసమానతలను తొలగించేందుకు కృషిచేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు అనిత, డీబీవీ స్వామి, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

మూఢాచారాలపై తిరగబడిన కవి జాషువా: మంత్రి లోకేశ్

అక్షరాన్ని ఆయుధంగా చేసుకుని మూఢాచారాలపై తిరగబడిన కవి గుర్రం జాషువా అని 'ఎక్స్' వేదికగా మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. 'అణగారినవర్గాలకు జరిగిన అన్యాయాలపై సాహిత్య ఉద్యమం ఆరంభించిన నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్నా. జాషువా ప్రజల మనసుల్లో ఎప్పటికీ జీవించే ఉంటారు' అని లోకేశ్ పేర్కొన్నారు.

ఒకే ఖాతాలోకి రూ.124 కోట్లు!



- సైబర్ నేరాల ద్వారా కొల్లగొట్టిన సొమ్ము చేరినట్లు బహిర్గతం
- మహ్మద్ బిన్ అహ్మద్ బవజీర్ పేరిట అకౌంట్ ఉన్నట్లు గుర్తింపు

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా సైబర్‌నేరాల ద్వారా కొల్లగొట్టిన రూ.కోట్ల సొమ్మును హైదరాబాద్‌లోని బ్యాంకు ఖాతాలకు బదిలీ చేయించుకున్న కేసు దర్యాప్తులో కీలక అంశాలు వెలుగుచూస్తున్నాయి. హైదరాబాద్ శంశీర్‌గంజ్ ఎస్‌బీఐ శాఖలోని 6 కరెంట్ ఖాతాల్లోకి సైబర్‌నేరాల సొమ్ము బదిలీ కావడంతో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈక్రమంలో ఆరింటిలోని ఒకే బ్యాంకు ఖాతాలోకి ఏకంగా రూ.124.25 కోట్లు బదిలీ అయినట్లు తేలింది. 'ప్రొవెన్ ఏహెచ్‌ఎం ఫ్యుజన్' సంస్థ పేరిట ఉన్న ఈ ఖాతాలోకి మార్చి, ఏప్రిల్ నెలల్లో సొమ్ము వచ్చిపడింది. ఇది మహ్మద్ బిన్ అహ్మద్ బవజీర్ పేరిట ఉన్నట్లు తేలింది. ఇతడి పేరిటే ఉన్న మరో ఖాతాలోకి రూ.34.19 లక్షలు వచ్చినట్లు వెల్లడి కావడంతో అతడిని అరెస్టు చేసి విచారించారు. ఈక్రమంలో అతడు మ్యూల్ (కమీషన్ కోసం బ్యాంకు ఖాతాను సమకూర్చడం) అని తేలింది. దుబాయ్‌లో ఉన్న సూత్రధారి సూచనల మేరకే తాము బ్యాంకు ఖాతాలు తెరిచినట్లు బవజీర్ వెల్లడించడంతో పోలీసులు ఈ నిర్ధారణకు వచ్చారు. బ్యాంకు ఖాతాలోకి వచ్చిన సొమ్మును హవాలా మార్గంతో పాటు ఫారిన్ ఎక్స్ఛేంజీల ద్వారా విదేశాలకు తరలించినట్లు పోలీసులు గుర్తించారు. మరోవైపు మిగిలిన అయిదు ఖాతాలూ మ్యూల్స్‌వే అని తేలింది. ఈ క్రమంలో సూత్రధారి దొరికితేనే కేసు దర్యాప్తు మరింత ముందుకు సాగే అవకాశముంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఖాతాలోకి వచ్చిన రూ.124.25 కోట్ల సొమ్ము 234 నేరాలకు సంబంధించినదిగా ప్రాథమిక దర్యాప్తులో తేలింది. సాధారణంగా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ)కు వచ్చే ఫిర్యాదుల్ని టీజీసీఎస్‌బీ పోలీసులు విశ్లేషిస్తుంటారు. ఈక్రమంలో శంశీర్‌గంజ్ ఎస్‌బీఐలోని ఖాతాలకు భారీగా సైబర్‌నేరాల సొమ్ము బదిలీ అవుతున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తడంతో టీజీసీఎస్‌బీ పోలీసులు దృష్టి సారించారు. ఈక్రమంలోనే 6 కరెంట్ ఖాతాల్లో రెండు నెలల్లోనే సుమారు రూ.150కోట్ల వరకు లావాదేవీలు జరగడంతో మరింత లోతుగా ఆరా తీశారు. ఈక్రమంలోనే పెద్దఎత్తున నగదు లావాదేవీలు బహిర్గతమయ్యాయి.

ఏ ఖాతాల్లోకి ఎంత సొమ్ము వచ్చి పడిందంటే..

కరెంట్ ఖాతా	ఖాతాదారు	ఖాతాలోకి చేరిన సొమ్ము	నేరాలతో సంబంధం
ప్రొవెన్ ఏహెచ్‌ఎం ఫ్యుజన్	మహ్మద్ బిన్ అహ్మద్ బవజీర్	రూ.124.25 కోట్లు	234
సీసీఈహెచ్‌డీ	సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్	రూ.21.06 కోట్లు	234
సినర్జీ స్కల్ప్ట్ ట్రేడర్స్	మహ్మద్ అబ్దుల్ రజాక్	రూ.8.49 కోట్లు	95
క్వాంటమ్ క్వాటిఫెంట్ ఇన్నోవేషన్స్	అమేర్ సిద్ధిఖీ	రూ.1.42 కోట్లు	19
పినాకిల్ పల్స్ ఎంటర్‌ప్రైజెస్	మహ్మద్ ఇమ్రాన్ సిద్ధిఖీ	రూ.34.22 లక్షలు	20
ప్రొవెక్స్ వాడ్ ట్రేడర్స్	మహ్మద్ బిన్ అహ్మద్ బవజీర్	రూ.34.19 లక్షలు	19

యువతలో చైతన్యం నింపిన దేశభక్తుడు భగత్‌సింగ్: సీఎం

ఈనాడు డిజిటల్, అమరావతి: యువతలో చైతన్యం నింపి జాతీయోద్యమానికి ఉత్తేజితుల్ని చేసిన దేశభక్తుడు భగత్‌సింగ్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. తెల్లదొరలకు సింహస్వప్నమై నిలిచి, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు వదిలిన త్యాగధనుడని పేర్కొన్నారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా శనివారం 'ఎక్స్' వేదికగా చంద్రబాబు నివాళులు అర్పించారు.

విప్లవ వీరుడు భగత్‌సింగ్: మంత్రి లోకేశ్

విప్లవవీరుడు భగత్‌సింగ్ అని మంత్రి నారా లోకేశ్ కొనియాడారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా 'ఎక్స్'లో లోకేశ్ నివాళులు అర్పించారు. స్వాతంత్ర్యం కోసం ఉరికొయ్యను ముద్దాడిన ఆయనలాంటి దేశభక్తుల త్యాగ ఫలితమే మన స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలని పేర్కొన్నారు.

అప్పుడు జగన్ మానవత్వం ఏమైంది?: మంత్రి డోలా

ఈనాడు డిజిటల్, అమరావతి: 'దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసు విషయంలో, తన తండ్రి వివేకా హత్యకేసులో న్యాయం చేయాలంటూ సునీత కన్నీరు పెట్టుకున్నప్పుడు మాజీ సీఎం జగన్ మానవత్వం ఏమైంది' అని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి ప్రశ్నించారు. తనకే ఇలా ఉంటే దళితుల పరిస్థితేంటని జగన్ మాట్లాడటం సిగ్గుచేటని శనివారం ఆయన ఓ ప్రకటనలో మండిపడ్డారు. 'డిక్లరేషన్ ఇవ్వాలంటే నా మతం మానవత్వం అంటూ అమాయకంగా నటిస్తున్నారు. డిక్లరేషన్ ఇవ్వడం ఇష్టం లేకనే ఆయన తిరుమల పర్యటన రద్దు చేసుకున్నారు. తితిదే నిబంధనలు కులానికి కాదు మతానికని తెలియదా? ఎవరైనా నిబంధనల్ని గౌరవిస్తూ శ్రీవారిని దర్శించుకోవాలి. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం కంటే జగన్ గొప్పనా? అలాంటప్పుడు డిక్లరేషన్ ఎందుకివ్వరు?' అని డోలా నిలదీశారు.


12వ పీఆర్సీ కమిషనర్‌ను నియమించాలి: ఏపీ ఐకాస

ఈనాడు, అమరావతి: ఉద్యోగులకు 12వ పీఆర్సీ కోసం నూతన కమిషనర్‌ను నియమించాలని, ఆ నివేదిక సమర్పించే లోపు 30% మధ్యంతర భృతి ఇవ్వాలని ఏపీ ఐకాస ఛైర్మన్ శివారెడ్డి కోరారు. విజయవాడలో శనివారం ఏపీ ఎన్జీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. "పీఎఫ్, ఏపీజీఎల్ఐ, డీఏ బకాయిలు చెల్లించాలి. సీపీఎస్ ఉద్యోగులకు సీపీఎస్ కాంట్రిబ్యూషన్‌ను జమ చేయాలి. పంచాయతీ రాజ్ శాఖలో సుదీర్ఘ కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను పూర్తి చేయాలి. సీపీఎస్, ఇతరత్రా సమస్యలపై ఆందోళనలు చేసిన సమయంలో పెట్టిన కేసులు ఎత్తివేయాలి" అని కోరారు.

ఐకాస నూతన ప్రధాన కార్యదర్శిగా ప్రసాద్

ఏపీ ఐకాస నూతన ప్రధాన కార్యదర్శిగా యూటీఎఫ్ ప్రధానకార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు ఈ పదవిలో ఉన్న హృదయరాజు పదవీ కాలం ముగిసింది. ఏపీటీఎఫ్-257 అధ్యక్షురాలు మంజుల, హృదయరాజులను కో-ఛైర్మన్‌లుగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఆప్టా ప్రధాన కార్యదర్శి ప్రకాశ్‌రావు, ఉపాధ్యక్షుడిగా ఏపీ వ్యవసాయ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సాయికుమార్ ఎన్నికయ్యారు.

పొలం నిండా బండలు.. గుండెల నిండా బాధలు!



ఇక్కడ రాళ్లు తీస్తున్న వీరు తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామ శివారు సోమ్లాతండాకు చెందిన భూక్య అజ్మీసింగ్, నీలా దంపతులు. వీరికున్న మూడెకరాల్లో వరి, మిరప పంటలు సాగు చేశారు. సెప్టెంబరు 1న కురిసిన వర్షానికి నర్సింహులపేట మండలం గొల్లబంజర శివారులోని రాయినిబంధం చెరువు కట్ట తెగింది. దాని నీటి ప్రవాహంతో వీరి పచ్చని పొలాలు రాళ్లూరప్పలు, ఇసుక మేటలతో నిండిపోయాయి. తిరిగి దున్నడానికి వీలు లేని పరిస్థితి ఏర్పడింది. రాళ్లను తొలగించి చదును చేసేందుకు రూ.2 లక్షలకు పైగా ఖర్చవుతుందని చెప్పడంతో అంత మొత్తం భరించలేక దంపతులిద్దరే తొలగించడం ప్రారంభించారు. సాగు సవ్యంగా సాగి ఉంటే ఈపాటికి పంట కోతలు మొదలు పెట్టేవాళ్లమని, కానీ రాళ్లు మోయాల్సి వస్తోందని కన్నీటిపర్యంతమవుతున్నారు. మా కష్టం ఎప్పటికి గట్టెక్కేనో.. పంట ఎప్పుడు సాగయ్యేనో అంటూ దిగాలు చెందుతున్నారు.

– న్యూస్‌టుడే, నర్సింహులపేట(డోర్నకల్)

నాకే అవమానం జరిగింది.. సామాన్యులకు జరగదా?

- తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య

మెదక్, న్యూస్‌టుడే: "ప్రొటోకాల్ విషయంలో మెదక్ జిల్లాలో నాకే రెండుసార్లు అవమానం జరిగింది. సామాన్యులైన ఎస్సీ, ఎస్టీలకు జరగదా?" అని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మెదక్ కలెక్టరేట్‌లో శనివారం ఆయన అట్రాసిటీ కేసులు, భూసమస్యలపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..మెదక్ జిల్లాలో ప్రొటోకాల్ పాటించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల మెదక్ కలెక్టరేట్‌లో మంత్రి దామోదర్ రాజనర్సింహ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండా సురేఖ నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశానికి తనకు కనీస సమాచారం లేదన్నారు.

ఎస్సీ వర్గీకరణపై జ్యుడిషియల్ కమిషన్..!

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ కోసం ఏకసభ్య జ్యుడిషియల్ కమిషన్ వేయాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. ఇప్పటికే సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఈ నెల 30 నుంచి కుల సంఘాలు, వ్యక్తులు, సమూహాల సలహాలు, సూచనలు తీసుకోవాలని ఎస్సీ సంక్షేమశాఖ నిర్ణయించింది. ఈ క్రమంలో ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ సచివాలయంలో శనివారం న్యాయనిపుణులతో చర్చించారు. ఎస్సీ వర్గీకరణ కోసం 2011 జనాబా లెక్కలు తీసుకుంటే న్యాయపరమైన ఇబ్బందులు వచ్చే అవకాశాలున్నట్లు కమిటీ గుర్తించింది. తమిళనాడు, హరియాణా, పంజాబ్ రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ అమలుకు ముందు జ్యుడిషియల్ కమిషన్ వేశారని ప్రస్తావించింది. రాష్ట్రంలోనూ ఏర్పాటు చేసి, ఆ నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకుంటే న్యాయ ఇబ్బందులు ఉండవని తెల్పింది.

హ్యాండ్‌బ్రేక్ కింద అరలో రూ.3.71 కోట్ల గోల్డ్ బిస్కెట్లు

జప్తు చేసిన డీఆర్ఐ

ఈనాడు, హైదరాబాద్: కారులో హ్యాండ్‌బ్రేక్ కింద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అరలో అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తమకు అందిన విశ్వసనీయ సమాచారంతో డీఆర్ఐ హైదరాబాద్ జోనల్ యూనిట్ బృందం శుక్రవారం రాత్రి రాయికల్ టోల్‌ప్లాజా వద్ద మాటు వేసింది. ఈ క్రమంలో కోయంబత్తూర్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ఓ కారును ఆపి తనిఖీ చేయడంతో 18 బంగారు బిస్కట్లు లభ్యమయ్యాయి. 24 క్యారట్ల ఆ బిస్కట్లు 4778 గ్రాముల బరువున్నట్లు తేలింది. వాటి విలువ రూ.3.71 కోట్లుగా లెక్కగట్టారు. దీంతో అధికారులు కారును స్వాధీనం చేసుకుని అందులో ప్రయాణిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డీఆర్ఐ కేసును దర్యాప్తు చేస్తోంది.

దసరా నుంచి యాదగిరీశుని విమానానికి స్వర్ణతాపడం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: తెలంగాణలోని యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయ విమానం స్వర్ణతాపడం పనులు దసరా పండుగ నాటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం జీవో జారీ అయింది. స్వర్ణ తాపడం పనులను స్మార్ట్ క్రియేషన్స్ వారికి అప్పగించింది. ఈ పనులను వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల నాటికి పూర్తి చేయాలని మంత్రి సూచించారు. దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్ ఛైర్‌పర్సన్, ఆ శాఖ డైరెక్టర్ కన్వీనర్ వైటీడీఏ వైస్ ఛైర్మన్ కిషన్‌రావు, ఆలయ ఈవో భాస్కర్‌రావు, విద్యుత్తుశాఖ చీఫ్ ఇంజినీర్ ప్రత్యేక కమిటీగా ఏర్పడి అవసరమైన సలహాలు ఇస్తారు.